


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+12+32 పేజీల ఆదివారం అనుబంధం   వెల: ₹ 7.00

సంపుటి: 16
సంచిక: 38

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
ఆదివారం ॥ 30-4-2023

వైరల్

కష్టాలే ఇంధనంగా..

నీతా గత జీవితంలోకి తొంగిచూస్తే 'బాధలు' 'కష్టాలు' తప్ప ఏమీ కనిపించనంత చీకటి. నీతా చిన్న వయసులో ఉన్నప్పుడే తల్లి చని పోయింది. తండ్రి తాగుబోతు. ఆయన పెట్టే హింస భరించలేక అమ్మమ్మ వాళ్ల ఇంటికి పారిపోయి అక్కడే ఉంది. 14 సంవత్సరాల వయసులో 22 ఏళ్ల వ్యక్తితో నీతాకు పెళ్లి జరిగింది. పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయింది.

భర్త తాగుబోతు. రకరకాలుగా హింస పెట్టేవాడు.

భర్త పెట్టే బాధలు భరించలేక అతడి నుంచి వేరుపడింది. ముగ్గురు పిల్లలు తనతో పాటే ఉన్నారు. చిన్నాచితకా పనులు చేస్తూనే ఆగిపోయిన చదువును కొనసాగించింది. పిల్లలతో పాటు చదువుకుంది.

'నీకు ఏ పనీ చేతకాదు' అని భర్త ఎప్పుడూ తిట్టేవాడు. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్కూటర్ నడపడం నేర్చుకుంది. ఆ తరువాత వ్యాన్, బస్ డ్రైవింగ్‌లను నేర్చుకుంది.

ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఇప్పుడు ముంబయిలో 13 బస్సులకు యజమాని అయింది. ముగ్గురు పిల్లలు బాగా చదువుకుంటున్నారు. కుమారుడు కెనడాలో ఉంటున్నాడు.

స్టోరీ టెల్లింగ్ ప్లాట్‌ఫామ్ 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' నీతా స్టోరీని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఆన్‌లైన్‌లో ఈ ఇన్‌స్పైరింగ్ స్టోరీ వైరల్‌గా మారింది.

'నేను ఎన్నోసార్లు నీతా ట్రావెల్ బస్సులలో ప్రయాణం చేశాను. ఆమె వెనుక ఇన్ని కష్టాలు ఉన్నాయని తెలియదు. ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిని ఇచ్చే స్టోరీ ఇది' అని ఇన్‌స్టాగ్రామ్ యూజర్ ఒకరు స్పందించారు.



బ్లాక్ అండ్ వైట్ డేస్... ఎంత బంగారమో!

కేబుల్ ఛానల్స్, ఆన్‌లైన్ స్ట్రీమింగ్ సర్వీసులకు ముందు వినోదానికి దూరదర్శన్ పెద్ద దిక్కు. దూరదర్శన్‌కు, ప్రేక్షకులకు మధ్య దూరం పెరిగినా ఆ నాస్టాల్జియాకు మాత్రం దూరం కాలేదు. దీనికి ఉదాహరణ వైరల్ అయిన ఈ వీడియో.

'అల్బేల' సినిమాలోని 'షోల జో బడ్కే' పాటను హార్మోనియం వాయిస్తూ సి.రామచంద్ర, కవితా కృష్ణమూర్తితో కలిసి పాడుతున్న బ్లాక్ అండ్ వైట్‌కు సంబంధించిన వీడియోను నటి హేమ మాలిని పరిచయం చేస్తున్న దూరదర్శన్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఒకరకంగా చెప్పాలంటే ఈ వీడియో నెటిజనులను టైమ్‌మిషన్‌లో బ్లాక్ అండ్ వైట్ జమానాలోకి తీసుకువెళ్లింది.

ఆరోజుల్లో దూరదర్శన్‌లో తమకు నచ్చిన కార్యక్రమాలతోపాటు 'మహా... భారత్' అనే టైటిల్ సాంగ్ వినిపించగానే తాము రెక్కలు కట్టుకొని టీవీల ముందు వాలిన దృశ్యాలను కూడా నెటిజనులు గుర్తుతెచ్చుకున్నారు. ఈ వీడియోను 'గోల్డ్' అండ్ 'ప్యూర్' అని ఆకాశానికెత్తారు నెటిజనులు.



సంగీతానికి సరిహద్దులు లేవోయ్!

దేశానికి సరిహద్దులు ఉండొచ్చుగానీ సంగీతానికి ఉండవు అని మరోసారి గుర్తు చేసిన ఈ వీడియో అంతర్జాలంలో వైరల్ అవుతూ 'ఆహా' అనిపిస్తోంది.

విషయం ఏమనగా...

భారతీయ యువతి ఒకరు లండన్‌లోని బిగ్‌బెన్(గ్రేట్ బెల్ ఆఫ్ ది గ్రేట్ క్లాక్ ఆఫ్ వెస్ట్ మినిస్టర్)కు సమీపంలో బాలీవుడ్ సినిమా 'క్వీన్' లోని 'లండన్ తుమ్మదా' పాటకు డ్యాన్స్ చేయడం మొదలుపెట్టింది.



చుట్టుపక్కల జనాలు గుంపులుగా చేరి ఆ డాన్స్‌ను ఆసక్తితో చూడడం మొదలుపెట్టారు. సీన్ ఇదే అయితే ఈ సీన్ గురించి చెప్పడానికి అంత సీన్ ఉండేది కాదు.

అయితే హిందీ భాషలో ఒక్క ముక్క కూడా అర్థం కాని ఆ జనాలు యువతితో పాటు డ్యాన్స్ చేయడం కోసం కాలు కదపడమే విషయం. .

'ఇలాంటి దృశ్యాన్ని లండన్‌లో మాత్రమే చూడగలం' అనే కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

డీఐవై లేడీ

'డూ ఇట్ యువర్ సెల్ఫ్' (డిఐవై) పాలసీని అనుసరిస్తే ఏమొస్తుంది? మెదడుకు పనిదొరుకుతుంది. షార్ప్ అవుతుంది.

తనను తాను 'డీఐవై లేడీ'గా పిలుచుకునే నటి, కంటెంట్ క్రియేటర్ శ్వేతా మహదిక్ పాత ఖాళీ రైస్ బ్యాగును స్టైలిష్ హ్యాండ్‌బ్యాగ్‌గా మలిచింది. కత్తిరింపు నుంచి మెషీన్‌పై కుట్టువరకు అన్నీ తానే స్వయంగా చేసింది. ఈ అందమైన బ్యాగ్‌కు గోల్డెన్‌కలర్ చైన్ జత చేసి 'అప్‌క్లచ్‌డ్ బ్యాగ్' అని నామకరణం చేసింది.

బ్యాగు తయారీ ప్రక్రియకు సంబంధించిన వీడియోను శ్వేతా మహదిక్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే వైరల్ అయింది.

బాలీవుడ్ ప్రముఖ నటి ఉర్ఫీ జావెద్, శ్వేతా మహదిక్‌ను ప్రశంసలతో ముంచెత్తింది.

నెటిజనులు రకరకాల కామెంట్స్‌తో భారీగా స్పందించారు. వాటిలో మచ్చుకు మూడు...

'ఇట్స్ రాకింగ్'

'మీకు ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ ఆర్టిస్ట్ అవార్డ్ తప్పనిసరిగా ఇవ్వాలి'

'మీ వీడియో చూసి ఇప్పటికే రెండు హ్యాండ్ బ్యాగ్‌లు తయారుచేశాను.'



5 టు 95



మానవ పరిణామక్రమం లాగే మనిషి వయసుకు సంబంధించిన రూప పరిణామక్రమం కూడా ఆసక్తికరమే.

అయిదు సంవత్సరాల వయసు ఉన్న బాలిక 95 ఏళ్ల వృద్ధురాలు అయ్యేక్రమంలో ఎన్ని రూపాల్లో కనిపిస్తుందో చూపే ఈ వీడియో వైరల్ అవుతోంది.

పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా ఈ హైపర్ రియలిస్టిక్ ఏఐ జనరేటెడ్ వీడియో క్లిప్‌ను ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తే 1.8 లక్షల వ్యూస్ వచ్చాయి.

బోలెడు లైక్‌లు వచ్చాయి.

'మా అమ్మ వయసు 72 సంవత్సరాలు. ఆమె పన్నెండేళ్ల వయసులో ఉన్నప్పుడు దిగిన ఫొటో మా ఇంట్లో ఉంది. ఆ ఫొటోను, అమ్మను చూసినప్పుడల్లా ఈ ఇద్దరూ నిజంగా ఒకరేనా? లేకపోతే వయసు ఆధారంగా కొత్త వ్యక్తులు ఆ వ్యక్తిలోకి వస్తుంటారా!' అనే ధర్మ సందేహాన్ని వెలిబుచ్చాడు ఒక నెటిజనుడు.

ఈ సందేహం మాట ఎలా ఉన్నా 'ఈ హైపర్ రియాలిటీ ఏఐ టెక్నాలజీతో 95 ఏళ్ల వయసులో నేను ఎలా ఉంటానో చూసుకోవాలని ఉంది' అని సందడి చేస్తున్న నెటిజనుల సంఖ్యే ఎక్కువ.

మెడి టిప్
సర్కేడియన్ రిథమ్ సక్రమంగా ఉండటం కోసం...

రాత్రి నిర్ణీత వేళకు మంచి నిద్ర పట్టి... ఉదయం మళ్లీ అదే సమయానికి నిద్రలేవడం అనేది సక్రమంగా కొనసాగడానికి మెదడులో సర్కేడియన్ రిథమ్ అనే ఓ క్రమబద్ధమైన ప్రక్రియ నడుస్తూ ఉంటుంది. ఈ రిథమ్ దెబ్బతినడం వల్ల నిద్రలేమితో పాటు పనిమీద దృష్టి కేంద్రీకరించలేకపోవడం, గుండెజబ్బులు, మెదడు పనితీరులో మార్పులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలూ కనిపిస్తాయి. ఇవి రాకుండా ఉండటానికి నిపుణులు చెబుతున్న కొన్ని జాగ్రత్తలివి...

▸ రాత్రి భోజనం కాస్త త్వరగా రోజూ అదే సమయానికి తినేయాలి. రాత్రి భోజనం కాస్తంత తేలిగ్గా ఉండటం మంచిది. ▸ నాణ్యమైన నిద్ర కోసం స్లీప్ హైజీన్ పాటించాలి. నిద్రరాకపోయినా... అదే టైముకు నిద్రను అలవాటు చేసేందుకు రోజూ అదే వేళకు పక్క మీదికి చేరడం, ఉదయం సక్రమంగా దాదాపుగా నిర్ణీత వేళకు నిద్రలేవడానికి ప్రయత్నించడం చేయాలి. ▸ గదిలో కాంతి బాగా ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. కాంతి బాగా తక్కువగా ఉన్నప్పుడే మెలటోనిన్ అనే నిద్రకు అవసరమైన హార్మోన్ స్రవిస్తుంది. ▸ రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు కెఫీన్ ఎక్కువగా ఉండే కాఫీ, కూల్‌డ్రింక్స్ లాంటి ద్రవాహారాలకు, నికోటిన్, ఆల్కహాల్ వంటి వాటికి దూరంగా ఉండాలి.

కొన్ని గైనిక్ సమస్యలకు లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సే మంచి పరిష్కారం!



మహిళల గర్భధారణకు తోడ్పడే వ్యవస్థకు సంబంధించిన సమస్య (గైనిక్ ప్రాబ్లమ్స్)ల్లో కొన్నింటికి శస్త్రచికిత్స అవసరం పడుతుంది. శస్త్రచికిత్సల్లో కొంత కోత తప్పదు. కానీ అలాంటి 'కోత' ఏదీ లేకుండా కేవలం 'అతి చిన్న గాటు'తోనే సమస్య పరిష్కారమైతే? ఈ ఆలోచన నుంచి పుట్టిందే లాపరోస్కోపిక్ శస్త్రచికిత్స. మహిళల్లో కొన్ని గైనిక్ లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలపై అవగాహన కోసం ఈ కథనం.

సాధారణంగా మహిళల్లో గైనిక్ సమస్యలు కొన్ని లక్షణాలతో వ్యక్తమవుతాయి. పొత్తికడుపులో నొప్పి, కడుపులో ఇబ్బందులు, నడుమునొప్పి వంటి సమస్యలు కనిపించనప్పుడు... అందునా అవి గైనిక్ సంబంధిత సమస్యల కారణంగా వస్తున్నట్లు నిర్ధారణ పరీక్షల్లో తేలినప్పుడు (డయాగ్నోజ్ అయినప్పుడు) కొన్ని సమస్యల్లో శస్త్రచికిత్సలు అవసరం కావచ్చు.

సాధారణ శస్త్రచికిత్సకు లాపరోస్కోపీ సర్జరీకి తేడాలు...

● శస్త్రచికిత్స అవసరం పడ్డ సందర్భాల్లో కోతలో... దాని నిడివి ఎక్కువగా ఉన్నప్పుడు అది మానడానికి చాలా సమయం పట్టవచ్చు. కానీ చిన్న చిన్నవి రెండు లేదా మూణ్నాలుగు గాట్లు చాలా కొద్ది సమయంలోనే పూర్తిగా తగ్గిపోతాయి. కాబట్టి కోత కంటే గాటు చాలా త్వరితంగా తగ్గుతుంది.


● కోత కాస్త ఎక్కువగా ఉన్నప్పుడు ఇన్ఫెక్షన్‌కూ అవకాశం పెరగవచ్చు. అసలు సమస్యకు తోడు ఇది కూడా ఓ అదనపు సమస్యగా మారవచ్చు. కానీ లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సకు పెట్టే గాటు చాలా చాలా చిన్నది కాబట్టి ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయి. ● పై రెండు అంశాల కారణంగా హాస్పిటల్‌లో ఉండాల్సిన వ్యవధి తగ్గుతుంది. దాంతో ఇటు ఆర్థిక భారమూ తగ్గడమే కాకుండా... ఎక్కువసేపు హాస్పిటల్‌లో ఉంచినప్పుడు కలిగే దుష్ప్రభావాల ముప్పు (హాస్పిటల్ రిలేటెడ్ ఇన్ఫెక్షన్స్ రిస్క్) తగ్గుతుంది.

● లాపరోస్కోపిక్ సర్జరీల్లో... దేహంలోకి కెమెరాను పంపి... అంతర్గత అవయవాలను చాలా పెద్దవిగా పెంచి స్క్రీన్‌పై చూస్తూ చేసే శస్త్రచికిత్సలతో... సర్జరీలో నిశితత్వం, ఖచితత్వం (ప్రెసిషన్) పెరుగుతుంది. దాంతో పొరబాట్లకు అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయి.

ఇలా ఏ విధంగా చూసినా 'లాపరోస్కోపిక్ శస్త్రచికిత్స'లతో అనేక ప్రయోజనాలు ఉన్నందున పైన పేర్కొన్న కేసుల్లో అవకాశం ఉన్నప్పుడు అవి చేసేందుకు అవకాశం ఉందా అని మీ గైనకాలజిస్ట్ / గైనిక్ సర్జన్‌ను అడిగి తెలుసుకోవడం మేలు.

శస్త్రచికిత్సలు అవసరమయ్యే కొన్ని సందర్భాలివి...


● ఎండోమెట్రియాసిస్ ● గర్భసంచిలో ఫైబ్రాయిడ్లు (యుటెరైన్ ఫైబ్రాయిడ్స్), అండాశయాల్లో నీటి తిత్తులు లేదా గడ్డలు (ఒవేరియన సిస్ట్స్/ట్యూమర్స్) ● పిండం గర్భసంచిలో బదులుగా ట్యూబ్స్‌లోనే పెరగడం (ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ) ● గర్భాశయ ముఖద్వారంలో పుండ్లు లేదా చిన్న చిన్న గడ్డలు (పెల్విక్ యాబ్సెస్ లేదా పెల్విక్ అడ్హెషన్స్) ● గర్భధారణ వ్యవస్థకు సంబంధించిన కొన్ని అవయవాలకు వచ్చే క్యాన్సర్ల కారణంగా వాటిని తొలగించాల్సి రావడం ● గర్భసంచి లేదా అండాశయాల తొలగింపు లేదా ఫైబ్రాయిడ్స్ కారణంగా వాటిని తొలగించాల్సి రావడం ● కుటుంబ నియంత్రణ ఆపరేషన్ జరిగిన మహిళల్లో ఏవైనా కారణాల వల్ల మళ్లీ ఆపరేషన్ చేసి ట్యూబ్‌లను కలపడం (కాంట్రసెప్టివ్ సర్జరీ రివర్సల్) ● మూత్రం ఏమాత్రం ఆపుకోలేకపోవడం ● గర్భసంచి కిందికి జారడం (యుటిరైన్ ప్రొలాప్స్ లేదా ప్రొలాప్స్‌డ్ యుటెరస్)... ఇలాంటి సందర్భాల్లో శస్త్రచికిత్స అవసరం పడవచ్చు.



డాక్టర్ రాజేశ్వరీ రెడ్డి, కన్సల్టెంట్ ఆబ్‌స్టెట్రీషియన్ గైనకాలజిస్ట్ అండ్ లాపరోస్కోపిక్ సర్జన్,
బర్త్ రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్,
నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్
కాంటాక్ట్ నంబర్: 8882 046 046
www.rainbowhospitals.in

హెల్త్

బర్న్ ఔట్ సిండ్రోమ్ & మూన్‌లైటింగ్ అంటే..?



లక్షణాలు
* తీవ్రమైన నిస్సత్తువ, * పని పైన ఆసక్తి లేకపోవడం * పని మీద దృష్టి కేంద్రీకరించలేకపోవడం * వృత్తికి సంబంధించిన ప్రతి అంశంలోనూ ప్రతికూల ధోరణి (నెగెటివిజమ్) * భవిష్యత్తు గురించి నిరాశాజనకంగా ఆలోచించడం * తనను తాను ప్రోత్సహించుకుని, పని చేయడానికి పురిగొల్పుకునే ధోరణి (మోటివేటెడ్‌గా) లేకపోవడం.

విపరీతంగా ఆలోచించినప్పుడు బుర్ర వేడెక్కిపోయింది అంటుండటం సాధారణం. మరి అంతకంటే ఎక్కువ తీవ్రతతో కూడిన ఒత్తిడితో పని చేస్తుంటే దాన్ని కాలిపోవడంతో పోల్చవచ్చా అంటే అవునంటున్నారు వైద్యనిపుణులు. నియంత్రణ ఏమాత్రం లేకుండా, తీవ్ర ఒత్తిడితో పనిచేస్తే కలిగే దుష్ప్రభావాలను "బర్న్ ఔట్ సిండ్రోమ్"గా చెబుతున్నారు. దీనికి ఒకింత తీవ్రత ఎక్కువగా ఉన్న మరో స్థితి కూడా ఉంది. దాని పేరే 'మూన్‌లైటింగ్' ఎఫెక్ట్. ఈ మాటలిప్పుడు మరింత ప్రాచుర్యంలోకి రావడానికి కారణం ఉంది. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్ విధించడంతో కొన్ని వృత్తులవారు... ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఆమాటకొస్తే డాక్టర్లు, నర్సుల వంటి వారూ ఈ 'బర్న్ ఔట్ సిండ్రోమ్', 'మూన్ లైట్ ఎఫెక్ట్' బారిన పడ్డట్లుగా అధ్యయనాల్లో తేలడంతో వాటి ప్రభావమిప్పుడు చర్చనీయాంశమైంది. 'బర్న్ ఔట్ సిండ్రోమ్', 'మూన్ లైట్ ఎఫెక్ట్‌'పై అవగాహన కల్పించే కథనమిది.

లాక్‌డౌన్ లేని సమయంలో సాఫ్ట్‌వేర్ వృత్తుల వారు ఎవరి ఆఫీసుల్లో వారు... వారి సంస్థకు చెందిన పనులు చేసుకునేవారు. లాక్‌డౌన్ విధించాక ఇంట్లోనే ఉండి పనిచేసుకోవచ్చనే వెసులుబాటు రావడంతో... కొంతమంది సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ ఒకటి కంటే ఎక్కువ సంస్థల నుంచి పనులు స్వీకరించి పనిచేయడం మొదలుపెట్టారు. మామూలుగానే ఒత్తిడితో కూడిన వృత్తి... దానికి తోడు మరిన్ని సంస్థలకు పనిచేయాల్సి రావడంతో ఏర్పడ్డ అదనపు ఒత్తిడి కారణంగా 'బర్న్ ఔట్ సిండ్రోమ్'కు గురికావడం ఎక్కువయ్యింది. ఒక సంస్థకు తెలియకుండా మరొక సంస్థలో పనిచేస్తూ... ఒకటి కంటే ఎక్కువ సంస్థలకు చెందిన కార్యకలాపాలు నిర్వహించడంతో... అనూహ్యంగా పెరిగిపోయిన తీవ్రమైన ఒత్తిడిని 'మూన్‌లైట్ ఎఫెక్ట్'గా వైద్యులు పేర్కొంటున్నారు. వీటివల్ల మెదడులో అనూహ్యపరిణామాలు చోటు చేసుకుంటున్నట్లు వెల్లడిస్తున్నారు. దీని ఫలితంగా చాలామంది ఉద్యోగాలనూ, ఉపాధిని కోల్పోవడమూ జరిగిందంటే దీని తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

'బర్న్‌ఔట్' తాలూకు తీవ్రతలూ - దశలు...

ఈ దుష్ప్రభావల తీవ్రత... ఒకేసారి కాకుండా దశలవారీగా కనిపిస్తుంది. అవే...

1. **హనీమూన్ ఫేజ్** : పని పెరిగినప్పటికీ అదనపు ఆదాయం సమకూరుతుండటం, డబ్బు కళ్లబడుతుండటంతో మొదట్లో చాలా ప్రోత్సాహకరంగా, హాయిగా, ఆనందంగా ఉంటుంది. అందుకే దీన్ని 'హనీమూన్ ఫేజ్'గా చెబుతారు.
2. **అర్లీ స్ట్రెస్ ఫేజ్** : ఒత్తిడి తాలూకు మొదటి దశ ఇది.
3. **క్రానిక్ స్ట్రెస్ ఫేజ్** : ఒత్తిడి మొదటి దశ దాటిపోయి... ఎల్లప్పుడూ అదే ఒత్తిడితో ఉండటం జరుగుతుంది. అందుకే దీన్ని 'క్రానిక్ స్ట్రెస్ ఫేజ్'గా చెబుతారు.
4. **ఎస్టాబ్లిష్‌డ్ బర్న్ ఔట్** : నిత్యం ఒత్తిడి కారణంగా కనిపించే దుష్ప్రభావాలు స్పష్టంగా వెల్లడవుతూ ఉండటం (ఎస్టాబ్లిష్ అవుతుండటం) వల్ల దీన్ని ఈ పేరుతో పిలుస్తారు.
5. **హ్యాబిచ్యువల్ బర్న్ ఔట్** : నిత్యం కనిపించే ఒత్తిడికి పూర్తిగా అలవాటు పడిపోయి, దాన్నొంచి తప్పించుకోలేక, ఒప్పుకున్న పనినుంచి తప్పుకోలేక ఒకరకమైన నిస్పృహకూ, నిరాసక్తతకూ లోనుకావడాన్ని 'హ్యాబిచ్యువల్ బర్న్ ఔట్' దశగా చెప్పవచ్చు. పైగా ఈ దశలన్నీ వ్యక్తుల్లో మంచి అభివృద్ధికి తోడ్పడే కీలకమైన వయసులో అంటే 30 నుంచి 35 ఏళ్ల మధ్యన కలగడంతో తీవ్రమైన నిరాశ, నిస్పృహలకు లోనుకావడంతో ఆ కుటుంబం అతలాకుతలం కావడం, ఛిన్నాభిన్నమైపోవడం లాంటి పరిణామాలు సంభవిస్తుంటాయి.

మెదడుపైనా దుష్ప్రభావాలు

ప్రీ-ఫ్రంటల్ కార్టెక్స్ ప్రాంతంలో: బర్న్ ఔట్ కారణంగా మెదడులోని ప్రీ-ఫ్రంటల్ కార్టెక్స్ ప్రాంతంలోని 'గ్రే మ్యాటర్' బాగా పలచబారినట్లు ఇటీవలి తాజా పరిశోధనలు చెబుతున్నాయి. దీని కారణంగా జ్ఞాపకశక్తి బాగా తగ్గడం, ఏ విషయాన్నైనా సమగ్రంగా ఆకళింపు చేసుకోవడంలో లోపాలు, చేసిన తప్పిదాలే మళ్లీ మళ్లీ చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడంలో నైపుణ్యాలు తగ్గడం వంటి లోపాలు కనిపించాయి.

టెంపోరల్ లోబ్ ప్రాంతంలో : మెదడులోని మధ్య (మీడియల్) టెంపోరల్ లోబ్ అనే చోట బాదం కాయ ఆకృతిలో 'ఎమిగ్డలా' అనే ఓ ప్రదేశం ఉంటుంది. (నిజానికి గ్రీకు భాషలో ఎమిగ్డలే అంటే బాదం కాయ అనే అర్థం. అందుకే దానికా పేరు). భయాలూ, ఆందోళనల్లాంటి అనేక ఉద్వేగాలకు కారణమయ్యే, ఆవిర్భవించే ప్రదేశమది. బర్న్ ఔట్‌కు లోనైన వారిని పరిశీలించినప్పుడు వాళ్లలో 'అమిగ్డలా' బలంగా మారినట్లు తేలింది. ఫలితంగా తమ చుట్టూ ఉన్న ప్రపంచమంతా భయంకరంగా అనిపించడం లాంటి అనుభవాలకు గురిచేస్తుందన్న మాట. ఒకవైపు గ్రేమ్యాటర్ పలచబారడం, మరోవైపు ఎమిగ్డలా బలపడటం... ఈ రెండింటి మధ్య సమన్వయం లేకపోవడంతో బర్న్‌ఔట్ తీవ్రత మరింతగా పెరుగుతోంది.

ఎవరిలో ఎక్కువంటే...

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే కాకుండా, కోవిడ్ సమయంలో కీలకమైన బాధ్యతలు నిర్వహించిన వైద్యవర్గాలూ 'బర్న్ ఔట్ సిండ్రోమ్'కు గురికావడం ఆసక్తికరమైన అంశం. గణాంకాల్ని చూసినప్పుడు ఈ వైద్యవర్గాల్లోనూ ఎమర్జెన్సీ వైద్య విభాగాల్లో పనిచేసేవారు 65%, కార్డియాలజీ విభాగానికి చెందిన వారు 43%, న్యూరోసర్జరీ విభాగాల్లో పనిచేసే వైద్యుల్లో 21% మంది దీని బారిన పడ్డారని తేలింది. వీళ్లే కాదు... ఫాస్ట్‌ఫుడ్ డెలివరీ వర్కర్లు, ట్రాఫిక్ పోలీసులు, ఫైర్ ఫైటర్లూ దీనికి గురవుతుంటారు. మహిళలు దీని బారిన ఎక్కువగా పడుతుంటారు. దీనికి తోడు వ్యాయామం చేయని వాళ్లూ, ఊబకాయం ఉన్నవారూ, ఒంటరివాళ్లూ, బాగా ఎక్కువగా ఆల్కహాల్ తాగేవారిలోనూ బర్న్ ఔట్ సిండ్రోమ్ బారిన పడే అవకాశాలు మరీ ఎక్కువ.

మూన్‌లైటింగ్ ఎఫెక్ట్ అంటే...

తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం పెంచుకోవాలనే కోరికతో, ఎలాగూ తమపై ఆఫీసు నిఘా ఉండదు కాబట్టి పలు చోట్ల పనులను ఒప్పుకున్నవారు మరింత ఎక్కువ ఒత్తిడికి గురికావడాన్ని 'మూన్‌లైటింగ్ ఎఫెక్ట్' అంటారు. మామూలుగా మనం పగలు పనిచేస్తుంటాం. అదనపు పనిని ఒప్పుకున్నందున నిద్రమానేసి విశ్రాంతి లేకుండా రాత్రుళ్లూ పని చేస్తూపోవడాన్ని 'మూన్‌లైటింగ్'గా చెబుతున్నారు. మొదట్లో దీన్ని ఓ వైవిధ్యమైన పరిస్థితిగా అనుకున్నప్పటికీ విస్తృత అధ్యయనం తర్వాత 'మూన్‌లైటింగ్' కూడా 'బర్న్‌ఔట్' తాలూకు మరో రూపమనీ, దానికంటే ఒకింత తీవ్రత ఎక్కువని తేలింది. దీనివల్ల ఆఫీసులో జరిగే తప్పులే కాకుండా... భవిష్యత్తులో హైబీపీ, గుండెజబ్బులకూ, డిప్రెషన్‌కూ దారితీయవచ్చని పరిశోధనల్లో తేలింది.

విముక్తి ఎలా... ఈ సమస్యల నుంచి బయటపడటం కూడా తేలికే. అవసరమైనంత విశ్రాంతి తీసుకోవడం, వీలైనంత వరకు మధ్యాహ్నాలు ఓ అరగంట నిద్ర (పవర్‌న్యాప్), రాత్రుళ్లు కంటి నిండా కనీసం ఎనిమిది గంటల పాటు నిద్రపోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తినడం, వీలైనంతవరకు చక్కెర పదార్థాలు చాలా తక్కువగా తీసుకోవడం ద్వారా ఈ సమస్యల నుంచి బయట పడవచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా ఆల్కహాల్‌కూ, నిద్రపట్టనప్పుడు స్లీపింగ్ పిల్స్ వాడేవారు వాటికి దూరంగా ఉండాలి. క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం చేయాలి. తమ పట్ల తాము జాగ్రత్తలు తీసుకోవడం మాత్రమే కాకుండా... ఇతరులకు సహాయం చేయడంలోని ఆనందమూ వారిని బర్న్ ఔట్ నుంచి రక్షిస్తుందని అధ్యయనాలు తేల్చాయి. అప్పటికీ నిరాశ, నిస్పృహ, నిస్సత్తువ, అనాసక్తి వంటి లక్షణాలు చాలాకాలం పాటు కనిపిస్తుంటే ఒకసారి డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.



డా॥ పి. రంగనాథం
సీనియర్ న్యూరో సర్జన్


'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+12+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 38

SUNDAY Special

ఆదివారం 30-4-2023



సన్‌రైజర్స్ విజయం

ఐపీఎల్ మ్యాచ్‌లో హైదరాబాద్ 9 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 7 వికెట్లతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై విజయం సాధించింది.

- 9లో



గంగ-గోదావరి సంగమంలా పుష్కరాలు

కాశీ ఘాట్లలో గంగా పుష్కరాల కార్యక్రమం చూస్తుంటే గంగా-గోదావరి సంగమం మాదిరిగా ఉందని ప్రధాని మోదీ అభివర్ణించారు.

- 4లో


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కాంగ్రెస్ నన్ను 91 సార్లు దూషించింది

కాంగ్రెస్ పార్టీ తనను దూషించడమే పనిగా పెట్టుకుందని ప్రధాని ఆరోపించారు. అయితే వారి తిట్లకు ప్రజలు ఓట్ల రూపంలో ప్రతిస్పందించారని అన్నారు.

- వివరాలు 4లో



దేశంలో తొలి రైల్వే కేబుల్ బ్రిడ్జి సిద్ధం

దేశంలోనే మొట్టమొదటి రైల్వే తీగల వంతెన నిర్మాణం పూర్తయ్యింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వయంగా వెల్లడిస్తూ శనివారం ట్వీట్ చేశారు.

- వివరాలు 4లో

న్యూస్‌రీల్

ఓఆర్ఆర్ లీజు అతిపెద్ద స్కాం!



ఓఆర్ఆర్‌ను 30ఏళ్లపాటు లీజుకిచ్చే ఒప్పందం దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ లీజును తాము అంగీకరించే ప్రసక్తే లేదని, తాము అధికారంలోకి రాగానే విచారణ జరిపే మొదటి ఒప్పందం ఇదేనని పేర్కొన్నారు.

- వివరాలు 8లో

సచివాలయ ప్రారంభోత్సవానికి వెళ్లను



కొత్తగా నిర్మించిన సచివాలయం ప్రారంభోత్సవానికి తాను వెళ్లనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఎంఐఎం నేత ఒవైసీ కళ్లలో ఆనందం చూడటం కోసం, ఒక వర్గం వారిని సంతృప్తి పరిచేందుకే సచివాలయాన్ని డోమ్‌లతో కట్టారని ఆయన ధ్వజమెత్తారు.

- వివరాలు 8లో

మూతులతో ముద్దులు.. కాళ్లతో తన్నులు: గుత్తా



మూతులతో ముద్దాడుకుంటూ..కాళ్లతో తన్నుకుంటున్న కాంగ్రెస్ నాయకులు పెట్టింది నిరుద్యోగుల సభ కాదని, అది కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల సభ అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. కడుపులో కత్తులు పెట్టుకొని కలిసి ఉన్నామనే విధంగా కౌగిలించుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

- వివరాలు 8లో

ప్రభుత్వ ఉద్యోగాలున్నయ్.. కానీ జీతాల్లేవ్!

ప్రభుత్వోద్యోగమే అయినా ఆర్నెల్లుగా నయా పైసా జీతం లేక అల్లాడిపోతున్నారు కొత్త మండలాల్లోని రెవెన్యూ ఉద్యోగులు. వేతనాల మంజూరు కోసం సీసీఎల్ఏ నుంచి 'కేడర్ స్ట్రెంత్' సర్క్యులర్ జారీచేయాల్సి ఉంటుంది. ఈ జీవో జారీ ఆరు నెలలుగా జాప్యమవుతోంది. దీంతో సిబ్బందికి వేతనాలు అందడంలేదు.

- వివరాలు 5లో

సరి'కొత్త' పాలనకు..

నేడే బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం ప్రారంభోత్సవం

ఉదయం 6 గంటలకు సుదర్శన యాగంతో కార్యక్రమాలు ప్రారంభం

- మధ్యాహ్నం 1.30 గంటలకు రిబ్బన్ కట్ చేయనున్న సీఎం కేసీఆర్
- తర్వాత 6వ అంతస్తులోని తన చాంబర్‌లో కొలువుదీరనున్న సీఎం
- 1.58 – 2.04 గంటల మధ్య తమ చాంబర్లలో కూర్చోనున్న మంత్రులు, అధికారులు
- 'గృహలక్ష్మి' సహా కీలక ఫైళ్లపై తొలి సంతకాలు చేయనున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు
- 2.15 గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగం.. 2,500 మందికి ఆహ్వానం



విద్యుద్దీప కాంతుల్లో తళుకులీనుతున్న కొత్త సచివాలయం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయం నుంచి పరిపాలన వ్యవహారాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం శ్రీకారం చుట్టనుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టిన కొత్త సెక్రటేరియట్‌ను ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రారంభించనున్నారు. తర్వాత సీఎంతో పాటు మంత్రులు తమకు కేటాయించిన చాంబర్లలో ఆసీనులై.. కొత్త సెక్రటేరియట్ నుంచి తొలి సంతకాలు చేయనున్నారు. ఆ తర్వాత అతిథులను, రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి సీఎం కేసీఆర్ ప్రసంగించనున్నారు.

ఉదయం సుదర్శన యాగంతో..

నూతన సచివాలయ ప్రారంభోత్సవానికి సుదర్శన యాగంతో శ్రీకారం చుట్టనున్నారు. ఇందు కోసం సచివాలయ ప్రాంగణంలో యాగశాలను సిద్ధం చేశారు. శృంగేరి పీఠానికి చెందిన వైదికుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు యాగం ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 1.20 నుంచి 1.30 గంటల మధ్య యాగం పూర్ణాహుతిలో సీఎం కేసీఆర్, శోభ దంపతులు

మిగతా 2వ పేజీలో ▶

ఆదర్శ పాలన దేశమంతా విస్తరించేలా..



నూతన సచివాలయం నుంచి ద్విగుణీకృతం కానున్న తెలంగాణ పాలన

రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక సందేశంలో సీఎం కేసీఆర్

2లో

జేఈఈ మెయిన్స్‌లో.. టాప్ లేపిన తెలంగాణ!

ఫస్ట్ ర్యాంకు సాధించిన హైదరాబాదీ వెంకట కౌండిన్య

- టాప్-10లో ఐదుగురు తెలంగాణ వారే..
- 100 పర్సంటైల్ సాధించిన 11 మంది
- మొదటి వంద ర్యాంకుల్లోనూ 25 కైవసం
- టాప్ వెయ్యి ర్యాంకుల్లో 200కుపైగా రాష్ట్ర విద్యార్థులకే..
- నేటి నుంచి అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో తెలంగాణ టాప్ లేపింది. జాతీయ స్థాయి మొదటి ర్యాంకు మాత్రమేగాక.. టాప్-10లో ఐదు ర్యాంకులను తెలంగాణ విద్యార్థులే సాధించారు. జాతీయ స్థాయిలో వంద పర్సంటైల్ సాధించిన వారిలోనూ రాష్ట్ర విద్యార్థులు 11 మంది ఉన్నారు. ఏపీతో కలుపుకొంటే రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 16 మంది వంద పర్సంటైల్ సాధించిన టాప్-43లో నిలిచారు. ఇక ఓపెన్ కేటగిరీలో మొదటి వంద ర్యాంకుల్లో 25కుపైగా, టాప్ వెయ్యి ర్యాంకుల్లో 200కుపైగా తెలంగాణ విద్యార్థులకు దక్కాయి. ఈసారి జేఈఈ పరీక్ష జాతీయ స్థాయిలో రెండు దఫాలుగా.. జనవరిలో ఒకసారి, ఏప్రిల్‌లో మరోసారి జరిగింది. కంప్యూటర్ ఆధారితంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా 11,62,398 మంది దరఖాస్తు చేసుకోగా.. 11,13,325 మంది హాజరయ్యారు. తుది ఫలితాలు, ర్యాంకులను

మిగతా 3వ పేజీలో ▶



మచిలీపట్నంలోని మార్గదర్శి కార్యాలయంలో తనిఖీ చేస్తున్న సీఐడీ అధికారులు

'మార్గదర్శి'లో రాష్ట్రమంతా సోదాలు

- మొత్తం 37 కార్యాలయాల్లో ఏకకాలంలో సీఐడీ తనిఖీలు
- రికార్డుల ధ్వంసంపై ఫోరెన్సిక్ ఆడిట్
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు సీఐడీ సోదాల్లో బట్టబయలు
- ఆ ముసుగులో భారీగా నల్లధనం చెలామణిలోకి
- ఆ నిధులే రామోజీ గ్రూప్‌లో అక్రమ పెట్టుబడులు

4లో



గురుకుల పోస్టుల పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే..!

- ఓఎంఆర్ ఆధారిత పరీక్షల నిర్వహణపై గురుకుల బోర్డు పునరాలోచన
- ప్రస్తుతం రాష్ట్రంలో ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ సామర్థ్యం 32 వేలు
- సబ్జెక్టులవారీగా పరీక్షలు నిర్వహిస్తే ఆన్‌లైన్‌లో నిర్వహణ సాధ్యమేనని అధికారుల అంచనా
- ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల ఎంపికకు మొదలైన సంప్రదింపుల కసరత్తు

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



భూతాపం.. పర్యావరణంపై ప్రతాపం

పెరిగిపోతున్న గ్లోబల్ వార్మింగ్ సంకేతాలు

అడవుల నిర్మూలనతో వేగంగా వేడెక్కుతున్న భూమి



- ఏటా 10 మిలియన్ హెక్టార్లలో అడవుల నరికివేత
- 2030 నాటికి గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు కట్టడి చేయకపోతే ప్రమాదమే
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదికలో వెల్లడి

6లో



నూతన సచివాలయ భవనం ఏరియల్ వ్యూ



భవనం ముందు ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్



భవనం మధ్యలో లాన్

సరి'కొత్త' పాలనకు..

▶ మొదటి పేజీ తరువాయి

పాల్గొంటారు. ప్రత్యేక పూజలు చేస్తారు. తర్వాత కేసీఆర్ రిబ్బన్ కట్ చేసి భవన సముదాయాన్ని ప్రారంభిస్తారు. కాసేపు సచివాలయంలో కలియదిరిగి.. 6వ అంతస్తులోని తన చాంబర్‌కు చేరుకుంటారు. తన సీట్లో ఆసీనుడై పలు కీలక నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేస్తారు. మధ్యాహ్నం 1.58 – 2.04 గంటల మధ్య మంత్రులు, అన్నిశాఖల కార్యదర్శులు, అదనపు/సంయుక్త/ఉప కార్యదర్శులు, సెక్షన్ అధికారులు, అదనపు సెక్షన్ అధికారులు తమకు కేటాయించిన చాంబర్లు/ సెక్షన్లలో ఆసీనులై ఏవైనా ఫైల్స్‌పై తొలి సంతకాలు చేస్తారు.

2,500 మంది అతిథులకు ఆహ్వానం

మధ్యాహ్నం 2.15–2.45 గంటల మధ్య సచివాలయం ప్రాంగణంలో మంత్రులు, సచివాలయ అధికారులు, ఇతర అతిథులతో జరిగే సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లు, అన్ని శాఖల హెచ్ఓడీలు, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా పరిషత్, డీసీసీబీ, డీసీఎంఎస్, జిల్లా గ్రంథాలయాల చైర్మన్లు, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు, మేయర్లతో సహా మొత్తం 2,500 మంది అతిథులను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది.

మూడేళ్ల 10 నెలల తర్వాత..

పాత సచివాలయ భవనాలను కూల్చి నూతన సచివాలయం కట్టేందుకు 2019 జూన్ 27న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయగా.. సుమారు మూడేళ్ల 10 నెలల తర్వాత ప్రారంభోత్సవం జరుగుతోంది. వాస్తవానికి అన్ని అనుమతులు లభించాక 2021 జనవరిలో నిర్మాణ పనులను ప్రారంభించి.. ఈ నెలాఖరు నాటికి 26 నెలల్లో పూర్తి చేశామని ప్రభుత్వం పేర్కొంటోంది. ఇన్నాళ్లూ బీఆర్‌కేఆర్ భవన్‌లో తాత్కాలికంగా సచివాలయాన్ని నిర్వహించారు.

హైమాస్ట్ లైట్ పోల్‌పై కెమెరా..



ముస్తాబైన సచివాలయ ప్రధాన ద్వారం



యాగశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మొత్తం 300 కెమెరాలు

తొలిరోజున పని మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు పనులను చిత్రీకరించేందుకు.. సచివాలయం ఎదురుగా తూర్పు దిశలో రోడ్డుపై ఉన్న భారీ హైమాస్ట్ లైట్ స్తంభంపై ప్రత్యేకంగా కెమెరాను ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా జరిగిన పనులను అది చిత్రిస్తూ వచ్చింది. దాని ఆధారంగా ఇటీవలే ఓ వీడియోను రూపొందించి విడుదల చేశారు కూడా.

సీఎం ప్రజాదర్బార్‌కు ఏర్పాట్లు

కొత్త సచివాలయం 6వ అంతస్తులో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో సీఎం చాంబర్ ఏర్పాటు చేశారు. పూర్తిగా పాలరాతితో సీఎం కార్యాలయం, సిబ్బంది విభాగాలను తీర్చిదిద్దారు. సీఎం ప్రజలను కలిసేందుకు, ప్రజాదర్బార్ నిర్వహించేందుకు 'జనహిత' పేరిట 250 మంది కూర్చునే సామర్థ్యంతో ఒక హాల్‌ను ఏర్పాటు చేశారు. 25 మంది మంత్రులు, 30 మందికిపైగా అధికారులు కూర్చునేందుకు వీలుగా కేబినెట్ హాల్‌ను సిద్ధం చేశారు. కలెక్టర్లతో సమావేశాల నిర్వహణ కోసం 60 మంది కూర్చునేలా ఒక హాల్, 50 మంది సమావేశమయ్యేందుకు మరో హాల్ నిర్మించారు. ఈ నాలుగు సమావేశ మందిరాలతో పాటు ముఖ్యమంత్రి విశిష్ట అతిథులతో కలసి భోజనం చేసేందుకు 25 మంది కూర్చోగలిగే అత్యాధునిక డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు.

సచివాలయం విశేషాలివీ..

సచివాలయంలో మొత్తం 28 ఎకరాల స్థలం ఉండగా.. 2.45 ఎకరాల(7,79,982 చదరపు అడుగుల)లో.. 265 అడుగుల ఎత్తుతో భవనాన్ని నిర్మించారు. మొత్తం 635 గదులు, 30 సమావేశ మందిరాలు, 34 గుమ్మటాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రధాన భవనం ఆరు అంతస్తులు ఉండగా.. ప్రధాన గుమ్మటం వద్ద మరో ఐదు అంతస్తులు కలిపి మొత్తం 11 అంతస్తులతో నిర్మించారు. సెక్రటేరియట్ ముందువైపు 10 ఎకరాల్లో పచ్చిక మైదానం ఉండగా.. కోర్ట్ యార్డు (భవనం మధ్య ఖాళీ భాగంలో) రెండెకరాల్లో లాన్ ఏర్పాటు చేశారు. మొత్తంగా రూ.617 కోట్లతో పరిపాలన అనుమతులు జారీ చేయగా.. ఇప్పటివరకు రూ.550 కోట్లకుపైగా ఖర్చు చేశారు. ఇంకా కొన్ని పనులు సాగుతున్నాయి. అనుకున్న దానికంటే 20–30% వ్యయం ఎక్కువ అవుతోందని ప్రభుత్వం పేర్కొంది.

యాక్సెస్ కార్డు ఉంటేనే లోపలికి..

నూతన సచివాలయ భవనంలోకి ప్రవేశించాలంటే ప్రత్యేకంగా రూపొందించే యాక్సెస్ కార్డు పాస్ తప్పనిసరి. ఏదైనా పనిమీద వచ్చేవారు ఏ శాఖ కార్యాలయానికి వెళ్లాలో అక్కడివరకు మాత్రమే వెళ్లగలిగేలా పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. లోపలికి అనుమతించే విషయంలో అప్రమత్తంగా ఉండేలా భద్రతా సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి. రెండు షిఫ్టుల్లో 300 మంది చొప్పున సచివాలయంలో పహారా కాస్తారు. వారికి నిర్ధారిత డ్యూటీ పాయింట్లు ఉంటాయి.

- పాత సచివాలయంలో కూడా పాస్‌ల జారీ విధానం ఉండేది. ఒకసారి లోనికి వెళ్లాక సీఎం ఉండే సీ బ్లాక్‌లోకి తప్ప మిగతా అన్ని భవనాల్లోకి సులువుగా వెళ్లేందుకు అవకాశం ఉండేది.
- సచివాలయంలోకి వెళ్లేందుకు 4 ద్వారాలు ఉంటాయి. ఇందులో ఆగ్నేయం (గతంలో పెట్రోల్ బంకు ఉండే ప్రాంతం) వైపు ద్వారం నుంచి సందర్శకులను అనుమతిస్తారు. వారు కార్యాలయానికి వెళ్లేందుకు అక్కడ అనుమతి తీసుకొని యాక్సెస్ పాస్ పొందాలి. చెకింగ్ పాయింట్ల వద్ద పాస్‌ను చూపుతూ వెళ్లాలి. ఆ పాస్‌లో ఏ కార్యాలయానికి, ఎటువైపు అనుమతి ఉంటుందో అక్కడికే సిబ్బంది అనుమతిస్తారు.

మీడియాను కూడా..

- భవిష్యత్తులో ఫేస్ రీడింగ్‌తో కూడిన యాక్సెస్ కార్డులను జారీచేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ప్రస్తుతానికి మాన్యువల్‌గా తనిఖీ చేసి పంపే యాక్సెస్ కార్డులను జారీ చేయనున్నారు.
- సచివాలయం భద్రత కోసం 300 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

మీడియాకూ ఆంక్షలు!

ఆగ్నేయ దిక్కున గేటు సమీపంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లోకి మాత్రమే మీడియా ప్రతినిధులను అనుమతిస్తారు. ఏదైనా మంత్రిత్వ శాఖ సమావేశ మందిరాల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేస్తే అధికారులు సెక్యూరిటీ అధికారులకు సమాచారం ఇస్తేనే.. మీడియాను లోపలికి పంపుతారని అధికార వర్గాలు చెప్తున్నాయి. లేకుంటే సంబంధిత అధికారులు మీడియా సెంటర్ వద్దకే వచ్చి సమాచారం ఇచ్చి వెళ్లేలా యోచన కూడా చేస్తున్నారు.

గృహలక్ష్మిపైనే తొలి సంతకం!


ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కొత్త సచివాలయాన్ని ప్రారంభించిన తర్వాత పేదల సంక్షేమానికి సంబంధించి సీఎం కేసీఆర్ తొలి సంతకం చేయనున్నారు. సొంత స్థలాలున్న పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.మూడు లక్షలు ఆర్థిక సాయంగా ఇచ్చే పథకం ఫైలుపై సీఎం సంతకం చేసే అవకాశం ఉందని సమాచారం. ఈ పథకం కోసం ఇటీవలి బడ్జెట్‌లోనూ రూ.12 వేల కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఒక్కో కుటుంబానికి రూ. మూడు లక్షల చొప్పున.. 4 లక్షల కుటుంబాలు ఇళ్లు నిర్మించేందుకు ఆర్థిక సాయం చేయనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇక కొత్త సచివాలయంలో తొలిరోజున చేసే సంతకాల్లో దళిత, బహుజనుల సంక్షేమానికి సంబంధించిన అంశాలు ఉంటాయని తెలిసింది. ఇటీవలి అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునే దిశగా పరిహారం నిధుల విడుదల ఫైలు, ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాల పెంపునకు సంబంధించిన ఫైళ్లపైనా సంతకాలు చేయనున్నట్టు సమాచారం. పోడు భూములకు పట్టాల పంపిణీ అంశం కూడా సీఎం ప్రాధాన్యతల్లో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దళితబంధు లబ్ధిదారుల ఎంపికపై ఈ కార్యక్రమంలో ఆదేశాలు ఇవ్వనున్నట్టు తెలిసింది.

కొత్త సచివాలయం విశేషాలివీ..

మొత్తం భూ విస్తీర్ణం: 28 ఎకరాలు	భవనం నిర్మించిన ప్రాంతం: 2.45 ఎకరాలు	ల్యాండ్ స్కేపింగ్: 7.72 ఎకరాలు
సెంట్రల్ కోర్ట్ యార్డ్ లాన్: 2.2 ఎకరాలు	పార్కింగ్ సామర్థ్యం: 560 కార్లు, 700 బైకులు	
ప్రధాన భవన కాంప్లెక్స్ బిల్టప్ ఏరియా: 8,58,530 చదరపు అడుగులు	లోయర్ గ్రౌండ్, గ్రౌండ్, ఆరు అంతస్తుల్లో ఒక్కోదాని ఎత్తు: 14 అడుగులు	
మొత్తం ఎత్తు: 265 అడుగులు		

నిర్మాణానికి ఉపయోగించిన సామగ్రి

ఉక్కు: 8,000 టన్నులు	సిమెంటు: 40,000 టన్నులు	ఇసుక: 30,000 టన్నులు (5 వేల లారీలు)
కాంక్రీట్: 60,000 క్యూబిక్ మీటర్లు	ఇటుకలు: 11 లక్షలు	ఆగ్రా రెడ్ స్టోన్: 3,500 క్యూబిక్ మీటర్లు
గ్రానైట్: 3 లక్షల చదరపు అడుగులు	మార్బుల్: లక్ష చదరపు అడుగులు	ధోల్‌పూర్ రెడ్‌స్టోన్: 3,500 క్యూబిక్ మీటర్లు
కలప: 7,500 క్యూబిక్ అడుగులు	పనిచేసిన కార్మికులు: మూడు షిఫ్టుల్లో 12,000 మంది	



ఆదర్శ పాలన | దేశమంతా విస్తరించేలా..

నూతన సచివాలయం నుంచి ద్విగుణీకృతం కానున్న తెలంగాణ పాలన

- రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక సందేశంలో సీఎం కేసీఆర్
- దీనితో ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై గొప్ప ప్రభావం
- సమాన హక్కులకు బాటలు వేయాలనే అంబేడ్కర్ పేరు
- కూలీల నుంచి మంత్రి దాకా అందరికీ కృతజ్ఞతలు చెప్పిన సీఎం



సాక్షి, హైదరాబాద్: దేశంలో అత్యంత తక్కువ వయసున్న రాష్ట్రమైనా.. సకల జనుల సంక్షేమ పాలనతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఈ ఆదర్శ పాలన దేశవ్యాప్తంగా విస్తరించేలా నూతన సచివాలయం నుంచి బీజం పడుతుందని చెప్పారు. తెలంగాణ ప్రభ దేదీప్యమానంగా మహోన్నత ప్రస్థానం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్న నేపథ్యంలో.. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శనివారం సందేశాన్ని విడుదల చేశారు. వివరాలు కేసీఆర్ మాటల్లోనే..

''ప్రశాంతతను ప్రసాదించే దేవాలయంలా, చూస్తేనే కడుపు నిండే విధంగా ఆహ్లాదభరిత వాతావరణంలో ఉద్యోగులు పనిచేసేలా సచివాలయం నిర్మితమైంది. ప్రభుత్వ యంత్రాంగ పనితీరును గొప్పగా ప్రభావితం చేస్తూ గుణాత్మక మార్పుకు బాటలు వేయనుంది. ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా, ప్రజా ఆకాంక్షలు నెరవేరుస్తూ సుపరిపాలన కొనసాగేలా సెక్రటేరియట్ నిర్మాణం జరిగింది.

దేశానికే వన్నె తెచ్చేలా నిర్మాణం

తెలంగాణ ప్రతిష్ట, ప్రజల ఆత్మగౌరవం ఇనుమడింపచేసేలా వినూత్న రీతిలో తెలంగాణ సచివాలయాన్ని నిర్మించుకున్నాం. ఇది యావత్ తెలంగాణ సమాజం గర్వించదగ్గ గొప్ప సందర్భం. అనేక అపోహలు, విమర్శలతో అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేసినా.. దృఢ సంకల్పంతో నూతన సచివాలయాన్ని పూర్తి చేశాం. దేశానికే వన్నె తెచ్చేలా, భవిష్యత్తు తరాల పాలనా అవసరాలకు అనుగుణంగా, గొప్ప సాంకేతిక విలువలతో సెక్రటేరియట్ నిర్మాణం జరిగింది. అన్ని రకాల ప్రమాణాలను పాటిస్తూ దేశంలోనే మొట్టమొదటి పర్యావరణ అనుకూల మహాద్భుత కట్టడంగా నిలిచింది.

రాళ్లెత్తిన కూలీల నుంచి అందరికీ కృతజ్ఞతలు

సెక్రటేరియట్‌ను గొప్పగా తీర్చిదిద్దడంలో అమోఘమైన పాత్ర పోషించిన, రాళ్లెత్తిన కూలీలు, మేస్త్రీలు, అన్నివృత్తుల నిపుణులు, ఆర్కిటెక్టులు, రేయింబవళ్లు పనిచేసిన కాంట్రాక్టు ఏజెన్సీలు, ఇంజనీర్లు, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు, సిబ్బంది, నిర్మాణంలో భాగమైన ప్రభుత్వ యంత్రాంగం అందరికీ కృతజ్ఞతలు చెప్తున్నా..''అని కేసీఆర్ తన సందేశంలో పేర్కొన్నారు.

రేపటికి దిక్సూచిగా అంబేడ్కర్

రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం దేశంలోనే మొదటిసారి. ఈ పేరు పెట్టుకోవడం వెనుక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా, పేద వర్గాలకు సమాన హక్కులు దక్కాలనే సమున్నత లక్ష్యం ఉంది. ఎదురుగా తెలంగాణ అమరుల స్మారక జ్యోతి, పక్కనే ఆకాశమంత ఎత్తున అంబేడ్కర్ మహాశయుడు రేపటికి దిక్సూచిగా నిలిచి స్ఫూర్తిని రగిలిస్తుండగా.. జాతి మెచ్చే సుపరిపాలన రాష్ట్ర ప్రజలకు అందుతుంది.

కొత్త యూనిఫాంతోనే స్కూల్‌కు!

విద్యాశాఖ సన్నాహాలు

- మే నెలాఖరు కల్లా కుట్టే ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశం
- 24 లక్షల మందికి రెండేసి జతల పంపిణీకి చర్యలు



సాక్షి, హైదరాబాద్: పాఠశాలలు తిరిగి తెరిచే రోజుకల్లా విద్యార్థులకు కొత్త యూనిఫాంలు అందించాలని విద్యాశాఖ భావిస్తోంది. ఇందుకు అవసరమైన కసరత్తు పూర్తి చేసింది. మే నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే దాదాపు 24.27 లక్షల మందికి ప్రభుత్వం యూనిఫాం అందిస్తుంది. దీని కోసం ఈ ఏడాది రూ.140 కోట్లు వెచ్చించారు. గతంలో స్కూళ్ళు తెరిచిన కొన్ని నెలల వరకూ దుస్తులు అందేవి కాదు. వస్త్రం కొనడం, వాటిని కుట్టడం వరకూ ఎదురయ్యే అనేక ఆటంకాలతో ఆలస్యమయ్యేది. అయితే ప్రస్తుతం ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రవేశ పెట్టడం, కార్పొరేట్ స్కూళ్ళకు దీటుగా పాఠశాలలను తీర్చిదిద్దడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో సకాలంలో యూనిఫాం ఇవ్వలేకపోతే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని విద్యాశాఖ భావించింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో యూనిఫాంలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఒక్కో విద్యార్థికి తలా రెండు జతల యూనిఫాంలు ఇవ్వనున్నారు.

ఫ్యాషన్ డిజైనర్లతో రూపకల్పన

విద్యార్థుల యూనిఫాం కార్పొరేట్ తరహాలో కన్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఫ్యాషన్ డిజైనర్లతో కొన్ని నమూనాలు తయారు చేయించారు. వివిధ రకాల డిజైన్లలో కొన్నింటిని ఇప్పటికే ఆమోదించారు. మొత్తంగా 24,27,391 మంది విద్యార్థులకు 1,26,96,313.30 మీటర్ల వస్త్రాన్ని తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా విద్యాశాఖ కొనుగోలు చేసింది. దానిని విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలలకు అప్పగిస్తున్నారు. గతేడాది స్వయం సహాయ బృందాల ద్వారా కుట్టించే ప్రయత్నం చేయగా ఈసారి 50 శాతం యూనిఫాంలను స్థానిక దర్జీల ద్వారా కుట్టించాలని నిర్ణయించారు. మే 31లోగా వాటిని కుట్టించే ప్రక్రియను చేపట్టి, గడువులోగా పూర్తిచేయాలని విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన ఆదేశించారు. ఒక్కో యూనిఫాం తయారీకి గాను దర్జీకి రూ.50 ఇవ్వనున్నారు.



సొంత బాధలు చెప్పుకుంటున్న మొదటి ప్రధాని మోదీ

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ

ధార్వాడ: ప్రజల కష్టాలను వినడానికి బదులు సొంత బాధలను ప్రజల ముందు చెప్పుకుంటున్న మొట్టమొదటి ప్రధానమంత్రి నరేంద్ర మోదీయేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా ఎద్దేవా చేశారు. ఇందిరా గాంధీ నుంచి మన్మోహన్ సింగ్ ద్వారా తాను ఎంతోమంది ప్రధానమంత్రులను చూశానని అన్నారు. సొంత సమస్యలను జనం ముందు ఏకరువు పెడుతున్న ప్రధానమంత్రిని చూడడంఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం ధార్వాడ జిల్లా నావల్‌గుండ్‌లో ప్రియాంక శనివారం ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో అవినీతిపరులకే బీజేపీ టికెట్లు దక్కాయని అన్నారు. లింగాయత్ సామాజిక వర్గాన్ని అధికార పార్టీ దారుణంగా అవమానించిందని విమర్శించారు.

యూజీ, పీజీల్లో భారతీయ సనాతన విజ్ఞానం

- ముసాయిదా మార్గదర్శకాలు విడుదల చేసిన యూజీసీ
- యూజీ, పీజీ కోర్సుల్లో అందుబాటులోకి..
- ఆయుర్వేదం, యోగా, ప్రకృతి వైద్యం, హోమియోపతి తదితరాలపై అవగాహన కోర్సులు

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యాకోర్సుల్లో భారతీయ విజ్ఞాన విధానాన్ని (ఇండియన్ నాలెడ్జి సిస్టమ్–ఐకేఎస్)ను ప్రవేశపెట్టాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ దిశగా ప్రాచీన భారతీయ వి/్ఞాన విధానానికి సంబంధించిన ప్రోగ్రాములు, పాఠ్యప్రణాళికలను రూపొందించాలని యూజీసీ అన్ని యూనివర్సిటీలకు సూచించింది. ఏప్రిల్ 30లోపు ఈ ముసాయిదా మార్గదర్శకాలపై అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. వీటిని www.ugc.ac.nicలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. నిపుణులు, భాగస్వాములు.. ugc.iks@gmail.comకు తమ అభిప్రాయాలను మెయిల్ చేయాలని పేర్కొంది.

సనాతన విజ్ఞాన పరిరక్షణే లక్ష్యం

రెగ్యులర్ కోర్సుల్లో భారతీయ సనాతన విజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా వాటి గురించి నేటి తరానికి, భవిష్యత్తు తరాలకు తెలియచేయొచ్చని యూజీసీ భావిస్తోంది. అంతేకాకుండా చిరకాలం ప్రాచీన వారసత్వ విజ్ఞానాన్ని కాపాడుకోవడానికి వీలవుతుందని విశ్వసిస్తోంది. ఈ లక్ష్యం కోసమే ఈ ఐకేఎస్ కోర్సులకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొంది. నేషనల్ ఎడ్యుకేషన్ ఫ్రేమ్ వర్క్‌కు అనుగుణంగానే ఈ కోర్సులను రూపొందించాల్సి ఉంటుందని అభిప్రాయపడింది. విద్యార్థుల్లో సమగ్ర నైపుణ్యాలను పెంపొందించడం, సమగ్ర భవిష్యత్‌కార్యాచరణతో ముందుకు తీసుకెళ్లాలన్నదే ఈ ఐకేఎస్ కోర్సుల ప్రధానోద్దేశమని పేర్కొంది.



యూజీ, పీజీ కోర్సులు రెండింటిలోనూ..

విద్యార్థులు.. అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ), పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సులు చేస్తూనే ఈ ఐకేఎస్ కోర్సులను అభ్యసించేందుకు వీలు కల్పించనున్నారు. ఇందుకనుగుణంగా కోర్సుల రూపకల్పన చేయనున్నట్లు యూజీసీ తెలిపింది. అంతేకాకుండా ఈ ఐకేఎస్ కోర్సులను నేర్చుకునే విద్యార్థులకు రెగ్యులర్ కోర్సుల క్రెడిట్లకు అదనంగా 5 శాతం మేర క్రెడిట్ పాయింట్లు కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించింది.

- ➤ నాలుగేళ్ల యూజీ డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులంతా భారతీయ విజ్ఞాన విధాన కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలని యూజీసీ అన్ని విశ్వవిద్యాలయాలకు, ఉన్నత విద్యాసంస్థలకు సూచించింది.
- ➤ డిగ్రీ మొదటి నాలుగు సెమిస్టర్ల సమయంలో ఎప్పుడైనా విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరడానికి అవకాశముంటుంది.
- ➤ యూజీ కోర్సుల కరిక్యులమ్‌ను అనుసరిస్తూనే ఐకేఎస్‌పై పునాది కోర్సును విద్యార్థులందరూ అభ్యసించాల్సి ఉంటుంది.
- ➤ విద్యార్థులంతా ఐకేఎస్ కోర్సులు అభ్యసించడానికి, క్రెడిట్‌ల సంఖ్యను పెంచుకోవడానికి వీలుగా అవసరమైన అన్ని ఐకేఎస్ కోర్సులను విద్యాసంస్థలు అందుబాటులో ఉంచాలని యూజీసీ సూచించింది.
- ➤ ఐకేఎస్ పరిధిలోకి వచ్చే సబ్జెక్టుల్లో ఏదైనా ఒకదానిలో ఇంటర్న్‌షిప్/అప్రెంటీస్‌షిప్‌ని చేసుకొనే అవకాశం కూడా విద్యార్థులకు ఉంటుంది.
- ➤ విద్యార్థులు ఈ ఐకేఎస్ కోర్సులకు సంబంధించి డిగ్రీలో 7 లేదా 8వ సెమిస్టర్‌లో సంబంధిత అంశాల్లో ప్రాజెక్టు వర్క్ కూడా చేయొచ్చు.
- ➤ యూజీ వైద్య విద్యార్థులకు వారి కోర్సు మొదటి సంవత్సరంలో భారతీయ సనాతన వైద్య వ్యవస్థలపై క్రెడిట్ కోర్సు అందుబాటులో ఉంటుంది. ఆయుర్వేదం, యోగా, ప్రకృతివైద్యం, యునాని, సిద్ధ, హోమియోపతిపై ప్రాథమిక అవగాహన కోసం ఇవి ఉంటాయి.
- ➤ వైద్య విద్యార్థులు రెండో సంవత్సరంలో భారతీయ వైద్య వ్యవస్థ సిద్ధాంతానికి సంబంధించిన అంశాల్లో రెండు సెమిస్టర్ క్రెడిట్ కోర్సులను కూడా అభ్యసించేందుకు వీలుంది.
- ➤ ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు, ధర్మశాస్త్రం, ఛందస్సు, వేద గణితం తదితర అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఐకేఎస్ కోర్సులను అందుబాటులో ఉంచుతారు.
- ➤ వేదాంగాలు, భారతీయ భాషా శాస్త్రాలు, భారతీయ గణిత శాస్త్రం, జ్యోతిష్యం, ఇండియన్ హెల్త్ సైన్సెస్, సంస్కృతం, ఇతర భారతీయ భాషల్లోని క్లాసికల్ లిటరేచర్, భారతీయ విద్యావిధానం, భారతీయ నిర్మాణాలు, టౌన్‌ప్లానింగ్, భారతీయ కళలు, భారతీయ వ్యవసాయం, ఇండియన్ టెక్స్‌టైల్స్, ఇండియన్ మెటలర్జీ, ఇండియన్ పాలిటీ, ఎకానమీ, వేదాల్లో గణితం, పాణిని అష్టాధ్యాయి, ఛందశ్శాస్త్రం, ప్లేస్ ఆఫ్ వ్యాల్యూ సిస్టమ్, ఆర్యభట్ట పరిశోధనలు తదితర అంశాల్లో ఐకేఎస్ కోర్సులను అందుబాటులోకి తేనున్నారు.



తెలుగు రాష్ట్రాల్లో మూడేళ్లుగా వేప చెట్లపై 'టీ మస్కిటో', ఫంగస్ దాడి

కొమ్మలన్నీ ఎండి, ఆకులు రాలి దెబ్బతిన్న చెట్లు

అయినా ఏటా ఉగాది తర్వాత చిగురించి బతుకుతున్న వేప

ఈసారి ఫిబ్రవరి నుంచి అకాల వర్షాలతో మళ్లీ మొదలైన కీటక దెబ్బ

ఈ ఏడాది 50–80 శాతం దాకా విత్తన దిగుబడి తగ్గొచ్చంటున్న నిపుణులు

వేపకు మళ్లీ 'డై బ్యాక్' ముప్పు!

లేపల్లైనా, రోడ్ల పక్కన, అడవుల్లో విస్తృతంగా పెరిగే మన వేపచెట్లకు మరోసారి 'డై బ్యాక్' జబ్బు ముప్పు పొంచి ఉంది. సుమారు మూడేళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో 'టీ మస్కిటో', ఫంగస్ దాడితో తీవ్రంగా దెబ్బతిన్న లక్షలాది వేపచెట్లు ఈ ఏడాది ఉగాది తర్వాత కోలుకుంటున్న క్రమంలో మళ్లీ టీ మస్కిటో దాడి మొదలుపెట్టింది. ఈసారి ఫిబ్రవరి నుంచి అకాల వర్షాలు కురుస్తుండటంతో మళ్లీ పంజా విసురుతోంది. ఫలితంగా చెట్లన్నీ కొమ్మలతో సహా ఎండి పోవడంతోపాటు ఆకులు రాలిపోతున్నాయి. దీనివల్ల చెట్లకు పోషకాలు అందక క్రమంగా చచ్చిపోతున్నాయి. దీన్నే డై బ్యాక్‌గా పిలుస్తున్నారు.

- సాక్షి, హైదరాబాద్

రానున్న రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రం కావొచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు తెగుళ్లు సోకడం వేపవిత్తనాల దిగుబడి భారీగా తగ్గిందని చెబుతున్నారు. ఈ ఏడాది 50 నుంచి 80% దాకా విత్తనాల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందని, దీని ప్రభావం వేప ఉత్పత్తులు, నీమ్‌కేక్స్, నీమ్ ఆయిల్, నీమ్

తగ్గనున్న వేప విత్తన దిగుబడి...

కోటింగ్‌పై ఆధారపడిన పరిశ్రమలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. డై బ్యాక్ జబ్బును జాతీయ స్థాయిలో దీనిని కట్టడి చేసేందుకు కార్యాచరణను చేపట్టకపోతే భవిష్యత్‌లో వేప ఆధారిత ముడిపదార్థాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఎదురుకావొచ్చని చెబుతున్నారు.

ఈ సమస్యపై ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఫారెస్ట్ కాలేజీ ఆఫ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) ఐఐసీటీ, జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విడివిడిగా పరిశోధనలు నిర్వహిస్తున్నాయి. వేపచెట్లకు ఎదురవుతున్న కీటక దాడులు, చెదలు, ఫంగస్‌లను ఎలా కట్టడి చేయాలనే దాని పై పరిష్కారాలు కనుగునేందుకు కృషి చేస్తున్నాయి. ఎఫ్‌సీఆర్ఐలో పరిశోధన నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.జగదీశ్‌కుమార్ చెబుతున్న దాన్ని బట్టి చూస్తే ఫోమోప్సిస్ అజాడిరాచ్‌టే అనే పాథోజెన్ ద్వారా వేప చెట్లకు ఈ జబ్బు సోకుతున్నట్లు గుర్తించారు. ఈ పాథోజెన్ గాలి ద్వారా సులభంగా వ్యాప్తికి అవకాశం ఉన్నందున వేపచెట్లు ఉన్న ప్రాంతానికి చేరుకున్నాక వేగంగా వ్యాప్తి చెందుతోందన్నారు. రాష్ట్రమంతటా వేప చెట్లు విస్తరించి ఉన్నందున అన్నింటికీ వివిధ రసా యన మిశ్రమాలతో పిచికారీ చేయడం అసాధ్యంగా మారిందని వివరించారు. అయితే వేపకు బతికే శక్తిసామర్థ్యాలు ఎక్కువగా ఉన్నందున పెద్దచెట్లకు అంతగా నష్టం ఉం

కొనసాగుతున్న పరిశోధనలు..

డదని ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా విభాగం రిటైర్డ్ సంచాలకుడు డాక్టర్ ఆర్.జగదీశ్వర్ అభిప్రాయపడ్డారు. కానీ గ్రామాలు, పట్టణాల్లో సీసీ రోడ్లు ఎక్కువ కావడంతో వేపచెట్టు నుంచి విత్తనం నేలపై పడి తిరిగి మొలకెత్తడం తగ్గిపోయిందన్నారు. అందు వల్ల వేప ముడిపదార్థాల ఉత్పత్తి, సరఫరాలో తగ్గుదల కనిపిస్తోందని సాక్షితో మాట్లాడుతూ చెప్పారు.

జేఈఈ మెయిన్స్‌లో.. టాప్ లేపిన తెలంగాణ!





వెంకట్ కౌండిన్య (ఫస్ట్ ర్యాంకు)



అల్లం సుజయ్ (6వ ర్యాంకు)



సాయిదుర్గారెడ్డి (40వ ర్యాంకు)

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్‌టీఏ శనివారం వెల్లడించింది.

టాపర్స్ వీరే..

జేఈఈ మెయిన్స్‌లో దేశవ్యాప్తంగా వంద శాతం పర్సంటైల్‌ను 43 మంది విద్యార్థులు సాధించగా.. అందులో 11 మంది తెలంగాణ విద్యార్థులే. మొత్తంగా టాప్ ర్యాంకు హైదరాబాద్‌కు చెందిన సింగరాజు వెంకట కౌండిన్యకు దక్కింది. టాప్–10లో రాష్ట్రానికి చెందిన అల్లం సుజయ్ 6వ ర్యాంకు, వావిళ్ల చిద్విలాస రెడ్డి 7వ ర్యాంకు, బిక్కన అభినవ్ చౌదరి 8వర్యాంకు, అభినీత్ మంజేటి 10వ ర్యాంకు సాధించారు. ఇక గుత్తికొండ అభిరాం (17వ ర్యాంకు), భరద్వాజ (18వ ర్యాంకు), పాలూరి గణకౌశిక్‌రెడ్డి (20వ ర్యాంకు), రమేశ్ సూర్యతేజ (21వ ర్యాంకు), నందిపాటి సాయి దుర్గారెడ్డి (40వ ర్యాంకు), ఈవూరి మోహన శ్రీధర్‌రెడ్డి (41వ ర్యాంకు) తదితరులు వందశాతం పర్సంటైల్ సాధించిన టాప్–43 ర్యాంకర్లలో ఉన్నారు.

కేటగిరీల వారీగా కటాఫ్ ఇదీ..

కేటగిరీ	కటాఫ్	ఎంపికైన అభ్యర్థుల సంఖ్య
ఓపెన్	90.788642	98,612
పీహెచ్	0.0013527	2,685
ఈడబ్ల్యూఎస్	75.6229025	25,057
ఓబీసీ	73.6114227	67,613
ఎస్సీ	51.9776027	37,536
ఎస్టీ	37.2348772	18,752

నేటినుంచి అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తులు

జేఈఈ అర్హులు నేటి నుంచి అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్‌టీఏ ప్రకటించింది. ర్యాంకు కార్డు డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. కటాఫ్ మార్కుల ఆధారంగా అడ్వాన్స్‌డ్‌కు అర్హులైన వారి వివరాలను ర్యాంకు కార్డులో పొందుపరిచారు.

అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ ఇదీ..

దేశవ్యాప్తంగా జేఈఈమెయిన్స్‌కు హాజరైనవారిలో 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఎంపిక చేస్తారు. పరీక్షలో వచ్చిన మార్కులను పరిగణనలోకి తీసుకుని వివిధ కేటగిరీల వారీగా కటాఫ్ నిర్ణయిస్తారు. గత ఏడాది కన్నా ఈసారి ఎక్కువ మంది పరీక్షకు హాజరయ్యారు. ఓపెన్ కేటగిరీలో 90పర్సంటైల్‌తో కటాఫ్ నిర్ణయించారు.

కృత్రిమ మేధపై పట్టు సాధించాలనుంది

జేఈఈ మెయిన్స్‌లో జాతీయస్థాయి టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉంది. అడ్వాన్స్‌డ్‌లోనూ ఇదే పట్టుదలతో విజయం సాధిస్తా. ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో చేరాలనుంది. తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పట్టు సాధించాలన్నది నా లక్ష్యం. ఆ దిశగా రోజుకు 18 గంటలు కష్టపడి చదువుతున్నాను. మా నాన్న శ్రీపణి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అమ్మ రాజరాజేశ్వరి నా కోసం చాలా కష్టపడ్డారు. వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తాను.

– సింగరాజు వెంకట కౌండిన్య, జేఈఈ టాపర్

ముంబై ఐఐటీపైనే ర్యాంకర్ల చూపు..

జేఈఈ మెయిన్ టాపర్ల దృష్టంతా ఐఐటీ ముంబైపైనే కనిపిస్తోంది. అడ్వాన్స్‌డ్‌లో సైతం సత్తా చాటి ఐఐటీ ముంబైలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదవాలన్నదే తమ లక్ష్యమని ర్యాంకర్లు చెప్తున్నారు. జాతీయ స్థాయిలో తొలిర్యాంకు సాధించిన హైదరాబాద్ విద్యార్థి సింగరాజు వెంకట కౌండిన్యతోపాటు నందిపాటి సాయిదుర్గారెడ్డి, సృజయ్ కూడా ముంబై ఐఐటీపై ఆసక్తి కనబర్చుతున్నారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన సృజయ్.. ఓబీసీ కేటగిరీలో 3వ స్థానంలో నిలవడం గమనార్హం. ఆయన తల్లిదండ్రులు ఇద్దరు టీచర్లే. ఇక ఏపీలోని పిడుగురాళ్లకు చెందిన నందిపాటి సాయిదుర్గారెడ్డి.. పదో తరగతి వరకు ఏపీలో చదివి హైదరాబాద్‌లో ఇంటర్‌లో పూర్తి చేశారు. వారిది నిరుపేద వ్యవసాయ కుటుంబం.



వ్యాయామమే మంచి మందు

మానసిక ఆరోగ్యానికి దీన్ని మించింది లేదు

- మందుల కంటే వ్యాయామంతోనే 1.5 రెట్లు ఎక్కువ ప్రయోజనం
- శారీరకంగా చురుకుగా ఉంటే నిరాశ, విచారం, ఆందోళన తక్కువే
- సౌత్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం పరిశోధన
- 1.28 లక్షల మందిపై అధ్యయనం
- బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో కథనం

సాక్షి, అమరావతి: ప్రతి రోజూ అర గంటపాటు నడక, పరుగు, సైక్లింగ్, ఈత.. ఇలా ఏదో ఒకదాన్ని నిత్యకృత్యంగా చేసుకున్నవారు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. నిత్యం వ్యాయామాన్ని ఒక అలవాటుగా మార్చుకుంటే చాలా వరకు వ్యాధులను దరి చేరకుండా చూసుకోవచ్చని పేర్కొంటున్నారు. కేవలం శారీరకంగానే కాకుండా మానసిక ఆరోగ్యానికి సైతం వ్యాయామాన్ని మించిన మందు లేదని వివరిస్తున్నారు. ఈ మేరకు అధ్యయనాలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని అంటున్నారు. మందుల కంటే కూడా వ్యాయామంతోనే 1.5 రెట్లు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. శారీరకంగా చురుకుగా ఉంటే విచారం, ఆందోళన, బాధ తదితరాలు తక్కువ స్థాయిలోనే ఉంటాయని పేర్కొంటున్నారు. ఈ మేరకు సౌత్ ఆస్ట్రేలియా యూనివర్సిటీ పరిశోధకులు ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందులో భాగంగా 1.28 లక్షల మందిని పరిశీలించారు. ఆయా మానసిక సమస్యలను అధిగమించడానికి మందులు, కౌన్సెలింగ్ కంటే కూడా శారీరక శ్రమ చేస్తే 1.5 రెట్లు ఎక్కువ ప్రభావవంతంగా ఉంటోందని వెల్లడించారు. ఈ అధ్యయనం ఆధారంగా గుర్తించిన అంశాలను బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్‌లో తాజాగా ప్రచురించారు.

మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం

పరిశోధకులు తమ అధ్యయనంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, నిరాశ, ఆందోళన, ఆత్మన్యూనతతో బాధపడేవారిని పరిశీలించారు. ఈ క్రమంలో శారీరక శ్రమ/వ్యాయామం చేసేవారిలో నిరాశ, ఒత్తిడి, ఆందోళన వంటివి తగ్గుముఖం పట్టాయని గుర్తించారు. తీవ్ర డిప్రెషన్‌తో బాధపడుతున్న గర్భిణులు, హెచ్ఐవీ, కిడ్నీ వ్యాధిగ్రస్తులు వ్యాయామంతో ఎక్కువ ప్రయోజనాలు పొందుతున్నట్టు స్పష్టమైంది.

ప్రతి ఎనిమిది మందిలో ఒకరు

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎనిమిది మందిలో ఒకరు మానసిక రుగ్మతతో బాధపడుతున్నారు. దీంతో మానసిక ఆరోగ్య సంరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా ఏటా దాదాపు 2.5 ట్రిలియన్ డాలర్ల వ్యయం చేస్తున్నారు. ఈ వ్యయం 2030 నాటికి 6 ట్రిలియన్ డాలర్‌లకు పెరుగుతుందని అంచనా.

మంచి హార్మోన్‌లు పెరుగుతాయి

నడక, వ్యాయామం, పరుగు, ఏరోబిక్స్ వంటివాటితో శరీరానికి మంచి చేసే హార్మోన్‌లు విడుదల అవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాయామం వల్ల శరీరంలోని అడ్రినాలిన్, కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్ల స్థాయిలు తగ్గుతాయని పేర్కొంటున్నారు. శారీరక శ్రమ ఒత్తిడిని తగ్గించే ఎండార్ఫిన్‌ల ఉత్పత్తిని ప్రేరేపిస్తుందని అంటున్నారు.

రోజూ అరగంట చేసినా మంచి ఫలితాలు..



ప్రస్తుతం అన్ని వయసులవారు తీవ్ర ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడుపుతున్నారు. ఈ క్రమంలో రోజూ కనీసం అరగంట పాటు నడక, స్విమ్మింగ్, రన్నింగ్, సైక్లింగ్, జాగింగ్, డ్యాన్సింగ్, ఏరోబిక్స్ వంటి వాటికి సమయం కేటాయించాలి. ఈ వ్యాయామం బీపీ, షుగర్, ఊబకాయం వంటివి రాకుండా శారీరక, మానసిక ఆరోగ్యాలకు మేలు చేకూరుస్తుంది. రోజూ శారీరక శ్రమ చేయడం వల్ల శరీరంలో మంచి హార్మోన్ల ఉత్పత్తి పెరుగుతుంది. ఒత్తిడి, నిరాశ, ఆందోళనల నుంచి దూరం కావచ్చు.

– డాక్టర్ రాధికారెడ్డి, రిజిస్ట్రార్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, విజయవాడ

ఏపీ విద్యార్థులకూ టాప్ ర్యాంకులు

- రెండో ర్యాంకు సాధించిన లోహిత్ ఆదిత్యసాయి
- 6, 10 ర్యాంకులు కూడా ఏపీ విద్యార్థులకు..

సాక్షి, అమరావతి: జేఈఈ మెయిన్స్‌లో ఏపీ విద్యార్థులు కూడా టాప్ ర్యాంకర్లుగా నిలిచారు. కాళ్లకూరి సాయినాత్ శ్రీమంత్ 2వ ర్యాంకు, పునుమల్లి లోహిత్ ఆదిత్యసాయి 12వ, సి.మిఖిల్ 35వ, నిమ్మకాయల ధర్మతేజారెడ్డి 37వ, దుగ్గినేని వెంకట యుగేశ్ 38వ ర్యాంకు సాధించారు. ఇక టాపర్‌గా నిలిచిన వెంకట కౌండిన్య ఏపీకి చెందిన విద్యార్థికాగా.. తెలంగాణ నుంచి పరీక్ష రాశారు. మొత్తంగా 100 పర్సంటైల్ సాధించిన 43 మందిలో ఐదుగురు ఆంధ్రప్రదేశ్ నుంచి జేఈఈ మెయిన్స్‌కు హాజరైన వారే. ఇక ఈసారి జేఈఈ మెయిన్స్‌లో బాలికలు బాగా వెనుకబడ్డారు. టాప్–10లో ఒక్కరూ నిలవలేదు. కర్ణాటకకు చెందిన విద్యార్థిని రిధి కమలేశ్‌కుమార్ మహేశ్వరి 16వ ర్యాంకుతో బాలికల్లో టాపర్‌గా నిలిచింది.



'మన్‌కీ బాత్'పై డాక్యుమెంటరీ ప్రదర్శన

గోల్కొండ: ప్రధాని మోదీ ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు ప్రారంభించిన 'మన్‌కీ బాత్' కార్యక్రమంపై శనివారం గోల్కొండ కోటలో డాక్యుమెంటరీ ప్రదర్శించారు. ఈ సందర్భంగా 'మన్ కీ బాత్' కార్యక్రమం ఏ విధంగా ఆదరణ పొందిందో వ్యాఖ్యాత వివరించారు. 'మన్ కీ బాత్' 100 ఎపిసోడ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ డాక్యుమెంటరీ ప్రదర్శించారు. ప్రచార సాధనాలు కొత్త పుంతలు తొక్కుతున్నా మోదీ 'మన్ కీ బాత్'కు ప్రాధాన్యమిచ్చారని డాక్యుమెంటరీలో వివరించారు.

'గురుకుల' పోస్టుల పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే..!

- ఓఎంఆర్ ఆధారిత పరీక్షల నిర్వహణపై గురుకుల బోర్డు పునరాలోచన
- ప్రస్తుతం రాష్ట్రంలో ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ సామర్థ్యం 32 వేలు
- సబ్జెక్టులవారీగా పరీక్షలు నిర్వహిస్తే ఆన్‌లైన్‌లో నిర్వహణ సాధ్యమేనని అధికారుల అంచనా
- ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల ఎంపికకు మొదలైన సంప్రదింపుల కసరత్తు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లోని ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అర్హత పరీక్షల నిర్వహణపై తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) పునరాలోచన చేస్తోంది. ప్రస్తుత నోటిఫికేషన్లలో పరీక్షలను ఓఎంఆర్ ఆధారితంగా లేదా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ... ఓఎంఆర్ ఆధారిత పరీక్షలకే ఏర్పాట్లు చేస్తూ వచ్చింది. కానీ టీఎస్‌పీఎస్సీలో పలు పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో ఓఎంఆర్ ఆధారిత పరీక్షల విధానంపై తర్జనభర్జన పడుతోంది. మరోవైపు టీఎస్‌పీఎస్సీ అన్ని రకాల పరీక్షలను కంప్యూటర్ ఆధారిత (కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్–సీబీఆర్‌టీ) విధానంలోనే నిర్వహించేందుకు చర్యలు చేపట్టడంతో గురుకుల ఉద్యోగ అర్హత పరీక్షలను కూడా ఈ విధానంలోనే నిర్వహించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను టీఆర్ఈఐఆర్‌బీ పరిశీలిస్తోంది.

పరిమిత సౌకర్యాలున్నా....

కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం అమలుకు రాష్ట్రంలో పరిమిత సౌకర్యాలే ఉన్నాయి. ప్రైవేటు ఏజెన్సీల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో సెంటర్లున్నప్పటికీ ఒకే సమయంలో పరీక్ష నిర్వహిస్తే గరిష్ఠంగా 32 వేల మందే హాజరయ్యే వీలుంది. దీంతో గురుకుల పోస్టులకు లక్షల సంఖ్యలో అభ్యర్థులుండటంతో ఈ విధానం అమలు సాధ్యం కాదని టీఆర్ఈఐఆర్‌బీ తొలుత భావించింది. కానీ ఒకే దఫా పరీక్షల నిర్వహణకు పోస్టులన్నీ ఒకే కేటగిరీకి సంబంధించినవి కాకపోవడంతో విడివిడిగా పరీక్షల నిర్వహణ అంశాన్ని బోర్డు పరిశీలిస్తోంది. టీజీటీ, పీజీటీ కేటగిరీలోనే 70% కొలువులున్నాయి. ఈ పోస్టుల్లో 15 సబ్జెక్టులున్నాయి. ఇవిగాకుండా జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ కేటగిరీల్లోనూ సబ్జెక్టుల వారీగా పోస్టులున్నాయి. ఒక సబ్జెక్టు పరీక్ష రాసే అభ్యర్థి మరో సబ్జెక్టును ఎంపిక చేసుకొనే అవకాశాలు తక్కువ. దీంతో ఒక్కో సబ్జెక్టు ఆధారంగా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించడం సాధ్యమేనని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం గురుకుల ఉద్యోగాలకు సంబంధించి న దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. మే 28 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. దీంతో దరఖాస్తు గడువు ముగిశాక అందే దరఖాస్తుల సంఖ్యపై స్పష్టత రానుంది. ఈ క్రమంలో పరీక్షల నిర్వహణపై నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంటుందని బోర్డు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

బుకింగ్‌తో ముందుకు...

గురుకుల పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో నిర్వహించాలంటే అందుకోసం ఆన్‌లైన్ టెస్టింగ్ ఏజెన్సీలతో ఒప్పందం తప్పనిసరి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని టెస్టింగ్ ఏజెన్సీలతో ఒప్పందం కోసం గురుకుల నియామకాల బోర్డు సంప్రదింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా కేంద్రాలు ఏయే తేదీల్లో ఖాళీగా ఉన్నాయనే వివరాలు సేకరిస్తోంది. ఖాళీగా ఉన్న తేదీల్లో పరీక్షల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై గురుకుల బోర్డు సమీక్షించనుంది.

‘మార్గదర్శి’లో రాష్ట్రమంతా సోదాలు

- మొత్తం 37 కార్యాలయాల్లో ఏకకాలంలో సీఐడీ తనిఖీలు
- కీలక రికార్డుల ధ్వంసంపై ఫోరెన్సిక్ ఆడిట్
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు సీఐడీ సోదాల్లో బట్టబయలు
- ఫేక్ చందాదారులు.. ఫేక్ డిపాజిట్‌దారులు
- ఆ ముసుగులో భారీగా నల్లధనం చెలామణిలోకి
- ఆ నిధులే రామోజీ గ్రూప్‌లో అక్రమ పెట్టుబడులు


మచిలీపట్నంలోని మార్గదర్శి కార్యాలయంలో తనిఖీ చేస్తున్న సీఐడీ అధికారులు

సాక్షి, అమరావతి: దశాబ్దాలుగా వేళ్లూనుకున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను కూకటి వేళ్లతో సహా తొలగించే విస్తృత కార్యాచరణకు సీఐడీ విభాగం ఉపక్రమించింది. రాష్ట్రంలోని మొత్తం 37 మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో ఏకకాలంలో విస్తృత సోదాలు చేపట్టింది. నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు, అక్రమ డిపాజిట్ల వ్యవహారాల్లో కీలక ఆధారాలు లభ్యమైన నేపథ్యంలో చందాదారుల ఫిర్యాదులతో కార్యాచరణ చేపట్టింది. ఫేక్ డిపాజిట్‌దారుల పేరిట మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో భారీగా నల్లధనాన్ని చేతులు మారుస్తుండటంపై సీఐడీ కీలక ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఆర్థిక అక్రమాలకు సంబంధించిన ఆధారాల ధ్వంసానికి పాల్పడటంపై ఫోరెన్సిక్ ఆడిటింగ్ చేపట్టడంతో సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలు వెలుగు చూసిన తరువాత సీఐడీ విభాగం ఇప్పటివరకు రాష్ట్రంలోని ఏడు బ్రాంచి కార్యాలయాలు, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మాత్రమే సోదాలు నిర్వహించింది. ఈ కేసులో ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావు, ఏ–2గా ఉన్న చెరుకూరి శైలజలను విచారించింది.

సహాయ నిరాకరణతో..

చిట్‌ఫండ్ చట్టం 1982కి విరుద్ధంగా రామోజీరావు యథేచ్ఛగా పాల్పడిన ఆర్థిక అక్రమాలపై సీఐడీ ఇప్పటికే కీలక ఆధారాలను సేకరించింది. నిధుల మళ్లింపు, అక్రమ డిపాజిట్లు, అక్రమ పెట్టుబడులపై ఆధారాలను ప్రదర్శిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయంలోని కీలక అధికారులను ప్రశ్నించింది. చట్ట ప్రకారం బ్రాంచి మేనేజర్లకు చెక్ పవర్ ఉండాలి. చందాదారులు చెల్లించిన సొమ్మును సంబంధిత బ్రాంచి కార్యాలయాలున్న నగరాలు / పట్టణాల్లోని జాతీయ బ్యాంకుల్లోనే డిపాజిట్ చేయాలి. అయితే అందుకు విరుద్ధంగా చందాదారుల సొమ్మును హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలించి అక్రమ పెట్టుబడులు పెట్టినట్టు వెల్లడైంది. ఈ నిధుల మళ్లింపులో చెరుకూరి శైలజా కిరణ్‌తోపాటు 11 మంది మార్గదర్శి ఉన్నతాధికారులు కీలక భూమిక పోషించారు. వారిలో ఏడుగురు ఆంధ్రప్రదేశ్‌లోని బ్రాంచిలకు సంబంధించి వ్యవహారాలు నిర్వర్తించారు. కీలక ఆధారాలను ఎలా ధ్వంసం చేయాలో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా బ్రాంచి మేనేజర్లకు వివరించారు. దీనిపై ఆ ఏడుగురు ఉన్నతాధికారులను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. అయితే రామోజీ ఆదేశాలతో వారు సీఐడీ దర్యాప్తునకు ఏమాత్రం సహకరించలేదు. దీంతో ఈ కేసులో దూకుడు మరింత పెంచాలని నిర్ణయించిన సీఐడీ ఏకకాలంలో రాష్ట్రంలోని 37 బ్రాంచి కార్యాలయాల్లో శనివారం సోదాలు చేపట్టింది. ఉదయం ప్రారంభించిన సోదాలు అర్ధరాత్రి వరకూ కొనసాగుతున్నాయి. మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో వారం రోజులపాటు సోదాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఫేక్ చందాదారులు.. జాడలేని కీలక రికార్డులు

ఏకకాలంలో బ్రాంచి కార్యాలయాల్లో సోదాలు చేపట్టిన సీఐడీ అధికారులు మార్గదర్శి అక్రమాలను గుర్తించి విస్తుపోయారు. చిట్‌ఫండ్ చట్టం ప్రకారం నిర్వహించాల్సిన రికార్డులు ఏవీ బ్రాంచి కార్యాలయాల్లో లేవు. చందాదారుల సొమ్మును జాతీయ బ్యాంకుల్లో జమ చేసినట్లు రికార్డులు సైతం లేకపోవడం గమనార్హం. నిధుల మళ్లింపునకు సంబంధించిన కనెక్టింగ్ రికార్డులు, లెడ్జర్ పుస్తకాలు లేకపోవడంతోపాటు బ్రాంచి కార్యాలయాల వార్షిక నివేదికల్లో వాటి ప్రస్తావనే లేదు. ఒక్కో బ్రాంచి కార్యాలయంలో నిర్వహిస్తున్న చిట్లు ఎన్ని? ఎంతమంది చందాదారులున్నారు? ప్రతి నెలా చందా మొత్తం ఎంత వస్తోంది? ఆ నిధులను ఏం చేస్తున్నారు? అనే రికార్డులేవీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సక్రమంగా నిర్వహించడం లేదని వెల్లడవుతోంది. పలువురు చందాదారులకు సంబంధించి సరైన చిరునామాలు కూడా లేవు. చందాదారుల ముసుగులో భారీ ఎత్తున నల్లధనాన్ని బ్రాంచి కార్యాలయాల నుంచి ప్రధాన కార్యాలయానికి తరలిస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆ నిధులను రామోజీరావు కుటుంబానికి చెందిన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్(కర్ణాటక)– బెంగళూరు, మార్గదర్శి చిట్‌ఫండ్స్(తమిళనాడు)– చెన్నైలలో పెట్టుబడిగా చూపించారు. ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలోనే ఉంది. అంటే భారీ ఎత్తున నల్లధనాన్ని రామోజీ ఫిల్మ్ సిటీలో పెట్టుబడి పెట్టినట్టు స్పష్టమవుతోంది.

ఫిర్యాదులపై కార్యాచరణ

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు సీఐడీకి పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. తాము ష్యూరిటీ సమర్పించినా చిట్టీ మొత్తాన్ని ఇవ్వడం లేదని, చిట్టీ మొత్తంలో కొంత భాగం డిపాజిట్లుగా ఉంచారని, తమను వేధిస్తూ ఆస్తులు ఆటాచ్ చేశారని... పలు ఫిర్యాదులు సీఐడీ దృష్టికి వచ్చాయి. వీటికి సంబంధించి బ్రాంచి కార్యాలయాల్లో రికార్డులను పరిశీలిస్తున్నారు. అక్రమ డిపాజిట్లు సేకరించినట్లు, ష్యూరిటీలు ఇచ్చినా చిట్టీ మొత్తాన్ని చెల్లించకుండా వేధిస్తున్నట్లు ఆధారాలు సేకరించారు. మరోవైపు ష్యూరిటీకి సంబంధించి మార్గదర్శి విధించిన షరతులు కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టంలోని మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నట్లు వెల్లడైంది. వీటిపై కీలక రికార్డులను సీఐడీ అధికారులు జప్తు చేశారు.

విచారించి వాంగ్మూలాలు నమోదు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో వారం రోజుల పాటు క్షుణ్నంగా సోదాలు కొనసాగించాలని సీఐడీ భావిస్తోంది. ప్రతి బ్రాంచి కార్యాలయం పరిధిలోని చందాదారుల్లో కనీసం 25 శాతం మందిని విచారించి వాంగ్మూలాలు నమోదు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. డిపాజిట్లు పెట్టిన చందాదారులపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. వారు చేసిన డిపాజిట్లకు ఎక్కడ నుంచి నిధులు తెచ్చారు? అందుకు సంబంధించిన పత్రాలు ఉన్నాయా? ఆదాయపన్ను రిటర్న్‌లలో వాటిని చూపిస్తున్నారా? అనే కోణంలో దర్యాప్తును వేగవంతం చేయనున్నారు. ఫేక్ డిపాజిట్‌దారుల పేర్లతో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో భారీ ఎత్తున డిపాజిట్లు చూపుతున్నట్లు గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీన్ని పక్కాగా నిర్ధారించేందుకు చందాదారులు, డిపాజిట్‌దారుల ఇళ్లకు వెళ్లి ఆరా తీయడం ద్వారా దర్యాప్తును వేగవంతం చేయాలని భావిస్తున్నారు.

ఆధారాల ధ్వంసంపై ఫోరెన్సిక్ ఆడిట్

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో సోదాలతోపాటు సీఐడీ అధికారులు సమాంతరంగా ఫోరెన్సిక్ ఆడిట్ కూడా చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్థిక అక్రమాలను కప్పిపుచ్చేందుకు ఈ కేసులో ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావు మరిన్ని అక్రమాలకు పాల్పడినట్లు ఇటీవల ఏడు బ్రాంచి కార్యాలయాల్లో నిర్వహించిన సోదాల్లో వెల్లడైన విషయం తెలిసిందే. నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేయడంతోపాటు కంప్యూటర్లలో కీలక రికార్డులను డిలీట్ చేసినట్లు సీఐడీ విభాగం గుర్తించింది. బ్రాంచి మేనేజర్లతో మార్గదర్శి యాజమాన్యం ప్రత్యేకంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి మరీ ఆధారాల ధ్వంసానికి పాల్పడినట్లు వెల్లడైంది. కేసు దర్యాప్తులో ఉండగా ఆధారాలను ధ్వంసం చేయడం తీవ్రమైన నేరం. సీఐడీ అధికారులు దీన్ని శాస్త్రీయంగా నిరూపించే ప్రక్రియను చేపట్టారు. ప్రత్యేకంగా నిపుణుల బృందాలను నియమించి మార్గదర్శి కార్యాలయాల్లో మొత్తం రికార్డులను విశ్లేషిస్తున్నారు. వారం పది రోజుల క్రితం ఏడు బ్రాంచి కార్యాలయాల్లో డిలీట్ చేసిన రికార్డులను రిట్రీవ్ చేసి వెలికి తీశారు. ప్రస్తుతం మొత్తం 37 బ్రాంచి కార్యాలయాల్లోనూ ధ్వంసం చేసిన రికార్డులను రిట్రీవ్ చేసి వెలికి తీయడంతోపాటు రికార్డులను ధ్వంసం చేసినట్టు శాస్త్రీయంగా రికార్డు చేస్తున్నారు. ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలతోనే కీలక రికార్డులను ధ్వంసం చేసినట్లు బ్రాంచి కార్యాలయాల సిబ్బంది సీఐడీ ఎదుట అంగీకరించినట్లు తెలుస్తోంది. వారి వాంగ్మూలాలను సీఐడీ అధికారులు నమోదు చేస్తున్నారు. ఆధారాలను ధ్వంసం చేసినట్లు ఫోరెన్సిక్ ఆడిటింగ్ ద్వారా నిరూపించడం ద్వారా న్యాయస్థానంలో సమర్పించేందుకు కీలక సాక్ష్యాధారాలను సేకరించే ప్రక్రియను సీఐడీ వేగవంతం చేసింది.

సీఐడీ సోదాలు చేపట్టిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాలు

- శ్రీకాకుళం
- విజయనగరం
- విశాఖపట్నం - 8 కార్యాలయాలు
- కాకినాడ
- రాజమహేంద్రవరం
- అమలాపురం
- మండపేట
- సామర్లకోట
- ఏలూరు
- భీమవరం
- తణుకు
- మచిలీపట్నం
- గుడివాడ
- విజయవాడ - 3 బ్రాంచి కార్యాలయాలు
- గుంటూరు - 2 బ్రాంచి కార్యాలయాలు
- తెనాలి
- నరసరావుపేట
- ఒంగోలు
- చీరాల
- నెల్లూరు - 2 బ్రాంచి కార్యాలయాలు
- కడప
- ప్రొద్దుటూరు
- చిత్తూరు
- తిరుపతి
- కర్నూలు
- అనంతపురం

ఉప్పొంగిన ‘నమ్మకం’

సీఎం జగన్ ప్రభుత్వానికి మద్దతుగా 1.16 కోట్ల కుటుంబాల మిస్డ్ కాల్స్

- ‘జగనన్నే మా భవిష్యత్తు’విజయవంతంతో శ్రేణుల్లో నూతనోత్సాహం
- 22 రోజుల్లో 1.45 కోట్ల కుటుంబాలను కలుసుకున్న జగనన్న సైన్యం
- పీపుల్స్ సర్వేలో 80 శాతానికిపైగా కుటుంబాల ఆదరణ సీఎం జగన్‌కే
- టీడీపీ సంప్రదాయ ఓటర్లు కూడా వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా ‘మా నమ్మకం నువ్వే జగన్..’నినాదం ప్రతిధ్వనించింది. సీఎం జగన్ ప్రభుత్వానికి మద్దతు పలికి ఆశీర్వదిస్తూ మళ్లీ ఆయనే అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ 1.16 కోట్ల కుటుంబాల ప్రజలు మెగా పీపుల్స్ సర్వేలో చాటిచెప్పారు. తద్వారా రాష్ట్రంలో 80 శాతానికిపైగా కుటుంబాల ప్రజలు సీఎం జగన్ పాలనకు మద్దతు తెలిపినట్లు స్పష్టమవుతోంది. టీడీపీ సాంప్రదాయ ఓటర్లు కూడా వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గుచూపుతున్నారడానికి మెగా పీపుల్స్ సర్వే ఫలితాలే తార్కాణమని రాజకీయ విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు.

ప్రతి గడపనూ పలుకరించిన జగనన్న సైన్యం

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించడం, మెగా పీపుల్స్ సర్వేలో 80 శాతానికిపైగా కుటుంబాలు సీఎం జగన్‌కు మద్దతు తెలపడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సరికొత్త జోష్ నెలకొంది. రాష్ట్రంలో 46 నెలలుగా అమలవుతున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా సీఎం జగన్ ప్రభుత్వం చేకూరుస్తున్న మేలును వివరించడం, విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే లక్ష్యంగా ఈనెల 7న ‘జగనన్నే మా భవిష్యత్తు’కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. సచివాలయానికి ముగ్గురు చొప్పున నియమించిన కన్వీనర్లు, 50 నుంచి వంద ఇళ్లకు ఇద్దరు చొప్పున నియమించిన గృహ సారథులు వెరసి ఏడు లక్షల మందితో కూడిన క్షేత్ర స్థాయి సైన్యం ప్రతి గడపనూ పలుకరించింది. టీడీపీ సర్కారు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని చదివి ఆయా కుటుంబాలకు గృహ సారథులు అందజేశారు. మెగా పీపుల్స్ సర్వేలో భాగంగా ప్రజా మద్దతు పుస్తకంలో ఐదు ప్రశ్నలను చదివి వినిపించి ప్రజాభిప్రాయాన్ని నమోదు చేశారు. ఆ తర్వాత రసీదు అందచేశారు. సీఎం జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 82960–82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కుటుంబాల అంగీకారం మేరకు సీఎం జగన్ ఫోటో ఉన్న స్టిక్కర్లను ఇంటి తలుపులు, మొబైల్ ఫోన్లకు అతికించారు. రాష్ట్రంలో ఈనెల 7న ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శనివారంతో ముగిసింది. మొత్తం 22 రోజుల్లో 15,004 సచివాలయాల పరిధిలోని 1.45 కోట్ల కుటుంబాల ప్రజలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మమేకమై అన్ని విషయాలూ వివరించాయి.

అచంచలమైన నమ్మకాన్ని ఉంచినందుకు కృతజ్ఞతలు

ప్రజలకు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ధన్యవాదాలు తెలుపుతూ సీఎం వైఎస్ జగన్ ట్వీట్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ‘జగనన్నే మా భవిష్యత్తు’కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేలో ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 1.16 కోట్ల కుటుంబాల ప్రజలు తనకు ఫోన్లు చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ‘మన పాలన పట్ల... మన ప్రభుత్వ విధానాల పట్ల... అచంచలమైన నమ్మకాన్ని ఉంచి... ఫోన్లు చేసి నాకు మద్దతు తెలిపిన 1.16 కోట్ల కుటుంబాలకు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ధన్యవాదాలు. మీకు మరింత సేవ చేసేందుకు, దేవుని దయ, మీ చల్లని ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని మనసారా కోరుకుంటున్నాను’అని సీఎం వైఎస్ జగన్ శనివారం ట్వీట్ చేశారు.

జాతీయం /అంతర్జాతీయం



మోదీ మన్ కీ బాత్ నేడు వందో ఎపిసోడ్ ప్రసారాన్ని పురస్కరించుకుని పూరీలో సముద్రతీరంలో శిల్పి సుదర్శన్ పట్నాయక్ చెక్కిన సైకత శిల్పం

కాంగ్రెస్ 91 సార్లు దూషించింది

- ఎవరెంత అవమానించినా ప్రజల కోసం, దేశం కోసం పనిచేస్తూనే ఉంటా
- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- కర్ణాటకలో ఎన్నికల ప్రచారం

హుమ్నాబాద్/విజయపుర/కుడాచీ: కాంగ్రెస్ పార్టీ తనను దూషించడమే పనిగా పెట్టుకుందని ప్రధాని మోదీ ఆరోపించారు. మోదీ విషసర్పమంటూ కాంగ్రెస్ చీఫ్ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు తనను ఇప్పటిదాకా 91 సార్లు దూషించారని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, స్వాతంత్ర్య సమర యోధుడు వీర సావర్కర్‌ను, లింగాయత్ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ అవమానించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుల తిట్లకు ప్రజలు ఓట్ల రూపంలో ప్రతిస్పందిస్తారని, తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రధాని మోదీ శనివారం కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీదర్ జిల్లాలోని హుమ్నాబాద్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఆయన ప్రచారం చేయడం ఇదే మొదటిసారి.

తిట్టడమే కాంగ్రెస్ చరిత్ర

‘సామాన్య ప్రజల గురించి మాట్లాడే ప్రతి ఒక్కరినీ కాంగ్రెస్ ద్వేషిస్తూనే ఉంటుంది. కాంగ్రెస్ నేతల అవినీతిని బయటపెట్టిన వారిని ఆ పార్టీ సహించదు. వారి రాజకీయ స్వార్థంపై దాడి చేస్తే ఒప్పుకోదు. శాశ్వత శత్రువుగా భావిస్తుంది. ఈ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మళ్లీ నన్ను దూషిస్తోంది. ప్రజల కోసం, పేదల కోసం పనిచేసేవారిని తిట్టడమే కాంగ్రెస్ చరిత్ర. చౌకీదార్ చోర్, మోదీ చోర్, ఓబీసీ వర్గం చోర్ అంటూ నన్ను తిట్టారు. కాంగ్రెస్ నేతలు నన్ను తిట్టిన సందర్భాలను ఒకరు లెక్కించారు. నాకు పంపించారు. ఇప్పటివరకు 91 సార్లు వేర్వేరు విధాలుగా నన్ను తిట్టారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు’ అని మోదీ తేల్చిచెప్పారు.


బెంగళూరులో జరిగిన రోడ్ షోలో అభిమానులకు మోదీ అభివాదం

‘ఈ బారియా నిర్దార.. బహుమతదా బీజేపీ సర్కార’

అంబేడ్కర్‌ను, వీర సావర్కర్‌ను కాంగ్రెస్ నేతలు ఘోరంగా దూషించారు. అదే తరహాలో నన్ను కూడా తిడుతున్నారు. అది ఒక బహుమానంగా భావిస్తా. తిట్టేవారిని తిట్టనివ్వండి. ఎవరెంత అవమానించినా దేశం కోసం, ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటా. ప్రజల ఆశీస్సులతో ఆ తిట్లన్నీ బురదలో కలిసిపోతాయి. కర్ణాటకలో బలమైన, సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు కోసం బీజేపీని పూర్తి మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరుతున్నా. ‘ఈ బారియా నిర్ధార.. బహుమతదా బీజేపీ సర్కార’(ఈసారి నిర్ణయం.. పూర్తి మెజార్టీతో బీజేపీ ప్రభుత్వం) ఈ ఎన్నికల్లో ఇదే మన నినాదం. రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం కావాలంటే డబుల్ ఇంజన్ ప్రభుత్వం కావాలి. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ ప్రభుత్వం ఉంటే రెండింటి మధ్య సమన్వయం చక్కగా ఉంటుంది. అప్పుడు అభివృద్ధికి ఎలాంటి అవరోధాలు ఉండవు. ఈ ఎన్నికలు కేవలం ఐదేళ్ల ప్రభుత్వ ఏర్పాటు కోసం కాదు, రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా మార్చడానికి జరుగుతున్నాయి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలో ఉంటే రాష్ట్రం నెంబర్ వన్‌గా మారడం తథ్యం. డబుల్ ఇంజన్ అంటే అర్థం డబుల్ ప్రయోజనాలు, డబుల్ వేగం'' అని ప్రధాని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు.

అలసిపోయిన వారిని ప్రజలు గెలిపించరు

పదవీ విరమణ(రిటైర్‌మెంట్) పేరుతో కాంగ్రెస్ ఓట్లు అడుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. క్రియాశీల రాజకీయాల నుంచి రిటైర్ అవుతానని, ఇదే చివరి ఎన్నిక, ఈసారి గెలిపించాలని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత సిద్దరామయ్య చేసిన విజ్ఞప్తిని మోదీ ప్రస్తావించారు. అలసిపోయిన వారిని(టైర్డ్) ప్రజలు గెలిపించరని చెప్పారు. బీజేపీ ఉత్సాహంతో ఉరకలేస్తోందని, ప్రజలు తమ పార్టీకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. విజయపుర, బెళగావి జిల్లాల్లో బహిరంగ సభల్లో మోదీ ప్రసంగించారు.

దేశంలో తొలి రైల్వే కేబుల్ బ్రిడ్జి సిద్ధం



జమ్మూ: దేశంలోనే మొట్టమొదటి రైల్వే తీగల వంతెన నిర్మాణం పూర్తయ్యింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వయంగా వెల్లడిస్తూ శుక్రవారం ట్వీట్ చేశారు. కేవలం 11 నెలల్లో ఈ వంతెన నిర్మాణం పూర్తయ్యిందని తెలియజేశారు. వంతెన వీడియోను షేర్ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని రియాసీ జిల్లా అంజీ ఖడ్‌లో ఈ కేబుల్ బ్రిడ్జిని నిర్మించారు. దీని మొత్తం పొడవు 473.25 మీటర్లు. 96 ప్రధాన తీగలు ఉన్నాయి. ఉదంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్(యూఎస్‌బీఆర్‌ఎల్)లో ఈ బ్రిడ్జిని నిర్మించారు. కాత్రా వైపు ఉన్న టన్నెల్ టీ2, రియాసీ వైపు ఉన్న టన్నెల్ టీ3ని ఇది అనుసంధానిస్తుంది. వంతెన నిర్మాణంలో ఉపయోగించిన మొత్తం తీగల పొడవు 653 కిలోమీటర్లు కావడం విశేషం. జమ్మూకశ్మీర్‌లో చీనాబ్ నదిపై ఉన్న రైల్వే వంతెన తర్వాత ఇది దేశంలోనే రెండో అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన. బలమైన గాలులు, తుఫాన్లు, పేలుళ్లను సైతం తట్టుకొనేలా డిజైన్ చేశారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేసిన ట్వీట్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్సలెంట్(అద్భుతం) అంటూ స్పందించారు.

రేపటి నుంచి కొత్త పార్లమెంట్ కమిటీలు

న్యూఢిల్లీ: 2023–24 ఆర్థిక సంవత్సరంలో నూతన పార్లమెంట్ కమిటీలు మే 1 నుంచి అమల్లోకి రానున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 30 దాకా ఇవి కొనసాగుతాయి. ఈ మేరకు లోక్‌సభ, రాజ్యసభ నోటిఫికేషన్ జారీ చేశాయి. కీలకమైన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరికి మరోసారి అవకాశం దక్కింది. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కమిటీ చైర్మన్‌గా బీజేపీ సభ్యుడు సంతోష్ కుమార్ గంగ్వార్ నియమితులయ్యారు. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కమిటీలో రాజ్యసభ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వి.విజయసాయిరెడ్డిని సభ్యుడిగా నియమించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌గా కిరీట్ ప్రేమ్‌జీభాయి సోలంకీ నియమితులయ్యారు.

కూటమిపై విపక్షాల భేటీలో చర్చిస్తాం: నితీశ్

పట్నా: 2024లో కేంద్రంలో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు చేతులు కలిపి, బలమైన కూటమిగా ఏర్పడాల్సిన అవసరం ఉందని జేడీ(యూ) చీఫ్ నితీశ్ కుమార్ చెప్పారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక విపక్ష నేతల భేటీ జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా విపక్షాల ఐక్యత, కూటమి ఏర్పాటుపై విస్తృతంగా చర్చించనున్నట్లు వివరించారు. కొన్ని పార్టీల నాయకులు ప్రస్తుతం కర్ణాటక ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా ఉన్నారని, ప్రతిపక్షాల సమావేశ వేదికను ఇంకా ఖరారు చేయలేదని చెప్పారు. పాట్నాలో నిర్వహించాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తనకు సూచించారని గుర్తుచేశారు. విపక్షాలకు ఏకం చేయడమే ధ్యేయంగా ఇప్పటికే వివిధ పార్టీల ముఖ్య నేతలతో మాట్లాడానని, త్వరలో మరికొన్ని బీజేపీయేతర పార్టీల నాయకులను కలిసి చర్చిస్తానని వెల్లడించారు.

సూడాన్ నుంచి వచ్చిన వారిలో ఎల్లో ఫీవర్

బనశంకరి: సూడాన్ నుంచి వెనక్కి వస్తున్న భారతీయులకు ప్రమాదకరమైన ఎల్లో ఫీవర్ భయం పట్టుకుంది. సూడాన్ నుంచి ఇటీవల బెంగళూరుకు చేరుకున్న 362 మందిలో 45 మంది ఎల్లో ఫీవర్‌తో బాధపడుతున్నట్లు తేలింది. అధికారులు వీరిని బెంగళూరులోని రాజీవ్‌గాంధీ ఆసుపత్రిలో క్వారంటైన్‌కు తరలించారు. చర్మం, కళ్లు పచ్చగా మారడం, జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, వాంతులు ఈ జ్వరం లక్షణాలు. పరిస్థితి విషమిస్తే 15 రోజుల్లో అంతర్గత రక్తస్రావం సంభవించి, అవయవాలు పనిచేయడం మానేస్తాయి. ఒక్కోసారి మరణానికి కూడా దారితీయవచ్చు. మరోవైపు, ‘ఆపరేషన్ కావేరి’లో భాగంగా సూడాన్ నుంచి మరో 365 మంది భారతీయులను శనివారం తీసుకువచ్చినట్లు విదేశాంగ మంత్రి జై శంకర్ ట్వీట్ చేశారు.

క్రిమియా చమురు నిల్వకేంద్రంపై దాడులు

ఇది ఉక్రెయిన్ పనే: రష్యా



కీవ్: తొమ్మిదేళ్ల క్రితం రష్యా ఆక్రమించుకున్న ఉక్రెయిన్ ద్వీపకల్ప ప్రాంతం క్రిమియాపై శనివారం ఉక్రెయిన్ డ్రోన్లు విరుచుకుపడ్డాయి. దీంతో క్రిమియాలోని తీరప్రాంత నగరం సెవస్తపోల్‌లోని చమురు నిల్వ కేంద్రానికి నిప్పు అంటుకుని అగ్నికీలలు ఎగసిపడుతున్నాయి. ‘ఈ దాడి ఉక్రెయిన్ డ్రోన్ల పనే. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ప్రస్తుతానికి ఒక్కచోట మాత్రమే మంటలు ఆర్పగలిగాం’ అని నగర గవర్నర్ మిఖాయిల్ రజవోజయేవ్ చెప్పారు. మరణాల వివరాలను ఆయన వెల్లడించలేదు. ప్రతిదాడి చేసి క్రిమియాను మళ్లీ ప్రధాన భూభాగంలో కలిపేసుకునేందుకు ప్రయత్నిస్తామని ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించడం, శుక్రవారమే 20 క్రూయిజ్ క్షిపణులతో దాడి చేసి రష్యా 23 మంది పొట్టనబెట్టుకున్న నేపథ్యంలో ఈ దాడులకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆయిల్ డిపోలో 10 ట్యాంకుల్లో అగ్గిరాజుకోవడం దేవుడు వేసిన శిక్ష అంటూ ఉక్రెయిన్ సైనిక నిఘా అధికార ప్రతినిధి ఆంద్రీ యుసోవ్ వ్యాఖ్యానించారు. కాగా, రష్యా అక్రమంగా విలీనం చేసుకున్న ఖేర్సన్ ప్రావిన్స్‌లోని నోవా కఖోవ్కా సిటీపైకి ఉక్రెయిన్ సేనలు భారీ స్థాయిలో కాల్పుల మోత మోగించాయి.

గంగ-గోదావరి సంగమంలా పుష్కరాలు

- కాశీతో తెలుగు వారికి ప్రత్యేక అనుబంధం
- కాశీ తెలుగు సంగమంలో ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: కాశీ ఘాట్లలో గంగా పుష్కరాల కార్యక్రమం చూస్తుంటే గంగా–గోదావరి సంగమం మాదిరిగా ఉందని ప్రధాని మోదీ అభివర్ణించారు. కాశీ తెలుగు సంగమం వంటి కార్యక్రమాలు భారతదేశ ప్రాచీన నాగరికతలు, సంప్రదాయాల సంగమమన్నారు. గంగా పుష్కరాల్లో భాగంగా వారణాశిలో శ్రీకాశీ తెలుగు సమితి అధ్యక్షుడు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కాశీ తెలుగు సంగమంలో ప్రధాని వర్చువల్‌గా పాల్గొన్నారు. కార్యక్రమంలో సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనం చేశారు. తెలుగు యాత్రికులను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. కాశీకి, ఇక్కడి తెలుగు వారితో ఎంతో గాఢమైన అనుబంధం ఉందని ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. తెలుగు వారికి కాశీతో అనుబంధం, కాశీ మాదిరిగానే అంతటి ప్రాచీనమైందని మోదీ తెలిపారు. కాశీ ఎంత పవిత్రమైనదో, అంతే పవిత్రమైన నమ్మకం తెలుగు వారికి కాశీపై ఉందని అభినందించారు. ఇప్పటికీ కాశీకి వచ్చే అత్యధిక యాత్రికుల్లో ఏపీ, తెలంగాణ వారే ఉంటారని ప్రధాని అన్నారు. కాశీ విశ్వనాథుడి దర్శనం చేసుకుని, అనంతరం విజయనగరంలో జన్మించిన తైలంగ స్వామి ఆశీర్వాదం తీసుకొనేందుకు ఆయన ఆశ్రమానికి తెలుగు వారు వెళ్తారన్నారు. జిడ్డు కృష్ణమూర్తి వంటి అనేక మందిని ఇప్పటికీ కాశీ వాసులు గుర్తు చేసుకుంటారన్నారు. తెలుగు వారు కాశీని తమ సొంత ప్రాంతంగా భావిస్తారని మోదీ పేర్కొన్నారు. అందుకే వేములవాడను దక్షిణ కాశీ అని పిలుస్తారని, తెలుగునాట దేవాలయాల్లో చేతికి కట్టే నల్లదారాన్ని కాశీ దారం అంటారని గుర్తు చేశారు. కాశీ భౌగోళికంగా తెలుగు రాష్ట్రాలకు దూరంగా ఉన్నప్పటికీ ప్రజల మనసులకు మాత్రం చాలా దగ్గరగా ఉందన్నారు.

సైన్యాధికారిణిగా గల్వాన్ అమరుని అర్ధాంగి

న్యూఢిల్లీ: గల్వాన్ లోయలో చైనా సైన్యంతో ఘర్షణల్లో అమరుడైన భారత సైనికుడు నాయక్ దీపక్ సింగ్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన సతీమణి సైతం కదనరంగంలోకి దూకారు. చెన్నై కేంద్రంగా పనిచేసే ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ(ఓటీఏ)లో విజయవంతంగా ఆర్మీ శిక్షణ పూర్తిచేసుకున్నాక 29 ఏళ్ల లెఫ్టినెంట్ రేఖా సింగ్.. ఆర్మీ ఆర్డ్‌నెన్స్ కోర్ విభాగంలో శనివారం విధుల్లో చేరారు. తూర్పు లద్దాఖ్‌లో ఫ్రంట్‌లైన్ యూనిట్‌లో ఆమె కర్తవ్య దీక్షను మొదలుపెట్టారని ఆర్మీ ఉన్నతాధికారులు చెప్పారు. ఆర్మీ మెడికల్ కోర్‌లో సభ్యుడైన నాయక్ దీపక్ సింగ్ ఆ తర్వాతికాలంలో బిహార్ రెజిమెంట్ 16వ బెటాలియన్‌లో నర్సింగ్ అసిస్టెంట్‌గా చేరారు. 2020 జూన్‌లో గల్వాన్‌లోయలో చైనా సైనికులతో పోరాడింది ఈ బెటాలియన్ బృందమే. ఘర్షణల్లో గాయపడినా నాయక్ తోటి 30 మంది క్షతగాత్రులైన సైనికులకు అత్యవసర వైద్యసాయంచేశారని కేంద్రం శ్లాఘించింది.

‘సార్వత్రిక’ విజయానికి ఈ ఎన్నికలే సింహద్వారం

- కర్ణాటక ఎన్నికల్లో గెలుపు ధీమాతో డీకే శివకుమార్ వ్యాఖ్య

బెంగళూరు: కర్ణాటకలో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని రాష్ట్రంలో ఆ పార్టీ సీనియర్ నేత, కర్ణాటక పీసీసీ సారథి డీకే శివకుమార్ బల్లగుద్ది చెప్పారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూ సందర్భంగా ఆయన పలు విషయాలు చెప్పారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- నా 35 ఏళ్ల రాజకీయ అనుభవం, సర్వే ఫలితాలను అనుసరించి చెప్తున్నా.. కన్నడ నాట ఈసారి 141 శాసనసభ స్థానాల్లో విజయఢంకా మోగిస్తాం. దక్షిణభారతంలో మోదీమేనియా పనిచేయదు. ఇక్కడ స్థానిక, అభివృద్ధి అంశాలే ఎన్నికల్లో కీలకంగా నిలుస్తాయి. ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపు వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల విజయానికి సింహద్వారంగా నిలుస్తుంది. గెలిచాక పార్టీ నుంచి ముఖ్యమంత్రి అయ్యేది సిద్ధరామయ్యనా లేక నేనా అనేది అనవసర చర్చ. ఇక్కడ బీజేపీని ఓడించడమే అసలైన లక్ష్యం.
- రాష్ట్రం జ్ఞాన రాజధాని. బీజేపీవారు హిజాబ్, హలాల్ వంటి నాటకాలు ఆడుతున్నారు. కర్ణాటక ప్రజల్లో ఎంతో పరిణతి ఉంది. రాష్ట్రాభివృద్ధికి ఇలాంటివి కొత్త సమస్యలు తెస్తాయని జనం భయపడుతున్నారు
- బీజేపీ అగ్రనేతల మేజిక్ ఇక్కడ పనిచేయదు. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్‌లలో మోదీ ఛరిష్మా పనిచేసిందా? ప్రజల కడుపు నింపితేనే, చక్కని పాలన అందిస్తేనే మీ గురించి జనం ఆలోచిస్తారు. ఈసారి ఇక్కడా జరిగేది అదే.

పేదల సేవలకు వైద్యులు ముందుండాలి: తమిళిసై



స్నాతకోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినికి ట్రోఫీని అందజేస్తున్న గవర్నర్

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లో శనివారం స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర గవ ర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2017, 2019 బ్యాచ్‌లకు సంబంధించి డెంటల్ సర్జరీలో 37 మంది విద్యార్థులకు బ్యాచిలర్ డిగ్రీ, 13 మంది విద్యార్థులకు మాస్టర్స్ డిగ్రీలు గవర్నర్ ప్రదానం చేశారు. డిగ్రీ పట్టాలు అందుకున్న డెంటల్ సర్జరీ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ వైద్యులు పేదలకు సేవ చేయడంలో తమ జీవితాలను అంకితం చేయాలని కోరారు. విద్యార్థులకు అత్యాధునిక సౌక ర్యాలను అందించి ప్రోత్సహించిన ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ అధ్యాపకులను గవర్నర్ అభినందించారు. కార్యక్రమంలో మేజర్ జనరల్ తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా (టాసా) ఏసీడీఎస్ చైర్మన్ రాకేష్ మనోచా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణ్ భారత్ ఆర్థోడాంటిక్స్ విభాగానికి చెందిన డాక్టర్ అగ్రిమా ఠాకూర్‌కు పాట్రన్స్ రోలింగ్ ట్రోఫీ, ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థి డాక్టర్ కె.రంజిమాకు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీ అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగాలున్నయ్.. కానీ జీతాల్లేవ్!

కొత్త మండలాల్లో రెవెన్యూ సిబ్బంది అరిగోస

- ఆర్నెల్లుగా విడుదలకాని వేతనాలు
- క్యాడర్ స్ట్రెంత్ అనుమతిలో సీసీఎల్‌ఏ జాప్యం
- కలెక్టర్లు విన్నవించినా పట్టించుకోని వైనం

కోరుట్ల: పేరుకి ప్రభుత్వోద్యోగమే అయినా ఆర్నెల్లుగా నయాపైసా జీతం లేక అల్లాడిపోతున్నారు కొత్త మండలాల్లోని రెవిన్యూ ఉద్యోగులు. గతేడాది సెప్టెంబర్ 26వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 13 కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ జీవో నంబరు 97 జారీచేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తొలుత తహసీల్దార్ కార్యాలయాలకు రూపు నిచ్చారు. ఆయా జిల్లాల్లోని వివిధ మండలాల్లో పని చేసే సిబ్బందికి వాటిలో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉందికానీ.. కొత్త మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది వేతనాల మంజూరు కోసం సీసీఎల్‌ఏ నుంచి 'క్యాడర్ స్ట్రెంత్'సర్కులర్ జారీచేయాల్సి ఉంటుంది. ఈ జీవో జారీ ఆరు నెలలుగా జాప్యమవుతోంది. దీంతో సిబ్బందికి వేతనాలు అందడంలేదు.

- 13 మండలాలు.. 240 మంది సిబ్బంది..
- కొత్త మండలాల జీవో జారీ కాగానే తహసీల్దార్ కార్యాయాలు ఏర్పాటు చేశారు.
- నిబంధనల ప్రకారం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు గిర్దావర్లు(ఆర్‌ఐలు), ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, సర్వేయర్, అటెండర్, చైన్‌మన్‌తోపాటు గ్రామాల సంఖ్యను బట్టి 15–25 మంది వీఆర్ ఏలను నియమించారు.



జగిత్యాల జిల్లాలో కొత్తగా ఏర్పాటైన ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయం

- జీవో 97 ప్రకారం ఇతర మండలాల్లోని సిబ్బందిని కొత్త మండలాల్లో నియమిస్తూ జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకున్నారు.
- ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన 13 మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో సుమారు 240 మంది ఉద్యోగులు వివిధ క్యాడర్లలో పనిచేస్తున్నారు.

ఆర్నెల్లుగా అరిగోస..

విధులు నిర్వర్తిస్తున్నా.. తమకు జీతాలు రాకపోవడంపై సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్యాడర్ స్ట్రెంత్ జీవో జారీకోసం కొందరు జిల్లా కలెక్టర్లు సీసీఎల్‌ఏకు మొరపెడుతూ లేఖలు రాసినా పట్టించుకునే వారులేరు. జీవో జారీ కాకపోవడంతో ఉద్యోగుల వివరాలు, బ్యాంకు ఖాతాలు, వేతనాల విడుదల వంటి అంశాల వివరాలు జిల్లా ట్రెజరీ కార్యాలయాల్లో నమోదు కాలేదు. ఫలితంగా ఆరు నెలలుగా జీతాలు లేక కొత్త మండలాల్లో పనిచేస్తున్న సుమారు 240 మంది రెవెన్యూ ఉద్యోగులు నానాతిప్పలు పడుతున్నారు.

ఆ 13 మండలాలివే

జిల్లా	కొత్త మండలం
జగిత్యాల	ఎండపల్లి, భీమారం,
సంగారెడ్డి	నిజాంపేట
నల్గొండ	గట్టుపల్లి
మహబూబాబాద్	సీరోల్, ఇనుగుర్తి
సిద్దిపేట	అక్బర్‌పేట, భూంపల్లి, కుకూనుర్‌పల్లి
కామారెడ్డి	డొంగ్లీ
మహబూబ్‌నగర్	కౌకుంట్ల
నిజామాబాద్	ఆలూర్, డొంకేశ్వర్, సాలూరా

ఏమిటీ క్యాడర్ స్ట్రెంత్?

కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ కార్యాలయాల్లో హోదాల ప్రకారం ఉండాల్సిన సిబ్బంది, వేతన వివరాలు, ఆర్థికపరమైన అనుమతులను రెవెన్యూ పరిభాషలో క్యాడర్ స్ట్రెంత్ అంటారు. ఈ క్యాడర్ స్ట్రెంత్ జీవో విడుదల అయితేనే కొత్త మండలాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, వేతనాలు నేరుగా సంబంధిత జిల్లా ట్రెజరీ కార్యాలయాకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ జీవోను సీసీఎల్‌ఏ జారీ చేయాల్సి ఉంటుంది.

ఏపీలో ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్ ప్లాట్ల

దరఖాస్తు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: మధ్య తరగతి ఆదాయ వర్గాల (ఎంఐజీ) కోసం మంగళగిరిలో అభివృద్ధి చేసిన 'ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్'లో ప్లాట్లకు దరఖాస్తు గడువును మే 20 వరకు పొడిగించినట్టు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నందున వారి సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు టౌన్‌షిప్‌లో 10 శాతం ప్లాట్లు రిజర్వు చేయడంతో పాటు ధరలో 20 శాతం రాయితీ కూడా కల్పించామన్నారు. తాడేపల్లి – మంగళగిరి నగర పాలక సంస్థ పరిధిలోని నవులూరు ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎంఐజీ పోర్టల్ https:// migapdtcp. ap. gov. in , ఏపీ సీఆర్డీఏ https:// crda. ap. gov. inలో మే 1 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 0866 – 2527124 నంబరులో సంప్రదించవచ్చు.



భవిష్యత్తు భరోసాకు దూరంగా...

పొదుపు సూత్రం మర్చిపోతున్న భారతీయ ఉద్యోగులు

- జీవిత, ఆరోగ్య బీమాల గురించి పట్టింపేలేదు
- అత్యవసర పరిస్థితి వస్తే కుటుంబం, స్నేహితులే ఆధారం
- 15 రోజులకే జీతం ఖాళీ..
- 75 శాతం మంది భారతీయ ఉద్యోగుల పరిస్థితి ఇదే
- అకస్మాత్తుగా లే–ఆఫ్‌లు వస్తే ఈఎంఐలు కూడా కట్టలేని దుస్థితి
- ఇండియాస్ మనీ హ్యాబిట్స్‌పై ఫినాలజీ సంస్థ సర్వే

సాక్షి, అమరావతి: ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక విప్లవం, పాశ్చాత్య ధోరణి ప్రభావంతో వ్యక్తుల ఆదాయానికి, ఖర్చుకు మధ్య పెద్ద అగాధాలు ఏర్పడ్డాయి. పేరుకే ఉద్యోగం.. చివరికి మిగిలేది అప్పే అన్నట్లుగా ఉద్యోగుల పరిస్థితి దిగజారింది. సంపాదనకు తగిన విధంగా పొదుపు చేయాలనే ప్రాథమిక సూత్రాన్ని విస్మరిస్తూ చిక్కుల్లో పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నిధుల్లేక నానా అవస్థలు పడుతున్నారు. అకస్మాత్తుగా లే–ఆఫ్‌లు వస్తే కనీసం ఈఎంఐలు కూడా కట్టలేని దుస్థితిలో భారతీయ ఉద్యోగులు ఉండటం శోచనీయం.

ఉద్యోగం కోల్పోతే నెల కూడా ఉండలేరు..

75 శాతం మంది భారతీయ ఉద్యోగులు ఎటువంటి పొదుపు మొత్తాన్ని దాచుకోవట్లేదని దేశీయ ఆర్థిక, పెట్టుబడి, స్టాక్ మార్కెట్ కోర్సులు, రీసెర్చ్ టూల్స్ సంస్థ ఫినాలజీ తాజా సర్వేలో వెల్లడించింది. మూడు లక్షల మంది భారతీయ ఉద్యోగుల నుంచి 'ఇండియాస్ మనీ హ్యాబిట్స్' పేరిట డేటాను సేకరించింది. దీని ప్రకారం.. ఉన్నపళంగా ఉద్యోగం కోల్పోతే ప్రతి నలుగురిలో ఒకరు ఒక నెలపాటు కూడా పరిస్థితులను తట్టుకోలేరని వెల్లడించింది. ప్రతి ముగ్గురిలో ఒకరికి ఆరోగ్య బీమా లేదని.. అనారోగ్య సమస్యలు, అనుకోని సంఘటనలు ఎదురైతే పరిస్థితి అగమ్యగోచరమేనని తెలిపింది.

భద్రత పాలసీలకు దూరంగా..

ఇక దేశంలో కొంతమేర పెరిగిన అవగాహన, కంపెనీల్లో తప్పనిసరి కావడంవల్ల 30–40 ఏళ్ల వయస్సు ఉద్యోగులు బీమా పాలసీలను తీసుకుంటే.. 20–30 ఏళ్ల వయస్సు వారి బీమా పాలసీ స్కోరు చాలా దారుణంగా ఉందని నివేదిక పేర్కొంది. అధిక ఆర్జన కారణంగా విలాసవంతమైన జీవనశైలిపై ఎక్కువ ఖర్చుచేయడం వారి ప్రధాన అంశంగా మారిపోయిందని.. ఫలితంగా పొదుపు సూత్రాన్ని పాటించడమే లేదని సర్వే కుండబద్దలు కొట్టింది. ప్రతీ ఆరుగురు భారతీయ ఉద్యోగుల్లో కనీసం ఒకరికి కూడా ఎటువంటి పాలసీ కవరేజీ లేకపోవడం భవిష్యత్తు ఆలోచనకు దూరంగా ఉండటమేనని చెప్పింది. క్రిటికల్ ఇల్‌నెస్‌లో 69 శాతం మందికి, ప్రమాదవశాత్తూ మరణిస్తే 65 శాతం మందికి సరైన భరోసా దక్కట్లేదని గుర్తించింది. ఈ క్రమంలోనే కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఉత్పన్నమైతే 68 శాతం మంది స్టాక్‌మార్కెట్లు నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలని భావిస్తున్నట్లు పేర్కొంది.

15 రోజులకే జీతం ఖాళీ..

సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు సగం మంది ఉద్యోగుల జీతం 15 రోజులకే ఖాళీ అయిపోతున్నట్టు తెలిపింది. అలాగే..

- ఇక్కడ నలుగురిలో ఒకరు రోజుకు వచ్చే జీతం కంటే ఎక్కువ ఖర్చుచేస్తున్నారు.
- ఆరుగురిలో ఒకరు తమ వద్ద ఉన్నదాని కంటే రెండు రెట్లు బాకీ ఉన్నారు.
- ఈఎంఐలు కట్టడానికి డబ్బులు అందుబాటులో లేకుంటే మెజారిటీ ఉద్యోగులు స్టాక్స్ వెనక్కి తీసుకుంటుంటే.. 24శాతం మంది ఈఎంఐలు కట్టడానికే తిరిగి రుణాలు తీసుకుంటున్నారు.
- ఐదు శాతం మంది స్నేహితులు, కుటుంబ సభ్యులపై ఆధారపడుతున్నారు.
- 15 శాతం మంది ఈఎంఐలు కట్టలేక ఎగ్గొడుతున్నట్లు సర్వే వెల్లడించింది.

అప్పుల ఊబిలో..

మరోవైపు.. ప్రతీ ఐదుగురు భారతీయ ఉద్యోగుల్లో ఇద్దరు ఎప్పటికీ అప్పుల ఊబి నుంచి తప్పించుకోలేరని నివేదిక హెచ్చరించింది. 27 శాతం మంది ప్రస్తుతం అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతుండగా 68 శాతం మంది పదవీ విరమణ ప్రణాళిక లేకుండా గడిపేస్తున్నారని ప్రస్తావించింది. ఇక 53 శాతం మంది మ్యూచువల్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, షేర్లు చూసుకుంటున్నారని.. 36 శాతం మంది పెన్షన్ ఫండ్స్, 7 శాతం మంది అద్దె వస్తుందని, నాలుగు శాతం మంది తమ పిల్లలు చూసుకుంటారనే ధీమాలో ఉన్నట్లు నివేదిక తెలిపింది.

'ఖాజీపల్లి' ఎన్నికల్లో

సీఐటీయూ గెలుపు

మూడు ఓట్లతో ఓడిపోయిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు



విజయోత్సవంలో చుక్కా రాములు

జిన్నారం(పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని ఖా జీపల్లి పారిశ్రామిక వాడలోని టీబీసీసీ పరిశ్రమలో శనివారం జరిగిన కార్మిక యూనియన్ ఎన్నికల్లో సీఐటీయూ అభ్యర్థి చుక్కా రాములు గెలుపొందారు. బీఎంఎస్ అభ్యర్థి దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై మూడు ఓట్ల తేడాతో రాములు విజయం సాధించారు. మొత్తం 173 ఓట్లలో రాములుకు 87, రఘునందన్‌రావుకు 84 ఓట్లు వచ్చాయి. అనంతరం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ...నాలుగోసారి టీబీసీసీ పరిశ్రమలో సీఐటీయూ విజయం సాధించిందని ఆనందం వ్యక్తం చేశారు.


మహారాష్ట్రలో కూలిన గోదాము..

ఇద్దరు దుర్మరణం

థానె: మహారాష్ట్రలోని థానె జిల్లా భివాండీలో రెండంతస్తుల గోదాము భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు చనిపోయారు. శిథిలాల కింద చిక్కుకున్న 12 మందిని రక్షించినట్లు అధికారులు చెప్పారు. మరో 12 మంది లోపలే చిక్కుకుని ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వల్పాడాలోని వర్ధమాన్ కాంపౌండ్‌లో శనివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. రక్షణ, సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది.

భూతాపం.. పర్యావరణంపై ప్రతాపం

భూ గ్రహం వేగంగా వేడెక్కుతోంది. మానవ అనుచిత ప్రవర్తన వాతావరణ సంక్షోభాన్ని సృష్టిస్తోంది. పర్యావరణ క్రియాశీలతలో పెనుమార్పులు తీసుకొస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అడవులు ధ్వంసం కావటం గ్లోబల్ వార్మింగ్ సంకేతాలను బలంగా వినిపిస్తోంది. భూమిపై కర్బన ఉద్గారాల్లో దాదాపు 15 శాతం అటవీ నిర్మూలన కారణంగానే వెలువడుతుండగా.. ఏటా 10 మిలియన్ హెక్టార్లలో ఉష్ణమండల అడవులు తరిగిపోతున్నాయి. దీనిని 2030 నాటికి అరికట్టకుంటే గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే పెరగకుండా పరిమితం చేయడం అసాధ్యమని వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదిక హెచ్చరిస్తోంది. - సాక్షి, అమరావతి



ఉష్ణ మండలంలో 2002 నుంచి 60 మిలియన్ హెక్టార్ల కంటే ఎక్కువ అడవుల్ని కోల్పోయామని.. ఇది ఫ్రాన్స్ దేశ పరిమాణానికి సమానమని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నివేదిక పేర్కొంది. ఉష్ణ మండల అడవుల నరికివేతలో 80 శాతం కంటే ఎక్కువ వ్యవసాయం కోసం చేస్తున్నట్టు గుర్తించింది. 2021లోనే 11.0 మిలియన్ హెక్టార్లలో చెట్లు అంతరించిపోగా.. ఇందులో 3.75 మిలియన్ హెక్టార్లు ఉష్ణ మండల ప్రాథమిక వర్షారణ్యాల ధ్వంసం ఫలితంగా 2.5 గిగా టన్నుల కర్బన ఉద్గారాలు వెలువడ్డాయి. ఇవి భారతదేశంలో వెలువడే వార్షిక శిలాజ ఇంధన ఉద్గారాలతో సమానంగా ఉండటం గమనార్హం. గ్రీన్‌హౌస్ వాయువులు, కర్బన ఉద్గారాలను 2030 నాటికి కనీసం 43 శాతానికి, 2035 నాటికి 60 శాతానికి తగ్గించాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

భూతాపం కట్టడి చేయకపోతే..

పారిశ్రామిక విప్లవానికి ముందునాటి పరిస్థితులతో పోలిస్తే ప్రపంచంలో సగటున 1.15 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అంటే.. భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్ కంటే పెరగకుండా కట్టడి చేయకపోతే సముద్ర మట్టాలు అనూహ్యంగా పెరుగుతాయి. ఫలితంగా తీరప్రాంత దేశాలైన భారత్, బంగ్లాదేశ్, చైనా, నెదర్లాండ్స్ వంటి దేశాలకు చాలా ప్రమాదం. కైరో, లాగోస్, మపుటో, బ్యాంకాక్, ఢాకా, జకార్తా, ముంబై, షాంఘై, కోపెన్‌హాగెన్, లండన్, లాస్ ఏంజిలిస్, న్యూయార్క్, బ్యూనస్ ఏరిస్, శాంటియాగో వంటి నగరాలకు ముప్పు వాటిల్లుతుంది. మునుపటి శతాబ్దాల కంటే 1900 నుంచి ప్రపంచ సగటు సముద్ర మట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. భూతాపం 1.5 డిగ్రీల సెల్సియస్ మించి పెరగకుండా పరిమితం చేయగలిగితే.. వచ్చే 2 వేల సంవత్సరాలలో ప్రపంచ సగటు సముద్ర మట్టం 2 నుంచి 3 మీటర్లు పెరుగుతుంది. 2 డిగ్రీల సెల్సియస్ పెరుగుదలతో సముద్రాలు 6 మీటర్లు, 5 డిగ్రీల సెల్సియస్ పెరుగుదలతో సముద్రాలు 22 మీటర్లు వరకు పెరగవచ్చు. దీనివల్ల లోతట్టు ప్రాంతాలు, మొత్తం దేశాలు జలసమాధి అవుతాయి. భూతాపం పెరిగితే అది తీవ్రమైన కరువు, కార్చిచ్చు, వరదలు లాంటి అసహజ వాతావరణ పరిస్థితులు ఏర్పడేలా చేస్తుంది. లక్షలాది మందికి ఆహారం కొరత ఏర్పడేలా చేస్తుంది. ఇది భూతాపంపై 1.50 డిగ్రీల సెల్సియస్ కంటే పెరగకుండా ఉంచేందుకు అడవులను కాపాడాలని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సూచిస్తోంది. ఇందుకు 100 బిలియన్ల డాలర్ల నుంచి 390 బిలియన్ల డాలర్ల వరకు ఖర్చవుతుందని భావిస్తోంది. ప్రపంచ జీడీపీలో సగాని కంటే ఎక్కువ.. అంటే దాదాపు 44 ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక విలువ ప్రకృతిపై ఆధారపడి ఉంటుందని.. దాదాపు 1.60 బిలియన్ల మంది ప్రజలు ఆహారం, నీరు, కలప, ఉపాధి కోసం అడవులపై ఆధారపడుతున్నారని వెల్లడించింది.

మన దేశంలో ఏటా గ్రీస్ దేశమంత అడవికి నష్టం



2021లో భారతదేశంలో వెలువడిన ఇంధన ఉద్గారాల కంటే వర్షారణ్యాల ధ్వంసం ద్వారా వచ్చిన కార్బన్‌డైఆక్సైడ్ ఎక్కువ ఉన్నట్టు నివేదిక చెబుతోంది. ఇక్కడ ఏటా జరిగే అటవీ నిర్మూలన శాతం గ్రీస్ దేశ పరిమాణానికి దగ్గరగా ఉందని వివరించింది. అటవీ నిర్మూలన, మానవ నివాసాల విస్తరణ, వ్యవసాయం, అడవుల్లో అధికంగా పశువులను మేపడం వంటి కారణాలతో మానవ, జంతువుల మధ్య దాడులకు దారి తీస్తున్నాయి. అడవులు తగ్గిపోతుండటంతో వన్యప్రాణులు తమ భూ భాగాలను కోల్పోతున్నాయి. ఆహారం, ఆశ్రయం లేకపోవడంతో పెద్దఎత్తున బాహ్య ప్రపంచంలోకి వస్తున్నాయి. ఇటీవల కాలంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోని మూడు ప్రధాన పులుల అభయారణ్యాలలో చుట్టుపక్కల మానవ-జంతు సంఘర్షణ పెరిగినట్టు నివేదిక పేర్కొంది.

టీఆర్ఎస్ పేరుతో మరో కొత్త పార్టీ

- ఎన్నికల సంఘానికి సిద్దిపేటవాసి దరఖాస్తు


బాలరంగం

సాక్షి, సిద్దిపేట: టీఆర్ఎస్(తెలంగాణ రాజ్య సమితి) పేరుతో రాష్ట్రంలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు కాబోతుంది. తెలంగాణ రాజ్య సమితి రిజిస్ట్రేషన్ కోసం సిద్దిపేట జిల్లా పొన్నాల గ్రామానికి చెందిన తుపాకుల బాలరంగం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిబ్రవరి 13న దరఖాస్తు చేశారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం చిరునామాగా ఓల్డ్ అల్వాల్‌లోని ఇంటి నంబర్. 1-4-177/148, 149/201ను దరఖాస్తులో పేర్కొన్నారు. అదే గ్రామానికి చెందిన తుపాకుల మురళీకాంత్.. పార్టీ ఉపాధ్యక్షుడిగా, సదుపల్లి రాజు.. కోశాధికారిగా, వెల్కటూర్‌కు చెందిన నల్లా శ్రీకాంత్.. ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ పేరుపై ఎవరికైనా అభ్యంతరాలుంటే మే 27లోపు తమ కు తెలపాలని ఎన్నికల సంఘం ప్రకటించింది. మార్చి 28న ఓ హిందీ పత్రిక, 29న ఇంగ్లిష్ పత్రికలో ప్రకటన ఇచ్చారు. అభ్యంతరాలొస్తే పరిశీలిస్తారు. అనంతరం నిబంధనల మేరకు రాజకీయ పార్టీగా రిజిస్టర్ చేస్తారు. కాగా, బాలరంగం 1983 నుంచి కేసీఆర్‌తోనే ఉన్నారు. 1987, 1995 సంవత్సరాల్లో సర్పంచ్‌గా, 2001లో ఆయన సతీమణి ఎల్లమ్మ సర్పంచ్‌గా, అప్పటి టీఆర్ఎస్ సిద్దిపేట మండల పార్టీ అధ్యక్షుడిగా, 2006లో జెడ్పీటీసీగా, 2019-2021 వరకు ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా పని చేశారు.

తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తుల అరెస్టు

సాక్షి, హైదరాబాద్: ఏండ్లుగా తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తులపై తెలంగాణ సీఐడీ అధికారులు ఫోకస్ పెంచారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు కోసం సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం సత్ఫలితాలిస్తోంది. కేరళకు చెందిన ట్రావెన్‌కోర్ ఫైనాన్స్ అండ్ లీజింగ్ కంపెనీ పేరిట మోసం చేసిన కేసులో 1994 నుంచి పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను ఇటీవలే అరెస్టు చేసిన సీఐడీ పోలీసులు, మరో నిందితుడు కె.రమన్ పిళ్లైని శనివారం అరెస్టు చేశారు. సదరు నిందితుడిని ఎర్నాకులంలో అరెస్టు చేసి, కోర్టులో హాజరు పర్చినట్టు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ఓ ప్రకటనలో తెలిపారు.

నకిలీ పత్రాలతో ఉద్యోగం.. 31 ఏళ్ల తర్వాత అరెస్టు

నకిలీ ధ్రువపత్రాలను చూపి ఉద్యోగం పొందిన ఆరోపణలతో నమోదైన కేసులో నిందితుడు పల్లె సారయ్యను సీఐడీ పోలీసులు 31 ఏండ్ల తర్వాత శుక్రవారం అరెస్టు చేశారు. ఈ కేసులో ఆదిలాబాద్ కోర్టు జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను అమలు చేశారు. నకిలీ ధ్రువపత్రాలను చూపి గోదావరిఖనిలో ఎస్సీ కంపెనీ లిమిటెడ్‌లో ఉద్యోగాలు పొందిన 76 మందిపై పోలీసులు 1992లో కేసు నమోదు చేశారు.

అరన్‌పూర్ పేలుళ్ల సూత్రధారి జగదీశ్

- గొండెరాస్ ఘటనకు ప్రతిగా మావోల ఘాతుకం
- పక్కా ప్లాన్ ప్రకారమే భద్రతా దళాలపై దాడి
- దాడికి నేతృత్వం వహించింది జగదీశ్‌గా గుర్తింపు
- అతని తలపై రూ. 5 లక్షల పోలీస్ రివార్డు
- దర్భా కమిటీ సభ్యులపై కేసు నమోదు


(ఫైల్)


జగదీశ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దంతెవాడ జిల్లా అరన్‌పూర్ బ్లాస్ట్ వెనుక ఉన్న మాస్టర్ మైండ్‌ను ఛత్తీస్‌గఢ్ పోలీసులు గుర్తించారు. పది మంది డీఆర్‌జీ కానిస్టేబుళ్లు, ఒక డ్రైవరు మరణించిన ఈ ఘటనకు జాగరగుండా తూర్పు గ్రామానికి చెందిన జగదీశ్ ప్రధాన కారకుడిని తేల్చారు. ఈ మేరకు దర్భా కమిటీ సభ్యులపై కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో వెల్లడైన వివరాలిలా ఉన్నాయి.

ప్రతీకారం కోసమే

ఏప్రిల్ 12న దంతెవాడ జిల్లాలోని గొండెరాస్ పంచాయతీ పరిధిలో పోలీసులు, ప్రత్యేక భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించాయి. ఇదే సందర్భంలో అక్కడున్న స్థానికులను భద్రతా దళాలు గట్టిగా బెదిరించాయి. గ్రామస్తుల ఎదుటే గాల్లోకి కాల్పులు జరిపారు. 17 మంది వృద్ధులు, పిల్లలను సైతం విచక్షణారహితంగా కొట్టినట్టు మావోయిస్టు పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సౌత్ సబ్ జోనల్ బ్యూరో ప్రతికా ప్రకటన సైతం జారీ చేసింది. అయితే ఈ ఘటనపై ఎటువంటి పోలీసు కేసు నమోదు కాలేదు. కానీ గొండెరాస్‌లో స్థానికులపై భద్రతా దళాలు ప్రవర్తించిన తీరుతో మావోలు రగిలిపోయారు. దీంతో ప్రతీకారం కోసం ఎదురు చూశారు. ఈ క్రమంలో అరన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సలేమీ అడవుల్లో కూంబింగ్ కోసం డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్‌తో పాటు సీఆర్‌పీఎఫ్ దళాలు ఈనెల 25న మంగళవారం అడవుల్లోకి వెళ్లాయి. ఒకరోజంతా అడవిలో కూంబింగ్ జరిపి మరుసటి రోజు ఏప్రిల్ 26న తిరుగు ప్రయాణం అయ్యారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న మావోయిస్టులు ప్రతీకారం ప్లాన్‌ను అమల్లో పెట్టినట్టు తెలుస్తోంది.

పక్కా ప్లాన్‌తో

భద్రతా దళాలకు చెందిన సుమారు రెండు వందల మంది ఎనిమిది వాహనాల్లో సలేమీ అడవీ ప్రాంతం నుంచి దంతెవాడకు తిరుగు ప్రయాణం అయ్యారు. అయితే మావోయిస్టులు రోడ్డు కింద ముందుగానే ఐఈడీ అమర్చిన చోటులో రోడ్డుకు అడ్డంగా కర్రలు పెట్టారు. దీంతో ఆ కర్రల దగ్గరకు రాగానే భద్రతా దళాలకు చెందిన వాహనాలు నెమ్మదించాయి. ఇదే అదనుగా మావోలు సుమారు 40 కేజీల ఐఈడీని పేల్చారు. పేలుడు ధాటికి మినీ బస్సు తునాతునకలైంది. వెంటనే అడవుల్లో మాటువేసి ఉన్న మావోయిస్టులు భద్రతా దళాలపైకి కాల్పులు జరిపారు. ఇరువైపులా నుంచి సుమారు 20 నిమిషాల పాటు కాల్పులు కొనసాగినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలోనే దాడికి పాల్పడిన ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత రెండు రోజులుగా వీరిని విచారించగా ఈ దాడికి పాల్పడింది జాగరగుండా తూర్పు గ్రామానికి చెందిన జగదీశ్‌గా వెల్లడైంది.

జగదీశ్ తలపై రూ.5 లక్షలు

జగదీష్ చాలా కాలంగా బస్తర్‌లో యాక్టివ్‌గా ఉంటున్నట్టు ఛత్తీస్‌గఢ్ పోలీసులు చెబుతున్నారు. పోలీసు రికార్డుల ప్రకారం గతంలో జగదీశ్ కాటేకల్యాణ్ ఏరియా కమిటీలో యాక్టివ్‌గా ఉండేవాడు. అయితే భారీ దాడులను విజయవంతంగా అమలు చేస్తుండటంతో ఇటీవల పార్టీలో జగదీశ్ కేడర్ పెరిగింది. అలా కీలకమైన దర్భా డివిజన్‌కు వెళ్లాడు. మావోయిస్టుల సైనిక దళంలో ఇప్పుడు జగదీశ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ప్రస్తుతం జగదీష్‌పై ఐదు లక్షల రివార్డు ఉంది. అరన్‌పూర్ ఘటనలో జగదీశ్‌తో పాటు మరో 12 మందిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దర్భా డివిజనల్ కమిటీలో చురుగ్గా ఉన్న జగదీష్, లఖే, లింగే, సోమడు, మహేష్, హిద్మా, ఉమేశ్, దేవే, నంద్ కుమార్, లఖ్మా, కోసా, ముకేశ్, చైతు, మంగ్తు, రాన్సాయి, జయలాల్, బమన్, సోమ, రాకేష్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీరందరిపై యూఏపీఏ చట్టాన్ని ప్రయోగించారు.

అవినీతి ఎమ్మెల్యేలెవరో చెప్పండి


మంద కృష్ణ

సాక్షి, హైదరాబాద్: దళితబంధు పథకం మంజూరుకు కొందరు ఎమ్మెల్యేలు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు వసూలు చేశారని స్వయంగా ప్రకటించిన ముఖ్యమంత్రి.. వారి చిట్టా బయటపెట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వారిపై పార్టీపరంగా చర్యలు తీసుకోవాలని లేదా ముఖ్యమంత్రే అవినీతి జరిగిందని చెప్పారు కాబట్టి హైకోర్టు సుమోటోగా కేసు తీసుకోవాలని కోరారు. ఆయన శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. అవినీతి ఎమ్మెల్యేల చిట్టా బయటపెట్టి చర్యలు తీసుకోనిపక్షంలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ముందు ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 వరకు ధర్నాలు, మే 2వ తేదీ నుండి 9వ తేదీ వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రాల్లో నిరవధిక దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని వివరించారు. అప్పటికీ స్పందించకపోతే 10వ తేదీన 33 జిల్లాల్లోని అన్ని కలెక్టర్ కార్యాలయాల ముట్టడి, దిగ్బంధం చేస్తామని కృష్ణ మాదిగ హెచ్చరించారు.

కొత్త సచివాలయంతో ఒరిగేదేంటి?


మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: అతి పెద్దదైన కొత్త సచివాలయం వల్ల సామాన్య ప్రజలకు ఒరిగేదేంటని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి ప్రశ్నించారు. ముఖ్యమంత్రితో పాటు ఐఏఎస్ అధికారులకు అనువుగా ఉండేలా రాజప్రాసాదాలు నిర్మించుకుంటే ప్రజలకు కలిగే లబ్ధి ఏమిటో అర్థం కావడం లేదని ఆయన శనివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. సచివాలయ ప్రారంభానికి ఇంత ఆర్భాటమెందుకని ప్రశ్నించారు. పాత సచివాలయమే ప్రజలకు అనువుగా ఉండేదని రవి అభిప్రాయపడ్డారు.

పర్యాటకానికి తలమానికం భారత్ గౌరవ్ రైళ్లు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- 'గంగా పుష్కరాల' భారత్ గౌరవ్ రైలును ప్రారంభించిన మంత్రి


యాత్రికులకు అల్పాహారం ప్యాకెట్లను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అడ్డగుట్ట (హైదరాబాద్): భారత్ గౌరవ్ రైళ్లు దేశంలో పర్యాటక రంగానికి తలమానికంగా నిలుస్తున్నాయని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని 10వ ప్లాట్‌ఫాంలో 'గంగా పుష్కరాల యాత్ర'(పూరీ, కాశీ, అయోధ్య) భారత్ గౌరవ్ పర్యాటక రైలును దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్, సికింద్రాబాద్ డీఆర్ఎం అభయ్ గుప్తా, ఐఆర్‌సీటీసీ జీజీఎం రాజ్‌కుమార్‌లతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ సాంస్కృతిక వారసత్వాన్ని, చారిత్రక ప్రదేశాలను, పుణ్య క్షేత్రాలను యాత్రికులు దర్శించడానికి రైల్వే శాఖ 3వ భారత్ గౌరవ్ రైలును ప్రారంభించిందన్నారు. శనివారం బయలుదేరిన భారత్ గౌరవ్ రైలు కోణార్క్ సూర్య దేవాలయం, పూరీ, కాశీ, అయోధ్య తదితర పుణ్యక్షేత్రాల సందర్శన తర్వాత మే 7న తిరిగి సికింద్రాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ మార్గంలోని వివిధ పుణ్య క్షేత్రాలకు భక్తులను తీసుకెళ్లి అక్కడ స్థానికంగా అవసరమయ్యే రవాణా, భోజన, వసతి సౌకర్యాలన్నీ భారతీయ రైల్వేనే ఏర్పాటు చేస్తుందన్నారు. వృద్ధులు, మహిళలు, పిల్లలను వెంట తీసుకొని ఈ పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లాలంటే ప్రజలకు భారీ ఖర్చు, ప్రయాసలతో కూడిన పని కాబట్టి మోదీ ప్రభుత్వం గౌరవ్ రైళ్లకు శ్రీకారం చుట్టిందన్నారు. కాగా, జూన్ 10న సికింద్రాబాద్ నుంచి జమ్మూలోని మాతా వైష్ణోదేవి, హరిద్వార్, రిషికేశ్ తదితర ప్రాంతాల సందర్శనకు మరో భారత్ గౌరవ్ రైలును ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ యాత్రికులకు ఇబ్బందులు లే కుండా సాంస్కృతికంగా ప్రముఖమైన ప్రదేశాలను సందర్శించడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తున్నామన్నారు.

యాత్రికులకు అల్పాహార ప్యాకెట్లు అందజేసిన మంత్రి

భారత్ గౌరవ్ రైలు యాత్రలో భాగంగా యాత్రికులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అల్పాహార ప్యాకెట్లను అందజేశారు. అనంతరం వారితో కొద్దిసేపు ముచ్చటించారు. భారత్ గౌరవ్ రైలు ద్వారా పుణ్యక్షేత్రాల సందర్శన సులభం అయిందంటూ యాత్రికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ఫాసిస్ట్ దాడులకు ప్రతీకారమే మందుపాతర

- మావోయిస్టు పార్టీ ప్రకటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు దాడులకు ప్రతీకారంగానే పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ, స్థానిక ప్రజలు అరుణ్‌పూర్‌లో మందుపాతర పేల్చి పోలీసు బలగాలను మట్టుబెట్టారని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో శనివారం లేఖ విడుదల చేసింది. కూంబింగ్ పేరుతో అటవీ గ్రామాలకు వస్తున్న పోలీసులు ఆదివాసీలపై దాడులకు పాల్పడుతున్నారని, అమాయకులను అక్రమంగా అరెస్టు చేసి జైళ్లలో నిర్బంధిస్తున్నారని పార్టీ ఆరోపించింది. ఈనెల 12న గాదిరాజ్ గ్రామంలో ప్రజలపై పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని, 17 మంది పిల్లలు, వృద్ధులను తీవ్రంగా కొట్టారని పేర్కొంది. వైమానిక దాడులు చేస్తూ పార్టీని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ చర్యలకు వ్యతిరేకంగానే పీఎల్‌జీఏ తిరుగుబాటుకు ఉపక్రమిస్తోందని ప్రకటించింది. పోలీసుల మరణానంతరం ప్రధాని, ముఖ్యమంత్రి మొసలి కన్నీరు కారుస్తూ నివాళులర్పిస్తున్నారని, మావోయిస్టు పార్టీపై యుద్ధానికి ఆదివాసీలనే ఎందుకు పోలీసు విభాగంలో చేర్చుకుంటున్నార ని ప్రశ్నించింది. ఆదివాసీలను సమిధలను చేస్తున్నారని పేర్కొంది. అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలన్న కుట్రతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ ప్రాంతాలపై దాడులు సాగిస్తున్నాయని, దీనిని ప్రజలు గుర్తించాలని కోరింది.

సుప్రీం తీర్పు చరిత్రాత్మకం



సాక్షి, హైదరాబాద్: విద్వేష పూరిత ప్రసంగాలతో సెక్యులరిజాన్ని దెబ్బతీస్తే తీవ్రమైన నేరంగా పరిగణించాలని, అలాంటి వ్యక్తులపై కుల, వర్గం, మతంతో సంబంధం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్న సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతుల గోస పట్టని ప్రభుత్వం ఎందుకు?


మహబూబాబాద్ జిల్లా అయ్యగారిపల్లిలో మొక్కజొన్న చేనును పరిశీలిస్తున్న షర్మిల

సాక్షి, మహబూబాబాద్/బచ్చన్నపేట/తిరుమలగిరి (తుంగతుర్తి): 'అతివృష్టి, అనావృష్టితో రైతులు నష్టపోతే ఆదుకునే నాథుడే కరువయ్యారు. రైతుల గోస పట్టని ప్రభుత్వం ఎందుకు? ఇటీవల కురిసిన వానతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలి'అని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల అన్నారు. శనివారం ఆమె మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లి, తూర్పుతండా, ధరావత్ తండా, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఆలింపూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల కురిసిన వడగళ్ల వానతో పంటనష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించారు. ఈ తొమ్మిదేళ్లలో ఇప్పటివరకు 9.50 లక్షల ఎకరాల్లో రూ.14 వేల కోట్ల నష్టం వాటిల్లినా ఏ ఒక్క రైతుకూ నష్ట పరిహారం అందించలేదన్నారు. మార్చిలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎకరాకు రూ.10వేల పరిహారం ఇస్తానని హామీ ఇచ్చారన్నారని, ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కాగా, మహబూబాబాద్ జిల్లాకు వెళుతున్న ఆమె సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో కాసేపు ఆగారు. పార్టీ నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు.

సాక్షి పెళ్ళిచూపులు

7

ఆదివారం 30-4-2023



మెరిసిన యాదాద్రి

నల్లని మబ్బులు కమ్ముకున్న వేళ.. విద్యుద్దీప స్వర్ణకాంతులతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం మెరిసిపోయింది. భక్త జనకోటి ఆనందంతో పరవశించిపోయింది. శనివారం సూర్యోదయమైన కాసేపటికే.. దట్టమైన నల్లని మేఘాలు కమ్మి భారీ వర్షం కురిసింది. కొండంతా చీకట్లు కమ్ముకోవడంతో ఆలయాధికారులు విద్యుద్దీపాలను వెలిగించారు. నల్లని మేఘాల గొడుగు కింద.. బంగారు వర్ణపు విద్యుత్ కాంతులతో వెలిగిపోయిన ఆలయం భక్తులకు కనువిందు చేసింది. – యాదగిరిగుట్ట

శ్రీవారి సేవల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించండి

- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి

సాక్షి, అమరావతి/తిరుమల: వేసవి సెలవుల రద్దీ ఆదివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనార్థం విశేష సంఖ్యలో విచ్చేసే భక్తులకు మరింత మెరుగైన సేవలందించే విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆయా విభాగాధిపతులను కోరారు. అన్నమయ్య భవనంలో శనివారం టీటీడీ సీనియర్ అధికారులతో ఈవో సమీక్ష నిర్వహించారు. మే 1 నుంచి జూలై 15వ తేదీ వరకు యాత్రికుల అవసరాలను తీర్చడానికి సంబంధిత విభాగాల అధికారులు 24 గంటలు తిరుమలలో అందుబాటులో ఉండాలన్నారు. క్యూలైన్లు, వైకుంఠం కాంప్లెక్స్‌లు, కంపార్ట్‌మెంట్లలో తాగునీరు, అన్నప్రసాదం తదితర సేవలకు ఎలాంటి లోటులేకుండా చూడాలన్నారు. భక్తుల రద్దీకి వీలుగా తగినన్ని లడ్డూలు నిల్వ ఉంచుకోవాలన్నారు. మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కల్యాణకట్ట, సీఆర్‌వో, పీఏసీల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు.

సౌకర్యవంతంగా దర్శనం: దర్శనానికి వచ్చే భక్తులకు వెండి వాకిలి తర్వాత ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరింత సౌకర్యవంతంగా శ్రీవారి దర్శనం కల్పించడంపై వివరంగా చర్చించారు. టీటీడీ విశ్రాంత సీఈ, టీటీడీ సలహాదారు రామచంద్రారెడ్డి, రద్దీ నిర్వహణలో అనుభవం ఉన్న విశ్రాంత డిప్యూటీ ఈవో ప్రభాకర్‌రెడ్డి కలిసి ఈ సమస్యను అధిగమించేందుకు కార్యాచరణ ప్రణాళికను రెండు రోజుల్లో అందించాలని కోరారు.

రెండేళ్లు.. బాధితులు 6 వేలు

- పంజాగుట్ట కేంద్రంగా నకిలీ కాల్ సెంటర్ దందా
- డేటా ఎంట్రీ ఉద్యోగాల పేరుతో నాలుగు రాష్ట్రాల వారికి గాలం
- ఒక్కొక్కరి నుంచి రూ.3వేల నుంచి రూ.5వేలు వసూళ్లు
- ప్రతి 45 రోజులకు ఫోన్ నెంబర్లను మార్చుతూ మోసాలు
- నకిలీ కాల్‌సెంటర్‌ను సీజ్ చేసిన సైబర్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- ప్రధాన నిందితుడితో సహా 35మంది అరెస్టు
- మీడియాకు వివరాలు వెల్లడించిన డీసీపీ స్నేహా మెహ్రా



స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను చూపిస్తున్న డీసీపీ స్నేహా మెహ్రా, ఓఎస్‌డీ రాధాకిషన్‌రావు, ఏసీపీ కేవీఎం

హిమాయత్‌నగర్: నిరుద్యోగులకు డేటా ఎంట్రీ ఉద్యోగాలు ఇస్తామంటూ పంజాగుట్ట కేంద్రంగా నడుస్తున్న ఓ నకిలీ కాల్ సెంటర్‌పై హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు, వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. దాదాపు రెండేళ్లుగా మోసానికి పాల్పడుతున్న ప్రధాన నిర్వాహకుడు గడగోని చక్రధర్, సహకారులు గణేష్, శ్రావణ్‌లతో పాటు మరో 32మంది టెలికాలర్స్(వీరిలో అమ్మాయిలు 11మంది)ని అరెస్టు చేసినట్లు సైబర్ క్రైం డీసీపీ స్నేహా మెహ్రా తెలిపారు. వారివద్ద నుంచి 14 ల్యాప్‌టాప్‌లు, 148 సెల్‌ఫోన్‌లు, రూ.1లక్షా 3వేలు నగదు, బీఎండబ్ల్యూ, ఫార్చునర్, ఇన్నోవా, మహేంద్ర కారులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శనివారం బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైం కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ రాధాకిషన్‌రావు, సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రఘునాథ్, శ్రీనాథ్‌రెడ్డిలతో కలసి స్నేహా మెహ్రా వివరాలను వెల్లడించారు.

ప్రతి 45రోజులకు సిమ్‌లు మార్పు

డబ్బులు వసూలు చేసిన తర్వాత ప్రతి 45 రోజులకోసారి ఫోన్ నంబర్లను చక్రధర్‌గౌడ్ మార్చేసేవాడు. ఫేక్ కేవైసీల ఆధారంగా వందల కొద్దీ సిమ్‌లను అనంతపురం వాసి కృష్ణమూర్తి నుంచి కొనుగోలు చేసేవాడు. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు డేటా ఎంట్రీ జాబ్ ఇస్తానంటూ మాయమాటలు చెప్పి వారి నుంచి రూ.2500 చొప్పున వసూళ్లు చేసి ఉద్యోగం ఇవ్వలేదు. దీంతో ఆ ఇద్దరూ సైబర్‌క్రైం పోలీసుల్ని ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి మొత్తం నిర్వాకాన్ని వెలికితీశారు. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, సైబర్‌క్రైం పోలీసులు ఈ కాల్ సెంటర్ గుట్టును రట్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ రాధాకిషన్ రావు తెలిపారు.

రెండేళ్లు..6వేల మంది బాధితులు

నగరంలోని బాచుపల్లిలో స్థిరపడ్డ సిద్దిపేటకు చెందిన గడగోని చక్రధర్‌గౌడ్ గతంలో కాల్‌సెంటర్‌లలో పనిచేసిన అనుభవం ఉండటంతో 2021లో పంజాగుట్టలో రూ.1లక్షా 30వేల విలువ గల ఫ్లాట్‌ను తీసుకుని కాల్‌సెంటర్‌ను ప్రారంభించాడు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగులకు డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు ఇస్తానంటూ వల వేశాడు. ఆయా రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగులతో మాట్లాడేందుకు ఆ రాష్ట్రాలకు చెందిన వారినే టెలికాలర్స్‌గా రూ.15వేల జీతానికి నియమించుకున్నాడు. ఈ రెండేళ్లలో ఒక్కో బాధితుడి నుంచి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు దాదాపు 6వేల మంది నుంచి వసూలు చేశారని గుర్తించారు. కొంతమంది నుంచి పెద్దమొత్తంలో కూడా వసూళ్లు చేశారు.

శ్రీపద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభం



విద్యుత్ దీపాల వెలుగులో పద్మావతి పరిణయోత్సవ మండపం (ఇన్‌సెట్‌లో) గజవాహనంపై నారాయణగిరి ఉద్యానవనానికి బయలుదేరిన మలయప్ప స్వామి వారు

తిరుమల: తిరుమల నారాయణగిరి ఉద్యానవనాల్లో భూలోక వైకుంఠాన్ని తలపించే రీతిలో స్వర్ణకాంతులు విరజిమ్మేలా ఏర్పాటు చేసిన అష్టలక్ష్మి దశావతార మండపంలో శనివారం శ్రీపద్మావతి పరిణయోత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. మే 1వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. తొలిరోజు శ్రీమలయప్ప స్వామివారు గజవాహనాన్ని అధిరోహించగా, ఉభయనాంచారులు పల్లకిపై పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు. పెండ్లి మండపంలో నూతన వధూవరులైన శ్రీస్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు, పూలదండలు మార్చుకోవడం, పూలబంతులాట, నూతన వస్త్ర సమర్పణ కోలాహలంగా జరిగాయి. ఆ తర్వాత స్వామివారికి కొలువు (ఆస్థానం) జరిగింది. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సహితుడైన స్వామి బంగారుతిరుచ్చిపై ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేయడంతో తొలిరోజు వివాహ వేడుక ఘనంగా ముగిసింది. శ్రీ పద్మావతి పరిణయ మండపాన్ని ఆపిల్, పైనాపిల్, మొక్కజొన్న కంకులు, ఆస్ట్రేలియా ఆరంజ్, నారింజ, ద్రాక్ష, అరటి, మామిడి కొమ్మలతో అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. మండపం అలంకరణకు బంతి, చామంతి, వట్టివేరు, వాడామల్లి, నాలుగు రంగుల రోజాలు, కార్నస్ తదితర పుష్పాలను వినియోగించారు.

సచివాలయ ప్రారంభోత్సవానికి వెళ్లను

- అది సెక్రటేరియట్‌లా లేదు
- ఒవైసీ కళ్లల్లో ఆనందం కోసమే డోమ్‌లతో నిర్మాణం
- బీజేపీ అధికారంలోకి వచ్చాక డోమ్‌లు కూల్చిన తరువాతే వెళతా
- సీఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: కొత్తగా నిర్మించిన సచివాలయం ప్రారంభోత్సవానికి తాను వెళ్లనని, అసలది సెక్రటేరియట్ మాదిరిగా లేనే లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. కర్ణాటక ఎన్నికల్లో భాగంగా చింతామణి నియోజక వర్గంలో ప్రచారం ముగించుకొని హైదరాబాద్ వస్తూ శనివారం ఏపీలోని అనంతపూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం నేత ఒవైసీ కళ్లల్లో ఆనందం చూడటం కోసం, ఒక వర్గం వారిని సంతృప్తి పరచేందుకే కేసీఆర్ సచివాలయాన్ని డోమ్‌లతో కట్టారని ధ్వజమెత్తారు. 'బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎవరు సీఎం అయినా నేను మాత్రం సచివాలయంలో అడుగుపెట్టను'అని అన్నారు. 'ఆ భవన నిర్మాణంలో తెలంగాణ సంస్కృతి ఎక్కడా కనిపించడం లేదు. సచివాలయ డోమ్‌లను కూల్చివేసి.. తెలంగాణ సంప్రదాయాలకు అనుగుణంగా పునర్నిర్మించిన తరువాతే అడుగుపెడతా'అని స్పష్టం చేశారు. సచివాలయంలో మసీదుకు 5 గుంటలు ఇచ్చి, నల్లపోచమ్మ ఆలయానికి రెండున్నర గుంటల జాగా మాత్రమే ఇస్తారా? అని ప్రశ్నించారు. 'బాంచన్ దొరా బతుకులు.. ఇంకా బతకాల్సిన అవసరం లేదు, అట్లాంటి సచివాలయానికి పోయి నా ఒకటే, పోకపోయినా ఒకటే'అని వ్యాఖ్యానించారు.

సీఎం కేసీఆర్‌కు బుద్ధిస్ట్ సొసైటీ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయానికి డా॥ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడంతో పాటు 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించినందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు 'ది ప్రాక్టీసింగ్ బుద్ధిస్ట్ సొసైటీ (బౌద్ధ ఉపాసక్ మహాసభ) అభినందనలు తెలిపింది. సొసైటీ ప్రధాన కార్యదర్శి కేఆర్ రావత్ లక్నో నుంచి సీఎం కేసీఆర్‌కు ఈ మేరకు లేఖ రాశారు. తెలంగాణ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం, దానికి పక్కనే ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా 125 అడుగుల బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో గొప్ప విషయం. ఈ దిశగా మీరు వేసిన అడుగు అంబేడ్కర్ భావజాలాన్ని విశ్వసించే వారికి సంతోషాన్ని కలిగిస్తున్నది. ఇంత గొప్ప కార్యాన్ని చేపట్టిన మీకు, బౌద్ధ ఉపాసక్ మహాసభ అభినందనలు తెలియజేస్తున్నది. ఇటువంటి విశిష్టమైన కార్యక్రమాలు నిత్యం చేపట్టాలని, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం మరింతగా కృషి చేయాలని, అందరికీ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని, ఆ బుద్ధ భగవానున్ని ప్రార్థిస్తున్నాం' అని లేఖలో పేర్కొన్నారు.

చంద్రబాబు, పవన్ మళ్లీ భేటీ

- భవిష్యత్తు వ్యూహంపై చర్చకే భేటీ!



సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తన మిత్రుడు చంద్రబాబును మరోసారి కలిశారు. గత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న ఆయన శనివారం అకస్మాత్తుగా హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ప్రత్యక్షమయ్యారు. 2 నెలలపాటు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న ఆయన ఇప్పుడు చంద్రబాబును కలవడం చర్చనీయాంశంగా మారింది. అరగంటపాటు ఏకాంతంగా సమావేశమైన ఇరువురు ఆ వివరాలను మాత్రం బయటకు వెల్లడించలేదు. గతంలో విజయవాడ, హైదరాబాద్‌లో ఒకరినొకరు కలుసుకున్నప్పుడు సంయుక్తంగా మీడియా సమావేశాలు నిర్వహించారు. కానీ, ఇప్పుడు మాత్రం మీడియాకు మొహం చాటేశారు. పవన్ కళ్యాణ్ మీడియా కంటపడకుండా చంద్రబాబు నివాసం నుంచి వెళ్లిపోయారు. ఇటీవలే పవన్ ఢిల్లీ వెళ్లి పలువురు బీజేపీ ముఖ్యనేతలను కలిసి వచ్చిన విషయం తెలిసిందే. చంద్రబాబుతో కలిసి పని చేద్దామని వారితో పవన్ చెప్పినట్లు జనసేన నేత నాదెండ్ల మనోహర్ అప్పట్లో వెల్లడించారు. కానీ, బీజేపీ మాత్రం ఆ విషయాన్ని పట్టించుకోలేదు. మరోవైపు.. చంద్రబాబు కూడా బీజేపీకి దగ్గరయ్యేందుకు రకరకాలుగా ప్రయత్నాలు చేస్తు న్నారు. తాజాగా.. రిపబ్లిక్ టీవీ చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొని మోదీని కీర్తించారు. కానీ, బీజేపీ పెద్దలు ఆయన్ను పట్టించుకోకపోగా దానిపై సోషల్ మీడియాలో బాబు అప్పుడు, ఇప్పుడు చేసిన కామెంట్లపై సెటైర్లు హోరెత్తాయి. మొత్తంగా టీడీపీని బీజేపీకి దగ్గర చేసేందుకు అటు పవన్, ఇటు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో.. భవిష్యత్ వ్యూహంపై చర్చించడా నికే ఇరువురు నేతలూ సమావేశమైనట్లు తెలిసింది.

కొత్త టైగర్ రిజర్వ్ .. చాన్సున్నా చర్యల్లేవ్?

రాష్ట్రంలో కొత్త టైగర్ రిజర్వ్‌ల ఏర్పాటుకు అన్ని సానుకూల పరిస్థితులున్నా అధికార యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లవుతున్నా ఒక్కటంటే ఒక్కటీ కొత్త టైగర్ రిజర్వ్ ఏర్పడలేదు. ప్రస్తుతం ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటైన అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లు ఉండగా, కొత్తగా కనీసం రెండు పులుల అభయారణ్యాల ఏర్పాటుకు అవకాశం ఉంది. కొత్త టైగర్ రిజర్వ్ ఏర్పాటుకు కాగజ్‌నగర్, కిన్నెరసాని, ఏటూరునాగారంలలో సానుకూల వాతావరణం ఉంది. అందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నిధులొచ్చే అవకాశమున్నా రాష్ట్ర ప్రభుత్వపరంగా ముఖ్యంగా అటవీశాఖ నుంచి గట్టి ప్రయత్నాలు సాగడం లేదనే విమర్శలున్నాయి.

- సాక్షి, హైదరాబాద్



ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడిన అమ్రాబాద్, కవ్వాల్ రిజర్వ్‌లు

తెలంగాణలో మూడు ప్రాంతాల్లో రిజర్వ్‌ల ఏర్పాటుకు అవకాశం

కేంద్రం నుంచి నిధులొచ్చే అవకాశమున్నా మన ప్రయత్నాలు నిల్

ఏమాత్రం చొరవ తీసుకోని రాష్ట్ర అటవీశాఖ అధికారులు

ప్రతిపాదనలు పంపితే మంచిదంటున్న నిపుణులు

తాజాగా విడుదలైన టైగర్ స్టేటస్ రిపోర్ట్-2022లోనూ రాష్ట్రంలో 'పులుల ఆక్యుపెన్సీ' తగ్గిందని ప్రత్యేకంగా పేర్కొన్నారు. కొత్త టైగర్ రిజర్వ్ ఏర్పాటు ద్వారా రాష్ట్రానికి వివిధ ప్రయోజనాలు చేకూరే అవకాశ

తగ్గిన పులుల ఆక్యుపెన్సీ

మున్నా గట్టి ప్రయత్నాలు జరగడం లేదనే ఆరోపణలున్నాయి. 2014 తర్వాత దేశవ్యాప్తంగా కొత్తగా 8, 9 పులుల అభయారణ్యాలు ఏర్పడినా, రాష్ట్రానికి ఒక్కటి కూడా రాకపోవడానికి ఈ దిశలో కనీసం ప్రతిపాదనలు కూడా కేంద్రానికి చేరలేదని సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా వీటి ఏర్పాటుకు అటవీశాఖ ప్రతిపాదనలు పంపితే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

కవ్వాల్‌లో కనిపించని స్థిరనివాస పులులు!

ఉమ్మడి ఏపీలో 2012లో కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్) ఏర్పడింది. నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో భాగంగా ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ఉన్న ప్రాంతాన్ని రాష్ట్ర విభజన అనంతరం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌గా (ఏటీఆర్) ప్రకటించారు.ప్రస్తుతం అమ్రాబాద్‌లో పులులు పుష్కలంగా ఉన్నాయని, 2018తో పోల్చితే వాటి సంఖ్య గణనీయంగా పెరిగిందనే అంచనాలున్నాయి. కవ్వాల్‌లోని చెన్నూరు డివిజన్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్న పులులే కనిపించకపోవడం ఆందోళన రేపుతోంది. ఎన్ని ఆడపులులు సంతానోత్పత్తి చేస్తున్నాయనే అంశం ప్రాతిపదికన ఆ టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య వృద్ధికి అవకాశముంది, ప్రస్తుతం ఏటీఆర్‌లో కనీసం ఏడు 'బ్రీడింగ్ ఫిమేల్ టైగర్స్' ఉండటంతోపాటు కనీసం నాలుగు ఆడపులులు పిల్లలు పెట్టి వాటిని సంరక్షిస్తున్నాయని ఈ ప్రాంతంతో పరిచయమున్న నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏటీఆర్‌లో 30 దాకా పులులు (నాలుగైదు పులి పిల్లలు కలుపుకొని) ఉండగా, కేటీఆర్‌లో అసలు పులులే కనిపించని పరిస్థితులు ఏర్పడినందున కొత్త టైగర్ రిజర్వ్‌ల ఏర్పాటు అవశ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాగజ్‌నగర్‌లో కనిపిస్తున్నాయ్...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఆనుకునే ఉన్న మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పెద్దపులుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో తెలంగాణలోకి వాటి వలసలు పెరిగాయి. ప్రస్తుతం కొంతకాలంగా పులులు లేని ప్రాంతంగా కవ్వాల్ నిలుస్తోంది. దీని బయట టైగర్ కారిడార్‌లో ముఖ్యంగా కాగజ్‌నగర్, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇవి కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో మూడో టైగర్ రిజర్వ్‌ను కాగజ్‌నగర్ ఏరియాలో ఏర్పాటు చేసి ఉంటే పులుల సంరక్షణకు పెద్దమొత్తంలో కేంద్ర నిధులు రావడంతోపాటు ఉద్యోగుల కేటాయింపు, స్థానికులకు ఉపాధి పెరిగే అవకాశం ఉండేదంటున్నారు. టైగర్ సఫారీ వంటి వాటికీ పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తారని, దీనివల్ల ఈ ప్రాంతానికి మరింత ప్రాచుర్యం లభిస్తుందని చెబుతున్నారు. మహారాష్ట్రలోని తడోబా, అంధారీ ప్రాంతానికి పక్కనే ఈ ప్రాంతం ఉండటంతోపాటు.. అక్కడి నుంచే పులులు ఇక్కడకు వస్తున్నందున మరో టైగర్ రిజర్వ్ ఏర్పాటుచేస్తే ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయని అంటున్నారు. వైల్డ్‌లైఫ్ శాంక్చురీగా ఉన్న కిన్నెరసాని, ఏటూరు నాగారంలోనూ పులుల సంచారం ఉన్నందున వాటిని కూడా టైగర్ రిజర్వ్‌గా ప్రకటించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ మూడింటిలో కనీసం రెండుచోట్ల టైగర్ రిజర్వ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచిస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో టైగర్ రిజర్వ్‌ను ఏర్పాటు చేసినా అడవులు, పర్యావరణానికి మేలు చేకూరుతుందని అంటున్నారు.



రాష్ట్రంలో పులుల అభయారణ్యానికి సానుకూలంగా ఉన్న ప్రాంతాలు

1. కాగజ్‌నగర్
2. కిన్నెరసాని
3. ఏటూరు నాగారం

సొంతింటి ఆశలు తీరే సమయం!

- గ్రేటర్ హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు
- కొత్త సచివాలయంలో తొలి సంతకం చేయనున్న మంత్రి కేటీఆర్
- పంపిణీకి సిద్ధంగా ఉన్న 63 వేల ఇళ్లు
- వివిధ నిర్మాణ దశల్లో ఉన్న మరో 37 వేల ఇళ్లు
- దరఖాస్తు చేసి ఎదురుచూస్తున్న సుమారు ఏడు లక్షల మంది



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఎన్నోఏళ్లుగా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నవారి ఆశలు త్వరలో తీరనున్నాయి. మంత్రి కేటీఆర్ కొత్త సచివాలయం ప్రారంభోత్సవం రోజున డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీకి సంబంధించిన మార్గదర్శకాల ఫైల్‌పైనే తొలి సంతకం చేయనున్నారు. దీనితో లబ్ధిదారుల ఎంపిక చేపట్టి, ఇళ్లను పంపిణీ చేసేందుకు మార్గం సుగమం కానుంది. నాలుగైదు నెలల్లో ఎన్నికలున్న నేపథ్యంలో.. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు.

కొనసాగుతున్న వివరాల అప్‌లోడింగ్

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన లక్ష డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో దాదాపు 63వేల వరకు పూర్తయ్యాయి. లబ్ధిదారులను ఎంపిక చేయగానే వాటిని పంపిణీ చేయవచ్చు. మిగతా ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం ఏడు లక్షలమందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. వారిలో అర్హులను గుర్తించేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించి ఓటరు కార్డు ఆధారంగా వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 3.6 లక్షల మంది వివరాలు అప్‌లోడ్ చేసినట్టు అధికారులు చెప్తున్నారు. నిజానికి రెండేళ్ల క్రితమే చాలా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. కానీ పంపిణీ చేయకపోవడంతో.. పలుచోట్ల ఇళ్లలోని సామగ్రి దొంగల పాలైంది.

మేడ్చల్ జిల్లా పరిధిలో ఎక్కువ ఇళ్లు

జీహెచ్ఎంసీలో నిర్మాణం చేపట్టిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో ఎక్కువశాతం మేడ్చల్ జిల్లా పరిధిలో ఉన్నాయి. ఆ జిల్లాలో 38,419 ఇళ్లు ఉండగా.. హైదరాబాద్ జిల్లాలో 9,453, రంగారెడ్డి జిల్లాలో 23,908, సంగారెడ్డి జిల్లాలో 28,220 ఇళ్లున్నాయి. వీటిలో పాత ఇళ్లు, గుడిసెలను కూల్చి అక్కడే కొత్తగా నిర్మించిన వాటిని మాత్రం ఇప్పటికే పంపిణీ చేశారు. నగరంలో లక్ష ఇళ్ల నిర్మాణానికి సరిపడా స్థలాలు లేనందున శివారు ప్రాంతాల్లో ఎక్కువగా నిర్మించారు. నగరంలో ఉంటున్న వారికి కూడా ఆయా ప్రాంతాల్లో ఇళ్లు కేటాయించనున్నారు.

మూడు కేటగిరీలుగా 'డబుల్'ఇళ్లు

అవసరాన్ని బట్టి, ఆయా ప్రాంతాల్లో అందుబాటును బట్టి జీహెచ్ఎంసీలో మూడు కేటగిరీల్లో డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు.


- సెల్లార్+స్టిల్ట్+9 అంతస్తులు, లిఫ్టులు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు. ఒక్కో ఇంటి వ్యయం రూ.8.65 లక్షలు.
- స్టిల్ట్+ 5 అంతస్తులు, లిఫ్టులు, మౌలిక సదుపాయాలు. ఒక్కో ఇంటి వ్యయం రూ.8.50 లక్షలు.
- లిఫ్టులు లేకుండా గ్రౌండ్+3 అంతస్తులు. మౌలిక సదుపాయాలు. ఒక్కో ఇంటి వ్యయం రూ.7.75 లక్షలు.

పేదలకు ఇళ్ల పంపిణీపై కేటీఆర్ తొలి సంతకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కొత్త సచివాలయ భవనంలోని మూడో అంతస్తులో తనకు కేటాయించిన చాంబర్‌లోకి ఆదివారం మంత్రి కేటీఆర్ అడుగుపెట్టబోతున్నారు. ఈ కార్యాలయం నుంచే ఐటీ, మున్సిపల్, పట్టణాభివృద్ధి, పరిశ్రమల శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించనున్నారు. కొత్త సచివాలయం నుంచి విధుల నిర్వహణ సందర్భంగా కీలకమైన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీకి సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేయనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న లక్ష డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు మార్గదర్శకాలకు సంబంధించిన ఫైల్ ఇది అని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఓఆర్ఆర్ లీజు అతి పెద్ద స్కాం!

- ఇందులో రూ.1,000 కోట్లు చేతులు మారాయి: టీపీసీసీ చీఫ్ రేవంత్ ఆరోపణ
- రూ.30వేల కోట్ల ఆదాయం వచ్చే ప్రాజెక్టును రూ.7,380 కోట్లకే కట్టబెట్టారు
- మాజీ సీఎస్ సోమేశ్ కనుసన్నల్లోనే వ్యవహారం
- అన్ని విచారణ సంస్థలకు దీనిపై ఫిర్యాదు చేస్తామని వెల్లడి
- ప్రజల ఆస్తులను కేసీఆర్ అమ్మేస్తుంటే బీజేపీ స్పందించడం లేదేమని నిలదీత



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగురోడ్డు (ఓఆర్ఆర్)ను 30ఏళ్లపాటు లీజుకిచ్చే ఒప్పందం దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ లీజును తాము అంగీకరించే ప్రసక్తే లేదని, తాము అధికారంలోకి రాగానే విచారణ జరిపే మొదటి ఒప్పందం ఇదేనని పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ఎస్సీసెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు ఫహీం, మెట్టుసాయికుమార్, చరణ్‌కౌశిక్ యాదవ్‌లతో కలిసి రేవంత్ మాట్లాడారు. ఓఆర్ఆర్ లీజు వ్యవహారంలో రూ.1,000 కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. రూ.30వేల కోట్లు ఆదాయం వచ్చే ఓఆర్ఆర్‌ను రూ.7,380 కోట్లకే ముంబై కంపెనీకి తాకట్టు పెట్టారని, ఇందులో దాగి ఉన్న మతలబు ఏమిటని నిలదీశారు. ఓఆర్ఆర్ లీజు వ్యవహారమంతా ప్రభుత్వ మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ కనుసన్నల్లో జరిగిందని.. దానిపై అరవింద్‌కుమార్ సంతకం పెట్టారని ఆరోపించారు. కేటీఆర్, సోమేశ్, అరవింద్‌కుమార్ కలసి మిత్రబృందం ఉపయోగించుకుంద న్నారు. నిజానికి ఈ లీజును అదానీకి కట్టబెట్టాలని చూశారని, కానీ ఆరోపణల నేపథ్యంలో ముంబైకి చెందిన కంపెనీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలపై బీజేపీ మౌనంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను కేసీఆర్ అమ్మేస్తుంటే బండి సంజయ్, కిషన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అంతర్జాతీయ ప్రమాణాలతో ఓఆర్ఆర్‌ను నిర్మించిందని, అలాంటి ఓఆర్ఆర్‌ను లీజుకివ్వాలన్న నిర్ణయంతో ప్రజలు దాన్ని వినియోగించుకోలేని పరిస్థితి దాపురిస్తుందని చెప్పారు. వేల కోట్ల రూపాయల ఈ కుంభకోణంపై ఈడీ, సీబీఐ, సెంట్రల్ విజిలెన్స్‌తో సహా విచారణ సంస్థలన్నింటికీ ఫిర్యాదు చేస్తామన్నారు.

దీనిపై బీజేపీ మౌనం ఎందుకు?

ఔటర్ రింగురోడ్డును ఆదాయ వనరుగా కేటీఆర్ దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఐఏఎస్ అధికారులు సోమేశ్‌కుమార్, అరవింద్‌కుమార్, జయేశ్‌రంజన్‌లు తీసుకున్న నిర్ణయాలన్నింటినీ కాంగ్రెస్ పార్టీ సమీక్షిస్తుందన్నారు. ప్రభుత్వం దిగిపోయే ఆరునెలల ముందు తీసుకునే ఏ నిర్ణయాన్ని అయినా వచ్చే ప్రభుత్వం సమీక్షిస్తుందని, ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించబోదని చెప్పారు.

మీ ప్రాణాలు మీరే కాపాడుకోండి

సాక్షి, హైదరాబాద్: మ్యాన్‌హోల్‌లో పడి నగరానికి చెందిన మౌనిక అనే బాలిక మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'విశ్వనగరంలో మ్యాన్‌హోళ్లు, వీధి కుక్కలు.. పిల్లల ప్రాణాలను మింగుతున్నాయి. రాజమహళ్లు – రాచరిక పోకడల ముందు సామాన్యుల ప్రాణాలు వెలవెలబోతున్నాయి. వర్షాకాలం వస్తోంది... గ్రేటర్ ప్రజలారా! ప్రభుత్వం పట్టించుకోదు. మీ ప్రాణాలు మీరే కాపాడుకోండి'... అని ఆ ట్వీట్‌లో రేవంత్ పేర్కొన్నారు.

రజనీకి అర్థమైనా.. గజనీలకు అర్థం కావడంలేదు

- హైదరాబాద్ న్యూయార్క్‌లా ఉందని రజనీకాంతే ప్రశంసించారు
- ప్రతిపక్షాలు నిరుద్యోగులను రెచ్చగొట్టేందుకు దొంగ దీక్షలు చేస్తున్నాయి
- మంత్రి హరీశ్‌రావు ధ్వజం



మంజీరా కుంభమేళాలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ బి.బి.పాటిల్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: 'తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధి వేరే రాష్ట్రంలో ఉన్న రజనీకాంత్‌కు అర్థమైంది కానీ.. ఇక్కడే ఉన్న గజనీలకు అర్థం కావడం లేదు'అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో హైదరాబాద్ అభివృద్ధిపై మాట్లాడారని, సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని, హైదరాబాద్ న్యూయార్క్‌లా ఉందని ప్రశంసించారని ఆయన పేర్కొన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కందిలో వీరశైవలింగాయత్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తుంటే ప్రతిపక్ష పార్టీల నేతలు నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ సర్కారును ఎందుకు గద్దెదించుతారని ప్రశ్నించారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నందుకు గద్దెదించుతారా? అని ప్రశ్నించారు.

లింగాయత్‌లను ఓబీసీల్లో చేర్చేందుకు మద్దతు

తెలంగాణలో లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని, ఈ అంశంపై తీర్మానం చేసి కేంద్రానికి పంపామని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఇతర బీజేపీ నేతలు లింగాయత్‌లను ఓబీసీల్లో చేర్చేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బసవ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బి.బి. పాటిల్, ఎమ్మెల్యే క్రాంతికిరణ్, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీసీఎం చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కుంభమేళాలో భాగంగా మంత్రి హరీశ్‌రావు పంచవటిలో మంజీర నది వద్ద గంగాదేవికి పూజలు చేశారు. అనంతరం మహా మంగళ హారతి నిర్వహించారు.

జాతీయ రాజకీయాల్లో కీలకంగా కేసీఆర్

- రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయం ఖాయం
- శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- మల్లన్నసాగర్–నిజాంసాగర్ కాల్వలు, టన్నెల్ పనుల పరిశీలన



టన్నెల్ పనులను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వివరిస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

గజ్వేల్: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయాన్ని పొందుతారని, జాతీయరాజకీయాల్లోనూ కీలక భూమిక పోషిస్తారని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రంలో రాక్షస ప్రభుత్వం రాజ్యమేలుతోందని, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టడమే లక్ష్యంగా పనిచేస్తోందని ఆయన మండిపడ్డారు. శనివారం సిద్దిపేట జిల్లాలో మల్లన్నసాగర్–నిజాంసాగర్, సింగూర్ కాల్వలు, టన్నెల్ పనులను సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, హనుమంత్ షిండే, ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ తీరుపై మండిపడ్డారు. 23 రాష్ట్రాల్లో ప్రభుత్వాలను వెలగబెడుతున్న బీజేపీ.. ఏ ఒక్క రాష్ట్రంలోనైనా తెలంగాణ తరహా పథకాలను తీసుకురాగలిగిందాని ప్రశ్నించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంపదను పెంచుతూ ప్రజలకు పంచిపెడుతున్నారని కొనియాడారు. కాళేశ్వరం ద్వారా రాష్ట్రంలో కరువుకు శాశ్వత పరిష్కారం చూపారన్నారు. తన సొంత జిల్లాలోని జూకల్ పక్కన మహారాష్ట్ర ప్రజలు మంచినీటి కోసం ఇప్పటికీ నిత్యం కిలోమీటర్ల తరబడి బిందెలను మోసుకెళ్లే దృశ్యాలు చూస్తుంటానని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేసే నాథుడు లేక ఇక్కడ కొనుగోలు చేయాలని రైతులు ప్రాధేయపడుతుంటారని చెప్పారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్, ఎస్ఈ వేణు, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా రైతుబంధు అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూతులతో ముద్దులు.. కాళ్లతో తన్నులు

- కడుపులో కత్తులు పెట్టుకొని కౌగిలించుకున్న కాంగ్రెస్ నాయకులు
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డివి మతిస్థిమితం లేని మాటలు
- మీడియా సమావేశంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్: మూతులతో ముద్దాడుకుంటూ..కాళ్లతో తన్నుకుంటున్న కాంగ్రెస్ నాయకులు పెట్టింది నిరుద్యోగుల సభ కాదని, అది కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల సభ అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. శనివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కడుపులో కత్తులు పెట్టుకొని అంతా కలిసి ఉన్నామనే విధంగా కౌగిలించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డివి స్థిరత్వం లేని, మతిస్థిమితం లేని మాటలన్నారు. తనను 2004లో ఓడించాను అని చెబుతున్న కోమటిరెడ్డిని.. తన శిష్యుడు కంచర్ల భూపాల్‌రెడ్డి ఘోరంగా ఓడించిన విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. కోమటిరెడ్డి తమ్ముడు ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఆయన అన్న జెడ్పీటీసీగా, మరదలు ఎమ్మెల్సీగా పోటీచేస్తే బీఆర్ఎస్ నాయకులు ఓడించిన విషయాన్ని మరువద్దని హితవు పలికారు. కోమటిరెడ్డి మాటలు చూస్తే ఈర్ష్య, భయంతో మాట్లాడినట్లు ఉందన్నారు.

ఉదయం బీఆర్ఎస్... మధ్యాహ్నం కాంగ్రెస్.. సాయంత్రం బీజేపీ

ఉదయం బీఆర్ఎస్‌కి వస్త అని చర్చిస్తడు .. మధ్యాహ్నం కాంగ్రెస్‌లోనే ఉంటా అంటడు ... సాయంత్రం బీజేపీ అంటడు అని కోమటిరెడ్డిపై సుఖేందర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఐదెకరాల భూమి లేదంటున్న కోమటిరెడ్డికి హైదరాబాద్ హైటెక్‌సిటీలో భూమి ఎవరిది, విల్లాలు ఎవరివి అని ప్రశ్నించారు. వాళ్లు ప్రారంభించిన ఉదయ సముద్రం ప్రాజెక్టు మేము పూర్తి చేస్తున్నామని, ఐటీ మంత్రిగా కోమటిరెడ్డి చేయలేనిది మంత్రి కేటీఆర్ సహకారంతో నల్లగొండలో ఐటీ హబ్ నిర్మాణం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ నేతలకు అధికారంలోకి ఎప్పుడు వద్దాం, ఎప్పుడు దోచుకుందామనే దురాలోచన తప్ప మరొకటి లేదన్నారు. తనపై, మంత్రి జగదీశ్‌రెడ్డిపై బురద చల్లడం సరికాదని గుత్తా అన్నారు.

ఓటుకు నోటు దొంగ నోటి నుంచి నీతులా?

- రేవంత్‌ది డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న అహంకారం
- బీఆర్ఎస్ ఎంపీ, ఎమ్మెల్యేల ధ్వజం

సాక్షి, హైదరాబాద్: ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి నీతులు చెబితే నవ్వాలో ఏడవాలో తెలియడం లేదని బీఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు. నల్లగొండలో కాంగ్రెస్ నిరుద్యోగ మార్చ్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆపార్టీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, సైదిరెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, రవీంద్రకుమార్ మీడియాతో మాట్లాడారు. డబ్బులు పెట్టి పీసీసీ అధ్యక్ష పదవి తెచ్చుకున్న అహంకారం, చంద్రబాబు ఏజెంట్ అనే గర్వంతో రేవంత్ ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. తిడితే పబ్లిసిటీ వస్తుందని భావిస్తూ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులపై నోరు పారేసుకుంటున్నాడని దుయ్యబట్టారు. నల్లగొండలో పన్నెండుకు పన్నెండు సీట్లు గెలిచామని, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డిలను ఎన్నికల్లో బీఆర్ఎస్ మట్టి కరిపించిన విషయాన్ని గుర్తు చేశారు. కోమటిరెడ్డి తన కాంట్రాక్టు పైసల కోసం అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిపై ఒత్తిడి పెంచేందుకే రాజీనామా చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిలింగ్, కలెక్షన్‌ల కోసమే డ్రామాలు ఆడుతున్నారని, వ్యక్తిగత విమర్శలు చేస్తే నాలుకలు కోస్తారని హెచ్చరించారు. ఓటుకు నోటు దొంగ పక్కన నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నేతలు బాడీగార్డుల్లా నిలబడటం సిగ్గుచేటని, కోమటిరెడ్డి బ్రదర్స్‌ను నల్లగొండ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. కాంగ్రెస్ నేతలు మోకాళ్ల మీద నడిచినా ఆపార్టీకి నల్లగొండలో డిపాజిట్లు రావని స్పష్టం చేశారు. నల్లగొండలో జరిగింది కాంగ్రెస్ నిరుద్యోగ నాయకుల సభ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు కేసీఆర్ కాలిగోటికి కూడా సరిపోరని విమర్శించారు. దేశంలోకెల్లా అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం తెలంగాణ అని, వచ్చే ఎన్నికల్లో నల్లగొండలో ఏ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్‌కు డిపాజిట్లు రావని అన్నారు. కోమటిరెడ్డి ఓ బ్రోకరని.. నైతికత గురించి ఆయనకు మాట్లాడే హక్కు ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఉండి బీజేపీకి మద్దతు ఇచ్చిన కోమటిరెడ్డి.. అసలు మనిషేనా అని వారు నిలదీశారు.



ఫైనల్లో సుమీత్ నగాల్

ఏటీపీ చాలెంజర్ యూరోపియన్ క్లే సీజన్‌లో భారత ఆటగాడు సుమీత్ నగాల్ జోరు కొనసాగుతోంది. రోమ్ ఓపెన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో నగాల్ ఫైనల్లోకి ప్రవేశించాడు. సెమీస్‌లో ప్రపంచ 347వ ర్యాంకర్ నగాల్ 2-6, 7-5, 6-4 స్కోరుతో 198వ ర్యాంకర్ జోరిస్ డి లూర్ (బెల్జియం)పై విజయం సాధించాడు. 2 గంటల 31 నిమిషాల పాటు ఈ పోరు సాగింది. ఫైనల్లో జెస్పర్ డి జోంగ్ (నెదర్లాండ్స్)తో నగాల్ తలపడతాడు. ఇక్కడ విజయం సాధిస్తే యూరోపియన్ క్లే పై ఏటీపీ చాలెంజర్ టైటిల్ గెలిచిన తొలి భారత ఆటగాడిగా నిలుస్తాడు. నగాల్ ఇప్పటి వరకు కెరీర్‌లో 3 ఏటీపీ చాలెంజర్ టోర్నీలు సాధించాడు.

ఫైనల్లో సాత్విక్-చిరాగ్

ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



దుబాయ్: ప్రతిష్టాత్మక ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత డబుల్స్ జోడి సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి ఫైనల్లోకి ప్రవేశించింది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారత జంటగా గుర్తింపు తెచ్చుకుంది. శనివారం జరిగిన సెమీస్‌లో ఆరో సీడ్ సాత్విక్-చిరాగ్...చైనీస్ తైపీకి చెందిన లీ యాంగ్ – వాంగ్ చిన్ లిన్‌పై విజయం సాధించారు. తొలి గేమ్‌ను 21–18తో గెలుచుకున్న భారత జంట రెండో గేమ్‌లో 13–14తో వెనుకబడి ఉన్న దశలో వాంగ్ చిన్ లిన్ గాయం కారణంగా తప్పుకున్నాడు. దాంతో 'వాకోవర్'తో మన ఆటగాళ్లు ముందంజ వేశారు. 41 నిమిషాల్లో ఈ మ్యాచ్ ముగిసింది. నేడు జరిగే ఫైనల్లో ఎనిమిదో సీడ్ ఆంగ్ యూ సిన్ – టియో ఈ యీ (మలేసియా)తో భారత జోడి తలపడుతుంది.


కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన



రెజ్లర్లకు ప్రియాంక గాంధీ సంఘీభావం

న్యూఢిల్లీ: భారత్ రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినా... తమ నిరసనను ముగించేందుకు రెజ్లర్లు ఇష్టపడటం లేదు. జంతర్‌మంతర్ వద్ద శనివారం కూడా ఈ నిరసన కొనసాగింది. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు రాజకీయ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి ఆటగాళ్లకు తమ సంఘీభావం ప్రకటించారు. అయితే కొందరు బయటి వ్యక్తులు నిరసన వేదిక వద్ద వచ్చి దుష్ప్రచారం చేస్తున్నారని రెజ్లర్ బజరంగ్ పూనియా ఆరోపించాడు. తమ ఉద్యమం రెజ్లర్ల సమస్యలకే పరిమితమని, ఇతర రాజకీయ అంశాల జోలికి తాము వెళ్లడం లేదని అతను అన్నాడు. మరో వైపు తాజా అంశంపై 'ఫొగాట్' సోదరీమణుల మధ్య విభేదాలు తలెత్తాయి. నిరసనలోకి రాజకీయ నాయకులను రానివ్వొద్దంటూ బబిత ఫొగాట్ విమర్శించగా... మహిళా రెజ్లర్ల తరఫున నిలవడం ఇష్టం లేకపోతే, కనీసం నిరసనను బలహీనపర్చవద్దని వినేశ్ జవాబిచ్చింది.

గుజరాత్ అదే జోరు



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జోష్ లిటిల్

- 7 వికెట్లతో కోల్‌కతాపై విజయం
- రాణించిన గిల్, విజయ్‌శంకర్
- గుర్బాజ్ మెరుపులు వృథా

కోల్‌కతా: సమష్టి ప్రదర్శన డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌కు 'హ్యాట్రిక్' విజయాన్ని అందించింది. ముందుగా పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన జట్టు ఆ తర్వాత బలమైన భాగస్వామ్యాలతో లక్ష్యాన్ని ఛేదించింది. గతి తప్పిన బౌలింగ్, పేలవ ఫీల్డింగ్‌తో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఓటమిపాలైంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 7 వికెట్ల తేడాతో కోల్‌కతాపై విజయం సాధించింది. ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. రహ్మనుల్లా గుర్బాజ్ (39 బంతుల్లో 81; 5 ఫోర్లు, 7 సిక్సర్లు) భారీ షాట్లతో చెలరేగాడు. అనంతరం టైటాన్స్ 17.5 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి 180 పరుగులు చేసి గెలిచింది. విజయ్ శంకర్ (24 బంతుల్లో 51 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (35 బంతుల్లో 49; 8 ఫోర్లు) కీలక పాత్ర పోషించారు. 2 కీలక వికెట్లు తీసిన జోష్ లిటిల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

సిక్సర పిడుగల్లే గుర్బాజ్...

జగదీశన్ (19; 4 ఫోర్లు) స్పీడ్‌కు షమీ బ్రేకులేసినా...అఫ్గనిస్తాన్ బ్యాటర్ గుర్బాజ్ మేటి బౌలర్లయిన షమీ, పాండ్యా, రషీద్‌ఖాన్ బౌలింగ్‌లో సిక్సర్లతో శివమెత్తాడు. జట్టు పవర్ ప్లేలో 61/2 స్కోరు చేయగా... గుర్బాజ్ ఫిఫ్టీ 27 బంతుల్లో పూర్తయ్యింది. వెంకటేశ్ అయ్యర్ (11), నితీశ్ రాణా (4)లు విఫలమైనా... గుర్బాజ్ ఏ బౌలర్‌ను విడిచిపెట్టకుండా భారీ సిక్సర్లతో చెలరేగిపోవడంతో రన్‌రేట్ ఆద్యంతం దూసుకుపోయింది. 16వ ఓవర్లో గుర్బాజ్‌కు నూర్ అహ్మద్ పెవిలియన్ దారి చూపితే... తర్వాత రసెల్ (19 బంతుల్లో 34; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) దంచాడు.

గిల్ వేగం...
విజయ్ శరవేగం...

ఛేదనలో అవసరమైన దాటిని శుబ్‌మన్ గిల్ కనబరిచాడు. సాహా (10) నుంచి సహకారం తక్కువైనా, స్కోరుబోర్డును గిల్ చూడచక్కని బౌండరీలతో పరుగెత్తించాడు. హార్దిక్ పాండ్యా (20 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు సాధించగా...2 పరుగుల వ్యవధిలో పాండ్యా, గిల్ నిష్క్రమించారు. ఈ దశలో 52 బంతుల్లో 87 పరుగుల సమీకరణం క్లిష్టమనిపించింది. అయితే ఓవైపు మిల్లర్ (18 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మరోవైపు విజయ్ శంకర్ సిక్సర్లతో 13 బంతులు మిగిలుండగానే గుజరాత్ శరవేగంగా లక్ష్యాన్ని అధిగమించింది. చెత్త ఫీల్డింగ్‌తో బౌండరీలు రావడం, కీలకమైన దశలో మిల్లర్ సులువైన క్యాచ్‌ను సుయాశ్ నేలపాలు చేయడం గుజరాత్‌కు కలిసొచ్చింది.



విజయ్ శంకర్ గుర్బాజ్

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జగదీశన్ (ఎల్బీ) (బి) షమీ 19; గుర్బాజ్ (సి) రషీద్ (బి) నూర్ అహ్మద్ 81; శార్దుల్ (సి) మోహిత్ (బి) షమీ 0; వెంకటేశ్ (ఎల్బీ) (బి) జోష్ 11; రాణా (సి) తెవాటియా (బి) జోష్ 4; రింకూ (సి) జోష్ (బి) నూర్ అహ్మద్ 19; రసెల్ (సి) తెవాటియా (బి) షమీ 34; వీస్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 179. వికెట్ల పతనం:** 1-23, 2-47, 3-84, 4-88, 5-135, 6-156, 7-179. **బౌలింగ్:** షమీ 4-0-33-3, హార్దిక్ 3-0-34-0, రషీద్ 4-0-54-0, జోష్ 4-0-25-2, నూర్ అహ్మద్ 4-0-21-2, మోహిత్ 1-0-12-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి)హర్షిత్ (బి) రసెల్ 10; గిల్ (సి) రసెల్ (బి) నరైన్ 49; హార్దిక్ (ఎల్బీ) హర్షిత్ 26; శంకర్ నాటౌట్ 51; మిల్లర్ నాటౌట్ 32; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (17.5 ఓవర్లలో 3 వికెట్లకు) 180.**

వికెట్ల పతనం: 1-41, 2-91, 3-93.

బౌలింగ్: హర్షిత్ 3-0-25-1, రసెల్ 3-0-29-1, వరుణ్ 4-0-42-0, సుయాశ్ 4-0-37-0, నరైన్ 3-0-24-1, నితీశ్ రాణా 0.5-0-14-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	8	6	2	12	0.638
రాజస్తాన్	8	5	3	10	0.939
లక్నో	8	5	3	10	0.841
చెన్నై	8	5	3	10	0.376
బెంగళూరు	8	4	4	8	-0.139
పంజాబ్	8	4	4	8	-0.510
కోల్‌కతా	9	3	6	6	-0.147
హైదరాబాద్	8	3	5	6	-0.577
ముంబై	7	3	4	6	-0.620
ఢిల్లీ	8	2	6	4	-0.898

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × పంజాబ్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
ముంబై × రాజస్తాన్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ఢిల్లీని గెలిచిన హైదరాబాద్



అభిషేక్

- 9 పరుగులతో సన్‌రైజర్స్ గెలుపు
- అభిషేక్, క్లాసెన్ అర్ధసెంచరీలు
- రాణించిన సాల్ట్, మార్ష్

ఢిల్లీ: సన్‌రైజర్స్ సొంతగడ్డపై ఆడిన గత మ్యాచ్‌లో ఢిల్లీ చేతిలో ఓడింది. ఇప్పుడు ఢిల్లీకి వెళ్లి ప్రతీకారం తీర్చుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 9 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. తొలుత సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 197 పరుగుల భారీస్కోరు చేసింది. అభిషేక్ శర్మ (36 బంతుల్లో 67; 12 ఫోర్లు, 1 సిక్స్), క్లాసెన్ (27 బంతుల్లో 53 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించారు. మార్ష్ 4 వికెట్లు తీశాడు. తర్వాత ఢిల్లీ 20 ఓవర్లలో 6 వికెట్లకు 188 పరుగులకే పరిమితమైంది. ఫిల్ సాల్ట్ (35 బంతుల్లో 59; 9 ఫోర్లు), మార్ష్ (39 బంతుల్లో 63; 1 ఫోర్, 6 సిక్సర్లు) మెరుపు అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. వీళ్లిద్దరే రెండో వికెట్‌కు 66 బంతుల్లోనే 112 పరుగులు జోడించి ఆశలు పెంచారు. వీరిద్దరు అవుటయ్యాక మిగిలిన బ్యాటర్లు చేతులెత్తేయడంతో ఢిల్లీకి ఓటమి తప్పలేదు.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్ష్

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) వార్నర్ (బి) అక్షర్ 67; మయాంక్ (సి) సాహా (బి) ఇషాంత్ 5; త్రిపాఠి (సి) పాండే (బి) మార్ష్ 10; మార్క్‌రమ్ (సి) అక్షర్ (బి) మార్ష్ 8; బ్రూక్ (సి) అక్షర్ (బి) మార్ష్ 0; క్లాసెన్ నాటౌట్ 53; సమద్ (సి) సాహా (బి) మార్ష్ 28; అకీల్ నాటౌట్ 16; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 197. వికెట్ల పతనం:** 1-21, 2-44, 3-83, 4-83, 5-109, 6-162. **బౌలింగ్:** ఇషాంత్ 3-0-31-1, నోర్జే 4-0-44-0, ముకేశ్ 2-0-38-0, మార్ష్ 4-1-27-4, కుల్దీప్ 3-0-27-0, అక్షర్ పటేల్ 4-0-29-1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (బి) భువనేశ్వర్ 0; సాల్ట్ (సి అండ్ బి) మార్కండే 59; మార్ష్ (సి) మార్క్‌రమ్ (బి) అకీల్ 63; పాండే (స్టంప్డ్) క్లాసెన్ (బి) అభిషేక్ 1; ప్రియమ్ (బి) మార్కండే 12; సర్ఫరాజ్ (బి) నటరాజన్ 9; అక్షర్ నాటౌట్ 29; రిపాల్ నాటౌట్ 11 ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 188. వికెట్ల పతనం:** 1-0, 2-112, 3-115, 4-125, 5-140, 6-148.

బౌలింగ్: భువనేశ్వర్ 4-0-45-1, అకీల్ 4-0-40-1, నటరాజన్ 4-0-34-1, ఉమ్రాన్ 1-0-22-0, మార్కండే 4-0-20-2, అభిషేక్ 3-0-26-1.

సినిమా



● శ్రుతీహాసన్

గోవాలో...

ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన రెండు భారీ సినిమాలు 'వీరసింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య'లో కథానాయికగా అలరించారు శ్రుతీహాసన్. ప్రస్తుతం ప్రభాస్ సరసన 'సలార్' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే ఇంగ్లిష్ చిత్రం 'ది ఐ' కూడా ఉంది. తాజాగా నాని సినిమాలో కీలక పాత్ర చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు శ్రుతి. ఇప్పటి వరకూ ప్రత్యేక పాటల్లో కనిపించిన ఈ బ్యూటీ కీ రోల్స్ చేయలేదు. సో.. నాని సినిమాలో చేయనున్నది శ్రుతీకి తొలి కీలక పాత్ర అవుతుంది. ప్రస్తుతం గోవాలో జరుగుతున్న ఈ చిత్రం షూటింగ్‌లో జాయిన్ అయ్యారు శ్రుతీహాసన్. ఇక నాని సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్న ఈ చిత్రానికి శౌర్యువ్ దర్శకత్వం వహిస్తున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, కెమెరా: సాను జాన్ వర్గీస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

అప్పుడు ఉగ్రం ఆలోచన వచ్చింది

- విజయ్ కనకమేడల



"హీరోల క్యారెక్టరైజేషన్ చుట్టూ కథలు అల్లడంపై ప్రస్తుతం నాకు ఆసక్తి లేదు. నేను రాసే కథలు హీరో సెంట్రిక్‌గా ఉంటాయి. ఒకవేళ భవిష్యత్తులో పెద్ద హీరోలు అవకాశం ఇస్తే అప్పుడు వారిని దృష్టిలో పెట్టుకుని కథ రాస్తానేమో. ఇప్పుడైతే ఓ అంశంతో కథను అల్లుకుని పాత్రలను సృష్టించుకుంటున్నాను. సామాజిక అంశాలకు వాణిజ్య పరమైన హంగులు జోడించి కథలు చెప్పడం నాకు ఆసక్తి" అన్నారు దర్శకుడు విజయ్ కనకమేడల. 'నాంది' తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, దర్శకుడు విజయ్ కనకమేడల దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఉగ్రం'. ఇందులో మీర్నా మీనన్ హీరోయిన్. హరీష్ పెద్ది, సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో విజయ్ కనకమేడల చెప్పిన విశేషాలు.

● 'నాంది' సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయిన తర్వాత లాక్‌డౌన్ వల్ల కొంత సమయం దొరికింది. అప్పుడు 'ఉగ్రం' కథ రాసుకున్నాను. ప్రతిరోజూ మిస్సింగ్ వార్తలను గమనిస్తూనే ఉన్నాం. తెలంగాణ హైకోర్టు మిస్ అవుతున్న వారు ఏమౌతున్నారో నివేదిక ఇవ్వమని పోలీసు డిపార్ట్‌మెంట్‌ని కోరినట్లు ఒక ఆర్టికల్ చదివాను. తప్పిపోతున్న వారి కుటుంబ సభ్యుల బాధ ఎలా ఉంటుందనే అంశంపై కథ చేస్తే బావుంటుందనిపించి, 'ఉగ్రం' కథ రెడీ చేశాం. తూము వెంకట్ నా ఫ్రెండ్. కథల గురించి మేం ఇద్దరం ఆలోచిస్తూనే ఉంటాం. మా కో-ఆర్డినేషన్ చాలా బాగుంటుంది. ఐడియాల షేరింగ్ ఎలా ఉన్నా తనది కథ, నాది స్క్రీన్ ప్లే, డైరెక్షన్ క్రెడిట్ అనుకున్నాం. అలా కొనసాగుతున్నాం. ● 'ఉగ్రం' స్క్రిప్ట్‌లో యాక్షన్ సీక్వెన్స్‌కు ఎక్కువ స్కోప్ ఉంది. కథలో క్యారెక్టరైజేషన్ ప్రకారమే యాక్షన్ సీక్వెన్స్‌లు వస్తాయి. ఈ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించడానికి ముందు కొంత రిహార్సల్స్ చేశాం. వీటి వల్ల నరేశ్‌గారి బాడీ లాంగ్వేజ్, ఫిట్‌గా ఉండటం వంటి అంశాలు మరింత మెరుగుపడ్డాయి. ఈ సినిమాలో హీరోయిన్ కాలేజ్ అమ్మాయిగా, భార్యగా, తల్లిగా మూడు భిన్నమైన కోణాల్లో కనిపించాలి. మిర్నా చేసిన గత సినిమాలు చూశాను. ఆడిషన్స్‌కు పిలిచి ఆమెను ఎంపిక చేసుకున్నాం. బాగా యాక్ట్ చేశారు.

● నరేశ్‌గారు ఆల్ రౌండర్ అని ఎప్పుడో అనిపించుకున్నారు. నా దృష్టిలో ఆయన కామెడీ హీరో కాదు. హీరోగా ఎక్కువగా కామెడీ చిత్రాలు చేశారంతే. 'ఉగ్రం'లో ఇంటెన్స్, ఎమోషన్స్ ఉన్న పోలీసాఫీసర్‌గా ఆయన బాగా నటించారు. అలాగే ఈ సినిమాలో ఓ లవ్ సాంగ్, ఫ్యామిలీ, టైటిల్ ట్రాక్స్ ఉన్నాయి. అయితే ఈ పాటలు కథను డిస్ట్రబ్ చేయవు. ఈ పాటల్లో కూడా కథ కొనసాగుతుంటుంది.

నాగచైతన్యగారికి ఓ కథ చెప్పాను. క్లయిమాక్స్ ఆయనకు నచ్చలేదు. చైతూగారు కనెక్ట్ అయినప్పుడే సినిమా చేస్తాం. ఇది కూడా సోషల్ డ్రామా సినిమానే. క్లయిమాక్స్ వర్క్ జరుగుతోంది. మరికొన్ని కథలు ఉన్నాయి.

అన్నీ మన కంట్రోల్‌లో ఉండవు

- మాళవికా నాయర్



"ఓ నటిగా నేను ఎప్పుడూ కొత్తదనం కోరుకుంటుంటాను. రొటీన్ రోల్స్ అయితే కొత్తగా నేను నిరూపించుకోవడానికి ఏమీ ఉండదు. అందుకే క్యారెక్టర్స్ ఎంపిక విషయంలో జాగ్రత్తపడుతుంటాను" అని అన్నారు హీరోయిన్ మాళవికా నాయర్. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిత్ర విందా మూవీస్‌తో కలిసి ప్రియాంక దత్ నిర్మించిన ఈ చిత్రం మే 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాళవికా నాయర్ మాట్లాడుతూ– "నా గత సినిమాలతో పోల్చితే 'అన్నీ మంచి..' చిత్రంలో నా పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది. ఇప్పటివరకు నేను సున్నితమైన పాత్రలు చేశాను. కానీ ఈ చిత్రంలో కాస్త కోపంగా, ధైర్యంగా ఉండే అమ్మాయి పాత్ర చేశాను. అన్నీ తన కంట్రోల్‌లోనే ఉండాలనుకునే వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి పాత్ర చేశాను. కాస్త హ్యూమర్ కూడా ఉంటుంది. నందినీ రెడ్డిగారు నాకు చాలా ఇన్‌పుట్స్ ఇచ్చారు. నటీనటుల నుంచి ఆమెకు కావాల్సింది రాబట్టుకుంటారు. 'కల్యాణ వైభోగమే' తర్వాత నందినీ గారితో మళ్ళీ సినిమా చేయాలని వుండేది. అది వైజయంతీ ఫిల్మ్స్‌తో నిజం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా కోసం రాజేంద్ర ప్రసాద్, గౌతమి, వీకే నరేశ్, వాసుకీగార్ల వంటి అనుభవజ్ఞులైన వారితో నటించడం కొత్త ఎక్స్‌పీరియన్స్. 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమా చేస్తున్నప్పుడు నాకు అన్నీ మంచి శకునములే అనిపించాయి. ఈ పాత్ బ్రేకింగ్ సినిమా విలువ ఏంటో నాకు తర్వాత తెలిసొచ్చింది. ప్రియాంక, స్వప్నగార్లు నాకు పరిచయం అయ్యింది కూడా 'ఎవడే సుబ్రహ్మణ్యం' నుంచే. ఇండస్ట్రీలో వారు నాకు మెంటర్స్‌లా ఉంటున్నారు. ఓ నటిగా నాకు యాక్షన్ రోల్ చేయాలని ఉంది. ప్రస్తుతం డెవిల్ సినిమాలో ఓ కీ రోల్ చేస్తున్నాను" అన్నారు.

సక్సెస్‌ల ప్రభావం ఇండస్ట్రీలో ఉంటుంది. సక్సెస్‌లో ఉంటే మాళవికగారు వచ్చారు అంటారు. లేకపోతే మాళవిక వచ్చింది అంటారు. అయినా అన్నీ మన కంట్రోల్‌లో ఉండవు (జయాపజయాలను ఉద్దేశిస్తూ..). ఓ యాక్టర్‌గా నటన మాత్రమే నా కంట్రోల్‌లో ఉంటుంది. కొన్నిసార్లు సినిమా వర్కౌట్ కాకపోతే నేను పర్సనల్‌గా తీసుకోను.

పోరాటం.. పరిరక్షణ



● 'ఉక్కు సత్యాగ్రహం'లో ఓ దృశ్యం

'సర్దార్ చిన్నపరెడ్డి, అయ్యప్ప దీక్ష, ప్రత్యూష, ప్రశ్నిస్తా' వంటి సినిమాలను నిర్మించిన సత్యారెడ్డి కథానాయకుడిగా నటించి, స్వీయదర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. విశాఖ స్టీల్ ప్లాంట్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రాన్ని జనం ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించింది. ప్రజాగాయకుడు గద్దర్, వైజాగ్ ఎంపీ ఎంవీవీ సత్యానారాయణ, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ప్రసన్నకుమార్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రంతో పల్సర్ బైక్ ఝాన్సీ కథానాయికగా పరిచయం అవుతున్నారు. ఇటీవలే ఈ సినిమా చివరి షెడ్యూల్ ముగిసింది. విశాఖపట్టణంలోని ఆర్‌కె బీచ్, ఆరిలోవా, ఆంధ్రా యూనివర్సిటీ, రామానాయుడు స్టూడియో లొకేషన్స్‌లో షూటింగ్ జరిపారు. ఈ సందర్భంగా హీరో – దర్శకనిర్మాత సత్యారెడ్డి మాట్లాడుతూ– "స్టీల్ ప్లాంట్ సాధన కోసం జరిగిన పోరాటం, పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటాల ఇతివృత్తంతో ఈ చిత్రం రూపొందింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జేఏసీ ఛైర్మన్ అయోధ్య రామ్, మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, కేఎస్ఎన్ రావుతోపాటు యూనియన్ లీడర్లు, ఉద్యోగులు, భూనిర్వాసితులు స్వచ్ఛందంగా ఈ చిత్రంలో నటించారు. రియాలిటీకి దగ్గరగా ఉంటుంది. గద్దర్, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, మజ్జి దేవిశ్రీ అద్భుతమైన పాటలు రాశారు. త్వరలో ఆర్‌కె బీచ్‌లో నిర్వహించనున్న ప్రీ రిలీజ్ వేడుకలో రాష్ట్రంలోని ఓ కీలక వ్యక్తి అతిథిగా హాజరవుతారు" అని అన్నారు.

అమరం.. అఖిలం.. సీతారాముల ప్రియనామం



● కృతీ సనన్

ప్రభాస్ హీరోగా ఓం రౌత్ డైరెక్షన్‌లో రూపొందిన పౌరాణిక చిత్రం 'ఆదిపురుష్'. రామాయణం ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో రాముడి పాత్రలో ప్రభాస్, సీత పాత్రలో కృతీ సనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. శనివారం 'సీతా నవమి' సందర్భంగా ఈ చిత్రంలోని 'రామ్ సియా రామ్' ఆడియో టీజర్‌ను విడుదల చేశారు. ఈ గీతాన్ని సచేత్ పరంపర స్వరపరిచారు. కాగా ఈ పాటలోని కృతీ సనన్ లుక్‌ని విడుదల చేశారు. "అమరం, అఖిలం, ఈ నామం.. సీతారాముల ప్రియనామం' అంటూ చిత్రదర్శకుడు ఓం రౌత్ ఈ పాటను ఉద్దేశించి ట్వీట్ చేశారు. భూషణ్‌కుమార్, క్రిషణ్‌కుమార్, ప్రసాద్ సుతార్, ఓం రౌత్, రాజేష్ నాయర్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 16న విడుదల కానుంది.

జగ్జీవన్ రామ్ జీవితంతో బాబూజీ



● ప్రసాద్, మీరాకుమార్, దిలీప్

భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ బయోపిక్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'బాబూజీ'. దిలీప్ రాజా దర్శకత్వంలో రూపొందు తున్న ఈ చిత్రం షూటింగ్ గుంటూరులో జరుగుతోంది. కాగా అదే నగరానికి వెళ్లిన జగ్జీవన్‌రామ్ కుమార్తె, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ ఈ చిత్రంలో జగ్జీవన్‌రామ్ పాత్రధారి మిలటరీ ప్రసాద్‌పై చిత్రీకరిస్తున్న సీన్‌కి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా దిలీప్ రాజా మాట్లాడుతూ – "మహాత్మాగాంధీ ఆహ్వానంతో స్వాతంత్ర్య ఉద్యమంలోకి వచ్చిన జగ్జీవన్‌రామ్ మరెందరినో ఆ ఉద్యమంలోకి తీసుకురావటం, జైలు శిక్ష అనుభవించడం వంటివాటిని 'బాబూజీ'లో తప్పనిసరిగా చూపించాలని మీరాకుమార్ సూచించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 2024 జనవరి 9న ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు.


సెల్ఫిష్ బాయ్



● ఆశిష్

'రౌడీ బాయ్స్'తో హీరోగా పరిచయమైన ఆశిష్ రెడ్డి హీరోగా నటిస్తున్న రెండో చిత్రం 'సెల్ఫిష్'. నూతన దర్శకుడు కాశీ విశాల్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, 'దిల్' రాజు, శిరీష్‌ల శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో స్వార్థానికి చిరునామాలా ఉండే పాత బస్తీ కుర్రాడి పాత్రలో కనిపిస్తారు హీరో ఆశిష్. ఇవానా హీరోయిన్. ఈ చిత్రంలోని తొలి పాట 'దిల్ ఖుష్..'ను మే 1న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఆశిష్ కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది చిత్రబృందం, ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె మేయర్, కెమెరా: మణికందన్, సహనిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, అశోక్ బండ్రెడ్డి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



EXPERIENCE THE
POWER OF
SR'S SUCCESS IN JEE-MAIN 2023
ALL INDIA RANK 7
B.SAMEETH
App No: 230310369648 (R)
ALL INDIA RANK 20
G.SAATVIK
App No: 230310130537 (R)
ALL INDIA RANK 22
C.AKHILA
App No: 230310445942 (R)
ALL INDIA RANK 34
K.SHREE VARSHITH
App No: 230310487026 (R)
ALL INDIA RANK 44
K.KARTHIK
App No: 230310673139 (R)
ALL INDIA RANK 48
D.SAI DHEERAJ
App No: 230310738964 (R)
ALL INDIA RANK 92
B.CHARAN
App No: 230310264879 (R)
109 B.NITHISH
118 SHAIK ABDUL SAMEER
167 P.TEJAVATH
167 P.HORTHIK
203 C.SONIKA
215 Md.MOINUDDIN
232 I.NAVEEN KUMAR
322 P.SREEKARI
324 A.MANIDEEP REDDY
343 K.SHIVA TEJA
348 K.KRISHNA KAUSTUBH
357 P.NARMADA
372 B.SAHARSH
403 V.DEEKSHITH REDDY
419 K.RANJITH REDDY
458 K.RISHIKA
481 S.DATTU
497 K.SRAVAN KUMAR
522 A.AJAY
528 V.SAKETH SHARMA
557 P.HURBANU KHANAM
563 P.RUTHVIK
575 P.HARSHITHA
634 B.SONUSREE
651 L.VISHAL
679 G.ADITHYA
728 V.SAI VIVEK
747 D.MONIYA BEGAM
770 R.RAJESWARI
780 SUNIL KUMAR
784 N.VARUN SRI TEJA
813 K.MAHESH
814 P.NIKHILA
818 M.NITHIN
848 M.NARASIMHA SWAMI
885 B.ANJAN KUMAR
924 SHAIK KODURU ASIF
926 C.MANISHARAN
951 K.ROOP SINGH
980 G.SRISHANTH
MRUGAN
LONG TERM (JEE-MAIN/ADVANCED) | ADMISSIONS ARE IN PROGRESS 2023-24
2786 STUDENTS SELECTED FOR - JEE-Advanced 2023
ADILABAD: 9154854690 | ANANTHAPURM: 9154854691 | BHIMAVARAM: 9642223762, 7331122579 | GUNTUR: 9154854694 | HYDERABAD: 8886322296, 9121307474 | KARIMNAGAR: 9642117367 | KHAMMAM: 9121155002 | KOTHAGUDEM: 9154854692 | KURNOOL: 9154854695 | NALGONDA: 9573927070 NELLORE: 9154854696 | NIRMAL: 9642117835 | NIZAMABAD: 9642117110 | ONGOLE: 8712609156 | RAJAHMUNDRY: 9154854693 | SRIKAKULAM: 9154854697 | TIRUPATI: 9154854699 | VIJAYAWADA: 8142111302 | VIZAG: 9052222274, 9154854707 | WARANGAL: 9642117378 | HOSAPETE: 9154854713.
SR Educational Academy
TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA

ఆదివారం 30-4-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12+12+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00
సంపుటి: 16
సంచిక: 38

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+12+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 16 సంచిక: 38

ఆదివారం 30-4-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

అసాధారణ శిక్షణతో IIT, NITలకు గేట్‌వేగా మారాం

తెలంగాణ నుండి లోకాన్ని ఏలే ప్రతిభావంతుల్ని దేశానికి అందిస్తున్నాం

రేపటి JEE-ADVANCED లోనూ టాప్ ర్యాంకర్లం మేమే !

ఇది మాకు శ్రీచైతన్య అందించిన ఆత్మ విశ్వాసం

ఆలిండియా ఆల్ కేటగిరీలో టాప్ 10లోపు ర్యాంకులు

- 1 RANK — S VENKAT KOUNDINYA — APPL.No. 230310124339 (GEN)
- 1 RANK — D. PRATAP SINGH — APPL.No. 230310167803 (DLP) (SC)
- 2 RANK — K SAINADH SRIMANTH — APPL.No. 230310286801 (EWS)
- 2 RANK — UDTYAVATH SAI LIKHITH — APPL.No. 230310187628 (ST)
- 3 RANK — K. CHANDRASHEN NAYAK — APPL. No. 230310421122 (ST)
- 4 RANK — MALPANI TUSHAR — APPL.No. 230310246220 (EWS)
- 5 RANK — D P NADHA REDDY — APPL.No. 230310072859 (EWS)
- 5 RANK — R G ANGEL BAI — APPL.No. 230310545823 (ST)
- 6 RANK — MAYANK SONI — APPL.No. 230310210909 (DLP) (OBC)
- 6 RANK — GOWDU CHARISHMA — APPL.No. 230310437865 (ST)
- 8 RANK — PONGURU BHANU — APPL. No. 230310295181 (PH CAT)
- 9 RANK — B. R. KUMAR REDDY — APPL. No. 230310385988 (EWS PH)
- 10 RANK — M AVINASH KUMAR — APPL.No. 230310560186 (OBC)



జేఈఈ-మెయిన్ 2023 ఆలిండియా టాపర్స్‌తో శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ

ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాప్ 1000లోపు ర్యాంకులు

RANK	NAME	APPL.No.
106	DOLA SURYA SAI	230310249300
116	VAASU KANSAL	230310349582
117	D PARDHA SARADHI	230310568383
120	SHAIK ASIM SHAREEF	230310466013
121	REUBEN LAWRENCE	230310434265
122	SANAPALA ANIRUDH	230310503625
135	MEDA SADVIK	230310120504
145	MARALA SAI PRAGNAAN	230310280488
151	VAKA SRI VARSHITHA	230310345202
159	S SAKETH MOGILLAPALLI	230310123250
176	ARINJAY GANGULY	230310195296
181	SEEMALA VARSHA	230310375353
184	R HARSHA VARDHAN	230310594344
191	D V V ABHINAV TEJA	230310236479
192	Y LAVANYA VANI	230310618722
193	S AVANEESH SAI	230310557512
196	PRATYAKSH JAIN	230310169243
214	GINJALA SRIVARDHAN	230310114144
215	DASARI SAKETH NAIDU	230310320238
216	BASWA DHANUSH SAI	230310145297
233	M B SUSHANTH	230310530682
236	PARTH AGRAWAL	230310015980 (DLP)
244	Y R MANOJ KUMAR REDDY	230310548456
248	KAKANI SINDHURA	230310330266
265	NADIPALLI SIDDARDHA	230310276861
281	NAMAN GOYAL	230310138245 (DLP)
282	GUNVEEN GILL	230310089074
288	DEVYANSH GUPTA	230310023795 (DLP)
290	KUNCHAKURTHY VIVEK	230310425128
304	Y V S RAGHU VARDHAN	230310340878
305	T NIKHILESH REDDY	230310419109
310	T SUBHASH RAM	230310358653
314	GAMPA RESHWIK	230310329753
319	V SHANVITHA REDDY	230310118015
320	N P BRANHAM REDDY	230310111635
322	P NAGA SAI PRAJITH	230310318320
323	VYSYARAJU SRIKAR NIHAL	230310285110
360	EDUBILLI KARTHIK	230310656012
374	KANITHI SRI KARTHIK	230310436477
376	SAKSHAM VERMA	230310472031
379	SHRAVYA KARNA	230310215011 (PPL.No.)
387	ATHARVA MOGHE	230310138778
398	S JAMEEL UR RAHAMAN	230310476913
401	V KRISHNA SAMEER	230310353383
413	SARODE PRANEETH	230310421250
414	G SREE RAM CHARAN	230310599423
423	KOKKILIGADDA MANASWI	230310117680
435	K AKSHAY REDDY	230310666935
440	PRAKHAR AGRAWAL	230310372870 (DLP)
448	V DSATHVIK REDDY	230310596166
450	M MAHEDAR REDDY	230310244936
451	SUNKI NAGARJUN REDDY	230310663006
452	BILLURI SRINIVASU	230310381816
457	B ANIRUDH SRIVATSA	230310313120
474	S MANISH KUMAR	230310480668
480	GOTTIPARTHI ABHIRAM	230310350712
489	ADITI SINGH	230310319658 (DLP)
491	CH V SAI KOUSHIK	230310220298
500	Y H NIHAR CHOWDARY	230310248271
503	GANGULA HARI CHARANI	230310453007
511	P DHRUV SHIVKANT	230310101751
514	V AJAY KUMAR REDDY	230310146201
523	S S SRI RAM VARUN	230310111906
531	DONDETI SAMHITHA	230310127416
533	GUDURU ADARSH	230310209252
535	A S HANUMA SAKETH	230310108409
542	ETTE HASINI	230310477145
543	POPURI ANIRUDH	230310182635
544	JAYESH NARAYANAN	230310136185
546	P LEKHA YAGNIK	230310544573
549	HARSH TAYA	230310364182
552	U SAI LIKHITH	230310187628
553	C RAKESH KUMAR REDDY	230310628108
561	D KISH AN TEJA	230310352932
568	S R T SAI ESWAR REDDY	230310190674
580	VARALA CHARISHMA	230310405592
589	RONGALI MOHIT NAIDU	230310467863
592	K CHANDRASHEN NAYAK	230310421122
602	GUNTI MURALI KRISHNA	230310597982
614	SANIT JETHWANI	230310200688
626	SRIVATHSA THOTAKURA	230310538853
639	M P KUMAR REDDY	230310416388
674	K SNIGDHA REDDY	230310118751
681	S S KUMAR REDDY	230310352201
697	V RAKESH	230310276989
709	R K KARTHIK NAIDU	230310342028
729	B SANJANA	230310401138
735	N V SANTHOSH	230310623180
742	BHAVESH S	230310312668
749	M HARIHARA VARMA	230310463969
750	A V SUBRAHMANYA MANOJ	230310200089
772	SODUM LEKHANA	230310190036
787	K P SRI KRISHNADITYA	230310620530
788	B N SAI PAVAN KUMAR	230310337460
797	C Y SREE NARAYANA	230310409092
800	N AASISH VARMA	230310178392
804	M SAI MANJUNATH	230310393472
817	S RAGHAV VANGALA	230310125793
818	R GRACE ANGEL BAI	230310545823
828	KOTHA SAI VEEKSHITH	230310430803
856	AKSHAY BOBBALA	230310273949
858	PRANAY REDDY RAGI	230310372871
859	GONA SANJANA	230310373064
868	G V SAI PRANEETH	230310595545
869	B V S SHARMIL KUMAR	230310620245
883	CHALLA KETHAN	230310448360
902	KARTHIK KASHYAP K	230310538607
903	B V VARDHAN VARMA	230310212069
904	ABHINAV KANNEGANTI	230310103450
908	P JAGANNADHAM NAIDU	230310452627
909	S REDDY BHAVANAM	230310127328
910	NAMA SRI SHASHANK	230310145867
924	E SAI VISHESH SHARMA	230310215993
926	P LOKESWARA REDDY	230310360709
927	G MAHENDRA REDDY	230310622109
932	E MIHIR DIVYANSH	230310170913
935	SATYALA MADHU KIRAN	230310562639
984	DESHPANDE SAI PARTHIV	230310329691
993	DIVI POTHUKUCHI	230310175682

Congratulations Students! You Make us proud

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback

Knowledge Hub
NEET | IIT JEE | FOUNDATION

NEET LONG TERM-2024

అడ్మిషన్ల కొరకు సంప్రదించండి: 040 660 60606

KNOWLEDGE HUB COACHING CENTERS

TELANGANA: Kukatpally: 9177444352, 9177867087
Dilsukhnagar: 9177444326, 9515111048 | Ameerpet: 9177444350, 9177867084
Himayatnagar: 9177444341, 9177867084 | Kondapur: 9515111428, 9177867453
ANDHRA PEADESH: Vizag: 9177444307, 9515111047


శ్రీచైతన్య విద్యాసంస్థలు

JEE-Main & JEE-Advanced 2024 LONG-TERM
అడ్మిషన్ల కొరకు సంప్రదించండి

VIJAYAWADA
RAMAN BHAVAN -2: 96526 99222, 97040 65666
RAMAN BHAVAN-1 (SANTHA): 97019 11666

HYDERABAD
MADHAPUR - 91777 36808, 91000 54074
DD COLONY - 91775 51685

VISHAKAPATNAM
HOSTEL- 89788 37897
DAY SCHOLAR - 91772 06961


'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+12+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 16 సంచిక: 38

ఆదివారం 30-4-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special



పేరు 'చికిత్స'... ఫలితం 'రోగం'

హైదరాబాద్‌లో వెయిట్ లాస్ క్లినిక్‌ల నిర్వాకంతో ఎంతోమంది నష్టపోతున్నారు. చాలామంది డబ్బుతో పాటు అనారోగ్యాల పాలవుతున్నారు.

- 8లో



ఒక్కలిగల కంచుకోటలో పాగా ఎవరిదో...!

కర్ణాటకలోని పాత మైసూరులో ఒక్కలిగ సామాజికవర్గం ప్రభావం అధికం. వారిని ప్రసన్నం చేసుకోగలిగే పార్టీనే విజయం వరిస్తుంది.

- 3లో



శతఘ్ని దళంలోకీ మహిళలు

భారత సైన్యం మరో చారిత్రక నిర్ణయం తీసుకుంది. మొదటిసారిగా ఆర్టిలరీ రెజిమెంట్‌లోకి మహిళా అధికారులను ఎంపిక చేసింది.


- వివరాలు 3లో



అన్సారీ సోదరులకు జైలు శిక్ష

ఉత్తరప్రదేశ్‌లోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ, ఆయన సోదరుడు అఫ్జల్ అన్సారీలకు జైలు శిక్ష విధించింది.


- వివరాలు 3లో



స్టడీ టూర్‌కు చిరునామాగా...

ప్రభుత్వం సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల్లో నిర్మించిన జలవనరుల ప్రాజెక్టులు ఇతర రాష్ట్రాల వారికి స్టడీ టూర్‌గా నిలుస్తున్నాయి.

- వివరాలు 2లో



పైన మెరుగు.. లోన మురుగు..

హైదరాబాద్ నగరం పైన మెరుగు... లోపల మురుగు మాదిరి తయారైందని బీజేపీ నేత డాక్టర్ కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు.

- వివరాలు 2లో

తెల్లారె... పొంగిపొర్లె

భాగ్యనగరాన్ని ముంచెత్తిన వాన.. అరగంటలోనే అతలాకుతలం



- వీధుల్లో పోటెత్తిన వరద.. ఇళ్లలోకి చేరిన నీరు
- కొట్టుకుపోయిన కార్లు, బైకులు
- విరిగి పడిన చెట్లు.. తెగిపడిన విద్యుత్ తీగలు
- ఈ నెలలో సగటున 5 సెం.మీ వర్షపాతం
- హైదరాబాద్‌లో నాలుగురోజుల పాటు విస్తారంగా వర్షాలు
- ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: వేకువజామున ఒక్కసారిగా కుండపోతగా కురిసిన వర్షం మహా నగరాన్ని అతలాకుతలం చేసింది. అరగంటపాటు ఏకధాటిగా భారీ వర్షం రాజధానిని ముంచెత్తింది. ప్రధాన రహదారులు గోదావరిని తలపించగా.. నాలాలు వాగులై ఉప్పొంగి ప్రవహించాయి. వీధుల్లో వరద సునామీలా విరుచుకుపడింది. వరద ఉధృతికి కొన్ని ప్రాంతాల్లో కార్లు, బైకులు కొట్టుకుపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై.. ఇళ్లలోకి నీరు చేరింది. చెట్లు విరిగిపడ్డాయి. కరెంట్ వైర్లు తెగిపడ్డాయి. భారీగా కురిసిన వాన జనాన్ని అవస్థల పాలుచేసింది. తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ఉరుములు మెరుపులు ఈదురుగాలులు ప్రారంభం కాగా, 6 గంటల నుంచి అరగంటపాటు కుండపోతగా వర్షం కురిసింది. ఆ తర్వాత తగ్గుముఖం పట్టి రెండు గంటలపాటు తేలికపాటిగా కురిసిన వర్షంతో హైదరాబాద్ నగరం తడిసి ముద్దయింది.

రికార్డు స్థాయిలో...

- హైదరాబాద్‌లోని హయత్‌నగర్ విఠల్‌వాడిలో అత్యధికంగా 7.8 సెం.మీ. శేరిలింగంపల్లి ఖాజాగూడలో 7.3 సెం.మీ., మల్కాజిగిరి ప్రశాంత్‌నగర్‌లో 6.8 సెం.మీ., ముషీరాబాద్ చిలకలగూడలో 6.5, అంబర్‌పేట బతుకమ్మ కుంట, షేక్‌పేట 6.3, ఎల్బీస్టేడియం, కూకట్‌పల్లిలో 6.2 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 5 సెం.మీ. వరకు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.
- నల్లకుంట పద్మకాలనీ వీధుల్లో వరద ప్రవాహం కాలనీవాసులను భయాందోళనలకు గురిచేసింది. అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి నీళ్లు వచ్చాయి. వర్షం తగ్గిన తర్వాత ఇళ్లల్లోకి భారీగా మురుగు వచ్చి చేరింది. నాలా పనులు జరుగుతుండటంతో.. రోడ్ల పక్కన ఉన్న కరెంట్ స్తంభాలు కూలిపోయాయి. వరద ప్రవాహానికి బైకులు, కార్లు నాలాలోకి కొట్టుకొచ్చాయి. గంటపాటు ఏం జరుగుతుందో అర్థం కాక.. ఇల్లు

మిగతా 2వ పేజీలో ▶


మృతిచెందిన మౌనిక (ఫైల్)


మృతదేహం వద్ద కుటుంబ సభ్యుల రోదన

పాల ప్యాకెట్ కోసం వెళ్లి.. నాలాలో పడి..

సికింద్రాబాద్‌లో నాలాలో కొట్టుకుపోయిన చిన్నారి మృతి

- అన్నను కాపాడి తనువు చాలించిన మౌనిక
- బాలిక కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం, రూ. 2 లక్షలు ప్రకటించిన జీహెచ్ఎంసీ
- తవ్వి వదిలేసిన రోడ్డు ఫలితమే అంటున్న స్థానికులు

రాంగోపాల్‌పేట్: పాలప్యాకెట్ కొనేందుకు సోదరుడితో కలిసి దుకాణానికి వెళ్లిన ఓ చిన్నారి ప్రమాదవశాత్తు నాలాలో పడి మరణించింది. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కళాసీగూడ ధన్‌బజార్‌కు చెందిన శ్రీనివాసులు, రేణుక దంపతులకు కార్తీక్ (15), మౌనిక (11) సంతానం. శ్రీనివాసులు గోల్డ్ స్మిత్ వద్ద పనిచేస్తూ జీవనం సాగిస్తుంటారు. భార్య ఇంటి వద్దే చిన్న దుకాణం నడిపిస్తుంది. కుమారుడు కార్తీక్ మానసిక వికలాంగుడు. శనివారం ఉదయం తనకు ఆకలిగా ఉందని కార్తీక్ చెప్పడంతో బయటకు వెళ్లి పాల ప్యాకెట్ తీసుకురమ్మని తల్లి మౌనికకు చెప్పింది. తాను కూడా వెళ్తానని కార్తీక్ చెప్పడంతో తల్లి ఇద్దరినీ పంపింది. ఉదయం 6 గంటల నుంచే సికింద్రాబాద్‌లో భారీ వర్షం కురుస్తోంది. అప్పటికే కళాసీగూడ ప్రభుత్వ పాఠశాల వద్ద పెద్దఎత్తున వర్షం నీరు చేరింది. 6.30 ప్రాంతంలో ఇద్దరూ స్కూలు వద్దకు చేరుకుని రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్నారు. అయితే సీసీ రోడ్డు కోసం గుంత తవ్వి ఉంచడంతో

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

రెండ్రోజులపాటు ఓ మోస్తరు వర్షాలు



ఉత్తర కర్ణాటక నుంచి తెలంగాణ మీదుగా దక్షిణ ఛత్తీస్‌గఢ్ వరకు సగటు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వివరించింది.

- వివరాలు 2లో

సాగునీటి రంగం నిర్వీర్యం



రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. గత తొమ్మిదిన్నరేళ్లలో కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులకు డిస్ట్రిబ్యూటరీ కాలువలు కూడా ప్రభుత్వం తవ్వించలేదన్నారు.

- వివరాలు 8లో

నవీన్ మిట్టల్ టార్గెట్ చేస్తున్నారు



ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ చెప్పిన వారిని రిజిస్ట్రార్ చేయలేదనే కోపంతోనే తనను టార్గెట్ చేస్తున్నారని తెలంగాణ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆరోపించారు.

- వివరాలు 8లో

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ!



నేడు కానిస్టేబుల్ పోస్టులకు తుది రాత పరీక్ష

- పరీక్ష నిర్వహణకు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అన్ని ఏర్పాట్లు
- హాల్‌టికెట్‌పై అభ్యర్థుల ఫొటో అతికించడం తప్పనిసరి..
- ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు వెంటతెచ్చుకోవాలని అధికారుల సూచన

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా వివిధ విభాగాల్లోని కానిస్టేబుల్, తత్సమాన పోస్టులకు ఆదివారం తుది రాత పరీక్ష నిర్వహించనున్నారు. సివిల్ పోలీస్, టీఎస్ఎస్పీ, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఎస్పీఎఫ్, ఫైర్, జైళ్ల శాఖ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్ శాఖల్లో కానిస్టేబుల్ పోస్టులకు ఆదివారం ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కానుంది. కమ్యూనికేషన్ కానిస్టేబుల్ పోస్టులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి పరీక్ష ప్రారంభం కానుంది. పరీక్షకు ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు ఇప్పటికే వెల్లడించారు. పరీక్ష నిర్వహణకు ఉమ్మడి పది జిల్లా కేంద్రాలతోపాటు హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో పోలీస్ నియామక మండలి అన్ని ఏర్పాట్లు చేసింది. అన్ని విభాగాల్లో కలిపి మొత్తం 16,908 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అన్ని పోస్టులకు కలిపి 3,40,000 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. రాత పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పోలీస్ నియామక మండలి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానంలో హాజరు తీసుకోనున్నారు. రాత పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష జరగనున్న జిల్లా కేంద్రాల్లో ఆయా జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించనున్నారు.

హాల్‌టికెట్లపై ఫొటో అతికించాలి..

కానిస్టేబుల్ తుది రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తాము ఏ4 సైజు పేపర్‌పై డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై విధిగా పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించి తేవాలని అధికారులు సూచించారు. హాల్‌టికెట్‌పై ఫొటో లేకపోతే పరీక్షకు అనుమతించరని తెలిపారు. అదేవిధంగా ఆధార్ కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఓటర్ కార్డు లాంటి గుర్తింపు కార్డులను తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థులు చేతులపై మెహందీ, టాటూలు లేకుండా చూసుకోవాలని చెప్పారు.

ఇప్పుడు కాకపోతే.. ఇంకెప్పుడు?

బదిలీలు, పదోన్నతులపై టీచర్లలో ఆందోళన

- ఎనిమిదేళ్లుగా దక్కని ప్రమోషన్లు... ఐదేళ్లుగా బదిలీల ఊసే లేదు
- కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు..
- ఇప్పట్లో బదిలీలు ఎండమావేనా?
- సంఘాలపై ఒత్తిడి చేస్తున్న ఉపాధ్యాయులు



సాక్షి, హైదరాబాద్: బదిలీలు, పదోన్నతులపై ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర ఆందోళన ఉంది. కోర్టుకు వేసవి సెలవులు వస్తున్న నేపథ్యంలో న్యాయస్థానంలో ఉన్న బదిలీల కేసు గురించి విద్యాశాఖ ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. జూన్ 12 నుంచి బడులు తెరుస్తారు. అప్పుడు బదిలీలు, పదోన్నతులు చేపట్టడం కష్టసాధ్యం. ఆ తర్వాత కొన్ని నెలలకు అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి. అందువల్ల ఇప్పుడు కాకుంటే కనుచూపు మేరలో బదిలీలు, పదోన్నతులు సాధించుకోవడం సాధ్యం కాదంటూ టీచర్లు తమ యూనియన్లపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో సంఘాలూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. బదిలీల వ్యవహారాన్ని పక్కనబెట్టి, కనీసం పదోన్నతులైనా కల్పిస్తే సమస్య చాలావరకూ పరిష్కారం అవుతుందని ప్రభుత్వానికి తెలిపేందుకు పలు యూనియన్లు సమాయత్తమవుతున్నాయి.

ఎనిమిదేళ్లుగా నిరీక్షణ

టీచర్లకు చివరిసారి 2015లో ప్రమోషన్లు కల్పించారు. అప్పుడు దాదాపు 6 వేల మందికి పదోన్నతులు దక్కాయి. అప్పట్నుంచీ ప్రమోషన్ల ఊసే లేదు. ప్రస్తుతం 7,300 మంది స్కూల్ అసిస్టెంట్లు, 2,080 ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు, 2,020 హైస్కూల్ హెచ్ఎంలు పదోన్నతికి అర్హులని తేల్చారు. విద్యాశాఖలో ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం ఎస్‌జీటీలతో, 30 శాతం ప్రత్యక్ష నియామకం ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. దాదాపు 11 వేల మంది ఉపాధ్యాయులు పదోన్నతులకు అర్హులవ్వడం, ఇప్పటికే వివిధ కేడర్లలో ఉన్న ఖాళీలను కచ్చితంగా తేల్చడానికి పదోన్నతులే కీలకం. ఫలితంగా 22 వేల టీచర్ పోస్టుల భర్తీకి అవకాశం ఉంటుంది. ఈ అడుగులు పడకపోవడం వల్ల ఉపాధ్యాయ అర్హత పరీక్ష పాసైన లక్షల మంది అభ్యర్థులు

మిగతా 2వ పేజీలో ▶

తప్పు విద్యాశాఖదే

కోర్టు వివాదం నెలకొన్న ప్రతీసారి విద్యాశాఖ వాస్తవ పరిస్థితిని కోర్టుకు వివరించడంలో విఫలమవుతోంది. జూన్ 13 వరకూ కోర్టు కేసు వాయిదా వేసినప్పుడు, పదోన్నతులు, బదిలీల ప్రాధాన్యతను కోర్టుకు వివరించి, ముందస్తుగా కేసు విచారణ పూర్తి చేయాలని కోరి ఉంటే బాగుండేది. బదిలీలు స్కూళ్లు తెరిచిన తర్వాతైనా చేయవచ్చు. కానీ పదోన్నతులు ఇప్పుడే చేయాలి. దీనివల్ల ఖాళీలపై స్పష్టత వస్తుంది. కొత్త నియామకాలు చేసే వీలుంటుంది. ఈ దిశగా అధికారులు, ప్రభుత్వం అడుగులు వేయడం లేదు. టీచర్ల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతాం.

– చావా రవి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

27 కంపెనీలు.. రూ. 7,218 కోట్ల పెట్టుబడులు

- ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారీ పెట్టుబడులు ఆకర్షించిన ప్రభుత్వం
- 58,458 మందికి ప్రత్యక్షంగా లభించనున్న ఉపాధి అవకాశాలు
- 'ద ఫుడ్ కాన్‌క్లేవ్-2023' తొలి ఎడిషన్‌కు తరలివచ్చిన దేశ, విదేశీ ప్రతినిధులు
- పామాయిల్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ల కోసం రూ. 3,458.95 కోట్ల పెట్టుబడులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించింది. 'ద ఫుడ్ కాన్‌క్లేవ్-2023'పేరిట తొలిసారి నిర్వహించిన కార్యక్రమంలో 27 కంపెనీలు ఆక్వా, డెయిరీ, ఆగ్రో ప్రాసెసింగ్, ఆయిల్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో రూ. 7,218 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఈ పెట్టుబడుల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో దాదాపు 58,458 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. శనివారం మాదాపూర్‌లోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో జరిగిన కాన్‌క్లేవ్‌కు పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావుతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ

మిగతా 2వ పేజీలో ▶

అమ్మో! ఆయిల్‌పామ్ సాగు..



- సర్కారు ఇచ్చిన సాగు లక్ష్యాన్ని చేరుకోలేక చతికిల
- మొత్తం లక్ష్యంలో ఆయిల్‌ఫెడ్ మాత్రమే ముందంజ
- పెట్టుబడికి జంకుతున్న ప్రైవేట్ కంపెనీలు
- లక్ష్యాన్ని కుదించినా.. అందుకోలేక పాట్లు

సాక్షి, హైదరాబాద్:

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ఈ పంట సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంత ప్రయత్నిస్తున్నా.. దీనికి సంబంధించి బాధ్యత తీసుకున్న వివిధ కంపెనీలు మాత్రం వెనకడుగు వేస్తున్నాయి. ఆయిల్‌పాం సాగు విస్తీర్ణాన్ని వచ్చే దశాబ్దంలోగా ఏకంగా 20 లక్షల ఎకరాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కొంతకాలం కిందట ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ పరిధిలోనే ఉన్న ఆయిల్‌పామ్ సాగును, కొత్తగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించారు. రాష్ట్రంలో 10 ప్రైవేట్ కంపెనీలకు వివిధ జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేసే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. 2022–23 వ్యవసాయ సీజన్‌లో 2 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని తొలుత నిర్ణయించింది. చివరకు ఆ లక్ష్యాన్ని 1.20 లక్షలకు కుదించింది. అయినా కొన్ని కంపెనీలు చతికిల పడుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆపసోపాలు పడుతున్నాయి.

పెట్టుబడికి జంకుతున్న కంపెనీలు..

నిర్దేశించిన జిల్లాల్లో నర్సరీల్లో ఆయిల్‌పామ్ మొక్కలను పెంచడం, వాటిని ఆరు నెలల తర్వాత రైతులకు అందివ్వడం, అనంతరం పండించిన పామాయిల్ గెలలను క్రషింగ్ నిమిత్తం కొనుగోలు చేయడం ఈ కంపెనీల బాధ్యత. కాగా, రాష్ట్రంలో ఆయిల్‌ఫెడ్‌కు పూర్తిస్థాయిలో యంత్రాంగం ఉంది. దశాబ్దాలుగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేయించడంలో, రైతులకు ఆసరాగా నిలబడటంలోనూ ఈ సంస్థ ముందుంది. అయితే కొత్తగా వచ్చిన కంపెనీల్లో చాలావరకు ఆయిల్‌పామ్ విషయంలో ఎలాంటి అనుభవం లేదని తెలుస్తోంది. పైగా కొందరు రాజకీయ నేతల అండదండలతో ఇవి ఆయిల్‌పామ్ రంగంలోకి వచ్చాయని సమాచారం. ఒక ఫ్యాక్టరీ పెట్టాలంటేనే రూ.60 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. విత్తనాలకు కోట్లు ఖర్చు చేయాలి. ప్రస్తుతం విత్తనాలకే పన్నులన్నీ కలిపి దాదాపు రూ.70 కోట్ల మేరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. పైగా నాలుగేళ్ల తర్వాతే లాభాలు వచ్చే పరిస్థితి ఉంటుంది. అప్పటివరకు మొత్తం ఖర్చుతో

మిగతా 2వ పేజీలో ▶

తుదిశ్వాస వరకు జైల్లోనే...

అత్యాచారం, హత్య కేసులో దోషుల ఉరిశిక్షను యావజ్జీవంగా మార్చిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సమత (పోలీసులు పెట్టిన పేరు)పై అత్యాచారం, హత్య కేసులో ముగ్గురు దోషులకు ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు విధించిన ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మారుస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. వారికి క్షమాభిక్ష ప్రసాదించరాదని, ఊపిరి ఉన్నంత వరకు జైల్లోనే ఉంచాలని స్పష్టం చేసింది. ఆదిలాబాద్ జిల్లా లింగాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో 2019 నవంబర్ 24న సమతపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన షేక్ బాబు, షేక్ షాబుద్దీన్, షేక్ మఖ్దూం ఆ తర్వాత అత్యంత దారుణంగా ఆమెను హత్య చేశారు. దోషులకు ఉరిశిక్ష విధిస్తూ 2020లో

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఆటోడ్రైవర్ కుటుంబానికి రూ.కోటి ఇవ్వాలి



చిరంజీవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హస్తినాపురం: పోలీసులు విచారణ పేరుతో చిత్రహింసలకు గురిచేయడం వల్లే ఆటో డ్రైవర్ చిరంజీవి మృతి చెందాడని.. మృతుని కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్ గుప్తానగర్ కాలనీకి చెందిన చిరంజీవి (32) కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుని భార్యకు ప్రభుత్వోద్యోగ, పిల్లలకు మంచి విద్య ఇచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ప్రవీణ్ హామీ ఇచ్చారు.

త్వరలోనే దళారులపై దళిత పోరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ఇస్తోంది దళితులకా? లేదా దళారులకా? అని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం ప్రశ్నించారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ దళితబంధు మంజూరుకు లంచాలు తీసుకుంటున్న వారిపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని, త్వరలోనే దళారులపై దళితపోరు అనే కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు. దళితబంధు పథకంలో ఏ ఎమ్మెల్యే ఎంత లంచం తీసుకున్నారో సీఎం కేసీఆర్ వెల్లడించాలని డిమాండ్ చేశారు.

సీపీఎస్ రద్దుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు రవి



మాట్లాడుతున్న మల్లు రవి

పంజగుట్ట (హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీ 2018 ఎన్నికల మేనిఫెస్టోలోనే.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని తీసుకొస్తామని పొందుపరిచిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు రవి గుర్తు చేశారు. ఆ హామీని వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరుస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లు రవి మాట్లాడుతూ.. అప్పటి ప్రధాని వాజ్‌పేయి హయాంలో కేంద్ర ఉద్యోగులకు సీపీఎస్ విధానం తీసుకువచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే వర్తింపజేసే అధికారాలున్నాయని ప్రకటించడంతో.. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎస్ విధానం అమలు చేశారని గుర్తుచేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీపీఎస్ విధానం రద్దు చేసి.. పాత పింఛన్ విధానం అమలు చేస్తున్నట్లు వివరించారు. టీపీఆర్‌టీవో వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల కృష్ణ కుమార్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు నాగేశ్వర్‌రావులు మాట్లాడుతూ .. రాష్ట్రంలో లక్షా 72 వేల మంది ఉద్యోగులు సీపీఎస్ విధానంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.



కళాసిగూడ నాలాలో మౌనిక మృతదేహం



మౌనిక కిందపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి తలసాని

పాల ప్యాకెట్ కోసం వెళ్లి.. నాలాలో పడి..

మొదటి పేజీ తరువాయి

కార్తీక్ కింద పడిపోయాడు. అయితే మౌనిక అన్నను లేపి నిల్చోబెట్టే క్రమంలో నీళ్లతో నిండిన గుంతలో పడి నాలాలోకి కొట్టుకుపోయింది. వెంటనే చుట్టుపక్కల వాళ్లు వచ్చి ప్రయత్నించినా వరదనీటి ఉధృతికి క్షణాల్లో వెళ్లిపోయింది. ఆ తర్వాత సహాయక సిబ్బంది నాలాలో వెతుకుతుండగా అర కిలోమీటర్ దూరంలో పార్క్‌లేన్ వద్ద నాలాలో ఉన్న భారీ మ్యాన్ హోల్ వద్ద తట్టుకుని ఆగిపోయింది. సహాయక బృందాలు బాలికను బయటకు తీయగా అప్పటికే మరణించింది. అచేతనంగా పడివున్న తమ కుమార్తెను చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వద్దని వారిస్తున్నా: షేక్ సలీం, ప్రత్యక్ష సాక్షి

స్క్రాప్ దుకాణంలో పనిచేస్తున్న నేను ప్రతిరోజూ ఇక్కడే పడుకుంటాను. నాతోపాటు పాలు విక్రయించే వాళ్లంతా దూరంగా నిల్చుని చూస్తున్నాం. ఆ పిల్లలను గమనించి ఇటువైపు రావద్దని, నీళ్లు ఎక్కువగా ఉన్నాయని అరుస్తూనే ఉన్నాం. కానీ మేము చెబుతున్న మాటలను గమనించకుండా వాళ్లు వచ్చారు. మానసిక వికలాంగుడైన సోదరుడు కిందపడిపోతే మౌనిక లేపి నిల్చోబెట్టింది. అంతలోనే ఆమె అక్కడున్న రంధ్రంలో పడి కొట్టుకుని పోయింది. మేము వెంటనే వెళ్లి రంధ్రం నుంచి తీసేందుకు వెతికినా కనిపించలేదు.

విషాదఛాయలు

మౌనిక ఆర్పీరోడ్‌లోని గుండా ఈశ్వరయ్య ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి పరీక్షలు రాసింది. కుమారుడు మానసిక వికలాంగుడు కావడంతో మౌనికనే తమకు సర్వస్వం అనుకుని బతుకుతున్న ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. చిన్నారి మృతితో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం పోలీసులు చిన్నారి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహంకాళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే బలితీసుకుందా?

జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల నిర్లక్ష్యమే చిన్నారిని బలితీసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. 15 రోజుల క్రితం ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులు మొదలుపెట్టారు. పాత రోడ్డును తవ్వారు. తర్వాత తాపీగా జలమండలి అధికారులు డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని చెప్పడంతో ఆ పనులను అక్కడే వదిలేశారు. కళాసీగూడ స్కూలు వద్ద నాలా రోడ్డును దాటుతూ వెళ్తుంది. ఇక్కడ నాలాపై శ్లాబు ఉంది. రోడ్డును తవ్వడంతో నాలా శ్లాబు పక్కనే నాలాలోకి రంధ్రం ఏర్పడింది. జీహెచ్ఎంసీ అధికారులు దీన్ని పట్టించుకోలేదు. అది లోతట్టు ప్రాంతం కావడం, అక్కడ ఉండే మ్యాన్‌హోల్‌లో చెత్త అడ్డుపడటంతో శనివారం కురిసిన భారీ వర్షానికి పెద్దఎత్తున వరద నీరు అక్కడికి వచ్చి చేరింది. పెద్దఎత్తున వరదనీరు నాలాలోకి ప్రవహిస్తుండటంతో ఆ రంధ్రం మరింత పెద్దదైంది. వర్షం నీరు అక్కడ నిలిచి ఉండటంతో ఆ రంధ్రం కనిపించక బాలిక అందులో పడి నాలాలో కొట్టుకునిపోయింది. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేసి ఉంటే ఈ బాలిక మరణించేది కాదని స్థానికులు అంటున్నారు.

బాలిక కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా: మంత్రి తలసాని

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. బాలిక నాలాలో కొట్టుకుని పోయి మరణించడం బాధాకరమన్నారు. అనంతరం బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాలిక కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం చెల్లిస్తామని, వారిని అన్నివిధాలా ఆదుకుంటామని చెప్పారు. ఘటనపై విచారణ జరిపి అధికారుల నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మౌనిక కుటుంబానికి జీహెచ్ఎంసీ తరపున రూ.2 లక్షల నష్టపరిహారం అందిస్తామని మేయర్ గద్వాల విజయలక్ష్మి చెప్పారు. కాగా, కాంట్రాక్టర్లకు బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో నాలాల నిర్వహణ సరిగా లేక ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు.

రాష్ట్రంలో రెండ్రోజులపాటు ఓ మోస్తరు వర్షాలు

మరింత తగ్గనున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తర కర్ణాటక నుంచి తెలంగాణ మీదుగా దక్షిణ ఛత్తీస్‌గఢ్ వరకు సగటు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. సముద్ర మట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వివరించింది. మూడు రోజులుగా రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. రానున్న రెండ్రోజులూ ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదు అవుతాయని హెచ్చరించింది. శనివారం రాష్ట్రంలో... గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 36.3 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత దుండిగల్‌లో 19.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	36.3	22.4
రామగుండం	35.2	23.2
నల్లగొండ	35.0	23.0
నిజామాబాద్	34.7	21.9
ఖమ్మం	34.0	27.2
మెదక్	33.2	20.8
మహబూబ్‌నగర్	32.5	22.1
భద్రాచలం	32.0	28.0
హైదరాబాద్	31.9	21.0
దుండిగల్	31.5	19.6
హనుమకొండ	30.5	24.5

హైదరాబాద్ పైన మెరుగు.. లోన మురుగు..

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



సాక్షి , హైదరాబాద్: హైదరాబాద్ నగరం పైన మెరుగు లోపల మురుగు మాదిరి తయారైందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ అత్యున్నత నిర్ణయాక కమిటీ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. నగరంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనం అల్లాడుతున్నారని శనివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి పైపులైన్లలో మురుగు చేరి ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారని తెలిపారు. చిన్నవానకే నగర రహదారుల్లో ట్రాఫిక్ జామ్ అవుతోందని, రహదారులు వాగుల్లా కనిపిస్తుంటే.. బయటకు వెళ్లిన వారు తిరిగి వస్తారో రారోనన్న ఆందోళనలో జనం ఉంటున్నారని లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ కళాసిగూడలో శనివారం చిన్నారి మౌనిక(6) మ్యాన్‌హోల్‌లో పడి మరణించడం అత్యంత బాధాకరమన్నారు. బీఆర్ఎస్ అసమర్థ పాలన కారణంగా గతంలో నాలాల్లో పడి చాలామంది చనిపోయారని తెలిపారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మారుస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటిస్తున్నారు కానీ.. ఎక్కడ చూసినా రోడ్లపై మురుగునీరు, మూతల్లేని మ్యాన్‌హోల్స్ దర్శనమిస్తున్నాయని లక్ష్మణ్ ఆరోపించారు. రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. 350 బస్తీలుంటే.. ఇప్పటివరకు ఎన్నిబస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారు? ఎంత మంది డాక్టర్లు అక్కడ పనిచేస్తున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీకి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు, ఆరోగ్యశ్రీకి డబ్బులు లేవు కానీ.. వందల కోట్లను వృథా చేసి సచివాలయం ఎందుకు నిర్మించారని లక్ష్మణ్ ప్రశ్నించారు.

డబులింజన్ ప్రభుత్వం ఉండాలి: డీకే అరుణ

రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉండాలని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అభిప్రాయపడ్డారు. వేర్వేరు ప్రభుత్వాలుంటే, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వాన్ని ఉద్దేశించి చురకలు అంటించారు. కర్ణాటకలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారనడం కేవలం మీడియా సృష్టేనని ఆమె కొట్టిపారేశారు. ఢిల్లీలో, గల్లీలో లేని కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఎందుకు ఓటు వేస్తారని అరుణ ప్రశ్నించారు. కర్ణాటకలో మరోసారి బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మార్కెట్‌లో వాననీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కుప్పలపైకి చేరుస్తున్న రైతు

భారీ వర్షం.. తడిసిన ధాన్యం

భువనగిరి/తిరుమలగిరి: సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో శనివారం ఉదయం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మార్కెట్‌లో ధాన్యం రాశులు వర్షానికి కొట్టుకుపోయాయి. రైతులు వర్షంలోనే తమ ధాన్యాన్ని సంరక్షించుకునే ప్రయత్నం చేశారు. భువనగిరి జిల్లాలో పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు చేరింది. కొన్నిచోట్ల ధాన్యం మొలకెత్తింది. భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రహీంఖాన్ గూడెంలో బునాదిగాని కాల్వ కట్ట తెగడంతో నీరంతా చుట్టుపక్కల పొలాలను ముంచెత్తింది.

తెల్లారె... పొంగిపొర్లె

మొదటి పేజీ తరువాయి

కూలిపోతాయా అన్న భయంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తల్లడిల్లిపోయారు.

- బండ్లగూడ జాగీర్ పరిధిలోని హైదర్ షాకోట్‌లో వర్షానికి పార్కు నీటిమయంగా మారింది. రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి.
- భారీ వర్షానికి లక్డీకాపూల్ మెట్రో స్టేషన్ కింద వర్షపు నీరు నిలిచిపోయింది. ఉప్పల్, రామంతాపూర్, అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసింది. బషీర్‌బాగ్, అబిడ్స్, నారాయణగూడ, ముషీరాబాద్ తదితర ప్రాంతాల్లో వాన బీభత్సం సృష్టించింది. చెట్లు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లో వాననీరు చేరడంతో నదులను తలపిస్తున్నాయి.



హైదరాబాద్‌లో మరో నాలుగు రోజులు

హైదరాబాద్‌లో రానున్న నాలుగు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదివారం వడగళ్లతో కూడిన భారీ వర్షాలు పడతాయని తెలిపింది. దీంతో హైదరాబాద్‌లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మొత్తం మీద ఏప్రిల్‌లో సాధారణ వర్షపాతం 15.5 మి.మీ. ఉండగా 50.8 మిల్లీమీటర్లు నమోదై రికార్డు సృష్టించింది.

తుదిశ్వాస వరకు జైల్లోనే...

మొదటి పేజీ తరువాయి

ఆదిలాబాద్ కోర్టు జడ్జి ఎంజీ ప్రియదర్శిని (ప్రస్తుత హైకోర్టు న్యాయమూర్తి) సంచలన తీర్పు వెలువరించారు. ఉరిశిక్ష ఖరారు నిమిత్తం కింది కోర్టు ఈ కేసును హైకోర్టుకు నివేదించింది. దోషులు కూడా ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేయగా సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. దోషులకు గతంలో ఎటువంటి నేరచరిత్ర లేకపోవడం, ఇది పథకం ప్రకారం చేసిన హత్య కాకపోవడంతో వారిలో పరివర్తనకు వీలుగా ఉరిశిక్షను యావజ్జీవంగా మారుస్తున్నట్లు తీర్పు సందర్భంగా ధర్మాసనం పేర్కొంది.

ఇప్పుడు కాకపోతే..ఇంకెప్పుడు?

మొదటి పేజీ తరువాయి

టీచర్ పోస్టులు దక్కించుకునే అవకాశం ఉండటం లేదు.

ఎండమావిలా బదిలీలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2018లో జరిగినవే చివరి ఉపాధ్యాయ బదిలీలు. అప్పట్నుంచీ టీచర్లు బదిలీల కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. 2021లో కొత్త జిల్లాలకు 317 జీవో అమలులో భాగంగా టీచర్లను బదిలీ చేశారు. ఈ ప్రక్రియ అనేక వివాదాలకు దారితీసింది. తమకు అన్యాయం జరిగిందని దంపతులుగా ఉన్న టీచర్లు ఇప్పటికీ ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో బదిలీలు, పదోన్నతులకు షెడ్యూల్ ఇచ్చారు. ఇదీ వివాదాస్పదమైంది. జీరో సర్వీస్ రూల్‌ను ఎత్తివేయడంతో 317 జీవోతో దూర ప్రాంతాలకు వెళ్లిన టీచర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం దూరమైంది. దీంతో వాళ్లు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశంతో వారికి అవకాశం ఇచ్చారు. ఈ సమయంలోనే స్పౌజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని నాన్-స్పౌజ్‌లు సవాల్ చేశారు. మరోవైపు భాషా పండితులు పదోన్నతులపై కోర్టును ఆశ్రయించారు. దీంతో బదిలీలు, పదోన్నతులపై కోర్టు స్టే ఇచ్చింది. కేసును జూన్ 13కు వాయిదా వేయడంతో బదిలీలు, పదోన్నతులపై తుది దశకు చేరుకున్న ప్రక్రియ అర్ధంతరంగా ఆగిపోయింది.

అమ్మో ఆయిల్‌పాం సాగు..

మొదటి పేజీ తరువాయి

కూడుకున్న వ్యవహారమే. కొన్ని కంపెనీలైతే కోటి రూపాయలు పెట్టడానికి కూడా ఒకటికి నాలుగుసార్లు ఆలోచిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. మొత్తానికి వెంటనే లాభాలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఈ కంపెనీలు పెట్టుబడికి జంకుతున్నాయని సమాచారం. మరోవైపు ఆయిల్‌పాం విత్తనాలకు అంతర్జాతీయంగా భారీ డిమాండ్ ఉంది. ముందస్తుగా బుక్ చేసుకుంటే తప్ప వచ్చే పరిస్థితి ఉండదు. ఈ పరిస్థితిలో ఆయా కంపెనీలు వెనకబడుతున్నాయి.

ఆయిల్‌ఫెడే మెరుగు..

2022–23లో మొత్తం 1.20 లక్షల ఎకరాల సాగు లక్ష్యం కాగా, అందులో ఇప్పటివరకు 82,219 ఎకరాల్లోనే ఆయిల్‌పాం సాగైంది. ఇందులో ఆయిల్‌ఫెడ్ లక్ష్యం 53,147 ఎకరాలు కాగా, ఆ సంస్థ 44,081 ఎకరాల్లో రైతులద్వారా సాగు చేయించింది. మొత్తం లక్ష్యంలో ఆయిల్‌ఫెడ్ ద్వారానే 54 శాతం సాగు జరిగింది. ఆ తర్వాత ప్రీ యూనిక్ సంస్థ లక్ష్యం 28,420 ఎకరాలు కాగా, ఆ సంస్థ 16,476 ఎకరాల్లో సాగు చేయించింది. అంటే మొత్తం లక్ష్యంలో 20 శాతం చేయించింది. కాగా, మిగిలిన కంపెనీలు పూర్తిగా వెనుకబడ్డాయని ఉద్యానశాఖ వర్గాలు చెబుతున్నాయి. మొదట్లో ఉన్న 2 లక్షల లక్ష్యాన్ని 1.20 లక్షలకు కుదించినా.. సాగు విషయంలో ఈ కంపెనీలు నానాపాట్లు పడుతున్నాయి. మొలక విత్తనాలను కొనుగోలు చేయలేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఆయిల్‌ఫెడ్‌కు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, జనగాం, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలను అప్పగించారు. వాస్తవంగా మొదట్లో ఆయిల్‌ఫెడ్‌కు తక్కువ విస్తీర్ణం కేటాయించి, ప్రైవేట్ కంపెనీలకే అధికంగా ఇవ్వాలనుకున్నారు. కానీ ఆయిల్‌ఫెడ్ పోరాటం చేయడంతో దానికి అధిక విస్తీర్ణం కేటాయించారు. ఇప్పుడు ఆశించిన ఫలితాలు ఆయిల్‌ఫెడ్ ద్వారానే కనిపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

స్టడీ టూర్‌కు చిరునామా సిద్దిపేట, గజ్వేల్

- అభివృద్ధి పనుల పరిశీలనకు తరలివస్తున్న ఇతర రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, రైతులు
- రిజర్వాయర్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ల గురించి తెలుసుకుంటున్న వైనం
- పంజాబ్ సీఎం నుంచి రైతుల వరకు.. మౌలిక వసతులు భేష్ అంటూ కితాబు



కొండపోచమ్మసాగర్‌ను పరిశీలిస్తున్న పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్, మంత్రులు, అధికారులు (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల్లో నిర్మించిన జలవనరుల ప్రాజెక్టులు, ఇతర మౌలిక వసతులు ఇతర రాష్ట్రాల వారిని అమితంగా ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాజెక్టులు, వసతులను తమ రాష్ట్రాల్లో కూడా ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలు స్టడీ టూర్‌కు చిరునామాగా నిలుస్తున్నాయి. సాగు, తాగునీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 50 టీఎంసీల సామర్థ్యంగల కొమురవెల్లి మల్లన్నసాగర్, మర్కూక్ మండలంలోని 15 టీఎంసీల కొండపోచమ్మ సాగర్, దేశంలోనే సకల సౌకర్యాలతో నిర్మించిన గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కోమటిబండలోని మిషన్ భగీరథ ప్రాజెక్ట్, గజ్వేల్‌లోని పాండవుల చెరువు, వర్గల్ మండలం సింగారయపల్లి అడవిని పరిశీలించేందుకు రోజురోజుకూ సందర్శకుల తాకిడి పెరుగుతోంది. సిద్దిపేట, గజ్వేల్‌లలో జరిగిన అభివృద్ధిని చూసి వివిధ రాష్ట్రాల రైతులు, ప్రజాప్రతినిధులు ప్రశంసలు కురిపిస్తున్నారు. రిజర్వాయర్ల నిర్మాణం ఎలా జరిగింది, వాటికింద సాగు విస్తీర్ణం ఎంత, ఎన్ని రోజుల్లో నిర్మించారు.. అని అడిగి తెలుసుకుంటున్నారు. రైతుల కోసం నిర్మించిన రైతు వేదికలను సైతం సందర్శిస్తున్నారు.

పంజాబ్ ముఖ్యమంత్రి సందర్శన

ఈ ఏడాది ఫిబ్రవరి 16న పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్‌తో పాటు మంత్రులు, అధికారులు కొండపోచమ్మ రిజర్వాయర్, పాండవుల చెరువును సందర్శించి రైతులతో మాట్లాడారు. తెలంగాణ సాగునీటి శాఖ ప్రత్యేక కార్యదర్శి రజత్ కుమార్‌తో ఇతర నీటిపారుదల శాఖ అధికారులు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు, వివిధ దశలను వారికి వివరించారు.

మహారాష్ట్ర నుంచీ రాక..

మహారాష్ట్రకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు.. ఈ నెల రోజుల్లోనే సుమారు 500 మందికి పైగా సందర్శించారు. ఈ నెల 11న మహారాష్ట్రకు చెందిన ఆదర్శ రైతులు కుకునూరుపల్లిలోని రైతు వేదిక, మంగోల్‌లో నిర్మిస్తున్న మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను పరిశీలించారు. అలాగే 15న మల్లన్నసాగర్, మిషన్ భగీరథ, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కొండపోచమ్మ రిజర్వాయర్లను జాతీయ మీడియా ప్రతినిధులు సందర్శించారు. ఈ నెల 27న అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన ప్రజాప్రతినిధులు మర్కూక్‌లోని ఎర్రవెల్లి గ్రామాన్ని సందర్శించారు. మార్చి 3న రాజస్తాన్‌కు చెందిన ఇరిగేషన్ అధికారులు మల్లన్నసాగర్‌ను, మార్చి 1న నారాయణరావుపేట మండలం గుర్రాగొంది గ్రామాన్ని పంజాబ్‌కు చెందిన వ్యవసాయ అధికారులు, ఫిబ్రవరి 28న ములుగు మండల కేంద్రంలోని గ్రామ నర్సరీ, క్రీడాప్రాంగణాన్ని ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన జిల్లా అధికారులు సందర్శించారు. అలాగే ఫిబ్రవరి 8న జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల పల్లె ప్రకృతి వనాన్ని ట్రైనీ ఐఎఫ్ఎస్ బృందం, జనవరి 28న మర్కూక్ రైతు వేదిక, గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఒడిశా రైతులు పరిశీలించారు. ములుగు మండలం జప్తిసింగరాయపల్లిలో పల్లెప్రకృతి వనాన్ని ఉత్తర్‌ప్రదేశ్ పర్యావరణ శాఖ మంత్రి డాక్టర్ అరుణ్‌కుమార్ సందర్శించారు. ఇలా ఎప్పుడూ ఏదో ఒక ప్రాంతం నుంచి ఇక్కడికి సందర్శకులు క్యూ కడుతున్నారు.

మొక్కల పెంపకం బాగుంది..



మా రాష్ట్రంలో జంతువుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రింబవళ్లు పొలాల్లోనే ఉండాల్సి వస్తుంది. ఇక్కడ అడవి జంతువుల సంరక్షణ కోసం చేపడుతున్న చర్యలు బాగున్నాయి. మొక్కల పెంపకం, వాటి సంరక్షణ, అడవి అభివృద్ధి సైతం బాగుంది. తెలంగాణలో సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావలసిన అవసరం ఎంతైనా ఉంది.

– విజయ్ విలేగర్, మహారాష్ట్ర రైతు బృందంసభ్యుడు

సాగునీటి సౌకర్యాలు భేష్



తెలంగాణలో అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, సాగునీటికి ఢోకా లేకుండా రిజర్వాయర్ల నిర్మాణం చాలా భేష్. ఇక్కడి రైతులకు అందిస్తున్న సదుపాయాలు బాగున్నాయి. ప్రజలు, రైతుల సౌకర్యార్థం నిర్మించిన మార్కెట్ చాలా బాగుంది. రైతులు పండించిన ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునేందుకు అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయడం అభినందనీయం.

– అజయ్ దేశ్‌ముఖ్, మహారాష్ట్ర

.. రూ.7,218 కోట్ల పెట్టుబడులు

మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. అలాగే దేశ విదేశాల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ రంగంలో వస్తున్న ఆవిష్కరణలను, తాజా పోకడలను మొత్తం 26 ప్యానెల్ చర్చలు, ఐదు రౌండ్‌టేబుల్ సమావేశాలు, ప్రభుత్వం–పరిశ్రమల ప్రముఖుల మధ్య 40 కంటే ఎక్కువ ద్వైపాక్షిక సమావేశాలు జరిగాయి.

పామాయిల్ రంగంలో భారీ పెట్టుబడులు

పామాయిల్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ల ఏర్పాటుకు టీఎస్ ఆయిల్‌ఫెడ్‌తోపాటు 9 కంపెనీలు రూ. 3,458.95 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ రూ.1,055 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రాగా, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ రూ.1,050 కోట్లు, ప్రీ-యునీక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఇవి కాకుండా పామాయిల్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం మరో 5 కంపెనీలు పెట్టుబడి పెట్టనున్నాయి. బెవరేజ్ తయారీ యూనిట్ కోసం వరుణ్ బీవరేజెస్ లిమిటెడ్ అండ్ ఫోర్ జీరో ఎల్ఎల్‌పీ కంపెనీ రూ. 829 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇథనాల్ కోసం జూరాల ఆర్గానిక్ ఫామ్స్ అండ్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఎల్ఎల్‌పీ రూ.550 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకురాగా, వివేక్ బయో రూ. 251 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. వాటితోపాటు గాయత్రీ ఆగ్రో ఇండస్ట్రీస్ పవర్ లిమిటెడ్ రూ. 240 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రైస్‌మిల్, మొక్కజొన్న ప్రాసెసింగ్, ధాన్యం నిల్వ, ఎడిబుల్ ఆయిల్ యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. మణికంఠ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ రూ.185 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రైస్‌మిల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టనుంది. మోదీ నేచురల్స్ లిమిటెడ్ రూ.325 కోట్ల పెట్టుబడితో ఇథనాల్ డిస్టిల్లరీ, ఆర్‌బీవోను ఏర్పాటు చేయనుంది. మస్కతి డెయిరీ ప్రొడక్ట్స్ రూ. 242 కోట్లతో పాలు, పాల ఉత్పత్తుల యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. పోర్క్, ఫిష్, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్లు, స్పైస్ యూనిట్‌లు ఏర్పాటుకు వీలుగా మరికొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి.

తెలంగాణపట్ల నమ్మకానికి నిదర్శనం: మంత్రి కేటీఆర్

కాన్‌క్లేవ్ సందర్భంగా రూ. 7,218 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు 27 కంపెనీలు ముందుకు రావడం రాష్ట్రంలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపట్ల పరిశ్రమ వర్గాలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో దాదాపు రూ. 7,000 కోట్ల నిధులను ఖర్చు చేసి మౌలిక సదుపాయాలను కల్పించిందని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనతో ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటు చేస్తున్నామని, 10 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఏర్పాటు అవుతున్న ఈ జోన్ల వల్ల ఈ రంగం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్నోవేషన్ ఇన్ ఫుడ్ ప్రాసెసింగ్, గ్రాండ్ చాలెంజ్‌ను కూడా మంత్రి ప్రారంభించారు. ఫుడ్ కాన్‌క్లేవ్‌ను ఏటా వార్షిక సదస్సుగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ రమేష్‌చంద్, ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ సోధి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆనంద్ మోహన్ విడుదలపై సుప్రీంకోర్టుకు ఉమా కృష్ణయ్య

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రాంతానికి చెందిన ఐఏఎస్ అధికారి జి.కృష్ణయ్య హత్య కేసులో దోషి, రాజకీయనేతగా మారిన గ్యాంగ్‌స్టర్, బిహార్ మాజీ ఎంపీ ఆనంద్ మోహన్‌ను జైలు నుంచి ముందుగానే విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ కృష్ణయ్య భార్య ఉమా కృష్ణయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బిహార్ ప్రభుత్వం జైలు నిబంధనలను మార్చడంతో గురువారం ఆనంద్ మోహన్ సహర్సా జైలు నుంచి విడుదలైన విషయం తెలిసిందే. 1994 నాటి కృష్ణయ్య హత్య కేసులో గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు ఆనంద్‌మోహన్‌కు జీవిత కాల జైలు పడిందనీ, నిబంధనలను మార్చి ఆ శిక్షను 14 ఏళ్లుగా అన్వయించడం తగదని ఆ పిటిషన్‌లో ఉమా కృష్ణయ్య పేర్కొన్నారు. మరణ శిక్షకు బదులుగా విధించిన జీవిత ఖైదు శిక్షను కోర్టు ఆదేశాల ప్రకారం కచ్చితంగా అమలు చేయాల్సిందేనని, ఇందులో రెమిషన్ ఉండరాదని పేర్కొన్నారు.

బైజూస్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

కీలక పత్రాలు, డిజిటల్ డేటా స్వాధీనం

న్యూఢిల్లీ: ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా)ను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ ఆఫీసులో, బైజూస్ సంస్థ సీఈఓ రవీంద్రన్ బైజూకు సంబంధించిన భవనంలో సోదాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం రెండు కార్యాలయాలు, ఒక నివాస భవనంలో సోదాలు జరిపామన్నారు. కొన్ని కీలక పత్రాలు, డిజిటల్ డేటాను స్వాధీనం చేసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విచారణకు హాజరు కావాలంటూ పలుమార్లు సమన్లు పంపించినా రవీంద్రన్ బైజు స్పందించలేదని ఈడీ ఆరోపించింది. థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ 2011 నుంచి 2023 మధ్య కాలంలో రూ.28 వేల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) పొందినట్లు పేర్కొంది. అలాగే ఈ కంపెనీ ఓవర్సీస్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో వివిధ విదేశీ అధికారులకు దాదాపు రూ.9,754 కోట్లను పంపినట్లు ఈడీ ఆరోపించింది. థింక్ అండ్ లెర్న్ సంస్థ 2020–21 నుంచి ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు తయారు చేయడం లేదని, ఖాతాల ఆడిటింగ్ కూడా నిర్వహించడం లేదని ఆరోపించింది. ఇదిలా ఉండగా, ఈడీ సోదాలపై బైజూస్ లీగల్ టీమ్ ప్రతినిధి స్పందించారు. తమ కంపెనీ పూర్తి పారదర్శకంగా పనిచేస్తోందని, అధికారులు అడిగిన సమాచారం అందించామని తెలియజేశారు. ఈ సోదాలు సాధారణంగా జరిగినవేనని పేర్కొన్నారు.


ఒక్కలిగల కంచుకోటలో పాగా ఎవరిదో...!

పాత మైసూరుపై పార్టీలన్నింటి కన్ను

- ఒక్కలిగల ఓట్ల కోసం తీవ్ర యత్నాలు
- జేడీ(ఎస్)కే జై కొడుతూ వస్తున్న ప్రాంతం

పాత మైసూరు. కర్ణాటకలో అధికార పీఠానికి రాచమార్గంగా భావించే ప్రాంతం. మెజారిటీ కావాలంటే ఇక్కడ అత్యధిక స్థానాలు గెలుపొందాల్సిందేనని పార్టీలన్నింటికీ బాగా తెలుసు. ఈ ప్రాంతంలో ఒక్కలిగ సామాజిక వర్గం ప్రభావం అధికం. వారిని ప్రసన్నం చేసుకోగలిగే పార్టీదే పాత మైసూరు. అందుకోసమే పార్టీలన్నీ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి...





సాక్షి బెంగళూరు: కర్ణాటక జనాభాలో ఒక్కలిగ సామాజికవర్గం 15 శాతం ఉంటుందని అంచనా. లింగాయత్ (17 శాతం)ల తర్వాత రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న సామాజికవర్గం వీరే. ఉత్తర కర్ణాటక లింగాయత్ బెల్ట్ కాగా పాత మైసూరు ఒక్కలిగల కంచుకోట. ప్రతి ఎన్నికల్లోనూ ప్రభుత్వ ఏర్పాటులో ఈ వర్గం కీలక పాత్ర పోషిస్తోంది. వీరు కొన్ని దశాబ్దాలుగా ఒక్కలిగలు జేడీ(ఎస్)నే ఆదరిస్తూ వస్తున్నారు. ఈసారి వారిని తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, **బీజేపీలు** తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

ఏడుగురు సీఎంలను ఇచ్చిన ప్రాంతం

- రాష్ట్రంలో మొత్తం 224 అసెంబ్లీ స్థానాల్లో పాత మైసూరు ప్రాంతంలో 51 సీట్లున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీ(ఎస్) పార్టీ 24 స్థానాల్లో, కాంగ్రెస్ 16 స్థానాల్లో, బీజేపీ 9 చోట్ల గెలిచాయి.
- కావేరి వివాదం, రైతు ఆత్మహత్యల వంటి సమస్యలు ఈ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్నాయి.
- మేజిక్ నంబర్ సాధించడంలో ఈ ప్రాంతం కీలకం.
- గతంలో ముఖ్యమంత్రులుగా చేసిన 17 మందిలో ఏకంగా ఏడుగురు ఒక్కలిగ సామాజిక వర్గానికి చెందిన వారే! ఈ సామాజికవర్గానికి చెందిన హెచ్.డి.దేవెగౌడ ప్రధాని పదవి దాకా ఎదిగారు.
- ఈ ప్రాంతంలో ప్రస్తుతానికి జేడీ(ఎస్) చాలా బలంగా ఉంది.
- మండ్య, హాసన్, రామనగర, మైసూరు, చామరాజనగర, కోలార్, తుమకూరు, కొడగు జిల్లాల్లో ఒక్కలిగలు అధికంగా ఉంటారు.
- ఒక్కలిగల ఓట్లను ఒడిసిపట్టేందుకు అధికార బీజేపీ తాజాగా వారి రిజర్వేషన్లను 4 శాతం నుంచి 6 శాతానికి పెంచింది.
- ఇక కాంగ్రెస్ ఒక్కలిగలకు ఎక్కువగా టికెట్లిచ్చి అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది.
- జేడీ(ఎస్) మాత్రం తన సంప్రదాయ ఓటుబ్యాంకు మళ్లీ చెక్కుచెదరబోదని ధీమాగా ఉంది.

కాంగ్రెస్.. గత వైభవమే

పాత మైసూరు ప్రాంతంలో కాంగ్రెస్ ఒకప్పుడు తిరుగులేని పార్టీ. దేవెగౌడ రూపంలో బలమైన ఒక్కలిగ నేత రాకతో ఇక్కడ దాని ప్రభ మసకబారింది. ఈ ప్రాంతానికే చెందిన ముఖ్య ఒక్కలిగ నేత పీసీసీ చీఫ్ డి.కె.శివకుమార్‌పైనే ఈసారి కాంగ్రెస్ ఆశలన్నీ పెట్టుకుంది.

ఇంటిపోరు జేడీ(ఎస్)ను ముంచేనా...?

దేవెగౌడ కుటుంబంలో వారసత్వ రగడ మొదలైంది. ఆయన కుమారుల్లో జేడీ(ఎస్) నేత హెచ్.డి.కుమారస్వామి రామనగర, మైసూరు, మండ్య జిల్లాల్లో గట్టి నాయకుడు కాగా సోదరుడు హెచ్.డి.రేవణ్ణ హాసన్ జిల్లాలో తిరుగులేని నేత. కొద్ది నెలలుగా వీరి మధ్య విభేదాలు పొడచూపాయి. హాసన్ టికెట్ విషయంలో ఇవి రచ్చకెక్కాయి. అక్కడ రేవణ్ణ భార్య భవానీని కాదని అతి సామాన్య కార్యకర్తకు కుమారస్వామి టికెటిచ్చారు. ఈ గొడవ కొంప ముంచుతుందేమోనని జేడీ(ఎస్) వర్గాల్లో ఆందోళన నెలకొంది.

బీజేపీ...

ఇక బీజేపీది భిన్నమైన పరిస్థితి! పాత మైసూరులో పార్టీకి ఒక్కరంటే ఒక్కరు కూడా బలమైన ఒక్కలిగ నాయకుడు లేడు. దాంతో ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, జేడీ(ఎస్)ల తర్వాతి స్థానానికే పరిమితమవుతూ వస్తోంది. అయితే 2018 ఎన్నికల్లో కాస్త పుంజుకున్న నేపథ్యంలో ఈసారి భారీగానే ఆశలు పెట్టుకుంది. గత తప్పిదాలను సరిదిద్దుకుంటూ బలమైన స్థానిక నేతలను చేర్చుకుని టికెట్లిచ్చింది.

అన్సారీ సోదరులకు జైలు శిక్ష

బీఎస్పీ నేత అఫ్జల్ అన్సారీపై ఎంపీగా అనర్హత వేటు పడే చాన్స్



ఘజియాబాద్(యూపీ): గ్యాంగ్‌స్టర్ చట్టం కింద 2007లో నమోదైన కేసులో ఉత్తరప్రదేశ్‌లోని ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు రాజకీయనేతగా ఎదిగిన గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ, ఆయన సోదరుడు బీఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీలను దోషిగా తేలుస్తూ వారికి జైలు శిక్ష విధించింది. ముఖ్తార్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా, అఫ్జల్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1 లక్ష జరిమానా విధిస్తూ అదనపు సెషన్స్ న్యాయమూర్తి దుర్గేశ్ తీర్పు చెప్పారని అదనపు జిల్లా ప్రభుత్వ న్యాయవాది(నేర) నీరజ్ శ్రీవాస్తవ చెప్పారు. ఘజియాబాద్ బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ అయిన అఫ్జల్‌ను కేసు విచారణ సందర్భంగా కోర్టులో హాజరుపర్చగా ముఖ్తార్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. తీర్పు తర్వాత అఫ్జల్‌ను పోలీసులు జైలుకు తరలించారు. ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం ఏదైనా కేసులో దోషిగా తేలి ఎంపీకి రెండేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం శిక్ష పడితే ఆ సభ్యుడిని ఎంపీగా అనర్హుడిగా ప్రకటిస్తారు. అఫ్జల్‌కు ఏకంగా నాలుగేళ్ల శిక్ష పడటంతో ఆయన అనర్హత దాదాపు ఖాయమైంది. ప్రజా ప్రతినిధుల చట్టం ప్రకారం దోషులుగా తేలడంతో రాహుల్ గాంధీ(వయనాడ్ స్థానం), ఆజం ఖాన్(రామ్‌పూర్), అతని కుమారుడు అబ్దుల్లా ఆజం(సుఆర్), బీజేపీ నేత విక్రమ్ సైనీ(ఖతౌలీ–ముజఫర్‌నగర్)లు ఇప్పటికే తమ పదవులకు అనర్హులైన విషయం విదితమే. 1997లో వారణాసికి చెందిన వ్యాపారి నంద్‌కిషోర్ అపహరణ, హత్య, 2005లో నాటి ఘాజీపూర్ ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్‌ను హత్యచేశారనే ఆరోపణలపై అన్సారీ సోదరులపై 2007 నవంబర్ 22న యూపీలోని కొత్వాలీ పోలీస్‌స్టేషన్‌లో యూపీ గ్యాంగ్‌స్టర్స్ చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో వీరిని గత సెప్టెంబర్‌లో దోషులుగా తేల్చి తీర్పు రిజర్వ్‌చేసి శనివారం వెలువర్చింది. మవూ సదర్ అసెంబ్లీ స్థానం నుంచి అఫ్జల్ గతంలో ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

శతఘ్ని దళంలోకీ మహిళల అడుగు

- మొదటి బ్యాచ్‌లో అయిదుగురిని తీసుకున్న ఆర్మీ
- ముగ్గురికి ఎల్‌ఏసీలో, ఇద్దరికి పాక్ సరిహద్దుల వెంట బాధ్యతలు



న్యూఢిల్లీ: భారత సైన్యం మరో చారిత్రక నిర్ణయం తీసుకుంది. మొట్టమొదటి సారిగా ఆర్టిలరీ రెజిమెంట్‌లోకి అయిదుగురు మహిళా అధికారులను ఎంపిక చేసింది. వీరిలో ముగ్గురికి చైనాతో సరిహద్దుల్లో నియంత్రణ రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి, ఇద్దరికి పాక్ సరిహద్దుల్లోని కీలకమైన ప్రాంతాల్లో బాధ్యతలు అప్పగించింది. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ(ఓటీఏ)లో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న లెఫ్టినెంట్ మెహక్ సైనీ, లెఫ్టినెంట్ సాక్షి దుబే, లెఫ్టినెంట్ అదితి యాదవ్, లెఫ్టినెంట్ పయిస్ ముద్గిల్, లెఫ్టినెంట్ ఆకాంక్షలను ప్రతిష్టాత్మక ఆర్మీ ఆర్టిలరీ విభాగంలోకి ఎంపిక చేసినట్లు శనివారం సైనిక వర్గాలు వెల్లడించాయి. ప్రధాన పోరాట విభాగమైన రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీలో 280 యూనిట్లుంటాయి. ఇందులో బోఫోర్స్ హోవిట్జర్లు, ధనుష్, ఎం–777 హోవిట్జర్లు, కె–9 వజ్ర వంటి శతఘ్ని ఆయుధ వ్యవస్థల నిర్వహణలో పనిచేయాల్సి ఉంటుంది. ఆర్టిలరీలోని అన్ని విభాగాల్లోనూ కొత్త మహిళా అధికారులకు బాధ్యతలు అప్పగిస్తామని, వీరు అత్యంత క్లిష్టతరమైన పరిస్థితుల్లో వివిధ వ్యవస్థల నిర్వహణకు అవసరమైన శిక్షణను పొందుతారని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈ అయిదుగురితోపాటు ఓటీఏలో శిక్షణ పూర్తి చేసుకున్న మరో 19 మంది పురుష అధికారులను తాజాగా వేర్వేరు ప్రాంతాల్లోని ఆర్టిలరీ విభాగాల్లోకి తీసుకున్నట్లు వివరించాయి. మొదటిసారిగా ఆర్మీ 2019లో మహిళలను మిలటరీ పోలీస్ విభాగంలోకి రిక్రూట్ చేసుకుంది. ఈ ఏడాది జనవరిలో ఆర్మీ కార్ప్స్ ఇంజినీర్స్ విభాగానికి చెందిన కెప్టెన్ శివ చౌహాన్‌కు మొట్టమొదటిసారిగా ప్రపంచంలోని ఎత్తైన యుద్ధక్షేత్రంగా భావించే సియాచిన్ గ్లేసియర్‌లో ఫ్రంట్‌లైన్ బాధ్యతలు అప్పగించారు.

కేజ్రీవాల్ నివాసానికి మరమ్మతులపై నివేదిక కోరిన ఎల్జీ

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అధికార నివాసానికి రూ.49 కోట్లతో చేయించిన మరమ్మతుల్లో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన వార్తలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్పందించారు. దీనిపై సవివర నివేదిక ఇవ్వాలని, మరమ్మతులకు సంబంధించిన అన్ని రికార్డులను 15 రోజుల్లోగా తన ముందుంచాలని శనివారం చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. 2020–22 సంవత్సరాల్లో అధికార నివాసంలో అదనపు పనులు, మరమ్మతుల కోసం కేటాయింపులు రూ43.70 కోట్లు కాగా, రూ.44.78 కోట్లు వెచ్చించినట్లు రికార్డులు చెబుతున్నాయి. సమస్యల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అవకతవకలు జరిగాయంటూ బీజేపీ ఆరోపణలు చేస్తోందని ఆప్ అంటోంది.

నగర వార్తలు

తెలంగాణకు అద్భుత చరిత్ర ఉంది

మంత్రులు శ్రీనివాస్ గౌడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు



బంజారాహిల్స్: తెలంగాణ ప్రాంతానికి అద్భుతమైన చరిత్ర ఉందని మంత్రులు శ్రీనివాస్ గౌడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణలో శనివారం ఫిక్కీ ఎఫ్ఎల్ఓ ఆధ్వర్యంలో 'లాస్ట్ ఇన్ టైం' పుస్తకాన్ని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకుల హయాంలో తెలంగాణ రాష్ట్రంలోని అనేక చారిత్రక ప్రాంతాలు, సంస్కృతులు, మరుగున పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో చారిత్రాత్మక సంపదకు, ప్రాంతాలకు సంస్కృతులకు ఎంతో గౌరవం తీసుకొస్తున్నారని అన్నారు. యాదాద్రి, రామప్పలకు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చిందన్నారు. వీటితో పాటుగా వాల్మీకి, పోతన జన్మించిన ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. హైదరాబాద్ ఒక మినీ భారతం అని, ఇక్కడ అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలు ఉంటారన్నారు. కార్యక్రమంలో కావేరి సీడ్స్ సీఈవో భాస్కరరావు, ఫిక్కీ ఎఫ్ఎల్ఓ మాజీ నేషనల్ ప్రెసిడెంట్ పింకీ రెడ్డి, ఫిక్కీ ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చాప్టర్ చైర్పర్సన్ రీతుషా, ప్రముఖ నృత్యకారిణి దీపికా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఖలీఫ్స్' ఎగ్జిబిషన్ షురూ



బహదూర్‌పురా: సాలార్‌జంగ్ మ్యూజియంలో శనివారం ఏర్పాటు చేసిన 'ది ఖలీఫ్స్ ఎక్స్‌ట్రార్డినరీ వరల్డ్ ఎగ్జిబిషన్'ను ప్రిన్సెస్ జైరిన్ ముఖరం జా ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో 8వ నిజాం చిత్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సెస్ జైరిన్ ముఖరం జా మాట్లాడుతూ..ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన చిత్రాల ద్వారా తన ముత్తాత అబ్దుల్ మోజిద్ వ్యక్తిత్వం ఎలా ఉందో అవగతమవుతోందన్నారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్ టర్కీకి పూర్వపు ఖలీఫాతో ఉన్న చారిత్రాత్మక సంబంధాన్ని తెలుపుతుందన్నారు. చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్‌ను అబ్దుల్ మోజిద్ తాత్కాలిక ఖలీఫాగా ఎలా నియమించారో తెలిపే 'డీడ్ ఆఫ్ ది ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ ఇస్లాం' అనే అరుదైన పత్రాన్ని ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో మహ్మద్ ఉస్మాన్ అలీ, మ్యూజియం డైరెక్టర్ సీమా ఖైతూ, సయ్యద్ అహ్మద్ ఖాన్, మాజిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థీకృతంగా హష్ ఆయిల్ దందా!



- ఒడిశా నుంచి విశాఖ ఏజెన్సీకి గంజాయి
- అక్కడ ప్రాసెసింగ్ ద్వారా ఆయిల్ తయారీ
- వైజాగ్ మీదుగా సిటీకి తీసుకువచ్చి విక్రయం
- గుట్టురట్టు చేసిన హెచ్–న్యూకు చెందిన బృందం
- వినియోగదారుల్లో వైద్యులు, వైద్య విద్యార్థులు

హిమాయత్‌నగర్: నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యులు, వైద్య విద్యార్థులు, ఐటీ ఉద్యోగులే లక్ష్యంగా హష్ ఆయిల్ దందా చేస్తున్న గ్యాంగ్ గుట్టును హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) రట్టు చేసింది. ఈ వ్యవస్థీకృత ముఠాలోని ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీసీపీ చక్రవర్తి గుమ్మి శనివారం ప్రకటించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు. ఒడిశాలో పండుతున్న గంజాయిని సేకరిస్తున్న పాడేరుకు చెందిన సత్యరావు అక్కడే హష్ ఆయిల్‌గా ప్రాసెస్ చేస్తున్నాడు. దీన్ని లీటర్ రూ.40 వేల చొప్పున చింతపల్లి, జి.మాడుగుల ప్రాంతాలకు చెందిన సప్లయర్స్ జి.బందు, కె.చంద్రరావులకు లీటర్ రూ.80 వేలకు విక్రయిస్తున్నాడు. కర్మన్‌ఘాట్‌లోని మైత్రిపురం కాలనీకి చెందిన ఇ.సంతోషరెడ్డిపై గతంలో ఐదు డ్రగ్స్ కేసులు ఉన్నాయి. ఇతడికి బందు, చంద్రరావులతో సంబంధాలు ఉన్నాయి. డ్రగ్ పెడ్లర్ పాత్ర పోషిస్తున్న ఇతగాడు వారి నుంచి హష్ ఆయిల్ లీటర్ రూ.80 వేలకు ఖరీదు చేస్తున్నాడు. ఒక్కో లీటర్ ఆయిల్‌ను 200 చిన్న డబ్బాల్లో (ఒక్కోటి ఐదు ఎంఎల్) నింపుతున్నాడు. వీటిని సబ్ పెడ్లర్స్ అయిన ఎస్.సాయిభరత్ (అంబర్‌పేట), వి.హరితేజలకు (సరూర్‌నగర్) లీటర్ రూ.3 లక్షల చొప్పున అమ్ముతున్నాడు. వీరితో పాటు మరో ముగ్గురూ సబ్–పెడ్లర్స్ పాత్ర పోషిస్తున్నారు. సిటీకి చెందిన వైద్యులు, వైద్య విద్యార్థులు, ఐటీ ఉద్యోగాలు చేసే వాళ్లకు క్రమం తప్పకుండా ఈ సబ్–పెడ్లర్స్ హష్ ఆయిల్ సరఫరా చేస్తున్నారు. వాట్సాప్ ద్వారా ఆర్డర్లు తీసుకుని వారి కోరిన చోట డెలివరీ ఇస్తున్నారు. ఒక్కో చిన్న డబ్బా రూ.2 వేలు చొప్పున లీటర్ రూ.4 లక్షలకు అమ్ముతున్నారు. కొన్నాళ్లుగా వ్యవస్థీకృతంగా సాగుతున్న వీరి దందాపై హెచ్–న్యూకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ పి.రమేష్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సై ఎస్.వెంకటరాములుతో కూడిన బృందం వలపన్ని బందు, చంద్రారావు, సంతోష్‌రెడ్డి, సాయి భరత్, హరితేజలను అరెస్టు చేసింది. వీరి నుంచి 2.5 లీటర్ల ఆయిల్ స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం సైదాబాద్ పోలీసులకు అప్పగించింది. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తోంది. ఇప్పటి వరకు 11 మందిని వినియోగదారులను గుర్తించామని, మరికొందరు ఉంటారనే అనుమానంతో ఆరా తీస్తున్నామని చక్రవర్తి గుమ్మి పేర్కొన్నారు. నగరంలో డ్రగ్స్ దందా, వినియోగంపై సమాచారం ఉంటే 8712661601కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



ర్యాలీలో పాల్గొన్న కె.నారాయణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: మత తత్వశక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతగానో ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ×బీజేపీ హటావో దేశ్ బచావో' అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నిజాం కళాశాల నుంచి ఎంజే మార్కెట్ వరకు కరపత్రాలను పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శవాలకు కూడా ప్రధాని మోదీ జీఎస్టీ వదలడం లేదని విమర్శించారు. రూ.10 లక్షల కోట్ల రూపాయల వరకు కార్పొరేట్ వ్యవస్థకు రాయితీని ఇచ్చిన ప్రధాని మోదీ..రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలను పెంచడం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం, ప్రజా సంపదను దోచిపెట్టడం వంటి కార్యక్రమాలపై ప్రజలను చైతన్య పరుస్తూ దేశవ్యాప్తంగా పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈటీ నర్సింహ, సీనియర్ నాయకులు ప్రేమ్ పావని, జిల్లా కార్యదర్శి ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

రసరాజుకు డాక్టర్ నందూరి కృష్ణమాచార్య పురస్కారం



సినీకవి రసరాజుకు నందూరి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న డాక్టర్ రమణాచారి తదితరులు

సుల్తాన్‌బజార్: మహాకవి డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణాచారి కొనియాడారు. ఈ మేరకు శనివారం రాత్రి సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో నందూరి రామకృష్ణమాచార్య సాహితీ పీఠం, నవ్య సాహితీ సమితి సంయుక్తంగా నిర్వహించిన నందూరి 103వ జయంతి కార్యక్రమాన్ని ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రముఖ సినీకవి రసరాజుకు డాక్టర్ నందూరి సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేసి, నిర్వాహక సంస్థల పక్షాన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ..అధికార భాషా సంఘం అధ్యక్షునిగా తెలుగుభాషా వికాసానికి, పద్య సాహిత్య ప్రాచుర్యానికి విశేషమైన సేవలందించారని గుర్తుచేశారు. లలితమైన పదాలతో అనంతమైన భావాన్ని తమ రచనలలో పొందుపరిచిన అభినవ వేమన నందూరి అన్నారు. సభకు తెలుగు విశ్వ విద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ అధ్యక్షత వహించారు. సాహితీ ప్రముఖులు జి.వసుంధర, ఆచార్య మాసన చెన్నప్ప, డాక్టర్ భవానిదేవి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీపీఠం కార్యదర్శి, ప్రముఖ కవి డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, ఎం.లక్ష్మీ, వేమరాజు విజయ్‌కుమార్, కె.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ఎకనామిక్స్ ప్రొఫెసర్ ఆర్.సిద్ధాగౌడ్ 'చైనా ఇన్ ది ఇండియన్ ఓషియన్ రీజియన్: ఇండియాస్ సెక్యూరిటీ ఛాలెంజెస్' అనే పుస్తకాన్ని రచించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను ప్రత్యేకంగా కలిసి పుస్తకాన్ని అందించారు. – సాక్షి, సిటీబ్యూరో

మా దేశంలో జైలులో వేస్తారు

- హైదరాబాద్‌లో చల్తా హై..
- ట్రాఫిక్ పోలీసులతో నైజీరియన్ వాగ్వాదం
- అతని వాహనంపై 42 పెండింగ్ చలానాలు



జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదం చేస్తున్న నైజీరియన్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు శనివారం జూబ్లీహిల్స్ రోడ్ నెం. 15లోని జూబ్లీహిల్స్ క్లబ్ వెనుక గేటు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ లేకుండా యాక్టివాపై వెళుతున్న నైజీరియన్ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. హెల్మెట్ ధరించకపోగా నెంబర్ ప్లేట్ కూడా సరిగ్గా లేకపోవడంతో ఇదేమిటని ప్రశ్నించిన పోలీసులు సదరు బైక్‌పై పెండింగ్ చలానాలను పరిశీలించగా, రెండేళ్లుగా 42 చలాన్లు పెండింగ్‌లో ఉన్నట్లుగా వెల్లడైంది. రూ. రూ.85 వేలు చలానా రూపంలో కట్టాల్సి ఉంది. మీ దేశంలో ఇలాగే వాహనాలు నడుపుతారా అని ప్రశ్నించగా 'ఇలా హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, నెంబర్ ప్లేట్ సరిగ్గా లేకుండా మా దేశంలో వాహనాలు నడిపితే జైలులో తోస్తారంటూ' సదరు నైజీరియన్ సమాధానం ఇచ్చాడు. మరిక్కడ మీ దేశంలోలాగా నిబంధనలు పాటించరా అని ప్రశ్నించగా 'హైదరాబాద్‌లో చల్తా.. హై' అంటూ సమాధానం ఇచ్చాడు. హైదరాబాద్ రాగానే మోటారు వాహనాల చట్టం రూల్స్ మర్చిపోతున్నారనడానికి ఇదో నిదర్శనం. అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, సుడాన్ దేశాలకు వెళ్లేవారు అక్కడి మోటారు వాహన చట్ట నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తుండగా హైదరాబాద్ విమానాశ్రయంలో విమానం దిగగానే వాటికి పాతరేసి ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారని ఓ పోలీసు అధికారి వ్యాఖ్యానించారు. సదరు నైజీరియన్ బైక్‌ను సీజ్ చేసిన పోలీసులు అతడిపై కేసు నమోదు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి ఘనంగా వీడ్కోలు



మాసబ్‌ట్యాంక్: ప్రభుత్వ బీఈడీ కాలేజీ మాసబ్‌ట్యాంక్‌లో గెస్ట్ లెక్చరర్ల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. బీఈడీ రెండో సంవత్సరం విద్యార్థులు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ ఉషారాణి మాట్లాడుతూ గెస్ట్ లెక్చరర్లు కాలేజీకి అందించిన సేవలను ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ గెస్ట్ లెక్చరర్లు విద్యార్థులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి సరైన విధంగా గైడెన్స్ ఇచ్చారని వ్యాఖ్యానించారు. వారి టీచింగ్ అనుభవాలు విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేసినందుకు రమాదేవి విద్యార్థులను అభినందించారు. అలాగే టీచింగ్ వృత్తిలో విద్యార్థులంతా విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్లు థామస్, ఖాజా అజీముద్దీన్, రామిరెడ్డి, సయ్యద్ అస్గర్, విజయలక్ష్మి, కోమలవల్లి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు సయ్యద్ షైబాజ్, వినీత్, అన్వేష్, శారద, డైనా, స్రవంతి, భాగ్యశ్రీ, వర్ష తదితరులున్నారు.

లీడ్స్ కనెక్ట్-ఇక్రిశాట్ మధ్య అవగాహన ఒప్పందం

బంజారాహిల్స్: వ్యవసాయ అంతరాలను తొలగించడం, ఉత్పత్తులకు సరైన మార్కెట్లను కల్పించడం, ఫిన్‌టెక్ మద్దతు అందించడమే లక్ష్యంగా లీడ్స్ కనెక్ట్ సర్వీసెస్, అగ్రిబిజినెస్ అండ్ ఇన్నోవేషన్ ప్లాట్‌ఫామ్ ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ద సెమీ ఎరిడ్ ట్రాపిక్స్(ఏఐపీ–ఇక్రిశాట్)తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. శనివారం జరిగిన కార్యక్రమంలో లీడ్స్ కనెక్ట్ సర్వీసెస్ చైర్మన్, ఎండి నవనీత్ రవికర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంస్థలకు మార్కెటింగ్ వ్యూహాలపై అవగాహన కల్పించామన్నారు. 2022లో డైరెక్టర్‌గా వచ్చిన ఘనా పౌరుడు విక్టర్ హఫారి సెఫాతో అవగాహన ఒప్పందంపై సంతకం చేశామన్నారు. మిరప, పప్పులు, పసుపులపై ఇప్పటికే పని చేస్తున్న లీడ్స్ కనెక్ట్ ఈ ఎంవోయూతో పాన్ ఇండియా కోసం కొత్త మార్గాలను తీసుకొస్తుందన్నారు. రైతుల అవసరాలు వారి ఉత్పత్తులకు మంచి ధర అందించడం ద్వారా సంఘాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అరవజి సెల్వరాజ్, డాక్టర్ సంగప్ప, పురుషోత్తం రుద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.



దేవుడు నాకు ఎత్తయిన కోటగా ఉన్నాడు.
నా బలమా, నిన్నే కీర్తించెదను.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.దశమి సా.6.55 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** మఖ ప.2.17 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.11.03 నుండి 12.48 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.32 నుండి 5.23 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.36 నుండి 12.23 వరకు.

సూర్యోదయం : 5.39
సూర్యాస్తమయం : 6.14
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

వ్యధార్థ జీవుల యథార్థ కవి

శ్రీశ్రీ 20వ శతాబ్ది ద్వితీయార్ధంలో నాటి కాలపు సామాజికార్థిక రాజకీయ అంశాలను, ఆకలి పేదరికపు కోరల్లో నలుగుతున్న వ్యధార్థ జీవితాలను కవిత్వీకరించాడు. దేశీయంగా జాతీయ ఉద్యమాన్ని నడుపుతున్న గాంధీ ప్రభావంతో, అంతర్జాతీయంగా మార్క్సిస్ట్ సైద్ధాంతిక ప్రభావంతో సాహిత్య సృజన చేశాడు. ఈ విధంగా శ్రీశ్రీపై జాతీయ ఉద్యమ ప్రభావం దాన్ని నడిపిస్తున్న గాంధీ ప్రభావం, ప్రపంచ పవనంగా వీస్తున్న మార్క్సిస్ట్ దృక్పథాలతో శ్రీశ్రీ కవిత్వం ముందుకు సాగిందని నేను భావిస్తున్నాను. గాంధీ స్వాతంత్య్రోద్యమ తాత్విక పునాదిపై కవిత్వమే కాదు... నాటికలు, వ్యాసాలు, కవితలు, వ్యాఖ్యానాలు, అనువాదాలు, ఇంటర్వ్యూలు, ఇలా వివిధ ప్రక్రియల్లో రచనా వ్యాసంగం చేశాడు.

'మహాసంకల్పం' కవిత ద్వారా గాంధీ సైద్ధాంతిక భూమికను వ్యక్తం చేస్తూ... 'ఇదిగో నా స్వాతంత్య్ర స్వప్నం... జన సందోహం కరిగి/ ఒకే వ్యక్తిగా రూపుధరిస్తే/ ఇదేం చిత్రమని చూశాను/ ఒక పెద్ద కాంస్య విగ్రహానికి ప్రాణం వచ్చినట్టుగా/ ఒక మేఘం గగనపథం



దిగి మానవుడై నిలిచినట్టుగా/... ఒకే ఒక్క మానవ మూర్తి నా కళ్ళ ముందు కనిపించాడు/... అతని బాధ్యత వహిస్తామని అందరూ హామీ ఇవ్వండి...' అంటూ గాంధీ తాత్వికతకు బావుటా పట్టాడు. మహాత్ముడి ఆదర్శాల వెలుగులో దేశ ప్రజలు పయనించాలని కాంక్షిస్తూ ఈ రచన చేశాడు. మహాత్ముడి నిర్యాణం తర్వాత శ్రీశ్రీ రాసిన 'సంభవామి యుగేయుగే' వంటి రచన తెలుగులోనే కాదు, మరే ప్రాంతీయ భాషలోనూ రాలేదని ప్రముఖ పాత్రికేయులు నార్ల చిరంజీవి వ్యాఖ్యానించారు. ఓ మహాత్మా ఓ మహర్షీ/ ఏది చీకటి ఏది వెలుతురు/ ఏది జీవితమేది మృత్యువు/ ఏది పుణ్యం ఏది పాపం/ ఏది నరకం ఏది నాకం... అంటూ రాసిన 'ఓ మహాత్మా' కవితా ఖండిక ప్రజల నాలుకలపై నిలిచి ఉంది.

స్వభావరీత్యా శ్రీశ్రీ పసిపాప లాంటి వాడుగా కనిపిస్తాడు. ప్రతిదానికీ స్పందించే లక్షణం ఉంటుంది. 'అభిప్రాయాల కోసం బాధల్ని లక్ష్యపెట్టని వాళ్లు మాలోకి వస్తారు. అభిప్రాయాలు మార్చుకొని సుఖాల్ని కామించే వాళ్లు మీలోకి వస్తారు'– అని సాహిత్యలోకాన్ని రెండుగా విభజించి ఒక స్పష్టమైన గీత గీసి ప్రజాశిబిరం, ప్రజా వ్యతిరేక శిబిరంగా విడగొట్టాడు. స్వాతంత్య్రానంతరం ధనిక పేదల మధ్య పెరిగిన అంతరాలు ఆకలి జీవుల, అన్నార్తుల హాహాకారాలను 'పేదలు' కవితలో వ్యక్తపరుస్తాడు. 'ఉద్యోగం ఇవ్వని చదువు/ నిలకడ లేని బతుకు వ్యాపకాలు/ స్వరాజ్య దుస్థితిని చూపుతున్నాయి' అంటాడు. చెదిరిపోయిన కలల్ని 'బాటసారి' కవితలో కూటి కోసం, కూలి కోసం, పట్టణంలో బ్రతుకుదామని తల్లి మాటలు చెవిని పెట్టక బయలు దేరిన బాటసారికి ఎదురైన సంక్షోభాన్ని కళ్ళకు కట్టినట్లు చూపుతాడు. గాంధీ గ్రామ స్వరాజ్యంపై అపార నమ్మకం ఉన్న శ్రీశ్రీ గ్రామీణ జీవితంలో ముసురుతున్న రోదనలకు అక్షర రూపం ఇచ్చాడు.

అయితే ఇటీవల దళిత సాహితీవేత్తలు శ్రీశ్రీ సాహిత్యం పట్ల నిర్లక్ష్యంగా ఉన్నట్టు నేను భావిస్తున్నాను. సమస్త కార్మిక, కర్షక, అభాగ్యుల, అన్నార్తుల అనాదల, వ్యధార్థజీవుల, యథార్థ బతుకుల్ని తన సాహిత్యంలో చూపిన శ్రీశ్రీని మన క్యాంపులోనే పెట్టుకోవాలి. అవతలి పక్షాలకు అప్పజెప్పి మనం బలహీనులం కాకూడదు. తెలుగు సాహిత్యంలో జాషువాని, శ్రీశ్రీని రెండు కళ్ళుగా స్వీకరించాల్సిన సందర్భం. తద్వారానే సామాజిక పరివర్తనకు మార్గదర్శకులమవుతాం. ఇది నేటి చారిత్రక అవసరం. సామాజిక సంస్కరణ లేకుండా భారతదేశ అభివృద్ధిని కాంక్షించలేము. ఈ సామాజిక లక్ష్యానికి ఒక సాంస్కృతిక కార్యాచరణను ప్రకటించిన వాళ్లు శ్రీశ్రీ, జాషువా.

– డొక్కా మాణిక్య వరప్రసాద్
వ్యాసకర్త ఏపీ ప్రభుత్వ విప్, మాజీ మంత్రి
(నేడు శ్రీశ్రీ జయంతి)

మోదీ మనోధర్మ వాణి 'మన్ కీ బాత్'

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం ప్రజాస్వామ్య విధానం. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన భారతదేశంలో ఈ విధానం ఈనాటిది కాదు. అదే పరంపరను అనుసరిస్తూ మొదలైన ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమం విజయవంతం కావడంలోని రహస్యం అదే. రేడియో ద్వారా ప్రజలతో సంభాషిస్తూ, దేశాభివృద్ధిలో వారందరినీ భాగస్వాముల్ని చేస్తూ, దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో 2014 అక్టోబర్ 3న ప్రధానమంత్రి ఈ కార్యక్రమం ప్రారంభించారు. రాజకీయాలకు అతీతంగా దేశంలోని సామాన్యుల అసామాన్య గాథలను ఇందులో ప్రస్తావిస్తుండటం దేశ పౌరులపై లోతైన ప్రభావం చూపిందనడంలో సందేహం లేదు. ప్రధానమంత్రిగా కాకుండా... స్నేహితుడిగా, సంరక్షకుడిగా, సన్నిహితుడిగా... వివిధ సందర్భాల్లో, వివిధ పాత్రల్లో ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా 'మన్ కీ బాత్' కార్యక్రమం కొనసాగుతోంది. ప్రతి నెలా చివరి ఆదివారం వచ్చే ఈ కార్యక్రమం ఈ రోజు వందో ఎపిసోడ్ పూర్తి చేసుకోనుండటం చరిత్రాత్మకం!

సందర్భం



జి. కిషన్ రెడ్డి

ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజలే ఎన్నుకునే ప్రభుత్వమే ప్రజాస్వామ్యం. అందుకే... ప్రజల భాగస్వామ్యంతో జరిగే ఏ పనికైనా ప్రజాస్వామ్యంలో అదే స్థాయిలో గౌరవ మర్యాదలు, ఆదరణ లభిస్తాయి. తమ సంక్షేమం, మంచి చెడ్డల గురించి ఆలోచించి, సమయానుగుణంగా మార్గదర్శనం చేసే వ్యక్తిని ప్రజలు తమ గుండెల్లో పెట్టుకుంటారు.

భారతదేశంలో ఈ సంప్రదాయం ఈనాటిది కాదు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలను భాగస్వామ్యం చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. చోళుల కాలంలో తమిళనాడులోని ఉత్తర మెరూర్‌లో గ్రామసభ, మన పక్కనున్న కర్ణాటకలోని బీదర్ జిల్లాల్లో బసవేశ్వరుడి 'అనుభవ మండపం' వంటివి పురాతన కాలం నుంచే దేశంలో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థకు అద్దం పడతాయి. అందుకే ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన భారతదేశంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ జరిగే కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్న 21వ శతాబ్దంలోనూ ఇదే ప్రజాస్వామ్య పద్ధతిని అవలంబిస్తూ... రేడియో ద్వారా నిరంతరం ప్రజలతో సంభాషించడం, తద్వారా వారందరినీ భాగస్వామ్యం చేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో 2014 అక్టోబర్ 3న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్'ను ప్రారంభించారు. ప్రతినెలా చివరి ఆదివారం గ్రామాల్లో, విద్యాసంస్థల్లో, వీధుల్లో, ప్రభుత్వ ఆఫీసుల్లో, పార్టీ కార్యాలయాల్లో... ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకొస్తున్న 'మన్ కీ బాత్' వందో ఎపిసోడ్ పూర్తి చేసుకోనుండటం చరిత్రాత్మకమే.

మీ మాట... నా నోట!

దేశ ప్రజల శక్తిసామర్థ్యాలు, సాహసం, శౌర్యం, ఆత్మవిశ్వాసం, స్ఫూర్తి దాయక గాథల గురించి చర్చిస్తూనే... ప్రజాసమస్యలు, సవాళ్లను ప్రస్తావిస్తూ వారిని చైతన్య పరచడం, ఆ సమస్యలపై వారిని పోరాటానికి సిద్ధం చేయడం... దేశ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తాయి. ఈ పనిని 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి స్వయంగా నిరంతరాయంగా చేస్తుండటమే ప్రజల్లో ఈ కార్యక్రమం పట్ల ఆదరణకు కారణం.

'మన్ కీ బాత్' అనేది మీది, నాది, మనందరి మనసులోని మాట. ప్రధాని వాక్కు ద్వారా దేశం మొత్తానికి తెలియజెప్పబడుతున్న 'మన మాట'. 'గొంతు నాదే కానీ భావన మీ అందరిదీ' అని ప్రధాని కూడా తరచుగా చెబుతుంటారు. అందుకే ప్రధాని మాటలు, దేశంలోని 90 శాతం ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉంటాయి. మారుమూల ప్రాంతాల్లో జరుగుతున్న అద్భుతమైన కార్యక్రమాలను, అక్కడి సామాన్యుల అసామాన్యమైన ఆలోచనను గుర్తుచేస్తూ... దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపడం; కరోనా రూపంలో 'తాత్కాలిక గ్రహణం' పట్టిన సమయంలో 'జాగ్రత్తగా ఉండండి, మేమున్నాం' అనే భరోసా ఇవ్వడం...వంటి ఎన్నో సానుకూలమైన మార్పులకు వేదిక ఈ 'మన్ కీ బాత్'.

ప్రతి నెలా చివరి ఆదివారం ప్రధాని మాట్లాడిన మాటల గురించి.. తర్వాతి రోజు పేపర్లలో, టీవీ ఛానళ్లలో చర్చ జరగడం ద్వారా ఎందరో సాధారణ వ్యక్తుల అసాధారణ ప్రతిభ ప్రపంచానికి పరిచయమైంది. ప్రధానమంత్రికి కోట్ల సంఖ్యలో ఉత్తరాలు వస్తాయి. వాటిలోని అంశాలను ఆయన తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ, ప్రజలు తమ అభిప్రాయాలను దేశ ప్రజలతో పంచుకునేలా ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులు రాసిన లేఖలను కూడా వీలున్నప్పుడు చదువుతూ, నేరుగా వారితో మాట్లాడిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఓ ప్రధానమంత్రిగా కాకుండా... స్నేహితుడిగా, సంరక్షకుడిగా, సన్నిహితుడిగా... వివిధ సందర్భాల్లో వివిధ పాత్రల్లో ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా 'మన్ కీ బాత్' కార్యక్రమం కొనసాగుతోంది. అందుకే ప్రజలు ప్రధానిని గుండెల్లో పెట్టుకున్నారు.

ప్రధానినైనా.. మీలో ఒకడినే!

ఓ రకంగా చెప్పాలంటే 'మన్ కీ బాత్'... భారతదేశపు నెలవారీ సమీక్షగా భావించవచ్చు. ఇందులో ప్రజలు, వారి సమస్యలు, పరిష్కారాలు, సమాజాభివృద్ధి కోసం అక్కడక్కడ వ్యక్తులు చేస్తున్న మహోత్కృష్టమైన పనులు పేర్కొంటూనే... కేంద్రప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ వీటి ద్వారా లబ్ధి పొందేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తున్నారు. స్వచ్ఛ భారత్, సెల్ఫీ విత్ డాక్టర్ (కరోనా సమయంలో), జల సంరక్షణ, అవినీతి రహిత, మత్తుపదార్థాల ప్రభావం లేని భారత్ నిర్మాణంతో పాటుగా కుంభమేళా, ఇన్‌క్రెడిబుల్ ఇండియా, ఫిట్ ఇండియా, బేటీ బచావో – బేటీ పఢావో, యోగా, ఖాదీకి ప్రోత్సాహం వంటి ఎన్నో విషయాలను చర్చిస్తున్నారు. గత ఎనిమిదేళ్లలో ఖాదీ రంగం ఉత్పత్తి 191 శాతం, కొనుగోళ్లు 332 శాతం పెరగడం, స్వచ్ఛందంగా ఎల్పీజీ సబ్సిడీని వదులుకోవడం, కరోనా సమయంలో నిబంధనలను పాటించడం వంటివి... ప్రధాని మోదీ మాటలను ప్రజలు విశ్వసించి భాగస్వాములు అవుతున్నారని చెప్పేందుకు నిదర్శనం.

అందుకే చాలా కేంద్ర ప్రభుత్వ విభాగాలు తమ మంత్రిత్వ శాఖలో జరుగుతున్న పురోగతిని, కొత్త పథకాలను మోదీ నోటి ద్వారా నేరుగా యావద్దేశానికి అందించాలని ప్రయత్నిస్తుంటాయి. యాడ్ ఏజెన్సీలను పెట్టుకుని ప్రచారం చేసినదానికంటే... 'మన్ కీ బాత్' ద్వారా ప్రజలకు నేరుగా పథకాల గురించి చేరుతుండటమే ఇందుకు కారణం. భారతదేశంలోని ప్రజల కోసం వివిధ భాషల్లో, మాండలికాల్లో ప్రసారం కావడంతో పాటు ఇంగ్లిష్ సహా 11 అంతర్జాతీయ భాషల్లోనూ ఇది ప్రసారం అవుతోంది. విదేశాల్లో ఉంటున్న భారతీయులకు కూడా... దేశంలో ఈ నెలరోజుల్లో ఏం జరిగింది? భవిష్యత్ కార్యాచరణ ఏంటి అనే అంశాలపై స్పష్టత లభిస్తోంది. భారతదేశంలో సామాజిక పరమైన విప్లవం తీసుకురావడంలో ఈ కార్యక్రమం విజయవంతం అయిందనే చెప్పాలి.



'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్' సంస్థ చేసిన ఓ స్టడీ ప్రకారం... సమాజంలోని ప్రతి వర్గంపై, ప్రతి రంగంపై ఇది స్పష్టమైన ప్రభావాన్ని చూపిస్తోంది. ముఖ్యంగా గ్రామాల్లో, యువత, స్వయం సహాయక బృందాలపై ఈ ప్రభావం కనబడుతోంది. తద్వారా గ్రామీణాభివృద్ధి పథకాల సద్వినియోగం, అమృత్ సరోవర్ మిషన్ వంటి వాటిలో ప్రజల భాగస్వామ్యం పెరిగింది.

రాజకీయాలకు అతీతంగా, భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత ఉన్నతస్థితికి తీసుకెళ్లేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ద్వారా జరుగుతున్న ప్రయత్నంలో ఉత్సాహంగా పాల్గొంటున్న ప్రజలందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రజల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి పథంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. ఇదే ప్రజాస్వామ్యం గొప్పదనం.

వ్యాసకర్త కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి

సందర్భం



శ్రీ ఎం.

భారతదేశ సుసంపన్న వారసత్వం, యోగా, ధ్యానం వైపు నేను బాల్యంలోనే ఆకర్షితుడనయ్యాను. అలా నా 18 ఏళ్ల వయసులో సత్య–జ్ఞానాన్వేషణలో హిమాలయాలకు వెళ్లాను. సుదీర్ఘ కాలం సంచారిగా కొనసాగిన సమయంలో జీవితంలోని విభిన్న కోణాలను దర్శించే అవకాశం లభించింది. ఇందులో భాగంగా చాలా కాలం సాధుసంతుల సత్సంగంలో గడపగలగడం నా అదృష్టం. ఎందరో మహనీయులు, యోగులు సమాజ సంస్కరణకే తమ జీవితాలను అంకితం చేయడం చూశాను. వారి బోధనలతో సమాజం స్వీయశక్తిని ఎలా గుర్తించగలదో గ్రహించాను.

సాధుసంతుల కరుణా తత్పరత

నా ఆరాధ్య గురుదేవునితోపాటు గొప్ప యోగులందరి నుంచీ నేను కూడా ఇదంతా నేర్చుకున్నాను. ఈ నేపథ్యంలో మన ప్రధాని నరేంద్ర మోదీని చూసినప్పుడు, ఆయన నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమ ప్రసంగం వింటూ, ఆయా అంశాలపై స్పందించే వేళ మన సాధుసంతులు ప్రబోధించే 'కరుణా తత్పరత'ను ఆయన కూడా అనుసరిస్తున్నట్లు తోస్తుంది.

ఈ కార్యక్రమం మొదలైన రోజున నేను యాదృచ్ఛికంగా విన్నప్పటికీ, అదొక అలవాటుగా మారింది. ఎందుకంటే– 'మన్ కీ బాత్' ప్రధానంగా రాజకీయాలకు తావులేనిది... అంతేగాక దేశం, సమాజం, సంస్కృతి, యోగా, సమాజంలోని శ్రమజీవుల విజయాలను మాత్రమే అది ప్రస్తావిస్తుంది. నేను ఈ ప్రసంగం వినడం ప్రారంభించినపుడు– అసలు 'మన్ కీ బాత్' వల్ల ప్రయోజనం ఏమిటనే ఆసక్తి నాలో ఉదయించింది. అయితే, ఈ రేడియో కార్యక్రమం ప్రధాని మోదీ శ్రీకారం చుట్టిన ఒక వినూత్న ప్రయోగమనే వాస్తవాన్ని నేను గుర్తించాను. అయినప్పటికీ– ఈ కొత్తదనం, ఆసక్తి, రాజకీయరహిత స్వభావం ఈ వేదికపై కొనసాగడం సాధ్యమేనా అని కించిత్ సందేహం కూడా కలిగింది. కానీ, అశేష ప్రజాదరణతో ఈ కార్యక్రమం నేడు 100వ భాగం పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఆ భయాలన్నీ నిరాధారమని నిరూపిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నా సందేహాలను పటాపంచలు చేశారని చెప్పడానికి నేనెంత మాత్రం సంకోచించను.

మనసుతో మనసు సంభాషణ

ప్రధానమంత్రి చొరవతో ప్రపంచం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడం యోగాభ్యాసానికి విశ్వగురువైన భారతదేశానికి గర్వకారణం. ఈ సందర్భంగా 2022 సెప్టెంబరు నెలలో 'మన్ కీ బాత్' కార్యక్రమం అంశం నాకు గుర్తుకొస్తోంది. ఆనాటి ప్రసంగంలో భాగంగా సూరత్ నగరానికి చెందిన బాలిక 'అన్వి' గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. పుట్టుకతోనే గుండె జబ్బుతో బాధపడుతూ వచ్చిన ఆ చిన్నారికి 'ఓపెన్ హార్ట్ సర్జరీ' చేశారు. ఆ తర్వాత ఆత్మస్థైర్యంతో, యోగాభ్యాసంతో ఆ బాలిక సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంది. యోగాభ్యాసంలో అనేక పతకాలు కూడా సాధించడాన్ని ప్రధాని ఉదాహరించారు. అటవీ విధ్వంసాన్ని నిలువరిస్తూ, నక్సలైట్లను ఎదుర్కొన్న జార్ఖండ్ వీరవనిత 'జమునా తుడు' కథను ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' ద్వారా పంచుకున్నారు. బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లో 'రైతు పిన్ని'గా ప్రసిద్ధురాలైన రాజకుమారి దేవి కథను కూడా ఆయన ప్రస్తావించారు. గుజరాత్ వాస్తవ్యురాలైన దివ్యాంగురాలు ముక్తాబెన్ పంకజ్‌కుమార్ డాగ్లీ కథను కూడా ప్రజలతో పంచుకున్నారు. పట్టుదారం వడకడంలో గిరిజన మహిళలకు శిక్షణ ఇస్తున్న ఒడిషా మహిళ కున్ని దేవూరి గురించి కూడా ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నాం. అదేవిధంగా మారుమూల ప్రాంతాల్లో గర్భిణులకు ప్రసవ సమయంలో అండగా నిలిచే పద్మశ్రీ సూలగిత్తి నరసమ్మ గురించి కూడా పౌరులు తెలుసుకున్నారు. సిద్ధగంగ మఠానికి చెందిన డాక్టర్ శ్రీ శ్రీ శివకుమార్ స్వామీజీ రచనల గురించి తెలుసుకునే అవకాశం కూడా లభించింది. ఈ తరహాలో 'మన్ కీ బాత్' ద్వారా ఎన్నో స్ఫూర్తిదాయక గాథలు మనకు చేరాయి.

సామాన్యులతో విస్తృత స్థాయిలో మమేకమవుతూ ప్రధాని ఆత్మీయ అనుబంధం ఏర్పరచుకున్నారు. కాబట్టే ఆయన నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ మీ కుటుంబ పెద్ద లేదా సంరక్షకుడు స్వయంగా మీతో మాట్లాడుతున్నట్లు మీరు భావిస్తారు. మనసుతో మనసు సంభాషణే 'మన్ కీ బాత్' అన్నది నా నిశ్చితాభిప్రాయం.

వ్యాసకర్త ఆధ్యాత్మిక గురువు, 'పద్మభూషణ్' పురస్కార గ్రహీత

జనతంత్రం



వర్ధెల్లి మురళి

విజనరీ వేషధారి!

మాజీ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఒక విషయాన్నయితే కుండ బద్దలు కొట్టారు. ఇరవయ్యేళ్ల తర్వాత ఆయన ఈ మధ్యనే హైదరాబాద్‌లో పర్యటించారట. అప్పటికీ ఇప్పటికీ పోలికే లేదు. న్యూయార్క్‌లో ఉన్నానా? ఇండియాలో ఉన్నానా అనే అనుమానం వచ్చిందట! ఇరవయ్యేళ్ల కిందట అంటే ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలిస్తున్న కాలం. ఆయన తర్వాత రెండు దశాబ్దాలకు హైదరాబాద్ అభివృద్ధి సాధించిందని రజనీ భావన. చంద్రబాబు విజనరీయే అని చెబుతూ హైదరాబాద్ అభివృద్ధి మాత్రం ఆయనది కాదని రజనీకాంత్ చెప్పకనే చెప్పారు.

ఆయన నటించిన 'నరసింహ' అనే సూపర్‌హిట్ సినిమా చాలామందికి గుర్తుండే ఉంటుంది. అందులో ఓ కామెడీ పాత్రధారి పెళ్లిచూపులకు బయల్దేరుతాడు. వెంట మిత్రబృందం కూడా ఉంటుంది. ఆ బృందంలో రజనీకాంత్ కూడా ఉంటారు. దారిలో ఎదురైన ప్రతివారికీ అడిగినా అడక్కపోయినా పెళ్లికొడుకును రజనీకాంత్ పరిచయం చేస్తుంటాడు. అదిగో ఆయనే పెళ్లికొడుకు, వేసుకున్న డ్రస్ మాత్రం అతనిది కాదని చెబుతుంటాడు. ఇలా ముగ్గురు నలుగురికి చెప్పేసరికి సదరు పెళ్లికొడుక్కి సిగ్గుతో చచ్చినంత పనవుతుంది. ఆ డ్రస్‌ను విప్పి పారేసి పెళ్లిచూపులకు వెళ్లకుండా వెనక్కి వెళ్లిపోతాడు. మొన్న జరిగిన ఎన్టీఆర్ శత జయంతి సభలో రజనీకాంత్ మాటలను చంద్రబాబు పాజిటివ్‌గానే తీసుకున్నారు. అస్సలు సిగ్గుపడలేదు.

తనది కాని ఘనతను ఎవరైనా తనకు ఆపాదించి పొగిడినప్పుడు అభ్యంతరం పెట్టే అలవాటు బాబుకు బొత్తిగాలేదు. పైగా ఆ ఘనత తనకు లభించిన పేటెంట్ హక్కు కింద భావిస్తారు. చేతనైన మేరకు తానూ ప్రచారంలో పెట్టుకుంటారు. సెల్‌ఫోన్‌ను దేశానికి తీసుకురావడం, కంప్యూటర్‌ను కనిపెట్టడం, హైదరాబాద్‌ను నిర్మించడం వంటివన్నీ ఈ కోవకు చెందినవే.

మొబైల్ ఫోన్ దాని ప్రాథమిక రూపంలో ప్రారంభమై యాభయ్యేళ్లు పూర్తయిన సందర్భంగా చాలా విషయాలు బయటకొస్తున్నాయి. కమర్షియల్‌గా ప్రజావినియోగంలోకి రావడానికి ఆ తర్వాత చాలాకాలం పట్టింది. భారత్‌లో మరింత ఆలస్యంగా ప్రారంభమైంది. 1995లో అప్పటి బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు కలకత్తా నుంచి ఢిల్లీలోని కేంద్రమంత్రి సుఖ్‌రామ్‌కు కాల్ చేయడంతో మనదేశంలో మొబైల్ ఫోన్ల వినియోగం ప్రారంభమైంది. ఆ తర్వాత నాలుగేళ్లకు చంద్ర బాబు భాగస్వామిగా ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడింది. తాను అప్పటి ప్రధాని వాజ్ పేయిని ఎడ్యుకేట్ చేసి ఒప్పించిన తర్వాతనే దేశంలో మొబైల్ ఫోన్లు ప్రారంభమయ్యాయని బాబు, ఆయన అనుంగు యెల్లో మీడియా ప్రచారం చేసుకోవడం తెలిసిందే.

ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలకు నిండా ఏడాది కూడా సమయం లేదు. భారీ శాంపుల్స్‌తో పెద్ద పెద్ద జాతీయ సంస్థలు నిర్వహిస్తున్న సర్వేలు మరోసారి బాబు పార్టీకి చావు డప్పు మోగిస్తున్నాయి. తన పార్టీకి ఏదో ఒక ఎజెండా తక్షణావసరం. ఇంకో రెండు మూడు జెండాలు అండగా నిలబడాలి. ఈ రెండు కర్తవ్యాలను నిర్వహించడం కోసం ఆయన బ్యాక్ ఆఫీసు బ్రోకర్లూ, ఢిల్లీ లాబీయిస్టులూ రౌండ్ ది క్లాక్ చెమటలు కక్కుతున్నట్టు భోగట్టా. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమాలను బాబు విమర్శించలేదు. పైగా ఏమాత్రం సంకోచం లేకుండా వాటిని కొనసాగిస్తానని కూడా చెప్పుకొస్తున్నాడు. ఇది సరిపోదు. చంద్రబాబుకు ఇంకేదో మేకోవర్ కావాలి. మొన్నటి పదవీకాలంలో చెప్పుకోవడానికి చేసిందేమీ లేదు. పాతికేళ్ల కింద యెల్లో మీడియా చంద్రబాబుకు వేసిన విజనరీ వేషాన్నే మళ్లీ వేయాలని సంకల్పించారు. గొప్ప విజన్ (దూరదృష్టి) గలవాడిగా ప్రచారం చేయడానికి అట్టహాసంగా కొన్ని కార్యక్రమాలను ప్లాన్ చేశారు.

ఎంతసేపూ యెల్లో మీడియా పొగిడితేనే సరిపోదు కనుక, కొంచెం పాపులర్ వ్యక్తులను కూడా రంగంలోకి దించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్టీఆర్ శతజయంతిని ఇందుకోసం వాడుకున్నారు. ఎన్టీఆర్ మీద ప్రేమ ఉంటే శతజయంతి సభను గొప్పగానే నిర్వహించేవారు. నిండా నాలుగు వేలమంది కూడా రాని సభతో మమ అనిపించారు. కానీ, వారి ప్రయోజనం వేరు. బాబుకు విజనరీ (దార్శనికుడు)గా డప్పేయడం కోసం ఈ వేదికను వాడుకో వడం. ఆ డప్పు వాయించే పనిని రజనీకాంత్‌కు అప్పగించాలని నిర్ణయించారు. వృద్ధనారీ పతివ్రతల్లాంటి ఇద్దరు సినీ ప్రముఖులు నడుం కట్టి రజనీకాంత్ చేతికి స్క్రిప్టును అందచేశారట. ఈ ఇద్దరూ కృష్ణా జిల్లా నేపథ్యం కలిగినవారే. ఒకరు రిటైర్డ్ దర్శకుడు. మరొకరు రిటైర్డ్ నిర్మాత. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచినప్పుడు హైదరాబాద్‌కు వచ్చి మరీ చంద్రబాబును ఆశీర్వదించిన చరిత్ర రజనీకాంత్‌ది. కానీ నిన్నటి సభలో ఎన్టీఆర్‌ను ఆకాశానికెత్తేయడం ఆశ్చర్యం కలిగించింది. అంతకంటే ఆశ్చర్యం ఎన్టీఆర్ కోసం చంద్రబాబు నటించిన ఆరాటం. ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చే వరకు పోరాటం ఆపడట! ఇటువంటి సందర్భాలను బట్టే సామెతలు పుడతాయి. 'చెప్పేవాడికి లేకపోతే వినేవాడికన్నా సిగ్గుండాలి కదా' అనే సామెత కూడా ఇలాంటిదే.

చంద్రబాబు వాజ్‌పేయి ప్రభుత్వంలో భాగస్వామి. ఆయన చెవిలో చెప్పి ఇండియాకు సెల్‌ఫోన్లు తెప్పించారు. కలామ్‌ను రాష్ట్రపతిగా చేశారు. స్వర్ణ చతుర్భుజి వంటి భారీ రహదారులను నిర్మింపజేశారు (ఆయన చెప్పుకున్నవే). ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఎందుకు ఇప్పించలేదో అనే అనుమానం ఎవరికీ రాదని ఆయన నమ్మకం. ప్రజల వివేచనాశక్తి మీద, జ్ఞాపకశక్తి

> రజనీకాంత్‌తో చంద్రబాబు దూతలు కుదిర్చిన ఒప్పందం ఎన్టీఆర్ శత జయంతి సభతో పూర్తి కాలేదు. ఇంకా పెద్ద టాస్క్‌ను ఆయనకు అప్పగించినట్టు విశ్వసనీయ సమాచారం. బీజేపీ కేంద్ర నాయకులతో రజనీకాంత్‌కు ఉన్న సత్సంబంధాలను ఉపయోగించి టీడీపీతో ఎన్నికల పొత్తును కుదర్చాలి. కరకట్ట నివాసంలో జరిగిన తేనీటి విందులో ఈ అంశంపైనే చర్చ జరిగింది. ఇదే అంశం మీద ఢిల్లీలో నడ్డాతో మాట్లాడి వచ్చిన పవన్ కల్యాణ్ శనివారం నాడు జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో చంద్రబాబును కలిసి ప్రోగ్రెస్ రిపోర్టును అందజేశారు. అయితే ఆ రిపోర్టు అంత ఆశాజనకంగా లేదట. ఒక వేళ బీజేపీ కలవకపోయినా తామిద్దరం కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. బీజేపీపై ఒత్తిడి పెంచుతూనే ఉండాలని కూడా నిర్ణయించారట.

మీద ఆయనకున్న చులకన భావానికి ఇది నిదర్శనం. రజనీకాంత్ ప్రసంగం మాత్రం ఎన్టీఆర్ కోసం వచ్చినట్టనిపించలేదు. చంద్రబాబుపై చేసిన పొగడ్తలు కూడా సహజంగా లేవు. బాలకృష్ణపై చేసిన ప్రశంసలు వెటకారంలా ధ్వనించాయి. సినిమా రక్తి కట్టలేదు. 'బాషా'ను తీయబోతే 'బాబా' తయారైంది.

రజనీకాంత్‌తో చంద్రబాబు దూతలు కుదిర్చిన ఒప్పందం ఎన్టీఆర్ శత జయంతి సభతో పూర్తి కాలేదు. ఇంకా పెద్ద టాస్క్‌ను ఆయనకు అప్పగించినట్టు విశ్వసనీయ సమాచారం. బీజేపీ కేంద్ర నాయకులతో రజనీకాంత్‌కు ఉన్న సత్సంబంధాలను ఉపయోగించి టీడీపీతో ఎన్నికల పొత్తును కుదర్చాలి. కరకట్ట నివాసంలో జరిగిన తేనీటి విందులో ఈ అంశంపైనే చర్చ జరిగింది. ఇదే అంశం మీద ఢిల్లీలో నడ్డాతో మాట్లాడి వచ్చిన పవన్ కల్యాణ్ శనివారం నాడు జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో చంద్రబాబును కలిసి ప్రోగ్రెస్ రిపోర్టును అందజేశారు. అయితే ఆ రిపోర్టు అంత ఆశాజనకంగా లేదట. ఒక వేళ బీజేపీ కలవకపోయినా తామిద్దరం కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. బీజేపీపై ఒత్తిడి పెంచుతూనే ఉండాలని కూడా నిర్ణయించారట.

విజనరీ మేకోవర్ కోసం ఈ వారంలోనే మరో కార్యక్రమాన్ని ఢిల్లీ లాబీయిస్టులు కుదిర్చారు. రిపబ్లిక్ టీవీ వారు గత మంగళవారం నాడు ఒక సదస్సును నిర్వహించారు. ఇందులో చంద్రబాబుతో ప్రశ్నలు–జవాబుల కార్యక్రమం ఉండేలా లాబీయిస్టులు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముందే ఓ రెండుసార్లు ఛానల్ హెడ్‌తో బాబు చేత మాట్లాడించారట! కార్యక్రమంలో చంద్రబాబునుద్దేశించి యాంకర్ అడిగిన ప్రశ్నలు చూస్తే హాస్యాస్పదంగా ఉంటాయి. ప్రశ్నలూ–జవాబులూ లాబీయిస్టులే తయారు చేసినట్టు చిన్నపిల్లవాడికైనా అర్థమవుతుంది. 'మీరు గొప్ప దార్శనికులు. ప్రధాని కూడా దార్శనికుడు. ఇద్దరూ కలిస్తే మంచిదే కదా?', 'మీ మాటల్ని బట్టి చూస్తే మోదీ అంటే మీకు చాలా ఇష్టమని తెలుస్తున్నది. ఎన్డీఏ నుంచి బయటకు వచ్చినందుకు చింతిస్తున్నారా?', 'ఎన్డీఏ మేనిఫెస్టో, మీ మేనిఫెస్టో ఒకే రకంగా ఉంటాయి. మీరిద్దరూ దేశం కోసం పనిచేస్తున్నారు. భవిష్యత్తులో ఇద్దరూ కలిసి పనిచేయడం మీకు సమ్మతమేనా?' ఇలా ఉన్నాయి యాంకర్ ప్రశ్నలు.

ప్రధానమంత్రి కటాక్షం కోసం, బీజేపీ పొత్తు కోసం రిపబ్లిక్ టీవీ ఛానల్ ద్వారా దరఖాస్తు పెట్టుకున్నట్టుగా సాగిందా కార్యక్రమం. వాస్తవంగా దాని ఉద్దేశం కూడా అదే! బీజేపీతో పొత్తు విజ్ఞాపనతో పాటు చంద్రబాబు ఒక దార్శనికుడని పలుమార్లు పలకడం మేకోవర్ వ్యూహంలో ఒక భాగం. ఇంతకూ ఏమిటి చంద్రబాబు విజన్? తన దార్శనికతకు దర్పణంగా ఆయన రాసుకున్న 'మనసులో మాట' అనే పుస్తకాన్ని ఎందుకు దాచిపెట్టారు? వ్యవసాయ రంగాన్ని సంక్షోభం పాల్జేసి వేలాది మంది రైతులను ఆత్మహత్యలకు పురికొల్పినది చంద్రబాబు విజన్ కాదా? ప్రభుత్వ పాఠశాలలను శిథిలం చేసి పేద బిడ్డల్ని చదువులకు దూరం చేసిన విజన్ చంద్రబాబుదే కాదా? ప్రభుత్వాసుపత్రుల్లోకి వెళ్లే నిరుపేదల గోళ్లూడగొట్టి యూజర్ చార్జీలు వసూలు చేసిన దార్శనికత ఆయనదే కదా? వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను వ్యతిరేకించింది ఆయన విజనే కదా? ప్రభుత్వ ఉద్యోగులెందుకు దండగని ఔట్‌సోర్సింగ్ బాటలు వేసిన విజన్ ఆయనదే కదా! అదిగో అదే విజన్‌తో మళ్లీ ముందుకొస్తున్నాడు విజనరీ. ప్రజలను మభ్యపెట్టేందుకు మాత్రం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తానని చెబుతున్నాడు. ముఖ్యమంత్రి మొన్న ఒక సభలో చెప్పినట్టు చెరువు పక్కన ముసలి పులి పొంచి కూర్చున్నది. బంగారు కడియాన్ని చూపెట్టి కవ్విస్తున్నది. అఖిలాంధ్ర జనులారా తస్మాత్ జాగ్రత్త!

vardhelli1959@gmail.com

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023

బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని రహదారిని ముంచెత్తిన వరద





వరదనీటిలో కొట్టుకువచ్చిన వాహనాలను వెలికితీస్తున్న బల్దియా సిబ్బంది

విశ్వనగరం దిశగా ఓ వైపు పయనం.. బహుళ అంతస్తుల భవనాలు.. రయ్‌మంటూ మెట్రో పరుగులు.. ఐటీ నగరిగా ఖండాంతరాల ఖ్యాతి.. చారిత్రక వారసత్వానికి ప్రతీతి.. జాతీయ, అంతర్జాతీయ సమ్మేళనాలకు సమాహారం.. ఎన్నెన్నో వ్యాపార వాణిజ్య కలాపాలకు నెలవు... ప్రపంచ స్థాయి కార్ రేసింగ్‌కు ఆతిథ్యమిచ్చిన నగరం.. అండర్‌పాస్‌లు.. ఫ్లై ఓవర్లు.. ఎలివేటెడ్ కారిడార్లు.. ఎక్స్‌ప్రెస్‌వేలు.. ఆకాశ మార్గాలు.. ఇవన్నీ ఒక ఎత్తయితే....

చినుకొస్తే చిగురుటాకులా వణికిపోయే భాగ్యనగరం. ఉప్పొంగే వాగులు, నదులను తలపించే సన్నివేశాలు. శివార్లలో విలవిలలాడే సామాన్య జనం.. మునకలో కొట్టుమిట్టాడే సగటు నగర జీవి.. నాలాలు పొంగిపొర్లే దృశ్యాలు.. అందులో మనుషులు కొట్టుకుపోయే దైన్యం... గుండెలవిసేలా రోదనలు.. ఆర్తనాదాలు.. హాహాకారాలు.. అస్తవ్యస్తంగా మారిపోయే ట్రాఫిక్‌తో వాహనదారుల ఉక్కిరిబిక్కిరి.. ఇదంతా నాణేనాకి మరో పార్శ్వం.

తీరు మారదా? అధికారులు మారరా? ప్రభుత్వాలు పట్టించుకోవా? ఏళ్ల కాలం నాటి నాలా వ్యవస్థకు మోక్షం ఎప్పుడు? ఒకింత ఆశ్చర్యం.. మండే ఎండలతో జనం అల్లాడుతున్న వేళ.. తెల్లారేలోపే కుండపోత వర్షంతో సిటీ అతలాకుతలమైంది. రోడ్లు, కాలనీలు అకాల వర్షంలో మునిగిపోయాయి. కాలంకాని కాలంతో జనజీవనం స్తంభించింది. ఇక వర్షాకాలం వస్తే?

అభం శుభం తెలియని ఓ చిన్నారిని ఓ నాలా పొట్టనపెట్టుకుంది.. ఇలాంటి విషాద దృశ్యాలు భాగ్యనగరంలో ఇంకెన్నాళ్లు? ఎన్నేళ్లు?...

నాలా మరణాలు.. ఇంకెన్నాళ్లు?

- ప్రతియేటా ప్రాణాలు పోతున్నా పట్టించుకోని యంత్రాంగం
- అధికారాలు జోన్లకు మార్చాక పరిస్థితులు దారుణం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి.. పట్టింపులేని కమిషనర్, మేయర్
- క్షేత్రస్థాయి పర్యటనల్లేవు.. పనుల తీరు పట్టించుకునేవారు లేరు
- తూతూమంత్రపు ప్రకటనలు.. మొక్కుబడి చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: విశ్వనగరం.. ఆకాశమార్గాలు.. ఫ్లైఓవర్లు.. ఎలివేటెడ్ కారిడార్లు.. ఎక్స్‌ప్రెస్‌వేలు.. అండర్‌పాస్‌లతో ఘనత చాటుకుంటున్న ప్రభుత్వం 'నాలా మరణాలను' మాత్రం నిలువరించలేకపోతోంది. జీహెచ్‌ఎంసీ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా మరో పసిప్రాణం నాలాకు బలైపోయింది. పాల కోసం వెళ్తూ చిన్నారి నాలాలో పడి మృత్యువాత పడటానికి కారణం జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యమేనని వెల్లడైంది. నాలాల్లో మరణాలు జరగరాదని గత రెండేళ్లుగా మంత్రి కేటీఆర్ తీవ్ర హెచ్చరికలు చేస్తూ.. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నా ఘోరం జరిగిపోయింది. గత వర్షాకాలం నాలా మరణాలు లేవనుకుంటుండగానే ఈసారి వానాకాలం రాకముందే వేసవిలోనే అయినా నాలాలో పసిప్రాణం బలైపోయింది. దీనికి పూర్తి బాధ్యత జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డులదేనని చెప్పక తప్పదు. వీడీసీసీ రోడ్డు కోసం జీహెచ్‌ఎంసీ ఉన్న రోడ్డును తవ్వి పనులు చేపట్టింది. డ్రైనేజీ లైన్ వేయడంలో వాటర్‌బోర్డు జాప్యం చేసింది. పనుల ప్రాంతంలో గుంతను పట్టించుకోలేదు. పనులు జరిగే ప్రాంతాల్లో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, ఏర్పాటు చేయాల్సిన సైనేజీలు వంటివి పూర్తిగా గాలికొదిలేశారు.

వికేంద్రీకరణ ఇందుకేనా?

- ఎక్కడైనా అధికార వికేంద్రీకరణ సత్ఫలితాలిస్తుంది. జీహెచ్‌ఎంసీలో మాత్రం అది వ్యతిరేక ఫలితాలిస్తోంది. జీహెచ్‌ఎంసీలో జోన్లకు విస్తృతాధికారాలిచ్చారు. కమిషనర్ తనకున్న అధికారాలను కూడా జోన్లకు ధారాదత్తం చేశారు. దాంతో ఇక జోన్ల వారు ఆడిందిఆటగా సాగుతోంది. క్షేత్రస్థాయిలో పనుల తీరును పరిశీలిస్తున్న వారే లేకుండాపోయారు. ప్రధాన కార్యాలయ అధికారులు తనిఖీలు చేస్తారన్న భయం లేదు. జోన్లలోని దిగువస్థాయి అధికారులు, సిబ్బంది సైతం పనుల కంటే పైఆదాయానికే శ్రద్ధ చూపుతున్నారని గత మూడేళ్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వ పెద్దలు సైతం పట్టించుకున్న పాపాన పోలేదు.
- సర్కిళ్లు, జోన్లలోనే మంజూరు నుంచి పూర్తయ్యే వరకు పనులు జరుగుతుండటంతో ఉన్నతాధికారులను పట్టించుకోవడం మానేశారు. కమిషనర్, మేయర్ క్షేత్రస్థాయి పర్యటనల్లేవు. నిర్లక్ష్యం వహిస్తున్నవారిని పట్టించుకుంటున్నవారు లేరు. నిర్లక్ష్యం కారణంగానే బాలిక అసువులు బాసింది. దుర్ఘటనలు జరిగినప్పుడు మాత్రం పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని తూతూమంత్రపు ప్రకటనలు చేయడం.. చర్యల్లో భాగంగా దిగువస్థాయి వారిని సస్పెండ్ చేయడం వంటి మొక్కుబడి చర్యలు తప్ప కఠిన వైఖరి లేకపోవడంతో పెద్దగా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులను బాధ్యులను చేయడం లేదు. నాలుగురోజులు గడవగానే పరిస్థితులు మళ్లీ మొదటికొస్తున్నాయి.



దేవరకొండ బస్తీలో కూలిన రేకుల ఇల్లు



జలమయంగా మారిన సూర్యనగర్ బస్తీ

నిర్లక్ష్యానికి మూల్యం

ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

సాక్షి, సిటీబ్యూరో: కళాసిగూడ నాలాలో బాలిక మృతి చెందిన ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. బాధ్యులైన ఇద్దరు అధికారులపై వేటు వేసింది. రోడ్డు పనుల సందర్భంగా సరైన భద్రత చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించారంటూ సంబంధిత బేగంపేట సర్కిల్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.తిరుమలయ్య, ఔట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బి.ఎం. హరికృష్ణలను సస్పెన్షన్ చేసింది. ఈమేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దుర్ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా ఖైరతాబాద్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్. ఇందిరాబాయిని నియమించారు. పది రోజుల్లోగా విచారణ నివేదికను అందజేయాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేయకుండా, డైవర్షన్ సూచికలు లేకుండా నిర్లక్ష్యం వహించడంతో సస్పెన్షన్ చేసినట్లు పేర్కొన్నారు. పనుల్లో నిర్లక్ష్యమే బాలిక మరణానికి కారణమైందని పేర్కొన్నారు.





కళాసిగూడలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి



కళాసిగూడలో గుమిగూడిన జనాలు

బల్దియా మేలుకో!

- నాలాలో పడి బాలిక మృత్యువాత
- గుండెల్ని పిండేసిన దుర్ఘటన
- రక్షణ చర్యలు తీసుకోకపోతే మరిన్ని ప్రమాదాలు
- నిర్లక్ష్యాన్ని పాతరేస్తేనే ప్రాణాలకు భద్రత
- బల్దియా నిద్రమత్తు వీడితేనే ప్రజలకు రక్షణ

సాక్షి, సిటీబ్యూరో: తెల్లవారగానే బాలిక మృతి వార్త నగర ప్రజల గుండెల్ని పిండివేసింది. వేసవిలోనే చోటు చేసుకున్న ఈ దుర్ఘటన రాబోయే రోజుల్లో ఎలా ఉండాలో తీవ్రంగా హెచ్చరించినట్లయింది. అకాల వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియదు. వర్షాకాలం వచ్చేంత వరకు పనులు చేస్తామంటే కుదిరేలా లేదు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కచ్చితమైన రక్షణ చర్యలు తీసుకోని పక్షంలో ఇంకెన్నో దారుణాలు జరగనున్నాయి. జీహెచ్‌ఎంసీ ఇకనైనా తగిన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో ఇంకెంత మూల్యం చెల్లించాల్సి ఉంటుందోనని నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దారుణాలు అడ్డుకట్ట పడదా?

ప్రతియేటా తగిన రక్షణ చర్యలు తీసుకున్నామంటున్నప్పటికీ, జరగాల్సిన దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ పనుల్లో నిబంధనల పాటింపు ప్రకటనల్లో తప్ప వాస్తవంగా అమలు కావడం లేదు. కాగితాల్లో తప్ప కార్యరూపం దాల్చడం లేదు. పనులు జరిగే ప్రాంతాల్లో బారికేడ్లు, దారి మళ్లింపు సైనేజీలు, రాత్రివేళ విద్యుత్ లైట్లు, పనులు చేస్తున్న ఏజెన్సీ, సంబంధిత అధికారి పేర్లు, ఫోన్ నంబర్లు వంటివి ఎక్కడా కనిపించవు. అది ఎస్సార్‌డీపీ పని అయినా, ఎస్‌ఎన్‌డీపీ పని అయినా, మరో పని అయినా అంతే. తాజా ఘటనలో బాలిక మరణానికి కారణం రోడ్డు పనులు. కొత్త రోడ్డు కోసం పాతరోడ్డును రెండు వారాల క్రితం తవ్వారు. రోడ్డుపై గుంత ఉన్నా దానికి అడ్డుగా ఏది పెట్టకపోవడం, బారికేడ్లు, సైనేజీల వంటివి లేకపోవడంతో అక్కడ గుంత ఉన్నట్లు తెలియకుండా పోయింది. నాలాల్లో ఎలాంటి ప్రాణాపాయం జరగరాదని మంత్రి కేటీఆర్ పలు పర్యాయాలు అధికారులను హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పసిప్రాణం పోయింది.

నిండా నిర్లక్ష్యం..

వర్షాకాలం కాకపోయినా వర్షాలు కురుస్తున్నాయి. ఇంకా వర్షాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరికలున్నాయి. అయినా అధికారులు నిర్లక్ష్యం వీడలేదు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కనీస జాగ్రత్తలు తీసుకోలేదు.

పట్టింపులేని తనం..

అధికారులకు ఎప్పటినుంచో చెబుతున్నాం అని పేర్కొన్న మేయర్ ఎంత కాలంగా చెబుతున్నారో.. అయినా శ్రద్ధ చూపనందుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఆమెకే తెలియాలి. మేయర్, కమిషనర్, చీఫ్ ఇంజినీర్లు క్షేత్రస్థాయి తనిఖీలు చేసి.. లోపాలు దృష్టికి వచ్చినప్పుడు వెంటనే తగిన చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఘటనలు జరిగేవి కావనే అభిప్రాయాలున్నాయి.

నిద్రమత్తు వీడరా..?

నాలా సేఫ్టీ ఆడిట్‌లో భాగంగా ఎస్ఎన్‌డీపీ పనుల్లోనే కాదు నడిచే దారుల్లో, రోడ్లు, ఫుట్‌పాత్‌ల కింద, నాలాలు, మురుగునీటి లైన్లు ఉన్న ప్రాంతాల్లో గోతులు, గుంతలు లేకుండా చేయాలి. లేనిపక్షంలో వాన కురిసినప్పుడు అవి కనిపించక ప్రాణాపాయ పరిస్థితులుంటాయని గతంలోనే అధికారులకు ఆదేశాలు జారీ చేసినా నిద్రమత్తు వీడలేదు. నాలాల్లో పడి మరణాలు జరిగితే ఉన్నతాధికారులనే బాధ్యులను చేస్తామని మంత్రి కేటీఆర్ హెచ్చరించినా, మేయర్ నగరవ్యాప్తంగా పర్యటించాలని ఆదేశించినా చలనమే లేకుండాపోతోంది.

ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే..

- నాలాల్లో పడిపోకుండా అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు, సేఫ్టీ గ్రిల్స్ ఉండాలి.
- ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రాత్రివేళల్లో లైట్లుండాలి.
- నడిచే దారుల్లో, రోడ్లు, ఫుట్‌పాత్‌ల కింద నాలాలు, మురుగునీటి లైన్లు ఉన్న ప్రాంతాల్లో గోతులు లేకుండా చేయాలి. లేనిపక్షంలో వాన కురిసినప్పుడు అవి కనిపించక ప్రాణాపాయ పరిస్థితులుంటాయి.
- పనులు పూర్తికాని ప్రాంతాల్లో అటువైపు వెళ్లకుండా బారికేడ్లు, తదితర రక్షణ ఏర్పాట్లు చేయాలి.
- గుంతలు, రోడ్ కటింగ్‌లు ఉంటే సంబంధిత ఈఈ దృష్టికి తెచ్చి వెంటనే పూడ్పించాలి.
- రెండు మీటర్ల కంటే ఎక్కువ వెడల్పున్న అన్ని నాలాలకు ఫెన్సింగ్ ఉండాలి. అంతకంటేతక్కువ వెడల్పున్న నాలాలకు పైకప్పు ఉండాలి.
- అన్ని మ్యాన్‌హోళ్లు.. క్యాచ్‌పిట్లపై మూతలుండాలి. మూతలకు పగుళ్లు ఉండరాదు.
- పనులు జరిగే అన్ని ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులుండాలి.



బేగంపేట్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఎదుట..

ఎక్కడ.. ఎలా..?

వాన బీభత్సం ఇలా..

- లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సు అండర్ బ్రిడ్జి కింద వరదలో నిలిచిపోయింది.
- చందానగర్ జాతీయ రహదారిపై వరద నీరు సాఫీగా ప్రవహించకపోవడంతో పక్కనే ఉన్న సెల్లార్‌లోకి చేరడంతో దుకాణాలు పూర్తిగా మునిగిపోయాయి. దాదాపు రూ.35 లక్షల విలువైన సరుకులు తడిసి ముద్దగా మారాయి.
- మణికొండ పంచవటి కాలనీలో రిటర్నింగ్ వాల్ లేని చోట పందెన్‌వాగు ఒక్కసారిగా పొంగటంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌ల సెల్లార్లలోకి నీరు చేరింది.
- కీసర– భోగారం ప్రధాన రహదారిలో చెట్ల కొమ్మలు విరిగిపడటంతో పంచాయతీ సిబ్బంది, పోలీసులు జేసీబీ సహాయంతో తొలగించారు.
- గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు చేరి చెరువును తలపించాయి. వర్షం వచ్చిన ప్రతిసారి నరకం అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.
- గోల్కొండలోని టోలిచౌకి, నదీమ్ కాలనీ, గోల్కొండ హీరాఖానా తదితర ప్రాంతాలలో రోడ్లపై వరదనీరు ప్రవహించింది.
- నాచారం డివిజన్ పరిధిలోని ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రాంగణంలో నీరు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులకు గురయ్యారు. బాబానగర్, వీఎస్‌టీ కాలనీ, అంబేడ్కర్‌నగర్, ఎర్రకుంట, రాఘవేంద్రనగర్, ఇందిరానగర్,వీరారెడ్డినగర్‌లో వరద నీటితో ఇబ్బందులు పడ్డారు.
- బోడుప్పల్‌లోని సాయి భవానీనగర్ కాలనీని వరద నీరు ముంచెత్తింది.
- ముషీరాబాద్ డివిజన్ అడిక్‌మెట్ డివిజన్ పద్మా కాలనీ నాలాపై పార్కు చేసిన సుమారు 30 వాహనాలకు పైగా వరదలో అచ్చయ్యనగర్ వరకు కొట్టుకువచ్చాయి. వీటిని జీహెచ్‌ఎంసీ రెస్క్యూ టీమ్ రెండు భారీ క్రేన్‌ల సహాయంతో వాహనాలను బయటకు తీశారు. నడుములోతు మేర నీరు ప్రవహించడంతో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర అవస్థల పాలయ్యారు. వరద ఉద్ధృతికి పలు ఇళ్ల గోడలు కూలిపోయాయి.
- బేగంపేట్ నాలా పరీవాహక ప్రాంతాలు నీట మునిగాయి. అల్లంతోటబావి జల దిగ్బంధంలో చిక్కుకుపోయింది. బస్తీ రోడ్లను కాల్వలను తలపించాయి.
- తార్నాక డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మ్యాన్ హోళ్లు, ఓపెన్ నాలాలు పొంగి పొర్లాయి. రోడ్లు, రహదారులపై బురద పేరుకుపోయింది. లాలాపేట సత్యానగర్, ఇందిరానగర్, చంద్రబాబునగర్, శ్రీపురి కాలనీ, వినోభానగర్ తదితర బస్తీల్లోన్ని రోడ్లపై భారీగా వర్షం నీరు చేరింది. సత్యానగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పద్మా కాలనీ నాలాలో కొట్టుకువచ్చిన బైక్‌లు

సుమేధ.. ఆనంద్‌సాయి.. మౌనిక

ఇంకెందరు..?

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో వానాకాలంలోనే కాదు.. ఎప్పుడు వర్షం వచ్చినా ప్రాణాలు పోయే పరిస్థితులు దాపురించాయి. గత మూడేళ్లుగా నాలాల్లో పడి పసివాళ్ల మరణిస్తుండటం నగర ప్రజల హృదయాల్ని కలచివేస్తోంది. అభం శుభం తెలియని పసివాళ్లు నాలాలకు బలవుతున్నా.. సరైన రక్షణ చర్యలు తీసుకోకుండా వ్యవహరిస్తుండటం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రభుత్వ విభాగాల సమన్వయం లోపం కూడా ఇందుకు కారణం. రెండేళ్లక్రితం నేరేడ్‌మెట్‌లో సుమేధ అనే బాలిక మరణంతో అలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. అందుకనుగుణంగా రూ.300 కోట్లు కేటాయించారు. పనులు పూర్తయ్యాయని అధికారులు పేర్కొన్నారు. కానీ నాలాల్లో ప్రాణాలు పోయే పరిస్థితులు మాత్రం మారలేదు. పనులు జరిగే ప్రాంతాల్లో కనీస జాగ్రత్తలు పాటించని నిర్లక్ష్యం వల్లే తాజాగా సికింద్రాబాద్ కళాసిగూడలో మౌనిక అనే చిన్నారి మృతి చెందింది. చిన్నారులతో పాటు పెద్దలూ నాలాల్లో పడి మృతి చెందారు.

గత ఆరేళ్లలో నాలా మృతులు ఇలా..

- 2017 ఫిబ్రవరిలో యాకుత్‌పురా నియోజకవర్గంలో నాలాలోపడి రెండేళ్ల జకీఅబ్బాస్ అనే బాలుడు మరణించాడు.
- 2018 సెప్టెంబర్‌లో సరూర్‌నగర్‌లో నాలాలో పడి హరీష్ అనే యువకుడు మృతి చెందాడు.
- 2019లో సెప్టెంబర్‌లో నాగోల్ సమీపంలోని ఆదర్శనగర్ నాలాలో పడి పోచంపల్లి గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ మరణించాడు.
- 2020 సెప్టెంబర్‌లో నేరేడ్‌మెట్‌లో సుమేధ అనే 12 ఏళ్ల బాలిక నాలాలో పడిపోయి అసువులు బాసింది.
- 2021లో ఓల్డ్‌బోయిన్‌పల్లిలో ఆనంద్ సాయి అనే ఏడేళ్ల బాలుడు నాలాకు బలయ్యాడు.
- అంతకుముందు సైతం పలు సందర్భాల్లో పలువురు నాలాల్లో పడి అసువులు బాశారు.

నేలకూలిన స్తంభాలు

గ్రేటర్ జిల్లాల్లో 218 ఫీడర్ల పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: ఈదురు గాలితో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరా వ్యవస్థ అతలాకుతలమైంది. శనివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి గ్రేటర్ జిల్లాల్లో 218 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ బర్కత్‌పురా నాలాకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం నేలకూలింది. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ నాలాలో పడిపోయింది. రాజేంద్రనగర్, సికింద్రాబాద్, హబ్సిగూడ సర్కిళ్లలో లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో వైర్లు తెగిపడ్డాయి. సబ్‌స్టేషన్లలోని ఫీడర్లు ట్రిప్పవడంతో ఆయా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో గంట నుంచి రెండు గంటల్లోనే సరఫరాను పునరుద్ధరించగా ముషీరాబాద్, సికింద్రాబాద్, తదితర ప్రాంతాల్లో శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా కరెంట్ సరఫరా కాలేదు. దీంతో ఆయా ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో అంధకారం నెలకొంది. ఉక్కపోతకు తోడు దోమలు కంటిమీదకునుకు లేకుండా చేశాయి.



ముషీరాబాద్‌లో విరిగిపడిన విద్యుత్ స్తంభం



ఉస్మానియా ఆస్పత్రిలోని ఓ వార్డులో..



అంబర్‌పేట్‌లో నేలకొరిగిన చెట్టు



పుత్లీబౌలిలో..

ముగిసిన ఫిల్మ్ ఫెస్టివల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మూడు రోజులు జరిగిన 24వ జాతీయ విద్య ఫిల్మ్‌ఫెస్టివల్ ముగిసింది. శనివారం దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి సీఈసీ డైరెక్టర్ ప్రొ.జగత్ భూషణ్ అధ్యక్షత వహించగా రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 193 చిత్రాలు పోటీ పడగా 13 చిత్రాలకు అవార్డులను అందచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ ప్రొ.మృణాళిని, మాజీ డైరెక్టర్ ప్రొ.జగదీశ్వర్‌రావు, డాక్టర మధుసూదన్‌రెడ్డి, కోఆర్డినేటర్ రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public is hereby informed that my clients Shaik Qutub Uddin S/o Shaik Moin and Syed Wahed Ali S/o Syed Azeem Uddin R/o Karwan Hyd-TS has intends into an agreement of sale for purchase of House bearing No.13-1-1232/A/44, Ambedkar Nagar Colony, Kulsumpura, Karwan, Hyd-TS From it's Owners A. Ratnakar, A. Prabhakar, A. Swarna Latha Childrens of late A. Venkata residence of Hyderabad TS.

Any person(s) having any objection/claim/rights over property for the said transaction, may approach the undersigned within (7) days with all relevant documents from the date of this publication no claim will be entertained thereafter my clients will proceed for registration.

Sd/-
M/s I M SABRY,
MOHAMMED TOUFEEQ
ADVOCATES
Bin Siddique Plaza, Old 'X' Road, Mehdipatnam, Hyderabad -28
Cell No. 9347830109.
Date: 29-04-2023

మియాపూర్ మెట్రో నుంచి పుష్పక్ బస్సులు

మియాపూర్: మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు పుష్పక్ బస్సులను అందుబాటులోకి తెచ్చారు. శనివారం మియాపూర్ మెట్రో వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ యాదగిరి, చీఫ్‌మార్కెటింగ్ అధికారి రిషి కుమార్, ఎల్అండ్‌టీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరేంద్రనాథ్ తదితరులు పాల్గొని పుష్పక్ కేంద్రాన్ని ప్రారంభించారు. మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 24 గంటల పాటు పుష్పక్ బస్సులు రాకపోకలు సాగిస్తాయని ఈడీ యాదగిరి తెలిపారు. ఉదయం 6:30 నుంచి రాత్రి 10:30 వరకు 20 నిమిషాల వ్యవధిలో నడుస్తాయి. అలాగే రాత్రి 11:10 నిమిషాలకు నుంచి ఉదయం 6:10 వరకు 40 నిమిషాలకు ఒక బస్సు చొప్పున అందుబాటులో ఉంటుంది.మియాపూర్ మెట్రో స్టేషన్, జేఎన్టీయూ నుంచి విమానాశ్రయం వరకు చార్జీలు రూ. 300 ఉంటుంది. అలాగే శిల్పారామం, గచ్చిబౌలి నుంచి టిక్కెట్ రూ. 250 ఉంటుంది. గూగుల్‌పే.పేటీఎం, ఫోన్‌పే వంటి సదుపాయం కూడా ఉందని, ప్రయాణికులు నగదురహిత సేవలను కూడా వినియోగించుకోవచ్చునని ఆయన చెప్పారు.ఎయిర్‌పోర్టు ప్రయాణికులు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద పుష్పక్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

తమిళనాడు తరహాలో రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి



రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్యవేదిక సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో రేషన్ డీలర్లకు తమిళనాడు తరహాలో గౌరవ వేతనం చెల్లించాలని తెలంగాణ రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘాల ఐక్యవేదిక చైర్మన్ నాయికోటి రాజు, రేషన్ డీలర్ల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పుస్తె శ్రీకాంత్ డిమాండ్ చేశారు. రేషన్ డీలర్లకు 45 వేల నుంచి 50 రూపాయల వరకు గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ గోదాముల వద్ద వే బ్రిడ్జీలను ఏర్పాటు చేయాలని, డీలర్లకు ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ మేరకు త్వరితగతిన రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రేషన్ డీలర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఐక్యవేదిక వైస్ చైర్మన్ బత్తుల రమేష్, కన్వీనర్ రవీందర్, కో కన్వీనర్ మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జానకిరామ్, వల్లాల శ్రీధర్, ప్రసాద్, వీరేశం, సద్గురు ఆనంద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 22 నుంచి గోల్కొండ బోనాలు

గోల్కొండ: గోల్కొండ కోటలో కొలువుదీరిన జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాలు జూన్ 22 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 22 గురువారం మొదటి, జూన్ 25 ఆదివారం 2వ బోనం, జూన్ 29న గురువారం 3వ బోనం ఉంది. ఆదివారం జూలై 2న 4వ బోనం, జూలై 6న 5వ బోనం, 6వ బోనం జూలై 9న, 13 జూలైన 7వ బోనం ఉంటుంది. అదే విధంగా 8వ బోనం 16 జూలై ఆదివారం, జూలై 20న గురువారం 9వ పూజ ఉంటుందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణలో మొట్ట మొదటిసారిగా గోల్కొండ కోట నుంచే బోనాలు ప్రారంభమవుతాయి.

స్పెషల్ డ్రైవ్‌లో 2641 పాస్‌పోర్టు దరఖాస్తుల పరిశీలన

రాంగోపాల్‌పేట్: పాస్‌పోర్టు దరఖాస్తుల సమర్పణ కోసం సుదీర్ఘ కాలం నిరీక్షించకుండా ఉండేందుకు శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 2641 దరఖాస్తులను ప్రాసెస్ చేసినట్లు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సెలవు దినం అయినప్పటికీ కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. సాధారణ, తత్కాల్, పీసీసీల సేవల కోసం 3066 అపాయింట్‌మెంట్లు విడుదల చేయగా 3041 స్లాట్‌లను బుక్ చేసుకున్నారని తెలిపారు. శనివారం బుక్ చేసిన అపాయింట్‌మెంట్లలో 2936 మంది దరఖాస్తుదారులు రాగా వాటిలో 2641 దరఖాస్తులను 5 పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ప్రాసెస్ చేసినట్లు వివరించారు. మిగిలిన దరఖాస్తులకు సంబంధించి సరైన పత్రాలు లేని కారణంగా ప్రాసెస్ చేయలేదని తెలిపారు.

సచివాలయం చుట్టూ నో ఎంట్రీ

- ప్రారంభోత్సవం నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు
- పలు ప్రాంతాల్లో మళ్లింపులు సైతం..
- ఆహుతులకు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు



సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్‌సాగర్ తీరాన నిర్మితమైన కొత్త సచివాలయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ చుట్టుపక్కల మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ అదనపు సీపీ జి.సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆహూతుల వాహనాలు మినహా మిగిలిన వాటిని అనుమతించరు. ఖైరతాబాద్ జంక్షన్, నెక్లెస్ రోటరీ-ఎన్టీఆర్ మార్గ్‌లో వాహనాలకు అనుమతి ఉండదు. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి నెక్లెస్ రోటరీ వైపు వెళ్లే వాహనాలను నిరంకారి మీదుగా, ఇక్బాల్ మీనార్ నుంచి ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వాహనాలను తెలుగు తల్లి ఫ్లైఓవర్, కట్టమైసమ్మ, లోయర్ ట్యాంక్‌బండ్ మీదుగా పంపిస్తారు. ట్యాంక్‌బండ్ వైపు నుంచి ఎన్టీఆర్ మార్గ్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మీనార్ వైపు, బడా గణేష్ లైన్ నుంచి మింట్ వైపు వచ్చే వాహనాలను రాజ్‌దూత్ లైన్‌లోకి మళ్లిస్తారు. అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులకూ ఈ మళ్లింపులు వర్తిస్తాయి. నిర్దేశిత వేళల్లో ఖైరతాబాద్, ఓల్డ్ సైఫాబాద్, రవీంద్రభారతి, మింట్ కాంపౌండ్, తెలుగు తల్లి, నెక్లెస్ రోటరీ, నల్లగుట్ట, కట్టమైసమ్మ, ట్యాంక్ బండ్, లిబర్టీ జంక్షన్ల మీదుగా ప్రయాణించవద్దని పోలీసులు కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ఆహుతుల కోసం 2,151 కారు పాస్‌లు జారీ చేశారు. వీరికి వేర్వేరు ప్రాంతాల్లో అలాటింగ్ పాయింట్లు, పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ఇవి కాకుండా మరో 70 వాహనాలకు ఎన్టీఆర్ ఘాట్, 100 కార్లకు బీఆర్‌కేఆర్ భవన్, 1000 కార్లకు పీవీ నరసింహారావు మార్గ్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా నగర ట్రాఫిక్ పోలీసు అధికారిక సోషల్ మీడియా పేజ్‌లతో పాటు 90102 03626ను సంప్రదించాలని ట్రాఫిక్ చీఫ్ సుధీర్‌బాబు సూచించారు.

పార్కుల మూసివేత

సాక్షి, సిటీబ్యూరో: సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆ పరిసరాల్లోని పార్కులు, వినోద కేంద్రాలను ఆదివారం మూసివేయనున్నట్లు హెచ్ఎండీఏ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ మేరకు లుంబిని పార్కు, ఎన్టీఆర్ గార్డెన్, ఎన్టీఆర్‌ఘాట్, లేజర్‌షోలను మూసివేయనున్నారు. సచివాలయం పరిసరాల్లో నెలకొనే రద్దీ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రముఖుల రాకపోకల దృష్ట్యా సెక్రెటేరియట్ రూట్‌లలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉన్న సంగతి తెలిసిందే.

క్లుప్తంగా

అఖిలపక్ష నాయకులతో సమీక్ష సమావేశం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ఓటర్ నమోదుకు సంబంధించి అభ్యంతరాలు, రాజకీయ పార్టీలు లేవనెత్తిన పలు అంశాలపై శనివారం నియోజకవర్గ టీఆర్‌ఓ, డిప్యూటీ కమీషనర్ రవీందర్ కుమార్ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అఖిలపక్ష పార్టీ నేతలు హాజరై ఓటర్ నమోదుపై వచ్చిన పలు అభ్యంతరాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గతంలో నమోదు చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి స్టేటస్ ఏమిటనే దానిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పి. బాబురావు, ఎండి ఖాజా, జి. శ్రీకర్‌రావు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



గోశాలను సందర్శించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి శనివారం బాలానగర్‌లోని ఐడిపిఎల్‌లోని శివాలయం, గోశాలను సందర్శించారు. దేవాలయం వద్ద మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలించిన కార్పొరేటర్ మహేందర్ తదితరులు

మోతీనగర్: అవంతినగర్ తోటలో ఇరవై లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం స్థానిక మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సీసీ రోడ్డు నిర్మాణాన్ని స్థానిక ప్రజలు దగ్గరుండి నాణ్యతగా నిర్మాణం చేపట్టే విధంగా పరిశీలించాలన్నారు. నాణ్యతగా నిర్మాణం చేపట్టకపోతే తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎర్రస్వామి, రమేష్ నాయర్, నాగరాజు, శోభరాజన్, భాస్కర్, శ్రీను, మల్లేష్ యాదవ్, నర్సింలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సప్తదశ 17వ వార్షికోత్సవ, జన్మదిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు అమ్మవారికి విశేష అభిషేకం, శ్రీ చక్రార్చన, శ్రీవిద్యా హోమం, సాయంత్రం 5 గంటలకు నవ చండీ హోమం, రాత్రి 8.30 గంటలకు పల్లకీ సేవ, నీరాజన, మంత్ర పుష్పం వంటి పూజా కార్యక్రమాలు జరిగాయని ఆలయ చైర్మన్ కుమారస్వామి తెలిపారు. అదే విధంగా ఈ నెల 30వ తేదిన జరిగే పూజా కార్యక్రమాల్లో శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో నలభై లక్షల రూపాయల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతై సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తుల కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కూలిపోతున్న విద్యుత్ స్తంభాలు, తెగిపోతున్న వైర్లు



ఆల్విన్‌కాలనీలో విరిగిపడిన విద్యుత్ స్తంభం (ఫైల్)



ఆస్‌బెస్టాస్ కాలనీలో ఓ ఇంటి ముందు ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు

విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

ఆల్విన్‌కాలనీ: మండు వేసవి కాలంలోనే ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి పడిపోతున్నాయి. చిన్నపాటి ఈదురు గాలులకే స్తంభాలు కూలిపడుతుంటే రానున్న వర్షాకాలంలో తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ప్రజలు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, ఆస్‌బెస్టాస్ కాలనీ, వివేకానందనగర్, ఎల్లమ్మబండ, తదితర ప్రాంతాలలోని ఆయా కాలనీలు, బస్తీల్లో నాడు ప్రజల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభాలు శిథిలావస్థకు చేరుకోవటంతో పాటు ఇబ్బడి ముబ్బడిగా కేబుల్ వైర్లు సైతం ఆ విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేయటంతో అవి కాస్తా స్తంభాలకు భారంగా మారటంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి పోతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

- మరికొన్ని కాలనీల్లో సైతం విద్యుత్ వైర్లు ఇంటి గుమ్మాల ముందే మామిడితోరణాల్లా వేలాడుతున్నాయని, విద్యుత్ వైర్లు సరిచేసి ప్రాణ నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పదే పదే ఇంటి వద్ద విద్యుత్ బిల్లులు ఇచ్చే సిబ్బందికి, విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం ఉండటం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

- ప్రాణనష్టం జరిగితే వీరిలో చలనం కలగదని వాపోతున్నారు. గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి, గాలులకే ఆల్విన్‌కాలనీలో ఓ విద్యుత్ స్తంభం విరిగి పడింది. రాత్రి సమయంలో ఆరు బయట ఎవరూ లేకపోవటంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అదే పగటి పూట జరిగితే పెద్ద ఎత్తును ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యుత్ సిబ్బంది సైతం ఆయా కాలనీల్లో విద్యుత్ సమస్యలపై కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

- ధరణినగర్ హైటెన్షన్ లైన్ సమీపంలోని ఓ వీధిలో విద్యుత్ స్తంభంపై విద్యుత్ వైర్లకు ఏర్పాటు చేసిన ఛానల్‌కు బోల్టులు ఊడిపోయి ఛానల్ పడిపోయేలా ప్రమాదకరంగా ఉంది. పలుమార్లు అధికారులకు వివరించినా ఫలితం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఏ మాత్రం గాలులు వీచినా పెను ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. తక్షణమే మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉంది.

- గత వర్షాకాలంలో వివేకానందనగర్ కాలనీలో భారీగా విద్యుత్ స్తంభాలకు ఆనుకొని వున్న చెట్లు విరిగి పడటంతో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్‌స్తంభాలు సైతం కూలిపోయిన సంఘటనలు ఉన్నాయి.

అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి



విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. గత ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని అటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. చెట్ల కొమ్మలు తొలగించటంతో పాటు విద్యుత్ స్తంభాలు, వైర్లను సైతం పరిశీలించి జాయింట్లు ఉన్న విద్యుత్ వైర్లను తక్షణమే తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

-కుమార్‌యాదవ్, ఆల్విన్‌కాలనీ



ధరణినగర్‌లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ ఛానల్



వివేకానందనగర్‌లో ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి



కార్పోరేటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శనివారం కార్పొరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వారికి పలు సూచనలు చేశారు. దశాబ్ధాలుగా కాని పనులు నేడు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో పూర్తి చేస్తున్నామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ...

ముఖ్యమంత్రిసహాయ నిధి పథకం క్రింద మంజూరైన 22 మంది లబ్ధిదారులకు రూ.9 లక్షల 60 వేల చెక్కులను శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పంపిణీ చేశారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పాలి



సమ్మర్ క్యాంపును ప్రారంభించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: విద్యార్థులకు చదువులతో పాటు సమాజంలో క్రమశిక్షణగా మెలిగేందుకు నైతిక విలువలు నేర్పడం చాలా అవసరమని బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఫ్రీ సమ్మర్ క్యాంప్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు ఆధ్యాత్మిక విజ్ఞానం చాలా అవసరమని సూచించారు. అందు కోసం బ్రహ్మకుమారీస్ ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిబిరం మంచి వేదిక అని అన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు శారీరక వ్యాయామాలు, మానసిక వికాస పాఠాలతో పాటు నైతిక విలువలు కూడా బోధించడం అభినందనీయమన్నారు. బ్రహ్మకుమారీస్ ఎస్ఆర్‌నగర్ సెంటర్స్ ఇన్‌చార్జి బీకే జ్యోతి మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు మెడిటేషన్, నైతిక విలువలు. ప్రకృతికి సంబంధించిన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



కావ్య అవెన్యూలో విద్యుత్ సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొలను వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్న స్థానికుల ఫిర్యాదుతో కార్పొరేటర్ కొలను వీరేందర్‌రెడ్డి శనివారం ఉదయాన్నే వర్షంలోనే కావ్య అవెన్యూ కాలనీలో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.గత కొన్ని రోజులుగా భారీ వర్షాల కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ అవుతుండటంతో వర్షం పడిన ప్రతి సారి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని స్థానికులు కార్పొరేటర్‌కు విన్నవించారు.

వెంటనే కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి బాచుపల్లి ఏఈ శాంతకుమార్‌కు సమస్యను వివరించి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షం పడ్డ ప్రతి సారి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.అదే విధంగా స్థానికంగా నెలకొని ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ,రోడ్ల సమస్యలను ప్రజలు కొలన్ వీరేందర్‌రెడ్డికి వివరించారు.స్థానికంగా అవసరమైన అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఆయన స్థానికులకు హామి ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు విజయ్ కుమార్,రామక్రిష్ణ, శ్రీకాంత్, నవీన్, భరత్,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఆల్విన్‌కాలనీ: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో ముంపునకు గురైన ప్రాంతాలను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కారణంగా రోడ్ల మీద నిలిచిన వర్షపు నీటిని తొలగించటం జరుగుతోందన్నారు. అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, రాజబాబు, జానయ్య పాల్గొన్నారు.





క్రైం కార్నర్..

డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్, సి సురేందర్ గౌడ్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఎండీఎంఏ డ్రగ్స్

భాగ్యనగర్‌కాలనీ: సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసిపి చంద్రశేఖర్ నిందితుల వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన యూసఫ్ షరీఫ్ (27), షాబాజ్‌ఖాన్ (21) బెంగుళూరులోని ఓ వస్త్ర దుకాణంలో సేల్స్ బాయ్‌గా పనిచేసేవారు. వచ్చిన జీతం సరిపోక పోవటంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బెంగుళూరులోని మాదకద్రవ్యాలు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే కూకట్‌పల్లి వై జంక్షన్ సమీపంలో శనివారం ఉదయం అనుమానస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించగా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు నేరాన్ని అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి 2 లక్షల 20 వేల రూపాయల విలువ చేసే 22.9 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్‌తో పాటు మూడు సెల్‌ఫోన్‌లు, ఒక కత్తిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో కూకట్‌పల్లి సీఐ సురేందర్ గౌడ్, డీఐ ఆంజనేయులు, ఎస్ఐ రామకృష్ణ, ఎస్ఓటి సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతూ దొరికిపోయాడు

భాగ్యనగర్‌కాలనీ: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏసీపీ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా జడుపుడి గ్రామానికి చెందిన డుప్పాల నరేష్ (22) మూసాపేట జనతానగర్‌లో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న ఓ వెల్డింగ్ షాపులో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతనికి వచ్చిన జీతం చాలకపోవటంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో విశాఖపట్నంలోని బాలాజీ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. తక్కువ డబ్బులకు గంజాయిని కొనుగోలు చేసి ఎవరైతే గంజాయికి బానిసలయ్యారో ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకోవాలనే పథకం వేశాడు. ఈ క్రమంలోనే మూసాపేట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం సమీపంలో గంజాయితో పోలీసులకు చిక్కాడు. దీంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 1.7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే నరేష్‌కు గంజాయిని విక్రయించిన బాలాజీపై కేసు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నరేష్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. బాలాజీ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.





క్లుప్తంగా...

మే 15లోగా రూ. 50 కోట్లు డిపాజిట్ చేయండి

ఆర్టీసీ యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సహకార పరపతి సంఘాని (సీసీఎస్)కి మే 15లోగా రూ. 50 కోట్లు డిపాజిట్ చేయాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 8కి వాయిదా వేసింది. సీసీఎస్‌కు జమ చేయాల్సిన నిధులను ఆర్టీసీ సొంతానికి వాడేసుకోవడంతో వడ్డీ సహా రూ. 900 కోట్ల బకాయిలు ఏర్పడటం తెలిసిందే. బకాయిల్లో కొంతైనా చెల్లించాలని కోరినా యాజమాన్యం స్పందించకపోవడంతో సీసీఎస్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ పి.మాధవీదేవి విచారణ చేపట్టారు. అయితే ఈ పిటిషన్‌లో ఆర్టీసీ మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. రూ.100 కోట్ల డిపాజిట్‌కు ఆరు నెలలు గడువు ఇవ్వాలని కోరింది. దీనిపై జీపీ వాదిస్తూ నెలనెలా రూ. 10 కోట్లు చెల్లించాలన్న కోర్టు ఆదేశాల మేరకు ఇప్పటికే సీసీఎస్‌కు రూ. 44 కోట్లు డిపాజిట్ చేశామన్నారు. మరోవైపు సీసీఎస్ తరపు న్యాయవాది ఏకే జయప్రకాశ్‌రావు వాదిస్తూ 2022 నవంబర్ 25నకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు యాజమాన్యం తొలి నాలుగు వారాల్లో రూ.100 కోట్లు, తర్వాత నాలుగు వారాల్లో మరో రూ. 100 కోట్లు డిపాజిట్ చేయాలన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి..ఐఏను అనుమతించారు. విచారణను జూన్ 8కి వాయిదా వేశారు.

పక్వానికి రాని మామిడి తీసుకురావద్దు



సాక్షి, హైదరాబాద్: బాటసింగారం మార్కెట్‌కు పక్వానికి రాని మామిడి కాయలను తీసుకురావద్దని మార్కెట్ కమిటీ కార్యదర్శి చిలుక నరసింహారెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల అకాల వర్షాల కారణంగా కొందరు రైతులు పక్వానికి రాని మామిడికాయలు కోసి మార్కెట్‌కు తీసుకొస్తున్నారని తెలిపారు. దీంతో ఆ కాయలకు ధర రాక రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ మధ్య మార్కెట్ ఎక్కువ మొత్తంలో కాయలు రావడంతో మామిడి ధర పడిపోయిందని చెప్పారు. రైతులు అకాల వర్షాలకు భయపడి ఒకేసారి కాయలను తెంపొద్దని సూచించారు. పక్వానికి వచ్చిన కాయలు మాత్రమే మార్కెట్‌కు తీసుకురావాలని కోరారు. కాయలు తెచ్చిన రైతులకు ఏవైనా ఇబ్బందులుంటే మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో లేదా 7330733189 ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

సాక్షి, హైదరాబాద్: మైనార్టీ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ యూసుఫ్, టీకుమల్ల సమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసినప్పటి నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒకేరకమైన వేతనాన్ని ఇస్తున్నారని తెలిపారు. నామమాత్రమైన వేతనంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీ గురుకులాల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగిన వేతనం చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు.

సత్యపాల్ చెప్పిన విషయాలపై మౌనమేల?

లోక్‌సభ కాంగ్రెస్ విప్ గౌరవ్ గొగోయ్



సాక్షి, హైదరాబాద్: పుల్వామా దాడి వెనుక వాస్తవాల గురించి జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ వెల్లడించిన విషయాలపై కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఎందుకు ఉంటోందని లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ విప్ గౌరవ్‌గొగోయ్ ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధాని మోదీ మౌనంగా ఉండడమే కాకుండా, వాస్తవాలు చెప్పిన వారిపై కేసులు పెట్టడం దారుణమని వ్యాఖ్యానించారు.గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, టీపీసీసీ నేతలు పొన్నం ప్రభాకర్, మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పుల్వామా దాడి ఘటనపై సత్యపాల్ మాలిక్ వెల్లడించిన అంశాలతో బీజేపీ వల్లించే జాతీయవాద నిజస్వరూపం బట్టబయలైందన్నారు.

ఔట్‌సోర్సింగ్‌తో ఆర్టీసీకి ముప్పు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ లాజిస్టిక్ విభాగం బస్సులు నడిపేందుకు, డిపోల్లో సాధారణ బస్సుల పార్కింగ్‌కు భారీ ఎత్తున ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల నియామకానికి యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలతో సంస్థ బలహీనపడే ప్రమాదం ఉందని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 44 శాతం బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకోవడం, ఇప్పుడు డ్రైవర్ పోస్టుల్లో ఔట్‌సోర్సింగ్ నియామకాలతో ప్రైవేటీకరణ ముప్పు ఉందని కార్మికులు ఆందోళన చెందుతున్నారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సొంత బస్సులు, సిబ్బంది ద్వారా ఆర్టీసీని బలోపేతం చేయాలని కోరారు.

ఓ వెయిట్ లాస్ క్లినిక్ నిర్వాకంతో నగరానికి చెందిన ఓ మహిళ తీవ్ర అనారోగ్యం పాలైంది. తాజాగా చోటు చేసుకున్న ఈ ఉదంతంలో... కార్ఖానాలోని సదరు క్లినిక్‌పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. నగరంలో జేబులు ఖాళీ చేయడంతోపాటు రోగాల పాలు చేస్తున్న వెయిట్ లాస్ క్లినిక్స్ నయామోసాలకు ఇది తాజా ఉదాహరణ మాత్రమే.

సాక్షి, హైదరాబాద్: నగరం ఇప్పుడు ఒబె'సిటీ' క్యాపిటల్‌గా మారింది. అధిక బరువుతో బాధపడేవారితో పాటు ఆ బాధను సొమ్ము చేసుకోవాలనుకునే చికిత్సా కేంద్రాలూ పుట్టగొడుగుల్లా పెరిగాయి. కానీ వీటిలో పలు వెయిట్ లాస్ సెంటర్లకు సరైన చికిత్సా విధానం లేదు. సరైన వైద్య నిపుణులు లేరు. దీంతో తోచిన వైద్యం చేస్తున్నారు. రూ.వేలకు వేలు ముందే కట్టించేసుకుంటూ నెలల తరబడి ట్రీట్‌మెంట్స్ సాగదీస్తున్నారు. వెరసి ఎటువంటి ఫలితం లేకపోగా డబ్బులు పోగొట్టుకుంటున్నారు. పోనీ పోతే పోయింది డబ్బే కదా అనుకోవడానికి లేదు.. చాలామంది డబ్బుతో పాటు అనారోగ్యాల పాలవుతున్నారు. అదే ఇప్పుడు ఆందోళనకరంగా మారింది.



పేరు 'చికిత్స'.. ఫలితం 'రోగం'

ఒబెసిటీ క్లినిక్‌ల నిర్వాకం

- అధిక బరువు తగ్గకపోగా అనారోగ్యం
- వెయిట్‌లాస్ చికిత్స కేంద్రాల నయామోసం

కరెంట్ షాక్స్‌తో వాంతులు.. కడుపునొప్పి



15 కిలోల బరువు తగ్గడానికి 30 ఏళ్ల క్లయింట్ మహేశ్వరి కార్ఖానాలోని కలర్స్ క్లినిక్‌ని ఆశ్రయించింది. దీంతో ఆమెకు గత ఏప్రిల్ 15 నుంచి చికిత్స ప్రక్రియ మొదలైంది, ఆ తర్వాత ఆమెకు క్లినిక్ సిబ్బంది కరెంట్ షాక్స్ ఇచ్చారు. అలాగే కొన్ని మందులు కూడా ఇచ్చారు. వీటి కారణంగా ఆమెకు తీవ్రంగా వాంతులు, కడుపునొప్పి మొదలయ్యాయి. దీని గురించి క్లినిక్ సిబ్బందికి చాలాసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలోనే శనివారం ఆమె స్పృహ తప్పి పడిపోయారు. దీంతో ఆమె భర్త ఫిర్యాదు మేరకు క్లినిక్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

శరీరం కాలిపోయింది...

అధిక బరువు తగ్గించే చికిత్స కోసం నగరవాసి గాయత్రి రాణా గచ్చిబౌలిలోని రిచ్ స్లిమ్మింగ్ అండ్ కాస్మెటిక్ క్లినిక్‌కు రూ.3 లక్షలు చెల్లించారు. మూడు నెలల చికిత్స వల్ల కనీసం 1% ప్రయోజనం పొందలేదు. పైగా 30డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద 'మెషినరీ' ఉపయోగించడటం వలన చికిత్స సమయంలో తనకు కాలిన గాయాలు సహా ఒంటిపై ఇతరత్రా అనేక గాయాలయ్యాయని ఈ విషయాన్ని క్లినిక్‌లోని సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పందన రాలేదని, సరైన వైద్యం అందించేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని ఆమె ఆరోపించారు. ఆమె ఫిర్యాదు పై విచారణ జరిపిన జిల్లా వినియోగదారుల ఫోరం నష్టాన్ని నిర్ధారించి, ఆమె చెల్లించిన రూ.3 లక్షలను 6% వడ్డీతో వాపసు చేయాలని ఇతర ఖర్చుల నిమిత్తం రూ.5,000 చెల్లించాలని క్లినిక్‌ని ఆదేశించింది.



వెన్నునొప్పి, చర్మ సమస్యలు..

నగరానికే చెందిన కె.హాసిని యాదవ్ చికిత్స కోసం లైఫ్ స్లిమ్మింగ్ అండ్ కాస్మెటిక్ క్లినిక్ ను సంప్రదించారు. తుంటి భాగంలో కొన్ని అంగుళాల కొవ్వు తగ్గించే చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. మూడు నెలల్లో కనీసం 10–15 కిలోల బరువు తగ్గుతుందని ఆమెను క్లినిక్ నిర్వాహకులు నమ్మించారు. దాంతో ఆమె చికిత్స రుసుముగా రూ.లక్ష చెల్లించారు. నాలుగు నెలలు గడిచినా అంగుళం, బరువు తగ్గలేదని పైగా తనకు కొత్తగా వెన్నునొప్పితో పాటు చర్మ సమస్యలు మొదలయ్యాయని ఆమె ఆరోపించారు. తన తొమ్మిది నెలల చికిత్స సమయంలో, ఫిజియోథెరపిస్ట్‌ని కనీసం ఆరు సార్లు మార్చారని, నేర్చుకోవడానికి ప్రయోగాలు చేయడానికి తనను ఒక మోడల్‌గా ఉపయోగిస్తున్నట్లు అనిపించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె కూడా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా నష్టపరిహారం ఇవ్వాలని క్లినిక్‌ను ఆదేశించింది.

జాగ్రత్తలు తీసుకోవాలి

బరువు తగ్గించుకునే చికిత్సలు అందించే కేంద్రాల్లో ఉన్న నిపుణుల గురించి క్షుణ్నంగా తెలుసుకోవాలి. ఏ ఆరోగ్య సమస్యలు రావని నిర్ధారించుకున్నాక, అది కూడా వైద్యుని సలహా తీసుకున్న తర్వాతే చికిత్స గురించి ఆలోచించాలి.

- వీలైనంత వరకూ మందులు, కఠినమైన వ్యాయామాలు, మసాజ్‌ల ద్వారా కాకుండా నిదానంగా ప్రారంభించి తగినంత సమయం తీసుకుని బరువు తగ్గే విధానాన్ని ఎంచుకోవాలి.
- ప్రకటనలు, ఆర్భాటాలు చూసి కాకుండా గత చరిత్ర, వ్యక్తిగత అనుభవాలు తెలుసుకుని క్లినిక్స్‌ను సెలక్ట్ చేసుకోవాలి. సంప్రదించిన రెండో నిమిషం నుంచే డబ్బులు కట్టమని ఒత్తిడి చేసే క్లినిక్స్‌ను దూరంగా పెట్టడమే మంచిది.

నన్ను, నా బిడ్డను కాపాడండి

సుడాన్‌లో చిక్కుకుపోయిన బాధితురాలి వేడుకోలు



సాక్షి, హైదరాబాద్: 'తుపాకుల మోతతో వాతావరణం భయానకంగా తయారైంది.. మేం ఎన్నాళ్లు బతుకుతామో తెలియదు.. ఆకలితో అలమటిస్తున్నాం.. నిత్యావసరాలు దొరకడంలేదు. కల్లోలంతో బయటకు వెళ్లే పరిస్థితి లేదు.. నన్ను, నా కుమారుడిని రక్షించండి' అని సుడాన్‌కి చెందిన బరా ఆదామ్ వేడుకుంటున్నారు. హైదరాబాదీని వివాహమాడిన బరా ఆదామ్ వెటర్నరీ వైద్యురాలు. నగరానికి చెందిన అబ్దుల్ హసీబ్ అసద్‌ను పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత సుడాన్‌కు వెళ్లిన బరా అంతర్యుద్ధంలో చిక్కుకుపోయారు. తనతోపాటు రెండేళ్ల కుమారుడిని కాపాడాలంటూ ఆమె భారత ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.నియాలా నగరంలో నివసిస్తున్న తన ఇంటిపైనా బాంబులు పడ్డాయని, దీంతో ఇళ్లు కొంత ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

నా భార్యా బిడ్డలను రక్షించండి

కాగా, ఆపరేషన్ కావేరిలో భాగంగా సుడాన్‌లో చిక్కుకుపోయిన తన భార్య, కుమారుడిని కాపాడాలని కిషన్‌బాగ్‌కు చెందిన అబ్దుల్ హసీబ్ అసద్ 'సాక్షి' ద్వారా మొరపెట్టుకున్నారు. అక్కడ విద్యుత్తు సరఫరా, ఇంటర్నెట్ సరిగ్గా పని చేయకపోవడంతో భార్యతో ఫోన్‌లో మాట్లాడాలన్నా కుదరడంలేదని.. కొడుకును కూడా చూడలేకపోతున్నానని ఆందోళన వ్యక్తం చేశారు. 2020లో ఉద్యోగం కోసం కువైట్ వెళ్లగా.. .అక్కడ పరిచయమైన బరా ఆదామ్‌తో 2021లో పెళ్లి చేసుకున్నానని చెప్పారు. తన బిడ్డకి అక్కడి భారత రాయబార కార్యాలయంలో భారతదేశ పౌరసత్వం తీసుకున్నానని తెలిపారు. తన భార్యకు కూడా భారత దేశ వీసా కూడా ఉందన్నారు. దీంతో తన కుటుంబాన్ని రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు మిషన్ కావేరీ ద్వారా కాపాడాలని హసీబ్ విజ్ఞప్తి చేస్తున్నారు.

నవీన్ మిట్టల్ టార్గెట్ చేస్తున్నారు

- నాపై విచారణ చేపట్టే అధికారం ఏసీబీ, విజిలెన్స్‌కు లేదు
- వారం రోజుల్లో కొత్త రిజిస్ట్రార్ నియామకం
- మీడియాతో తెయూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్



మాట్లాడుతున్న తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, పక్కన మాజీ రిజిస్ట్రార్ విద్యావర్ధిని

తెయూ (డిచ్‌పల్లి): 'రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ తాను చెప్పిందే నడవాలంటారు. ఆయన చెప్పిన వారిని రిజిస్ట్రార్ చేయలేదనే కోపంతోనే నన్ను టార్గెట్ చేసి ఇదంతా చేస్తున్నారు. రెండేళ్లుగా రూసా నిధులు రూ.20 కోట్లు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు'అని తెలంగాణ యూనివర్సిటీ(తెయూ) వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ ఆరోపించారు. తెయూ పరిపాలనా భవనంలోని ఎగ్జిక్యూటివ్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధినితో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 19న హైదరాబాద్ రూసా భవనంలో జరిగిన తెయూ పాలకమండలి (ఈసీ) 55వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు రద్దు చేస్తూ హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు వీసీ తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రొఫెసర్ యాదగిరి రిజిస్ట్రార్ బాధ్యతల నుంచి వెంటనే తప్పుకోవాలని, లేదంటే అతనిపై పోలీసు కేసు నమోదు చేయిస్తామని వీసీ పేర్కొన్నారు. వారం రోజుల్లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఒకరిని తెయూ రిజిస్ట్రార్‌గా నియామకం చేస్తామని వీసీ తెలిపారు. తనను రీకాల్ చేయాలంటే అసెంబ్లీలో 2/3 మెజార్టీతో తీర్మానం చేయాల్సి ఉంటుందని, తనపై విచారణ జరిపే అధికారం ఏసీబీ, విజిలెన్స్‌కు లేదని వీసీ స్పష్టం చేశారు. ఈ నెల 19న ఈసీ సమావేశానికి హాజరైన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధినిని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణ ఎదుటే 'గెటవుట్'అంటూ కమిషనర్ నవీన్ మిట్టల్ అవమానించారని వీసీ చెప్పారు. ఈ విషయంలో తనకు, నవీన్‌మిట్టల్‌కు మధ్య వాగ్వాదం నెలకొనడంతో తాను సమావేశం నుంచి వాకౌట్ చేశానని తెలిపారు. తాను సమావేశంలో లేకుండా పాలకమండలి తీసుకునే నిర్ణయాలను చైర్మన్ హోదాలో వీసీగా తాను లేదా గవర్నర్ కానీ ఆమోదించాల్సి ఉంటుందని, లేదంటే ఆ నిర్ణయాలు చెల్లవని వీసీ స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే తాను కొనుగోళ్లు, చెల్లింపులు చేశానని, కొందరు అధ్యాపకులు కావాలని తనపై ఆరోపణలు చేస్తున్నారని రవీందర్ వెల్లడించారు.

సాగునీటి రంగం నిర్వీర్యం

సర్కారు తీరుపై భట్టి విక్రమార్క ధ్వజం



జనగామ మండలం ఎర్రకుంటతండా ఏసీనగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో పొన్నాల లక్ష్మయ్య

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. పీపుల్స్ మార్చ్‌లో భాగంగా శనివారం జనగామ మండలంలోని పలు గ్రామాల మీదుగా పాదయాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంది. మార్గమధ్యలో కూలీలు, రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కొత్రతండా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు.

వైఎస్ హయాంలో దేవాదుల నిర్మిస్తే..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో సుమారు 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో దేవాదుల ప్రాజెక్టుకు మోక్షం లభించిందని భట్టి తెలిపారు. కరువుతో అల్లాడిపోతున్న జనగామ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు జలయజ్ఞంలో భాగంగా వైఎస్‌ఆర్ సహకారంతో నాటి ఇరిగేషన్ మంత్రి పొన్నాల లక్ష్మయ్య దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చారన్నారు. వరంగల్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాలకు మేలు చేరకూర్చేలా చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించారన్నారు. 5 లిఫ్ట్ పాయింట్లతోపాటు అదనంగా 6 రిజర్వాయర్లు, 10 చిన్న చెరువుల సామర్థ్యాన్ని పెంచామన్నారు. రూ. 9 వేల కోట్లతో 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను పూర్తి చేశామన్నారు. పాత చెరువులైన భీమ్ లింగాపూర్, రామప్ప, సాలివాగు, నగరం, పులిగుర్తి, ధర్మసాగర్‌ల సామర్థ్యం పెంచడంతోపాటు గండిరామారం, బొమ్మకూర్, తపాస్‌పల్లి, జల్లగూడెం, చీటకోడూర్, అశ్వరావుపల్లి, ఘన్‌పూర్ వంటి కొత్త ప్రాజెక్టుల నిర్మాణం సైతం వైఎస్‌ఆర్ హయాంలోనే జరిగిందని భట్టి చెప్పారు. గోదావరి, కృష్ణా బేసిన్‌లను వేరుచేసేలా అత్యంత ఎత్తయిన ప్రదేశంలో ప్రస్తుత సిద్దిపేట జిల్లాలోని తపాస్‌పల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణం చేసినట్లు చెప్పారు. అక్కడినుంచి అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేలా డిజైన్ చేశారన్నారు.

విభజన తర్వాత కాలువలకూ దిక్కులేదు..

కాలువల నిర్మాణం పూర్తి చేసి సాగునీటిని విడుదల చేసే సమయంలో తెలంగాణ ఉద్యమం ఫలితంగా రాష్ట్ర విభజన జరగ్గా ఆ తర్వాత ఏర్పడ్డ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత తొమ్మిదిన్నరేళ్లలో తాము నిర్మించిన ప్రాజెక్టులకు డిస్ట్రిబ్యూటరీ కాలువలు కూడా తవ్వించలేదని భట్టి విమర్శించారు. తెలంగాణ తెచ్చుకున్న ఉద్దేశాలను నెరవేరనీయకుండా, కరువు కాటకాలు, ప్రజలు ఆకలితో అలమటించేలా చేస్తున్న భూస్వామ్య ఫ్యూడల్ మనస్తత్వంతో ప్రస్తుత పాలన సాగుతోందని దుయ్యబట్టారు. దీన్ని అత్యంత తీవ్రమైన ప్రభుత్వ నేరంగా పరిగణించాలన్నారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్‌కు విద్యుదుత్పత్తి అవసరమయ్యేలా కంతనపల్లి బ్యారేజ్ వద్ద డిజైన్ చేశామని, దీనిని నిర్వీర్యం చేశారన్నారు. తన పాదయాత్ర పూర్తయిన వెంటనే.. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల సందర్శనకు బస్సుయాత్ర మొదలు పెడతామన్నారు. విలేకరుల సమావేశంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి



జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ ప్రభంజనం

హనుమకొండ చౌరస్తా: అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ(మెయిన్)–2023 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ కాకాజీకాలనీలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫలితాల వివరాలను వెల్లడించారు. తమ విద్యార్థులు బి.సమీత్ జాతీయ స్థాయిలో రిజర్వేషన్ కేటగిరీలో 7వ ర్యాంకు, సాత్విక్ 20వ ర్యాంకు, చవాన్ అఖిల 22వ ర్యాంకు, శ్రీవర్షిత్ 34వ ర్యాంకు సాధించారని తెలిపారు. వీరితోపాటు మరో 11 మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఎస్ఆర్ కీర్తిప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలబెట్టారని వివరించారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన, ఉన్నతమైన ఫ్యాకల్టీతో ఈ విజయాలను సాధించగలిగామన్నారు. సమావేశంలో ఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలిండియా ఫస్ట్ ర్యాంకుతో శ్రీచైతన్య రికార్డు



హైదరాబాద్:జేఈఈ (మెయిన్స్)–2023 ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించి శ్రీ చైతన్య రికార్డ్ సృష్టించింది. 300కు 300 మార్కులు సాధించి తమ విద్యార్థి వెంకట కౌండిన్య 1వ ర్యాంకు సాధించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ తెలిపారు. అదేవిధంగా కె.సాయినాథ్ శ్రీమంత్ 10 ర్యాంక్, టాప్ 10 లోపు 2 ర్యాంకులు, 100 లోపు 23 ర్యాంకులు, ఆలిండియా అన్ని బ్రాంచీల నుండి టాప్ 100 లోపు ర్యాంకులు, 1000లోపు 149 ర్యాంకులు, ఆల్ కేటగిరీలలోనూ టాప్ 100 లోపు 97 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనితరసాధ్యమైన ప్రోగ్రాములు, మైక్రోషెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టమ్, నిరంతరం శ్రమించే టాప్ ఫ్యాకల్టీ వల్లే ఇంతటి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులనువిద్యా సంస్థల అధినేత డాక్టర్ బీఎస్ రావు అభినందించారు.

ఓపెన్‌లో నారాయణ 2, 5, 6 ర్యాంకులు



హైదరాబాద్: జేఈఈ (మెయిన్స్)–2023 ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 2, 5, 6 ర్యాంకులతో తమ విద్యార్థులు సత్తా చాటారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ పి. సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. లోహిత్ ఆదిత్య సాయి 2వ ర్యాంకు, కౌశల్ విజయ్ వార్గేయ 5వ ర్యాంకు, ఎన్.సాయి దుర్గారెడ్డి 6వ ర్యాంకుతో.. పదిలోపు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఒక ప్రకటనలో తెలిపారు. 100లోపు 25 టాప్ ర్యాంకులతోపాటు 1000లోపు ర్యాంకులను 160 మంది సాధించి, నారాయణ విజయ ప్రస్థానాన్ని కొనసాగించారని కొనియాడారు. వీరిలో 85 మంది విద్యార్థులు నారాయణ స్కూల్ విద్యార్థులన్నారు. నారాయణ అందిస్తున్న అనితరసాధ్యమైన శిక్షణ, ప్రోగ్రామ్స్, పటిష్ట ప్రణాళిక, నిబద్ధత వల్లనే ఈ విజయం సాధ్యమైందన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

కేకేఆర్ గౌతమ్ విద్యార్థుల విజయం

హైదరాబాద్: జేఈఈ (మెయిన్స్)–2023లో తమ విద్యార్థులు డి.ఫణీంద్రనాథ్ రెడ్డి ఆలిండియా 5వ ర్యాంకు, ఆర్.గ్రేస్ ఏంజిల్‌బాయ్ 5వ ర్యాంకు, ఎం.అవినాష్‌కుమార్ 10వ ర్యాంకు సాధించినట్లు డాక్టర్ కేకేఆర్ గౌతమ్ హైస్కూల్ యాజమాన్యం తెలిపింది. వివిధ కేటగిరీల్లో పదిలోపు మూడు ర్యాంకులు, వందలోపు 18 ర్యాంకులు సాధించారని ఒక ప్రకటనలో పేర్కొంది. ర్యాంకులను సొంతం చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు, వారితల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేసింది.

ఐఐటీ మెయిన్స్‌లో 'అల్ఫోర్స్' ప్రభంజనం



కొత్తపల్లి(కరీంనగర్): ఐఐటీ–జేఈఈ (మెయిన్స్)లో కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల ఐఐటీ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. జాతీయస్థాయిలో శనివారం విడుదల చేసిన ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థి పి.రాకేశ్ 12వ ర్యాంకుతో సత్తాచాటారు. బి.మారుతి – 228వ ర్యాంకు, ఎ.ఇషాంత్‌రెడ్డి – 250, ఎం.అభిరామ్ – 448, ఆర్.సుహాసితరెడ్డి – 480, జి.సాత్విక్ – 511, పి.హర్షవర్ధన్ – 520, కె.రాహుల్ – 554, ఎం.అరుణ్ – 624, ఎ.శివసాయిచరణ్ – 634, వై.శివమణి – 680, డి.వివేక్‌వర్ధన్ – 748, బి.రాజ్‌కుమార్ – 805, బి.శ్రీనివాస్ – 939వ ర్యాంకు సాధించారు. ఫిజిక్స్‌లో 100కు 100 మార్కులు సాధించి ఎం.అభిరామ్ అల్ఫోర్స్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించారు. 1000లోపు 14 మంది, ఐదు వేలలోపు 40 మంది, పదివేలలోపు 70 మంది ర్యాంకులు సాధించడంతోపాటు 450 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించినట్లు ఆ విద్యా సంస్థల నరేందర్ రెడ్డి వెల్లడించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన సన్మానించి అభినందించారు.

ట్రినిటీ విద్యార్థుల ప్రతిభ



కరీంనగర్: జేఈఈ(మెయిన్స్) ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు అత్యధిక పర్సెంటైల్‌తో జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారు. ఎ.శ్రవణ్ 617వ ర్యాంకు, బి.భానుప్రకాష్ 676 ర్యాంకు, ఎస్.సుహాస్ రెడ్డి 1,225 ర్యాంకు, ఎ.అనిల్ 1,524 ర్యాంకు, పి.అభినయ్ 1,686 ర్యాంకు, ఎం.రాజారెడ్డి 1,837 ర్యాంకులను సాధించారు. స్కూల్ లెవల్ ఫౌండేషన్‌తోపాటు ఇంటర్‌లో ఐఐటీ కోచింగ్‌తో ర్యాంకులు సాధించినట్లు ట్రినిటీ కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. 231 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు.

జేఈఈలో సత్తా చాటిన గిరిజన విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: జేఈఈలో గిరిజన గురుకుల సొసైటీ విద్యార్థులు సత్తా చాటారు. ఈ పరీక్షల్లో 23 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ కంటే ఎక్కువ సాధించి రికార్డు సృష్టించారు. గిరిజన గురుకుల సొసైటీ నుంచి 741 మంది విద్యార్థులు జేఈఈ పరీక్షలు రాయగా..509 మంది అర్హత సాధించారు. వీరిలో 23 మంది అత్యుత్తమ ఫలితాలు సాధించారు. మరో 80 మంది విద్యార్థులు 80 పర్సంటైల్ సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు గిరిజన మంత్రి సత్యవతి రాథోడ్ అభినందనలు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.